సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+10+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 18
సంచిక: 28

ఆదివారం 20-4-2025


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+10+32 పేజీల ఆదివారం అనుబంధం   వెల: ₹ 7.00
సంపుటి: 18
సంచిక: 28
ఆదివారం 20-4-2025



'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

40 Infinity Learn

JEE MAIN 2025 Results

JEE లో కష్టమైన మ్యాథ్స్, క్లిష్టమైన కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లను

శ్రీచైతన్య అకడమిక్ ప్రోగ్రామ్‌లతో సులువుగా అధిగమించవచ్చని

శ్రీచైతన్య ఏపి రెసిడెన్షియల్ క్యాంపస్‌ల విద్యార్థులు నిరూపించారు



JEE MAIN టాప్ ర్యాంకర్స్‌ను అభినందిస్తూ శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మశ్రీ గారు, శ్రీచైతన్య టెక్నోస్కూల్స్ డైరెక్టర్ శ్రీమతి సీమ గారు

వైజాగ్, శ్రీకాకుళం, విజయనగరం, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం రెసిడెన్షియల్ క్యాంపస్‌లు

ALL-INDIA ALL CATEGORY RANKS BELOW TOP 10

RANK	Name	Appl No
1	VANGALA AJAY REDDY	250310255592
2	THANDU YOGITHAA	250310612207
3	BANDARI RUSHMITH	250310395238
4	V ESWAR KARTHIK	250310236425
5	K MUNI SAI YADAV	250310488636
6	B VIKRAM RAJA	250310322700
7	SHAGANTI THRISHUL	250310500008
8	LAXIBHARGAV MENDE	250310248080
9	D CHETAN RAO	250310635984
10	P H SAI SURYA KARTHIK	250310407861

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో టాప్ 1000లోపు ర్యాంకులు

RANK	Name
107	MAULIK JAIN
121	T VARDHAN COWDARY
127	A RAVIKIRAN
129	B V MANI PREETHAM
130	VANKA SAI SRI RAM SATVIK
131	PABBATI PRANAY REDDY
132	AARIT PANDA
138	D G S DHARMA PRATAP
141	ARNAV SHARMA
144	PUTTA GURU HARSHITH
176	BALABADRULA ARYAN
188	ATHARVA VINAY MHATRE
198	SOURISH SRIVASTAVA
204	KAKUMANU VENEETH
206	K CHENNA KESHAVA
212	RONGALI KARTHEEK
214	VIVAAN
219	V GEETHAM KUMAR NAIDU
224	D G S ARUNACHALAM
230	P JASWANTH REDDY
239	K A RISHITHA REDDY
240	EIVAKSH AGGARWAL
241	BURRI RISHIK KUMAR
243	SHREYAS S
245	D NUTHAN REDDY
255	BANDARU ROHITH DATTA
262	M V GANESH ROYAL
265	PIYUSH PANDA
272	KURUVELLA HARSHITH
273	UPPULA BHAVAPRITA
278	KOLA PRAVEEN KUMAR
282	V H VARDHAN REDDY
285	MADU MANMOHITH REDDY
285	N HEMANTH ABHIRAM
292	KALLURI SRI RAGHAVA
294	D GNANA RUTVIK SAI
309	SARATH CHANDAR M
319	S GEETHA SRI KOUMUDI
330	MOHITH LAKSHMANA
334	ADEEB ALI ISLAM
345	LAKKIREDDY CHERVITHA
345	Y JASWANTH CHOWDARY
350	NALAMARA SREE VATSAV
356	PALURI BHARATH REDDY
364	P PVT ABHI RAM
371	ADVAY MAYANK
378	G H SAI RAM BALAJI
380	SAKHINANA HARICHARAN
398	EGA YASWANTH REDDY
400	GYAN PRAKASH
414	SK MOHAMMED SAMEER
421	SWARIT SUBHAM
422	KORIKANA RASAGNYA
427	P BHANU PRAKASH REDDY
436	DUARY ANISH
456	KRISHNA SRIPAD K
457	D SRUJAN HASITH REDDY
459	BUDUMU MAHANTH
462	A SRI PRANEETH REDDY
462	TANAV GUPTA
469	ARNAV KRISHNA
477	GAUTHAM POCHA
493	GALI PRATHYUSHA
496	P BHAVYA
505	DAKSH TIWARI
522	VALLABHANENI REVANTH
523	M MANIDEEP VARMA
529	C C S G VARUN YADAV
531	M LAKSHMI PRASANNA
540	PARIMALA LAKSHMI LASYA
544	NALLA SAANVI SAI VEERA
546	P ABHINOW REDDY
607	BELLAMKONDA SARVAJITH
615	RUDRA BHOR
630	MACHUPALLI BHAVYA
649	TANMAY GARG
665	SUDARSHAN
669	DAKKA VASU TEJA
683	P SRUJAN KUMAR
708	S PRANEETH SAI BHARATH
725	M PAVAN KUMAR NAIDU
728	SASANAPURI NIRNITH
751	AYUSHI VATS
759	KUSHAGRA SINHA
769	D BALARAM NAIDU
776	KRISHNA BANSAL
812	B YOGA SAI SRINIVAS
817	GOWNI GOWNITH REDDY
833	G MAHANT
834	HET SACHIN SHETH
843	SIDDHARTHA CH V S
853	JAGANA YOGESWAR
856	ALAPARTHI JAHNAVI
876	GANGADA RAJESH KUMAR
909	R SAI KIRAN
922	KSHITIJS DEEPAK
923	ASHUTOSH PANDEY
931	ANANYA TRIPATHI
932	GUNTURU ROHIT PAWAN
934	LOLUGU KARTHIKEYA
948	ADAPA ASHOK SWAMY
959	M NHAREN
997	V V RITESH PRATHIPATI

స్థలాభావం వల్ల అన్ని ర్యాంకులు ప్రకటించలేకపోతున్నాము

IIT-JEE & NEET LONG-TERM 2026

ADMISSIONS OPEN FOR NEET : 040 66 06 06 06

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Scan the QR code for offer on JEE Courses

FOR JEE MAIN & ADVANCED

HYDERABAD

NARSINGI - 91774 22235, 91777 36808 (BOYS)
MADHAPUR - AKSHARA LT - 89777 14781
KONDAPUR - GIRLS - 91770 46533, 91000 91871

VIJAYAWADA

GUDAVALLI - RAMAN BHAVAN-01: 97040 65666, 9701911666
GAYATHRI CAMPUS DAYS: 96763 98777, 91775 50944

VISAKHAPATNAM


ASILMETTA - RAMAN BHAVAN-2: 91772 06961, 91776 39378
PEDDIPALEM - RAMAN BHAVAN BOYS RESIDENTIAL: 97058 30168, 91775 32995
BOYAPALEM - RAMAN BHAVAN GIRLS RESIDENTIAL: 94940 12024, 91772 01369

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback *DLP

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

పేజీలు: 14+10+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 18
సంచిక: 28

SUNDAY Special ఆదివారం 20-4-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సమ్మర్ చైల్డ్ కేర్

వేసవి వేడిమితో పిల్లలకు వచ్చే సమస్యలు.. సెలవుల్లో ఎండల నుంచి పిల్లలను సంరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.


- ఫ్యామిలీలో



బట్లర్ జోష్... టైటాన్స్ ఖుష్

ఢిల్లీ క్యాపిటల్స్‌పై గుజరాత్ టైటాన్స్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. జోస్ బట్లర్(97 నాటౌట్) చెలరేగి ఆడడంతో 203 పరుగుల విజయ లక్ష్యాన్ని గుజరాత్ సునాయాసంగా ఛేదించింది.

- స్పోర్ట్స్‌లో



సౌదీ అరేబియాకు ప్రధాని మోదీ

ప్రధాన మంత్రి మోదీ మంగళవారం నుంచి రెండు రోజులపాటు సౌదీ అరేబియాలో పర్యటించనున్నారు. సౌదీ యువరాజుతో మోదీ సమావేశం కానున్నారు

వివరాలు 6లో ▸



మనిషి.. మరమనిషి సై

మనిషికి దీటుగా కృత్రిమ మేధ ఆన్‌లైన్‌లో అసాధారణ ప్రతిభ చూపిస్తుంటే ఆఫ్‌లైన్‌లో హ్యూమనాయిడ్ రోబోలు మనిషికి సవాల్ విసురుతున్నాయి.

వివరాలు 6లో ▸

అక్రమ కేసే.. బాబు కుట్రే

అబద్ధపు వాంగ్మూలాల ఆధారంగానే సిట్ దర్యాప్తు

తప్పుడు సాక్ష్యాలే ప్రాతిపదికగా ప్రశ్నలు

- దర్యాప్తులో సిట్ సాధించినది శూన్యం
- ఎంపీ మిథున్‌రెడ్డి విచారణలో సిట్ బాగోతం బట్టబయలు
- వేధించి నమోదు చేసిన అబద్ధపు వాంగ్మూలాలతోనే ప్రశ్నలు
- అసలు మద్యం కుంభకోణమే జరగలేదని.. ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమని సిట్‌కు వివరించిన ఎంపీ మిథున్‌రెడ్డి


సిట్ విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొంటాం

- వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి
- ఇలాంటి తప్పుడు కేసులకు భయపడేది లేదు
- ఇప్పటికే పెట్టిన ఎన్నో కేసులు వీగిపోయాయి
- మద్యం కేసు కూడా అక్రమ కేసేనని తేలుతుంది
- లిక్కర్ కేసు చంద్రబాబు రాజకీయ కక్షలో భాగమే
- ప్రతి రెండు నెలలకు ఒక స్కాం పేరిట ప్రభుత్వం మాపై నిందలేస్తోంది

2 లో

ఎట్టకేలకు డీఎస్సీ షెడ్యూల్ విడుదల



- డీఎస్సీ–2025 మొత్తం పోస్టులు 16,347
- ఇందులో ఎస్జీటీ 6,599, స్కూల్ అసిస్టెంట్లు 7,487, పీఈటీ 2
- మరో 2,259 స్టేట్, జోనల్ పోస్టులు
- నేటినుంచి మే 15 వరకూ ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు
- మే 20న మాక్ టెస్ట్, మే 30 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్షలు

7 లో

ఉత్తరాంధ్రలో వడగాడ్పుల ప్రభావం

8 లో

- నేడు, రేపు ఠారెత్తనున్న ఎండలు
- వారం తర్వాత తగ్గనున్న ఉష్ణోగ్రతలు



అక్రమ కేసే.. బాబు కుట్రే!

ఎంపీ మిథున్‌రెడ్డి విచారణలో సిట్ సాధించింది శూన్యం

సాక్షి, అమరావతి: కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్టుగా తయారైంది చంద్రబాబు ప్రభుత్వ రెడ్‌బుక్ అక్రమ కేసుల పరిస్థితి. టీడీపీ వీర విధేయ పోలీసు అధికారులతో నియమించిన సిట్ దర్యాప్తు లోనే ఆ కేసుల డొల్లతనం బట్టబయలైంది. తాము బెదిరించి.. వేధించి నమోదు చేసిన అబద్ధపు వాంగ్మూలాల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తోందన్నది నిగ్గు తేలింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంపై నమోదు చేసిన తప్పుడు కేసు దర్యాప్తులో భాగంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు విచారించిన తీరే అందుకు నిదర్శనం. కేవలం గాలి పోగేసి నిరాధార ఆరోపణలతోనే ఈ కేసు కేసు పెట్టారన్నది స్పష్టమైంది. న్యాయస్థానం ఆదేశాలతో తన న్యాయవాదితో కలిసి మిథున్‌రెడ్డి శనివారం ఉదయం 10.30 గంటలకు విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. సాయంత్రం 6.30 వరకు న్యాయవాది సమక్షంలో ఆయనను రెండు దఫాలుగా సిట్ అధికారులు విచారించారు. కేవలం తాము వెంటాడి వేధించి నమోదు చేసిన అబద్ధపు వాంగ్మూలాల ప్రాతిపదికనే ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు విచారించడం ఈ కేసులో డొల్లతనాన్ని బట్టబయలు చేసింది. అసలు కుంభకోణమే లేనప్పుడు దర్యాప్తు అధికారులు చేయగలిగేదీ ఏమీ ఉండదని తేలిపోయింది.



సిట్ విచారణకు హాజరై బయటకు వస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి. పక్కన పేర్ని నాని తదితరులు

అబద్ధపు వాంగ్మూలాలే సిట్‌కు ఆధారం

విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. దర్యాప్తు ముసుగులో సిట్ అధికారులు తాము వెంటాడి వేధించి నమోదు చేయించిన అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాల ఆధారంగానే మిథున్‌రెడ్డిని ప్రశ్నించారు. బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, ఆ సంస్థలో పూర్వ ఉద్యోగి సత్యప్రసాద్‌లను వేధించి బలవంతంగా తీసుకున్న అబద్ధపు వాంగ్మూలాలు, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వాంగ్మూలం ఆధారంగానే ప్రశ్నలు వేయడం గమనార్హం. తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలని సిట్ అధికారులు వేధిస్తున్నారని, కుటుంబసభ్యులను బెదిరిస్తున్నారంటూ వాసుదేవరెడ్డి మూడు సార్లు కోర్టుకెళ్లినా.. ఆయనను బెంబేలెత్తేలా చేసి, సిట్ అధికారులు అబద్ధపు వాంగ్మూలంపై సంతకం తీసుకున్నారు. అదే వాంగ్మూలంలోని అంశాల గురించి ఎంపీ మిథున్‌రెడ్డిని విచారణలో ప్రశ్నించారని తెలిసింది. వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి చెప్పిన విషయాల ఆధారంగా మరికొన్ని ప్రశ్నలు అడిగారని, అంటే గంటల పాటు సిట్ విచారణ అంతా పూర్తిగా అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాల ఆధారంగానే సాగిందని తెలుస్తోంది.

ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొంటాం

వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి స్పష్టీకరణ

చంద్రబాబు ప్రభుత్వం రాజకీయ కక్షతో పెడుతున్న తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటామని వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. 'కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పెట్టిన ఎన్నో కేసుల్లో ఆరోపణలు అవాస్తవమని ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. అదే రీతిలో ప్రస్తుతం మద్యం విధానంపై పెట్టిన అక్రమ కేసులో ఆరోపణలు కూడా అవాస్తవమేనని త్వరలో నిర్ధారణ అవుతుంది' అని ఆయన చెప్పారు. విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిట్ విచారణ అనంతరం మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. 'ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున ప్రస్తుతం పూర్తి విషయాలు మాట్లాడలేను. చంద్రబాబు ప్రభుత్వం మొదట మదనపల్లిలో ఏదో జరిగిందని రెండు నెలలు రాద్ధాంతం చేసింది. ఆ కేసులో అనుమానితుడిని తీసుకెళ్లి పాలిగ్రాఫ్ టెస్ట్ చేసి విచారించారు. ఆరోపణలన్నీ కట్టుకథ అని తేలింది. తర్వాత గనుల శాఖలో అవకతవకలు, ఇసుకలో రూ.వేల కోట్లు అవినీతి అని అన్నారు. అది కూడా అవాస్తవ ఆరోపణలు, తప్పుడు కథనమేనని తేలింది. వందల గనులు అన్యాక్రాంతం అని మరో తప్పుడు ఆరోపణలు చేశారు. అవీ నిరూపించలేదు. మా సొంత భూములను అటవీ భూముల ఆక్రమణ అని కొన్నాళ్లు రాద్ధాంతం చేశారు. దీనిపై మేం కోర్టుకు వెళ్లాం. అవన్నీ అటవీ భూములు కాదని అంతా సక్రమంగానే ఉందని మళ్లీ వాళ్లే కోర్టుకు నివేదిక ఇచ్చారు. తర్వాత భూముల ఆక్రమణ అని మరో తప్పుడు కేసు పెట్టారు. ఏదీ నిరూపించలేకపోయారు. ఎర్రచందనం స్మగ్లింగ్ అని ఆరోపణ చేశారు. దీనిపై బహిరంగ చర్చకు రమ్మని సవాల్ విసిరాం. ఒక్కరూ రాలేదు. ప్రతి రెండు నెలలకు కూటమి ప్రభుత్వం ఏదో ఒక స్కాం అంటూ మాపై నిందలు వేస్తోంది. ఇదంతా రాజకీయ కక్షలో భాగమే. ఇప్పుడు లిక్కర్ స్కాం అని మరో ఆరోపణ చేస్తున్నారు. అన్నింటి మాదిరిగానే ఇదీ తప్పుడు కేసని నిర్ధారణ అవుతుంది. ఇదంతా రాజకీయ కక్షలో భాగమే. డ్రగ్స్, మానవ అక్రమ రవాణా మినహా అన్ని కేసులను మా పార్టీ నాయకులపై పెట్టి వేధించాలని ప్రయత్నించారు. లిక్కర్ స్కాం కేసు కోర్టు పరిధిలో ఉన్నందున అన్ని వివరాలు చెప్పలేకపోతున్నాను. కోర్టు నిర్ణయం వచ్చిన తరువాత మీడియా ముఖంగా అన్ని వివరాలు చెబుతాను'' అని పేర్కొన్నారు.

సిట్ ప్రశ్నలకు మిథున్ సమాధానాలివీ...

అబద్ధపు వాంగ్మూలాల ఆధారంగా సాగిన సిట్ విచారణను ఎంపీ మిథున్ రెడ్డి దీటుగా తిప్పికొట్టారని, అధికారుల ఆరోపణలన్నీ నిరాధారం, అవాస్తవాలని ఆయన ఆధారసహితంగా బదులిచ్చారని సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆ విచారణ ఇలా సాగింది..

సిట్: అదాన్ కంపెనీని నెలకొల్పేందుకు విజయసాయిరెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో మీరు పాల్గొన్నారా? మీరు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు కదా?

మిథున్‌రెడ్డి: విజయసాయిరెడ్డి చెప్పింది పచ్చి అబద్ధం. ఆయన నివాసంలో ఆ తేదీల్లో ఎలాంటి సమావేశంలోనూ నేను పాల్గొనలేదు. నాకు ఆ వ్యవహారాలతో ఎలాంటి సంబంధం లేదు. కావాలంటే మీరు గూగుల్ టేక్ అవుట్ తెప్పించండి. విజయసాయిరెడ్డి చెప్పింది పూర్తిగా అవాస్తవమని తేలుతుంది.

(దాంతో సిట్ అధికారులు మౌనం వహించారు)

సిట్: ఓ కంపెనీ నుంచి మీ కుటుంబ వ్యాపార సంస్థ పీఎల్ఆర్ గ్రూప్‌నకు రూ.5 కోట్లు బదిలీ అయ్యాయి కదా.. ఎందుకు?

మిథున్‌రెడ్డి: ఔను. ఆ సంస్థ మా కంపెనీతో కలిసి నిర్మాణ కాంట్రాక్టులు చేయాలని భావించింది. అందుకు అగ్రిమెంట్ కుదుర్చుకుంది. కాంట్రాక్టు పనుల ఈఎండీ, బ్యాంక్ గ్యారంటీ కోసం 2019 నవంబరులో రూ.5 కోట్లు చెల్లించింది. కానీ కోవిడ్ వ్యాప్తితో పనులు చేయలేకపోయింది. దీంతో రూ.5 కోట్లను తిరిగిచ్చేశాం. ఆ కంపెనీ నుంచి ఎలాంటి ప్రయోజనాలు పొందలేదు. అందుకు ఇవిగో ఆధారాలు.. (అగ్రిమెంట్ కాపీ, బ్యాంకు లావాదేవీల రికార్డులు చూపించారు). ఇందులో నిబంధనలకు విరుద్ధమైనది ఏమీ లేదు. ఇప్పుడు సిట్ దర్యాప్తు చేస్తుందని మేం ఆరేళ్ల క్రితమే ఈ అగ్రిమెంట్లు చేసుకోం కదా..? ఇదంతా పారదర్శకంగా సాగిన వ్యవహారం.

(దాంతో సిట్ అధికారులు ఈ అంశాన్ని విడిచిపెట్టారు)

సిట్: రాజ్ కసిరెడ్డి కంపెనీ కోసం విజయసాయిరెడ్డి అల్లుడి కుటుంబ వ్యాపార సంస్థ నుంచి రూ.100 కోట్లు అప్పు ఇప్పించారా?

మిథున్‌రెడ్డి: ఆ వ్యవహారంతో నాకేం సంబంధం? అది ఎవరో కొందరు ప్రైవేటు వ్యక్తుల మధ్య వ్యవహారం. దానిపై నేనేం చెబుతాను? విజయ సాయిరెడ్డి అల్లుడి కంపెనీ ఎవరికో అప్పు ఇస్తే.. అప్పు ఇచ్చిన అరబిందో కంపెనీ వాళ్లను, తీసుకున్నవాళ్లను, ఇప్పించిన విజయసాయిరెడ్డిని అడగాలి.

(దాంతో సిట్ అధికారులు ఆ అంశాన్ని కొనసాగించలేకపోయారు)

సిట్: రాజ్ కసిరెడ్డి తెలుసా.. ఆయనతో మీకు వ్యాపార సంబంధాలున్నాయా?

మిథున్‌రెడ్డి: రాజ్ కసిరెడ్డితో పరిచయం మాత్రమే ఉంది. ఆయనతో ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవు.

సిట్: మీరు కొన్ని రియల్ ఎస్టేట్ ప్లాట్లు కొనుగోలు చేశారు కదా? (అని కొన్ని పత్రాలు చూపించారు)

మిథున్‌రెడ్డి: అవును. అవన్నీ సక్రమంగా కొనుగోలు చేసిన ఆస్తులే. ఆ వివరాలన్నీ నా ఎన్నికల అఫిడవిట్‌లో కూడా వెల్లడించాను.

రాజకీయ కుట్రతో నమోదు చేసిన కేసు..

వాంగ్మూలంలో నమోదు

టీడీపీ కూటమి ప్రభుత్వం రాజకీయ కుట్రతోనే తమపై ఈ అక్రమ కేసు నమోదు చేసిందని మిథున్‌రెడ్డి సిట్ అధికారులకు విస్పష్టంగా చెప్పారు. అంతే కాదు ఆ విషయాన్ని తాను వెల్లడించినట్టుగా వాంగ్మూలంలో సిట్ అధికారులతో రికార్డు చేయించారు. తన అభిప్రాయాన్ని అధికారికంగా నమోదు చేయాలని ఆయన పట్టుబట్టారు. దాంతో సిట్ అధికారులు ఆ విషయాన్ని నమోదు చేశారు.

ఉద్యోగాల్లో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్లు

సాక్షి, అమరావతి: ప్రతిభ కలిగిన క్రీడాకారులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీపీఎస్సీ పరిధిలోని గ్రూప్ 1, 2, 3 పోస్టులతోపాటు సర్వీస్ కమిషన్ కిందకు రాని ఇతర శాఖల ద్వారా భర్తీచేసే పోస్టుల్లో రాత పరీక్ష అవసరం లేకుండా క్రీడాకారుడి ప్రతిభ, గెలిచిన మెడల్స్, ఈవెంట్స్ ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమలు చేయనుంది. ఒలింపిక్స్ నుంచి రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ వరకు స్థాయిని బట్టి పోస్టులను భర్తీ చేయనున్నట్టు జీవోలో పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శనివారం మార్గదర్శకాలు జారీ చేశారు. శాప్‌లో ప్రత్యేక స్క్రీనింగ్ కమిటీ ఖాళీలను బట్టి ఉద్యోగాలకు క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి మెరిట్ ఆధారంగా నివేదిక రూపొందించి రాష్ట్రస్థాయి ఎంపిక కమిటీకి నివేదించేలా మార్గదర్శకాలు రూపొందించారు. వీటిపై క్రీడా సంఘాలతోపాటు క్రీడాకారులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. క్రీడల్లో ప్రతిభ చూడకుండా కేటగిరీలుగా విభజించడంపై మండిపడుతున్నారు. జీవో మొత్తం తప్పుల తడకగా ఉందని విమర్శిస్తున్నారు.

బీసీఐ వైస్ చైర్మన్‌పై దాడి హేయం

- న్యాయవాదుల భద్రతకు తక్షణమే చర్యలు చేపట్టాలి
- కేంద్రాన్ని కోరిన రాష్ట్ర బార్ కౌన్సిల్

సాక్షి, అమరావతి: భారత న్యాయవాద మండలి (బీసీఐ) వైస్ చైర్మన్, ప్రముఖ సీనియర్ న్యాయవాది వైఆర్ సదాశివరెడ్డిపై దాడిని రాష్ట్ర న్యాయవాద మండలి (బార్ కౌన్సిల్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 16న బెంగళూరులో జరిగిన దాడిని హేయమైన ఘటనగా అభివర్ణించింది. సదాశివరెడ్డిపై దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని కర్ణాటక పోలీసులను డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎస్.ద్వారకానాథరెడ్డి, వైస్ చైర్మన్ సిరిపురపు కృష్ణ మోహన్ శనివారం ప్రకటన విడుదల చేశారు. ఓ న్యాయవాదిపై ఆయన కార్యాలయంలోనే దాడి జరగడం న్యాయవాదుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని సీరియస్‌గా తీసుకుని, న్యాయవాదుల భద్రతకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం కూడా సదాశివరెడ్డిపై జరిగిన దాడిని ఖండించింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, కార్యవర్గం పోలీసులను కోరింది.

అంతర్వేది ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయం వద్ద అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం న్యాయమూర్తిని అర్చకులు ఆశీర్వదించారు. స్వామివారి లడ్డూ ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.



జస్టిస్ రాజశేఖర్ రావుకు స్వామివారి చిత్రపటాన్ని ఇస్తున్న అసిస్టెంట్ కమిషనర్

రేపటి నుంచి రేర్ ఎర్త్‌పై అంతర్జాతీయ సదస్సు

తిరుపతికి 200 మంది దేశ, విదేశీ ప్రతినిధుల రాక



మాట్లాడుతున్న వీసీ, రిజిస్ట్రార్, ఫిజిక్స్ హెచ్‌వోడీ

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ) ఫిజిక్స్, శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ బయో టెక్నాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 'రేర్ ఎర్త్'పై తిరుపతిలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. ఎస్వీయూ వీసీ చాంబర్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈ సదస్సుకు ముంబైకి చెందిన రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే సదస్సులో సుమారు 200 మంది దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని చెప్పారు. సదస్సు నిర్వాహకులు ప్రొఫెసర్ బి.దేవప్రసాద్ రాజు, ప్రొఫెసర్ ఎస్ జాన్ సుషాలను ఆయన అభినందించారు. సదస్సు ప్రారంభ సభ మహిళా వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరగనున్నట్లు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

ఇందుకూరుపేట: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముదివర్తిపాలెంలో వడదెబ్బతో ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. పాటూరు పోతయ్య (63) అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోలేక మరణించాడని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆయనలో జీవముండెను:
ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, **తిథి:** బ.సప్తమి ప.2.09 వరకు తదుపరి అష్టమి, **నక్షత్రం:** పూర్వాషాఢ ఉ.7.35 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.3.45 నుండి 5.23 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.33 నుండి 5.23 వరకు, **అమృత ఘడియలు:** రా.1.33 నుండి 3.11 వరకు, భాను సప్తమి.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం : 6.12
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

గులామ్ నబీ ఆజాద్ (మాజీ కాంగ్రెస్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఆత్మవిశ్వాసం మీదకెక్కి కూర్చున్నప్పుడు వినూత్నమైన ఆలోచనలు మదిలో మెదులుతుంటాయి. మంచి ఉద్యోగంలో ఉన్న వారు ఆ ఉద్యోగం మానేసి, సొంతంగా ఒక కంపెనీ పెట్టాలనుకుంటారు! గ్రాండ్ ఓల్డ్ పార్టీలో ఉన్నవారు ఆ పార్టీని వదిలేసి, సొంతంగా ఒక పార్టీ పెట్టాలనుకుంటారు.

జమ్మూ–కశ్మీర్ లోయలో ఇటీవలి కాలంలోని పరమ ఆత్మవిశ్వాసపు కథ ఏదైనా ఉందీ అంటే అది నాదే! నా సొంత పార్టీ 'డీపీఏపీ' పెద్ద ఫెయిల్యూర్ స్టోరీ. డీపీ అంటే డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్. ఏపీ అంటే ఆజాద్ పార్టీ. పాత పార్టీ లోంచి బయటికి వచ్చాక నేను కొత్తగా డీపీఏపీని స్థాపించినట్లు లేదు. కొత్తగా డీపీఏపీని స్థాపించటం కోసం పాత పార్టీ నుంచి నేను బయటికి వచ్చినట్లు ఉంది. మీదకెక్కి కూర్చున్న వారి మహిమ అనుకుంటాను!

పాత పార్టీలో యాభై ఏళ్లు ఉన్నాక: పార్టీ సీఎంగా, పార్టీ ఎంపీగా, పార్టీ కేంద్రమంత్రిగా, రాజ్యసభలో పార్టీ అపోజిషన్ లీడర్‌గా నన్ను కూర్చోబెట్టి గౌరవించిన పాత పార్టీని అమర్యాదగా వదిలి వచ్చేశాను నేను. అప్పుడే నా ఫెయిల్యూర్ స్టోరీ మొదలైందా?!



కాదు. ఇంకొకరి ఫెయిల్యూర్స్‌ని ఎప్పుడైతే వేలెత్తి చూపుతామో అప్పుడే మన స్టోరీ మొదలవుతుంది! పార్టీ నుండి బయటికి వచ్చేటప్పుడు నేను మౌనంగా వచ్చేయలేదు. "పార్టీ పనైపోయింది" అంటూ అడుగు బయటికి వేశాను. బయటికి వచ్చాక, "రాహుల్ అన్‌ఫిట్" అని, "రాహుల్ చైల్డిష్" అని సోనియాజీకి లెటర్ రాశాను.

'భారత్ జోడో' యాత్రలో రాహుల్‌కు తోడుగా ఉండకుండా ; గుజరాత్, హిమాచల్ ఎన్నికల్లో ఖర్గేజీకి చేదోడుగా లేకుండా పార్టీ నుంచి వచ్చేసి, సొంతంగా పార్టీ పెట్టుకున్నాను.

నన్ను తన సొంత మనిషి అనుకున్న పార్టీని నేను దెబ్బకొట్టి వచ్చేస్తే, నేను పెట్టుకున్న నా సొంత పార్టీ నన్ను దెబ్బకొట్టేసింది!

పార్టీ పెట్టాక, తొలిసారి పోటీ చేసిన రెండు లోక్‌సభ స్థానాల్లోనూ నా పార్టీ గెలవలేకపోయింది! పార్టీ పెట్టాక, తొలిసారి పోటీ చేసిన 23 అసెంబ్లీ స్థానాల్లోనూ నా పార్టీ ఓడిపోయింది. కొన్నిచోట్ల 'నోటా'కు పడినన్ని ఓట్లు కూడా నా పార్టీకి రాలేదు!

ఓటమి మనిషినే కాదు, పార్టీని కూడా ఒంటరిని చేస్తుంది. నాతో పాటు పాత పార్టీని వదిలి వచ్చిన వారంతా తిరిగి ఆ పార్టీలోకే వెళ్లిపోయారు! రెండున్నరేళ్ల నా కొత్త పార్టీలో 76 ఏళ్ల వయసున్న పార్టీ చైర్మన్‌గా నేను, నా సెక్రెటరీ బషీర్ ఆరిఫ్ మాత్రమే ఇప్పుడు మిగిలాం.

"పని పూర్తయింది ఆజాద్‌జీ..." అంటూ వచ్చారు బషీర్ ఆరిఫ్.

"రండి బషీర్‌జీ! మొత్తం డిజాల్వ్ చేసేశారు కదా?!"అని అడిగాను.

"ఒక్క యూనిట్‌ను కూడా మిగల్చలేదు ఆజాద్‌జీ. స్టేట్, ప్రావిన్షియల్, జోనల్, డిస్ట్రిక్ట్ యూనిట్‌లతో పాటు... పార్టీ బ్లాక్ లెవల్ కమిటీలను కూడా రద్దు చేసేశాం. త్వరలోనే వాటిని పునరుద్ధరిస్తాం అని ఉత్తినే ప్రెస్ నోట్ కూడా పంపించాం..." అన్నారు బషీర్.

ప్రాణం కాస్త తేలిక పడింది. మీదకెక్కిన వారెవరో దిగిపోయినట్లుగా ఉంది.


"నాకిప్పుడు ఫ్రీ బర్డ్‌నన్న ఫీలింగ్ కలుగుతోంది బషీర్‌జీ. మీక్కూడానా?" అని అడిగాను. ఆయన నవ్వారు.

"ఎక్కడికి వెళుతున్నాం అనే దాని కంటే, ఎక్కడి నుంచి వెళుతున్నాం అన్నదే ఒక్కోసారి ఫ్రీడమ్ అనే మాటను చక్కగా డిఫైన్ చేస్తుంది ఆజాద్‌జీ. నాకు సెలవిప్పించండి..." అన్నారు నమస్కరిస్తూ!!

సాయంత్రం బాల్కనీలో ఒంటరిగా నిలుచుని లోయలోకి చూస్తూ ఉన్నప్పుడు తులిప్స్, కుంకుమ పూలు, కశ్మీరీ గులాబీలు, బంతిపూలు... గాలికి ఊగుతూ కనిపించాయి. ఒక్క కమలం పూలు మాత్రమే స్థిరంగా ఉన్నాయి.

ఆ కమలం పూల వైపే నేనూ స్థిరంగా చాలాసేపు చూస్తూ ఉండిపోయాను.

పైసా తక్కువ రూపాయ్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

"**కా**సులతో ప్రలోభపెట్టారు. వినకపోతే కేసులతో భయపెట్టారు. 27 మంది విశాఖ కార్పొరేటర్లను కూటమి నేతలు ఈ విధంగా లొంగదీసుకున్నారు. సొంత బలం లేకున్నా మేయర్‌పై అవిశ్వాసాన్ని నెగ్గించుకున్నారు. ఈ అప్రజాస్వామిక చర్యకు కూటమి నేతలు పెట్టుకున్న ముద్దుపేరు 'ధర్మ విజయం'."

నూరు ఎలుకల్ని తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయిందట!
(ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత రాజకీయ చిత్రమిది)

***

"**వి**శాఖపట్నం నుంచి విజయవాడకు విమానంలో వెళ్లాలంటే హైదరాబాద్‌కు వెళ్లి రావాల్సి వస్తున్నది. ఇదీ మన పరిస్థితని టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు ట్వీట్ చేశారు. దీన్ని బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజు సమర్థించారు. అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌నంటూ తన ఆటోబయోగ్రఫీని ప్రణాళికా సంఘం సభ్యులకు చంద్రబాబు వినిపించిన మరునాడే ఈ పరిణామం."

ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కిందట!
(ఇదీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ముఖచిత్రం)

***

"**ఐ**టీకి ప్రోత్సాహం పేరుతో పైసా తక్కువ రూపాయ్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించింది. ముందుగా ప్రముఖ కంపెనీ టీసీఎస్‌కు 21 ఎకరాలు కేటాయించారు. ఆ వెంటనే ఊరూపేరూ లేని కంపెనీలు ఈ స్కీములో లైను కట్టాయి. ఐఎమ్‌జీ భారత్‌కు అయ్యలాంటి స్కెచ్."

'లూటీ' కోసం కోటి విద్యలు'!
(ఇది కొత్తపుంతలు తొక్కుతున్న అవినీతి చంద్రిక)

***

"**మ**ద్యాన్ని ఏరులై పారిస్తే లోకకల్యాణార్థమట. దాన్ని నియంత్రిస్తే మహా పాతకమట!"

వినేవాడు వెర్రివాడైతే, చెప్పేవాడు... ... !
(ఇదీ ఆంధ్రప్రదేశ్ సమాచార స్రవంతి)

***

రూపాయంటే నూరు పైసలు. ఒక్క పైసా తక్కువైనా అది రూపాయి కాదు. ఆ విలువ రాదు. మాటలైనా అంతే! ఆచరణకు నోచుకోకపోతే విలువుండదు. ఆచరణయోగ్యం కాని వాగ్దానాలు చేయడం, ఎగవేయడంలో ఇప్పటికే చంద్రబాబుది ఆలిండియా రికార్డు. మాటలతో మభ్యపెట్టి పబ్బం గడుపుకోవడంలో కూడా ఆయనకే వీరతాడు వేయాలి. మంచినీళ్లడిగితే మబ్బులవంక చూపెట్టి, 'అదిగదిగో' అన్న చందంగా కూటమి ప్రజాపాలన సాగుతున్నది. మరోపక్కన కాంట్రాక్టుల పేరుతో కమీషన్లు, కంపెనీల పేరుతో స్వీయ కైంకర్యాల కార్యక్రమం యథేచ్ఛగా జరుగుతున్నది.

రాజధాని నిర్మాణం పేరుతో పిలిచిన 40 వేల కోట్ల రూపాయల విలువైన టెండర్లలో తొమ్మిదివేల కోట్లు 'మూల విరాట్టు' హుండీలోకి చేరుకునేవిధంగా మంత్రాంగం నడిచిందని 'సాక్షి' ఒక కథనంలో నిరూపించింది. దీనిపై వివరణ ఇచ్చే ప్రయత్నం గానీ, ఖండించే సాహసం గానీ ప్రభుత్వం చేయలేదు. చేయదు. నవ్విపోదురుగాక, నాకేటి సిగ్గు అనే ధోరణి. రాజధాని కాంట్రాక్టుల్లో ఈ లెక్కన ఇరవై రెండున్నర శాతం హుండీ ఖాతాకు చేరాలన్నమాట. ఇటీవల ప్రణాళికా సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి చెప్పిన వివరాలను బట్టి ఇంకో 37 వేల కోట్ల రూపాయలకు టెండర్లను పిలవాల్సి ఉన్నది.

అమరావతి పేరుతో జరుగుతున్న ఈ తతంగంలో కాంట్రాక్టర్లు చేసే సంతర్పణ కంటే అక్కడ జరిగిన, జరుగుతున్న భూభాగోత లబ్ధి చాలా ఎక్కువని ఇప్పటికే పలు ఆరోపణలు, విమర్శలు వెలువడ్డాయి. అందుబాటులో ఉన్న 55 వేల ఎకరాలకు తోడు మరో 45 వేల ఎకరాలతో అమరావతి పార్ట్–2ను త్వరలో విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. దీనిపైనా పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. రాజధాని కోసం ప్రభుత్వమే లక్ష ఎకరాలను సేకరించడం ఎందుకని విజ్ఞులూ, తటస్థ రాజకీయవేత్తలూ ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ ప్రతిపాదిత వైశాల్యం సుమారు మూడింట రెండొంతులు. అక్కడ కోటీ ఇరవై లక్షలమంది నివసిస్తున్నారు. దాని ప్రకారం ఆలోచిస్తే మొత్తం విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి – తాడేపల్లి నగరాలను పూర్తిగా ఖాళీ చేసి ఇక్కడ నింపేసినా ఇంకా సగం స్థలం ఖాళీగానే ఉంటుంది.

రాజధాని నిర్మాణానికి సంబంధించి నిన్ననే 'ఈనాడు' పత్రిక ఒక ఆకర్షణీయమైన కథనాన్ని అచ్చేసింది. సరికొత్త సచివాలయ టవర్ల నిర్మాణం కోసం రూ.4,688 కోట్ల అంచనా వ్యయంతో సీఆర్‌డీఏ టెండర్లను పిలిచిందట! ఇందులో ఐదు ఐకానిక్ టవర్లుంటాయని ఆ గ్రాఫిక్ బొమ్మను కూడా అచ్చేశారు. రాబోయే వంద సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మించిన కొత్త పార్లమెంటు భవనాన్ని కూడా వెయ్యి కోట్ల లోపు వ్యయంతోనే పూర్తి చేశారు. ఈమధ్యనే కట్టిన తెలంగాణా సెక్రటేరియట్‌కయిన ఖర్చు కూడా వెయ్యి కోట్ల లోపే! అమరావతిలో మాత్రం ఎంత భారీ ఖర్చయితే అంత ప్రయోజనం అనుకున్నారేమో గాని ఐదు ఐకానిక్ టవర్లను నిర్మించే పనిలో పడ్డారు. 'ఈనాడు' రాసిన ఈ కథనంలోనే ఇంకో గమనించదగ్గ విషయం కూడా ఉన్నది.

ఈ గ్రాండ్ సెక్రటేరియట్ నిర్మాణానికి 60 వేల టన్నుల స్టీల్ అవసరమవుతుందట! దీనికోసం సీఆర్‌డీఏ అధికారులు రాయగఢలోని ఫ్యాక్టరీని పరిశీలించి వచ్చారట! ఇక్కడ స్టీల్ కొనుగోలు చేసి బళ్లారి, తిరుచిరాల్లి వర్క్‌షాపుల్లో ఫ్యాబ్రికేట్ చేయించాలని నిర్ణయించారట! ఈ విషయం తెలిసిన తర్వాత విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులు భగ్గుమంటున్నారు. మెడ మీద ప్రైవేటీకరణ కత్తి వేలాడుతున్న విశాఖ ఫ్యాక్టరీకి ప్రభుత్వ ఆర్డర్లను అప్పగిస్తే ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉండేది కదా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ ఉక్కును ఆంధ్రుల హక్కుగా నిలబెట్టడంలో ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో ఈ వ్యవహారంతో తేలిపోయిందన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

విశాఖ ఉక్కు సంగతే కాదు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కూడా చంద్రబాబు సర్కార్ ఏపీ ప్రజలను మోసగిస్తున్నది. 45.72 మీటర్ల ఎత్తు వరకు నీళ్లు నిలబెట్టుకునేందుకు పోలవరం ప్రాజెక్టుకు గోదావరి ట్రిబ్యునల్ అనుమతి ఉన్నది. తెలుగుదేశం పార్టీ భాగస్వామిగా ఉన్న ఎన్డీఏ కేబినెట్ ఇటీవల దాని ఎత్తును 41.5 మీటర్లకు కుదిస్తూ ఆ మేరకు నిధులను అందజేయాలని నిర్ణయించింది. చంద్రబాబు సర్కార్ తలూపింది. 'పోలవరం ఆంధ్రుల జీవనాడి' అని బాబు మాట్లాడుతూంటారు. ఇప్పుడా నాడి స్పందన కోల్పోయినట్టే! 35 మీటర్ల ఎత్తునకు పైన లభ్యత ఉంటేనే జలాలు కుడి, ఎడమ కాల్వలకు పారుతాయి. ఇప్పుడా లభ్యత 45.72 మీటర్లకు బదులుగా 41.5 మీటర్లకు మాత్రమే పరిమితం కానున్నది. నిల్వ సామర్థ్యం 194 టీఎమ్‌సీల నుంచి 115 టీఎమ్‌సీలకు తగ్గిపోతుంది. ఈ కారణం వల్ల ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, కృష్ణా ద్వారా పెన్నాతో అనుసంధానం వంటి మాటలన్నీ కాకమ్మ కబుర్లు కాబోతున్నాయి.

ఈ విషయాన్ని దాచేసి ప్రజలను మభ్యపెట్టడానికి 'గోదావరి – బనకచర్ల అనుసంధానం' అనే పాటను చంద్రబాబు పదేపదే ఆలపిస్తున్నారు. పోలవరం ఆయకట్టుకే సరిపోని విధంగా కుదించిన ప్రాజెక్టుతో ఈ అనుసంధానం ఎట్లా సాధ్యమవుతుందో ప్రభుత్వ ఇరిగేషన్ అధికారులైనా ప్రజలకు వివరించాలి. ఎన్నికలకు ముందు చెప్పిన 'సూపర్ సిక్స్' హామీలను అటకెక్కించిన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన 'అభివృద్ధికి ఆరు మెట్లు' అనే కొత్త సిద్ధాంతాన్ని ప్రవచిస్తున్నారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన ప్రణాళికా సంఘం బృందానికి కూడా తన ఆరు మెట్ల సిద్ధాంతాన్ని వివరించినట్టు 'ఈనాడు' రాసింది.

'ఆరు మెట్ల' అభివృద్ధిలో మొదటి మెట్టుగా పోలవరం – బనకచర్ల అనుసంధానాన్నే ఆయన ప్రస్తావించారు. ఇదెంత బోగస్ వ్యవహారమో పోలవరం ఎత్తు కుదింపుతోనే తేలిపోయింది. ఇక రెండో అభివృద్ధి మెట్టు – తాగునీటి ప్రాజెక్టట! ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించిన గణాంకాలనే తీసుకుందాము. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల్లో 2019 ఆగస్టు 15 నాటికి 30 లక్షల 74 వేల గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరిగేది. 2019 ఆగస్టు 15 – 2025 మే మధ్యకాలంలోనే, అంటే జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనా కాలంలోనే అదనంగా 39 లక్షల 34 వేల గృహాలకు తాగునీటి కుళాయిలు అందుబాటులోకి వచ్చాయి. మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనవరి చివరి నాటికి 36 వేల గృహాలకు మాత్రమే కొత్తగా నీటి కుళాయిలు బిగించారు. తాగునీటి రంగంలో అభివృద్ధి మెట్టును వేసిందెవరో ఈ గణాంకాలు చెప్పడం లేదా?

అభివృద్ధి మూడో మెట్టుగా పర్యాటక హబ్‌ల ఏర్పాటు, నాలుగో మెట్టుగా నాలెడ్జి ఎకానమీ, క్వాంటమ్ వ్యాలీ, స్కిల్ డెవలప్‌మెంట్ వగైరాలుంటాయట! ఐదో మెట్టుగా నౌకాశ్రయాలు, ఫిషింగ్ హార్బర్లు, మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులు తదితరాలు. ఆరో మెట్టు – అమరావతి, తిరుపతి, విశాఖపట్నం గ్రోత్ సెంటర్లు. తిరుపతి, విశాఖ, అరకు వంటి ప్రాంతాల్లో జరిగిన పర్యాటకాభివృద్ధిపై ఆచరణే గీటురాయిగా ఎవరి హయాంలో ఏమి జరిగిందో చర్చకు పూనుకోవచ్చు. నాలెడ్జి ఎకానమీ, క్వాంటమ్ వ్యాలీ వంటి 'నేమ్ డ్రాపింగ్' వాగాడంబరం చంద్రబాబుకు పరిపాటే! మంత్రదండం చేతబూని 'ఓపెన్ ససేమ్' అనగానే పుట్టుకొచ్చేవి కావవి. అదొక సేంద్రియ అభివృద్ధి. అందుకు అనువైన పరిస్థితులు పూర్తిగా ఏర్పడేందుకు ఐదేళ్లు పట్టవచ్చు. పదేళ్లు పట్టవచ్చు. కానీ బాబు మాత్రం తన ఆలోచనలోకి రావడమే అమల్లోకి వచ్చినట్టుగా భావిస్తారు. అనుబంధ మీడియా తాళం వేస్తుంది. అనుయాయులు వీరతాళ్లు వేస్తారు.

ఇక ఐదో మెట్టుగా నౌకాశ్రయాలు, ఫిషింగ్ హార్బర్లు, రవాణా సదుపాయాల పెంపుతో 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నిలబెట్టాలట! కేవలం ఐదేళ్ల పదవీకాలంలోనే నాలుగు నౌకాశ్రయాలను, పది ఫిషింగ్ హార్బర్లను, ఆరు ఫిష్ ల్యాండర్ల నిర్మాణాన్ని ప్రారంభించి కొన్నిటిని పూర్తిచేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణ ఎక్కడ? ఇంకో ఇరవై రెండేళ్లలో వాటిని నిర్మించాలనుకుంటున్న చంద్రబాబు ఆలోచన ఎక్కడ? మిడిమిడి జ్ఞానపు, మీడియా జ్ఞానపు మేధావులంతా ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆరో అభివృద్ధి మెట్టుగా గ్రోత్‌సెంటర్లుగా అమరావతి, విశాఖ, తిరుపతిలను అభివృద్ధి చేయాలని పెట్టుకున్నారు. దీనిపై కూడా ఆచరణే గీటురాయిగా విస్తృత చర్చ జరగవలసిన అవసరం ఉన్నది.

అమరావతిలో గ్రాండ్ సెక్రటేరియట్ నిర్మాణానికి 60 వేల టన్నుల స్టీల్ అవసరమవుతుందట! దీనికోసం సీఆర్‌డీఏ అధికారులు రాయగఢలోని ఫ్యాక్టరీని పరిశీలించి వచ్చారట! ఇక్కడ స్టీల్ కొనుగోలు చేసి బళ్లారి, తిరుచిరాల్లి వర్క్ షాపుల్లో ఫ్యాబ్రికేట్ చేయించాలని నిర్ణయించారట! ఈ విషయం తెలిసిన తర్వాత విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులు భగ్గుమంటున్నారు. మెడ మీద ప్రైవేటీకరణ కత్తి వేలాడుతున్న విశాఖ ఫ్యాక్టరీకి ప్రభుత్వ ఆర్డర్లను అప్పగిస్తే ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉండేది కదా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ ఉక్కును ఆంధ్రుల హక్కుగా నిలబెట్టడంలో ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో ఈ వ్యవహారంతో తేలిపోయిందన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

విశాఖ ఉక్కు సంగతే కాదు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కూడా చంద్రబాబు సర్కార్ ఏపీ ప్రజలను మోసగిస్తున్నది. 45.72 మీటర్ల ఎత్తు వరకు నీళ్లు నిలబెట్టుకునేందుకు పోలవరం ప్రాజెక్టుకు గోదావరి ట్రిబ్యునల్ అనుమతి ఉన్నది. తెలుగుదేశం పార్టీ భాగస్వామిగా ఉన్న ఎన్డీఏ కేబినెట్ ఇటీవల దాని ఎత్తును 41.5 మీటర్లకు కుదిస్తూ ఆ మేరకు నిధులను అందజేయాలని నిర్ణయించింది. చంద్రబాబు సర్కార్ తలూపింది.

ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం కంపెనీల ఏర్పాటు పేరుతో పైసా తక్కువ రూపాయి పథకాన్ని ప్రారంభించింది. టీసీఎస్ ఆఫీసు ఏర్పాటు కోసం విశాఖలో విలువైన 21 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. టీసీఎస్ అనేది పేరున్న సంస్థ కనుక ఆ కంపెనీ ఏర్పాటయితే మన నిరుద్యోగులకు ఉద్యోగాలొస్తాయనే ఆశ ఉండవచ్చు. కాకపోతే ప్రభుత్వ ఐటీ పాలసీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలనే షరతు లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. టీసీఎస్‌కు భూకేటాయింపు జరిగిన వెంటనే అసలైన అవినీతి కథ మొదలైంది. 'ఉర్సా' అనే ఊరూపేరూ లేని, రెండు మాసాల వయసున్న ఓ కంపెనీకి విశాఖలోనే ఖరీదైన 60 ఎకరాల స్థలాన్ని ఎకరా 99 పైసలకే కట్టబెట్టారు. ఇలాంటి కంపెనీలు పైప్‌లైన్లో ఇంకా చాలా ఉన్నాయట!

కాంట్రాక్టుల్లో కమీషన్లు, భూకేటాయింపుల్లో చేతివాటంతో అగ్రనేతలు చెలరేగుతుంటే గ్రాస్ రూట్స్ నాయకులు గడ్డి మేయకుండా ఉంటారా? అవినీతి గబ్బు ఆంధ్రావనిని అతలాకుతలం చేస్తున్నదని వార్తలు వస్తున్నాయి. వాగ్దాన భంగం కారణంగా జనంలో తీవ్రమైన ప్రభుత్వ వ్యతిరేకత బాహాటంగానే వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలోనే అభివృద్ధిని మబ్బుల్లో చూపడం, అవినీతిని గత ప్రభుత్వంలో చూపడమనే కార్యక్రమాన్ని కూటమి సర్కార్ తలకెత్తుకున్నది. అందులో భాగంగా గత ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కామ్ పేరుతో ఓ నిత్యాగ్నిహోత్రాన్ని నిరంతరం మండించే పనిలో పడ్డారు. అసలు స్కామ్ అంటే ఏమిటి? ఎటువంటి ప్రభుత్వ విధానం వల్ల స్కామ్ జరిగే అవకాశం ఉంటుంది అనే మౌలికమైన ప్రశ్నల జోలికి వెళ్లకుండా జాగ్రత్తపడుతున్నారు.

మద్యం తయారీదారులకు ఉపయోగపడేలా మద్యం ఉత్పత్తులకు ఊతమిచ్చి, అమ్మకందారులు లబ్ధిపొందేలా ప్రవాహాలను ప్రోత్సహించే పాలసీలో స్కామ్ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌కు మద్యం సరఫరా చేసిన డిస్టిలరీలలో సింహభాగం గతంలో చంద్రబాబు ప్రభుత్వం అనుమతులతో పుట్టినవేనని చెబుతున్నారు. మునుపటి చంద్రబాబు పాలనా కాలంలో ఊరూవాడల్ని మద్యం ముంచెత్తింది. గజానికో బెల్టు షాపు, పది గజాలకో పర్మిట్ రూమ్‌తో మహమ్మారి విలయతాండవం చేసింది. జగన్ సర్కార్ మద్య నియంత్రణను తన పాలసీగా ప్రకటించింది. కొత్తగా డిస్టిలరీలకు అనుమతులివ్వలేదు. 43 వేల బెల్టు షాపులను ఎత్తేసింది. పర్మిట్ రూమ్‌లను అనుమతించలేదు. షాపుల సంఖ్యను సగానికి సగం కుదించింది. అమ్మకం ద్వారా లాభాలను గడించే ప్రైవేట్ వ్యాపార వర్గాన్ని పూర్తిగా తొలగించింది. ప్రభుత్వ యాజమాన్యంలోనే నిర్ణీత వేళల్లోనే అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకున్నది. ఒకే ఒక్క ప్రశ్న: 'మా ప్రభుత్వంలో తమ్ముళ్లకు బాగా తాపిస్తా' అని చెప్పిన ప్రభుత్వంలో స్కామ్ ఉంటుందా? 'మద్యం ముట్టుకుంటే షాక్ కొట్టాల్సిందే'నని హెచ్చరించిన ప్రభుత్వంలో స్కామ్ ఉంటుందా? బుద్ధిజీవులే నిర్ణయించాలి!

vardhelli1959@gmail.com

ప్రభుత్వ ప్రాయోజిత మత పక్షపాతం

అభిప్రాయం



డానీ

కొత్త వక్ఫ్ చట్టాన్ని ముస్లింలు మాత్రమే వ్యతిరేకిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఒక తప్పుడు సంకేతాన్ని ఇస్తున్నాయి. ముస్లిం ధర్మాదాయ దేవాదాయ వ్యవహారాలను వక్ఫ్ అంటారు. 1995 నాటి వక్ఫ్ చట్టం ఇప్పటి వరకు అమలులో వుంది. ఇప్పుడు దీన్ని 'యునైటెడ్ వక్ఫ్ మేనేజ్మెంట్, ఎంపవర్మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్మెంట్ యాక్ట్–2025 (యూడబ్ల్యూఎమ్ఈఈడీఏ)'గా మార్చారు.

వక్ఫ్ సవరణ బిల్లు ఏప్రిల్ 3న లోక్‌సభలో 288 – 232 ఓట్ల తేడాతో గెలిచింది. రాజ్యసభలో ఏప్రిల్ 4న 128 – 95 ఓట్ల తేడాతో గెలిచింది. ఆ వెంటనే రాష్ట్రపతి ఆమోద ముద్ర కూడా పడిపోయింది. ఇక్కడ ఒక విశేషం ఉంది. 543 మంది సభ్యులున్న లోక్ సభలో ముస్లింలు 24 మంది మాత్రమే. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. అంటే 208 మంది ముస్లిమేతర సభ్యులు ముస్లింల పక్షాన నిలిచారు. అలాగే 245 మంది సభ్యులున్న రాజ్య సభలో ముస్లింలు 15గురు మాత్రమే. 95 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. అంటే 80 మంది ముస్లిమేతర సభ్యులు ముస్లింల పక్షాన నిలిచారు. రెండు సభల్లోనూ కలిపి ముస్లింల సంఖ్య 39 మాత్రమే. వాళ్ల పక్షాన నిలిచిన ముస్లిమేతరులు 288 మంది.

కొత్త చట్టం రాజ్యాంగ ఆదర్శాలకు, హామీలకు విరుద్ధంగా ఉందనీ, దాన్ని పునఃసమీక్షించాలని కొన్ని సంఘాలు, కొన్ని రాజకీయపార్టీలు సుప్రీంకోర్టులో 70కు పైగా పిటీషన్లు వేశాయి. ఈ విషయంలోనూ ముస్లింల సంఖ్య చాలా తక్కువ. ముస్లిమేతరుల సంఖ్య చాలా ఎక్కువ. మన దేశంలో వర్ధిల్లుతున్న మతసామరస్యానికి ఇది తాజా ఉదాహరణ. దీనికి విరుద్ధంగా బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టానికి మద్దతు ప్రకటించాయి.

ఒక బిల్లు ఉభయ సభల్లో మెజారిటీ సాధించి రాష్ట్రపతి ఆమోద ముద్రపడి చట్టంగా మారాక కూడ సుప్రీం కోర్టుకు చేరడం విశేషం. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఏప్రిల్ 16న ఈ పిటిషన్లపై విచారణ ప్రారంభించింది. కొత్త చట్టంలో వివాదాంశాలు అనేకం ఉన్నాయి. ఇందులో నాలుగు అంశాలు మరింత తీవ్రమైనవి. వక్ఫ్ బోర్డుల్లో, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో కొత్తగా ముస్లిమేతరులను అనుమతించడం తీవ్రమైన వివాదంగా మారింది. వక్ఫ్ భూముల్లో 'వక్ఫ్ బై యూజర్'



సౌలభ్యాన్ని తొలగించి అది వక్ఫ్‌గా కొనసాగాలంటే రిజిస్ట్రేషన్ దస్తావేజులు చూపాలనడం ఇంకో వివాదాంశం. వక్ఫ్ ఆస్తి అవునో కాదో తేల్చడానికి జిల్లా కలెక్టర్లకు విశేషాధికారాలు కల్పించడం, కనీసం ఐదేళ్ళుగా ఇస్లామిక్ ధార్మిక ఆచరణను కొనసాగిస్తున్నవారు మాత్రమే వక్ఫ్ దానం చేయడానికి అర్హులు అనడం కూడా వివాదంగా మారింది.

వక్ఫ్ భూములకు దస్తావేజులు చూపడం అసాధ్యమైన విషయం. 19వ శతాబ్దం ఆరంభం వరకు మన దేశంలో అసలు దస్తావేజులు, రిజిస్ట్రేషన్ల సంప్రదాయమే లేదు. లార్డ్ కార్న్‌వాలిస్ 1793లో తొలిసారిగా శాశ్వత భూమిశిస్తు విధానాన్ని తెచ్చాడు. అది కూడా ఇప్పటి బెంగాల్, బిహార్, ఒడిశా ప్రాంతంలో మాత్రమే. ఆ తరువాత థామస్ మన్రో మద్రాసు, బొంబాయి ప్రెసిడెన్సీల్లో రైత్వారీ విధానాలను తెచ్చాడు. భారత దేశంలో 8వ శతాబ్దం నాటికే ఇస్లాం ప్రవేశించింది. ఇస్లాం ప్రవేశించిన వెయ్యేళ్ళ తరువాత మనకు దస్తావేజులు, రిజిస్ట్రేషన్ విధానాలు వచ్చాయి.

అత్యున్నత న్యాయస్థానపు ధర్మాసనం సరిగ్గా ఈ అంశాన్నే పట్టించుకుంది. 'మనం చరిత్రను తిరగరాయలేం' అని భారత ప్రధాన న్యాయమూర్తి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు గుర్తుచేశారు. వక్ఫ్ వ్యవహారాల్లో పారదర్శకతను ప్రదర్శించడమేగాక, రెండు మత సమూహాల సహవాసాన్ని కొత్త చట్టం ప్రోత్సహిస్తుందని, ముస్లింల గుత్తాధిపత్యాన్ని తొలగిస్తున్నదని సొలిసిటర్ జనరల్ ధర్మాసనానికి వివరించే ప్రయత్నం చేశారు. ఇలా రెండు మతసమూహాల కలయిక ఒక ఆదర్శం అని కేంద్ర ప్రభుత్వం నిజంగానే నమ్ముతోందా? నమ్మితే హిందూ ధర్మాదాయ కమిటీల్లోనూ హిందూయేతరులకు స్థానం కల్పించాలిగా? సరిగ్గా ఈ ప్రశ్ననే భారత ప్రధాన న్యాయమూర్తి వేశారు. తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చేవరకు వక్ఫ్ భూములు వేటినీ డీ–నోటిఫై చేయరాదని ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

కేంద్ర ప్రభుత్వ వాదనను వినిపించడానికి ఒక వారం రోజులు గడువు ఇవ్వాలని సొలిసిటర్ జనరల్ ధర్మాసనాన్ని కోరారు. ఇందులో ఒక కిటుకు ఉంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా మరో మూడు వారాల్లో, మే 13న పదవీ విరమణ చేయనున్నారు. ఎలాగోలా ఈ సమయాన్ని సాగదీస్తే అనుకూలమైన తీర్పు తెచ్చుకోవచ్చు అనేది కేంద్ర ప్రభుత్వ వ్యూహంగా కనిపిస్తోంది.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు | 90107 57776

ఇంద్రవెల్లి పోరాటం

ఏప్రిల్ 20వ తేదీ ఆదివాసీ పోరాట చరిత్రలో చెరగని జ్ఞాపకం. 70వ దశకం చివరిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివాసులు భూమి పట్టాలు, శిస్తు వసూలు, తూకంలో మోసం, షావుకారీ వ్యవస్థ తదితర తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆదివాసీలకు 'గిరిజన రైతుకూలీ సంఘం'తో పరిచయం ఏర్పడింది. గోండు, కోలం, కోయ తెగల రైతులు అందులో చేరారు. పోడు భూములకు పట్టాలు, దళారీ షావుకారుల అధిక వడ్డీ వ్యాపారంలో మోసాలు తదితర అంశాలపై గిరిజన రైతుకూలీ సంఘం మహాసభలను 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ చేయాలని నిర్ణయించారు. ముందుగా సభ నిర్వహణ అనుమతికై స్థానిక ఆదివాసీలు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోగా, మొదట అనుమతి మంజూరు చేశారు. కానీ సభ జరిగే రోజు అనుమతి రద్దుచేసి 144 సెక్షన్ విధించారు. అప్పటి విప్లవ పార్టీ పీపుల్స్‌వార్ సైద్ధాంతిక మద్దతును గిరిజన రైతుకూలీ సంఘం కలిగివుందనే అనుమానంతో అధికారులు ఈ పనికి పూనుకున్నారు. అనుమతి రద్దయిన సంగతి తెలియక, 144 సెక్షన్ గురించిన సమాచార లోపంతో ఇంద్రవెల్లి చుట్టుపక్కల గ్రామాల ఆదివాసులతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ గూడేల ఆదివాసులు పెద్ద సంఖ్యలో ఇంద్రవెల్లి సభాస్థలికి వెళ్లారు. పోలీసులు చెట్లపై మాటువేసి ఆదివాసీలపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 17 మంది ఆదివాసులు మరణించారు. వందల మందిని అరెస్టు చేశారు. ఈ ఘటనను పాఠ్యాంశం చేయాల్సిన అవసరముంది.



– సిడం జంగుదేవ్,
ఆదివాసీ విద్యార్థి సంఘం
తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా...

ఆ సీఐని తక్షణమే సస్పెండ్ చేయాలి

మాజీ మంత్రి అంబటి డిమాండ్



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటి కృష్ణవేణి పట్ల అమర్యాదగా మాట్లాడిన సీఐని తక్షణమే సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా జైల్లో ఉన్న కృష్ణవేణితో శనివారం అంబటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ పల్నాడు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షురాలు మాధవి ములాఖత్ ద్వారా మాట్లాడారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడుతూ..సామాజిక మాధ్యమాల్లో సీమరాజా ఏదేదో మాట్లాడుతున్నాడని, ఆయన మంత్రి లోకేశ్ సృష్టించిన రోబో అని ఆరోపించారు. అతనిపై గుంటూరు పట్టాభిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కనీసం కేసు నమోదు చేయలేదని అంబటి చెప్పారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

పోలీసుల అదుపులో నిందితుడు!

విజయనగరం క్రైమ్: విజయనగరంలో నాలుగేళ్ల చిన్నారి (4)పై ఓ వ్యక్తి అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు..విజయనగరం జిల్లా కేంద్రంలోని ఓ వీధికి చెందిన నాలుగేళ్ల చిన్నారిని ఈ నెల 16న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి దిగబెట్టింది. మధ్యాహ్నం పాపను తెచ్చేందుకు కేంద్రానికి వెళితే అక్కడ లేదు. పాపను అదే వీధికి చెందిన గ్రంధి రాజు (42) బండిపై తీసుకువెళ్లినట్లు స్థానికులు చిన్నారి తల్లికి చెప్పారు. ఈ క్రమంలో కాసేపటికే నీరసంతో..ఏడుస్తూ ఇంటికి చేరిన పాపను తల్లి ఎక్కడికెళ్లావని ప్రశ్నించింది. రాజు చాక్లెట్‌లు, బిస్కెట్లు ఇచ్చి తనపై అఘాయిత్యానికి పాల్పడ్డాడని చెబుతూ.. తనకు నొప్పి వస్తుందని చిన్నారి ఏడ్చింది. విషయం ఎవరికైనా చెబితే పరువు పోతుందని పాప తల్లి దీనిపై అప్పుడు ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. అయితే చిన్నారి అనారోగ్యం బారిన పడటంతో శనివారం ఆమెను విజయనగరంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లింది. పరీక్షించిన వైద్యులు చిన్నారిపై జరిగిన అకృత్యాన్ని నిర్ధారించారు. సమాచారం అందుకున్న విజయనగరం టూటౌన్ సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఏఎస్‌ఐ పైడితల్లి ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రేవతి చిన్నారి కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఉమెన్ పీఎస్ డీఎస్పీ గోవిందరావు ఆదేశాల మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.



భీమిలి బీచ్‌లో 'పెద్ద పాలబొంత'

భీమిలి బీచ్ ఒడ్డున శనివారం పెద్ద సైజులో ఉన్న పాలబొంత చేప ప్రత్యక్షమైంది. వైఎస్సార్‌సీపీ నేత, మత్స్యకార నాయకుడు అల్లిపిల్లి నర్సింగరావుకు బీచ్ ఒడ్డుకు కొట్టుకు వచ్చిన ఈ చేప దొరికింది. ఇది సుమారు 15 కేజీలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ చేపలు సాధారణంగా చిన్నవిగా ఉండి, చాలా రుచిగా ఉంటాయని, కానీ ఈ చేప మాత్రం పెద్దగా ఉందని పేర్కొన్నారు.

– భీమునిపట్నం





ప్రపంచానికి శాంతి సందేశం

క్రీస్తు జీవితంలో మూడు ప్రధాన ఘట్టాలైన జననం, మరణం, పునరుత్థానం మూడూ ఎంతో ప్రత్యేకం. వీటిని క్రైస్తవులు క్రిస్మస్, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పేరుతో జరుపుకుంటారు. క్రీస్తుకు శిక్ష విధించడం నుంచి ఆయన శిలువపై మరణించడం వరకు 14 సంఘటనలు జరుగుతాయి. ఈ 14 ఘట్టాలకు విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ చిరుధాన్యాలతో రూపం కల్పించారు. దాదాపు నెల రోజుల పాటు శ్రమించి వీటిని తీర్చిదిద్దారు. ఇందుకోసం అరికలు, కొర్రలు, సామలు, నల్ల సామలు, రాగులు వినియోగించారు. వెనుక భాగాన్ని కొంత రంగులు అద్ది ఎంతో సహజత్వం ఉట్టిపడే విధంగా తీర్చిదిద్దారు. మూడు రోజులుగా విశాఖలోని సెయింట్ థామస్ ఆర్‌సీఎం చర్చ్‌లో ప్రదర్శించారు. దేశవ్యాప్తంగా ప్రముఖ చర్చిలలో వీటిని ప్రదర్శించి, భారత్ నుంచి పోప్‌కు బహుమతిగా వీటిని అందించాలని విజయ్ కుమార్ భావిస్తున్నారు.

–విశాఖపట్నం

అలిపిరి.. జనఝరి



కలియుగ వైకుంఠం తిరుమలకు భక్తులు పోటెత్తారు. శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రం వద్ద భక్తుల వాహనాలు కిలోమీటర్ల మేరకు బారులు తీరాయి. రద్దీ నేపథ్యంలో ఉదయం అలిపిరి కాలినడక మార్గం నుంచి గరుడ సర్కిల్ వరకు వాహనాలు ఇలా నిలిచిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

కిలో దొండ.. ₹5



నిండా నష్టాల్లో దొండ రైతులు / కోత ఖర్చులూ రాని దుస్థితి / ఆవేదనలో సాగుదారులు

పెరవలి: దొండ రైతుల పరిస్థితి అతివృష్టి, అనావృష్టి అన్న చందంగా మారింది. మూడు నెలల కిందట 10 కిలోల దొండ కాయలకు మార్కెట్లో రూ.325 ధర పలకగా..ప్రస్తుతం ఎవ్వరూ ఊహించని రీతిలో రూ.50కి పడిపోయింది. అంటే కిలో దొండ కాయలను రూ.5కు రైతు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. మునుపెన్నడూ లేని రీతిలో ధరలు పడిపోవడంతో దొండ పాదులు ఉంచాలో తొలగించాలో పాలుపోని స్థితిలో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పుడున్న ధరకు కనీసం కోత ఖర్చులు కూడా రావటం లేదని గగ్గోలు పెడుతున్నారు. దిగుబడి సమృద్ధిగా వస్తున్న సమయంలో ధరలిలా పడిపోవడంతో కూలీలు, పురుగు మందుల ఖర్చులకు సరిపోక అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

అందరూ సన్న, చిన్న కారు రైతులే

తూర్పుగోదావరి జిల్లాలో దొండ సాగుచేస్తున్న వారిలో సన్న, చిన్నకారు రైతులే అధికం. వీరు 10 సెంట్ల నుంచి రెండెకరాల విస్తీర్ణంలో పాదులు వేస్తున్నారు. పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, చాగల్లు, గోపాలపురం, కొవ్వూరు, తాళ్ళపూడి, కడియం, అనపర్తి, సీతానగరం, కోరుకొండ, రాజమహేంద్రవరం గ్రామీణ మండలాల్లో దొండ సాగు ఎక్కువగా జరుగుతోంది. నిత్యం 3 వేల టన్నుల దిగుబడి వస్తోంది. పెరవలి మండలం ఖండవల్లి, ముక్కామల, లంకమాపల్లి, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, కడింపాడు, పిట్టల వేమవరం, కానూరు అగ్రహారం, నల్లాకులవారిపాలెం గ్రామాల్లోని 900 ఎకరాల్లో దొండసాగు చేస్తున్నారు. ఇక్కడి ఖండవల్లి మార్కెట్ నుంచి రాష్ట్రంలోని తిరుపతి, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలు, తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు ప్రముఖ రిటైల్ సంస్థలకు ఎగుమతి అవుతుంటాయి.

దిగుబడి పెరిగింది..ధర తగ్గింది

ఖండవల్లి మార్కెట్‌కు సాధారణంగా ప్రతి రోజూ 70 నుంచి 80 టన్నుల దొండకాయలు వస్తుంటాయి. కానీ, కొన్నాళ్లుగా దిగుబడి ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. రోజూ 100 నుంచి 150 టన్నులకు పైగా కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. దీంతో పతనమైంది. పంట దండిగా చేతికి వచ్చినప్పుడు రేటు పడిపోతుండటాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆర్థికంగా తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

చేతికొచ్చేది రూ. 4వేలే..

దొండ సాగుకు పెట్టుబడి అధికం. ఎకరా విస్తీర్ణంలో రూ.2 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ఎకరం దొండ పందిరి నుంచి టన్నుకు పైగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. పాదుల్లో కాయలు కోయడానికి 10 మందికి పైగా కూలీలు అవసరం. ఒక్కో కూలీకి రోజుకు రూ.550 ఇవ్వాలి. అంటే 10 మందికి రూ.5,500 చెల్లించాలి. పాదుల సంరక్షణ, దిగుబడి సాధించాలంటే ఎరువులు, పురుగు మందులు, నీళ్ల తోడికలకు మరో రూ.2 వేలు ఖర్చవుతోంది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న రేటు ప్రకారం టన్ను కాయలు అమ్మితే రూ.5 వేలు మాత్రమే వస్తోంది. ధర గిట్టుబాటు కాకపోవడంతో కొందరు రైతులు దొండ పంటను వదిలేసి, కూలి పనులకు వెళ్తున్నారు. మరికొందరు పాదులు కోసేసి సాగునుంచి అర్ధంతరంగా వదిలేస్తున్నారు.

దొండ ధరల పతనం ఇలా..

(10 కిలోలకు రూ.లలో)

నెల	పతనం రూ.లలో
జనవరి	250 - 300
ఫిబ్రవరి	325 - 300
మార్చి	300 - 150
ఏప్రిల్	150 - 50

తూర్పు గోదావరి జిల్లాలో
దొండ సాగు విస్తీర్ణం: 3,000 ఎకరాలు
సాగు చేస్తున్న రైతులు : సుమారు 10వేలు
ఎకరానికి పెట్టుబడి : రూ.2,00,000

అప్పులు చేసి కూలీలకు ఇస్తున్నాం



కాపుకొచ్చిన దొండ పందిరిని చూసి ఆనందించాలో, గిట్టుబాటు ధర లభించడం లేదని బాధ పడాలో తెలియడం లేదు. కూలీలకు, పురుగు మందులు, ఎరువులకు అప్పు చేయాల్సి వస్తోంది. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. ఒక కోతకు టన్ను దిగుబడి వస్తోంది. మార్కెట్లో అమ్మితే కనీసం కూలీ ఖర్చులకు సరిపడేంత సొమ్ము రావడం లేదు.

– చింతా వెంకటేశ్వర్లు, దొండ రైతు, ఖండవల్లి, పెరవలి మండలం

అమరావతి నిర్మాణంలో అంతులేని దోపిడీ

- కాంట్రాక్టుల ముసుగులో ప్రజాధనం లూటీ
- మొబిలైజేషన్ అడ్వాన్సుల ద్వారా 8 శాతం కమీషన్లు
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణంలో అంతులేని దోపిడీకి సీఎం చంద్రబాబు తెగబడ్డారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణ సంస్థల టెండర్లలో పెద్దఎత్తున ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అత్యధిక రేట్లకు కాంట్రాక్టులు కట్టబెట్టారని ధ్వజమెత్తారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల రూపంలో ముందస్తు చెల్లింపులు చేసి అందులో 8 శాతం మొత్తాన్ని ముడుపులుగా దండుకున్న ఘనుడు చంద్రబాబు అని ఆరోపించారు. రాజధాని నిర్మాణంలో కూటమి ప్రభుత్వం 'పెంచుకో.. పంచుకో' (పీ–2)అంటూ ముందుకెళ్తోందన్నారు. 2014–19 మధ్య కూడా రూ.వేల కోట్లు ఖర్చు చేసినా పనులు ఎక్కడా కొలిక్కి తీసుకు రాలేదని గుర్తు చేశారు. తాత్కాలిక సచివాలయం, తాత్కాలిక అసెంబ్లీకి దేశంలో ఎక్కడా లేనివిధంగా ఖర్చు చేశారని, మళ్లీ ఇప్పుడు శాశ్వత భవనాలు అంటూ రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

రూ.3,200 కోట్లు దండుకున్నారు

రాజధాని నిర్మాణ పనుల్లో సిండికేట్ వ్యవస్థను చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని కారుమూరి ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్దలకు దగ్గరైన వారికే పనులు అప్పగించేలా సంస్థలతో సిండికేట్ ఏర్పాటు చేసి వాటికి మాత్రమే పనులు అప్పగించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. ఇందుకోసం టెండర్ల నియమ, నిబంధనలు మారుస్తున్నారన్నారు. అలా రాజధాని పనుల్లో రూ.9 వేల కోట్ల ప్రజాధనానికి ×టెండర్₹ పెడుతూ.. ఒక్క మొబిలైజేషన్ అడ్వాన్సుల్లోనే రూ.3,200 కోట్లకుపైగా ముఖ్యనేత జేబులో వేసుకున్నారని ఆరోపించారు. కిలోమీటరు రోడ్డుకు రూ.64 కోట్లు, భవనాల నిర్మాణానికి చదరపు అడుగుకు గరిష్ఠంగా రూ.10,043 చొప్పున టెండర్లు ఖరారు చేశారంటే ఏ స్థాయిలో దోపిడీ జరుగుతుందో అర్థమవుతోందన్నారు. ఇప్పటికే రూ.40,497 కోట్ల విలువైన పనులను అధిక ధరలకు 9 కాంట్రాక్టు సంస్థల పరం చేయగా, దానివల్ల ఖజానాపై రూ.1,231 కోట్లకుపైగా భారం పడుతోందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా రివర్స్ టెండరింగ్, జ్యుడీషియల్ ప్రివ్యూ విధానాలు అమలు చేసి ఉన్నట్లయితే ఈ పనుల్లో వేల కోట్ల రూపాయలు ఆదా అయ్యేదని స్పష్టం చేశారు.

గుడిపాడులో టీడీపీ నేతల దాష్టీకం

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి చేపల కంటైనర్ నిలిపివేత
- ఆత్మహత్యే శరణ్యమంటూ ఎస్పీ కార్యాలయానికి పురుగుమందు డబ్బాతో బాధితులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: హైకోర్టు ఉత్తర్వులతో సొంత చెరువులో పట్టిన చేపల్ని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన రైతు లారీలో తరలిస్తుండగా టీడీపీ నేతలు అడ్డుకోవడమే కాకుండా చెరువు గట్టుకు గండికొట్టి జేసీబీ, లారీని అడ్డంగా పెట్టిన ఘటన ఏలూరు జిల్లా గుడిపాడులో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపాడు మండలం గుడిపాడుకు చెందిన ఘంటసాల సుబ్బారావుకు అదే గ్రామంలో ఆరు ఎకరాల చేపల చెరువు ఉంది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్థానిక టీడీపీ నాయకులు మోరు దశరథమహారాజు, మురళీమోహన్‌తో పాటు మరికొందరు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన సుబ్బారావును వేధించసాగారు. 6 నెలల క్రితం సుబ్బారావు చెరువులోని చేపల్ని తరలిస్తుండగా అడ్డుకోవడంతో అప్పట్లో రూ.25 లక్షలకుపైగా నష్టం వాటిల్లింది. దీంతో రెండోసారి చేపలు పట్టుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ సుబ్బారావు హైకోర్టును ఆశ్రయించారు. చేపలను తరలించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్థానిక అధికారులు సహకరించాలని కోర్టు ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారమైనా తమకు న్యాయం చేయండని కోరడానికి ప్రయత్నిస్తే తహశీల్దార్ ఫోన్ స్విచాఫ్, ఎస్సై స్పందించని పరిస్థితి ఎదురైంది. తహశీల్దార్, ఎస్‌ఐ స్పందించకపోవడంతో సుబ్బారావు కుటుంబం ఎస్పీ కార్యాలయానికి పురుగుమందు డబ్బాతో వచ్చి ఆందోళన చేశారు. త్రీటౌన్ సీఐ అక్కడికి చేరుకుని దీనిని ఆర్‌డీఓ వద్ద చూసుకోవాలని చెప్పి పంపించేశారు.



పురుగుమందు డబ్బాతో బాధితురాలు వెంకటేశ్వరమ్మ

బాధితులు ఆర్‌డీఓను కలిస్తే నేను మాట్లాడతాను.. మీరు ఊరికి వెళ్లండని బాధితులకు చెప్పారు. రాత్రి 9 గంటలు దాటినా ఏ అధికారీ స్పందించని పరిస్థితి. ఈ విషయమై సుబ్బారావు భార్య వెంకటేశ్వరమ్మ మీడియాతో మాట్లాడుతూ.. రూ.50 లక్షలు పెట్టుబడి పెడితే ఇప్పటికే రూ. 25 లక్షలు నష్టం వచ్చిందని వాపోయింది. శనివారం రాత్రిలోగా కంటైనర్ బయటకు వెళ్లకపోతే చేపలు చనిపోయి మరో రూ.25 లక్షల మేర నష్టపోతామని తెలిపింది. టీడీపీ నాయకులను చేతులెత్తి వేడుకుంటున్నామని, తాము ఆత్మహత్య చేసుకోకుండా కాపాడాలని వేడుకుంది.

రోడ్డెక్కిన ధాన్యం రైతులు



ధాన్యం కొనుగోళ్లు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశవరం గ్రామంలో రైతులు రోడ్డెక్కారు. రాజమహేంద్రవరం–సామర్లకోట కెనాల్ రోడ్డుపై దాదాపు మూడు గంటలపాటు బైఠాయించి.. ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వివరాలు.. రబీ సీజన్‌లో 2,150 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు కేశవరం రైతులు తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది కొనుగోళ్లు నిలిపివేశారని.. ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. దళారులు బస్తాకు రూ.250 నుంచి రూ.400 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని.. దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు.

– మండపేట

వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారని దుకాణాలు ధ్వంసం

పల్నాడు జిల్లాలో టీడీపీ నాయకుల ఘాతుకం

శావల్యాపురం: వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారని దుకాణాలను టీడీపీ నేతలు ధ్వంసం చేసిన ఘటన పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా గంటావారిపాలెంలో ఎస్టీ కాలనీ (పాముల కాలనీ)లో పులి జ్యోతి, కుటుంబ సభ్యులు చికెన్, కిరాణా వ్యాపారం చేసుకుంటున్నారు. 2024లో ఎన్నికల్లో ఈ కుటుంబం వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారని గంటావారిపాలెం, వేల్పూరు గ్రామాలకు చెందిన సుమారు 10 మంది టీడీపీ నేతలు పొక్లెయిన్‌తో ఆ దుకాణాలను కూల్చివేశారు. దుకాణాలు ధ్వంసం చేస్తున్న దృశ్యాలను పులి జ్యోతి సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా గమనించిన టీడీపీ నాయకులు జాకెట్‌లో భద్రపరచుకున్న సెల్‌ఫోన్‌ను సైతం లాక్కుని పులి జ్యోతి, పులి నాగేశ్వరరావుపై దాడిచేశారు. ఈ ఘటనలో పులి నాగేశ్వరరావుకు గాయాలుకాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావును వివరణ కోరగా.. ఘటనపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.



కూల్చివేసిన దుకాణాలు

బీజేడీ చీఫ్‌గా నవీన్ పట్నాయక్

వరుసగా 9వ సారి ఎన్నికైన ఒడిశా మాజీ సీఎం

భువనేశ్వర్: బిజూ జనతాదళ్(బీజేడీ) అధిపతిగా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ వరుసగా 9వ విడత ఎన్నికయ్యారు. శనివారం భువనేశ్వర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నవీన్ పట్నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుందని సంస్థాగత ఎన్నిక రిటర్నింగ్ అధికారిగా ఉన్న పీకే దేవ్ ప్రకటించారు. అనంతరం నవీన్ పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మొత్తమ్మీద ఎక్కువ ఓట్లు సాధించినప్పటికీ స్వల్ప మార్జిన్‌తో ఓటమి చెందిందని చెప్పారు. బీజేడీకి వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన తప్పుడు ప్రచారాన్ని ముఖ్యంగా సోషల్ మీడియాలో సమర్థవంతంగా ఎదుర్కోలేకపోవడం వల్లే ఇలా జరిగిందన్నారు. సోషల్ మీడియాను, సాంకేతికతను మరింత సమర్థవంతంగా వినియోగించుకుంటూ బీజేపీ అసత్యాలను ఎండగడుతూ, నిజాలను బహిర్గతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ వ్యవస్థాపకుడైన నవీన్ పట్నాయక్ అధ్యక్ష పదవి రేసులో నిలిచిన ఏకైక అభ్యర్థిగా ఉన్నారు. 2000–2024 మధ్య ఒడిశాలో బీజేడీ పాలనను ఆయన స్వర్ణయుగంగా అభివర్ణించారు.

ఈ ఏడాది భారత్‌లో పర్యటిస్తా: ఎలాన్ మస్క్

న్యూయార్క్: భారత్‌లో పర్యటించాలన్న ఆకాంక్షను టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ వ్యక్తం చేశారు. ఈ ఏడాది భారత పర్యటన కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆయన శుక్రవారం భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆధునిక సాంకేతికత, నవీన ఆవిష్కరణలపై వారిద్దరూ చర్చించుకున్నారు. ప్రధాని మోదీతో మాట్లాడడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. ఈ ఏడాది ఆఖరు నాటికి ఇండియాలో పర్యటిస్తానని ఉద్ఘాటించారు. మస్క్ ప్రస్తుతం అమెరికా ప్రభుత్వంలో బలమైన శక్తిగా మారారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సన్నిహితుడిగా పరిపాలనా వ్యవహారాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఉద్యోగుల సంఖ్యను తగ్గించి, ప్రభుత్వ ఖర్చులకు కళ్లెం వేయడానికి ఉద్దేశించిన 'డోజ్'కు మస్క్ నేతృత్వం వహిస్తున్నారు.

ఎల్లుండి నుంచి మోదీ సౌదీ అరేబియా పర్యటన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం నుంచి రెండు రోజులపాటు సౌదీ అరేబియాలో పర్యటించనున్నారు. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ శనివారం ఈ విషయం వెల్లడించారు. ఇంధనం, వ్యాపారం, వాణిజ్యం, రక్షణ వంటి కీలక రంగాల్లో సౌదీ అరేబియాతో ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి మోదీ పర్యటన దోహదపడుతుందని తెలిపారు. సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్–సౌద్‌తో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా భారత్–సౌదీ అరేబియా మధ్య పలు ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందన్నారు. రెండు దేశాల నడుమ ఇప్పటికే అమల్లో ఉన్న ఇంధన సహకారానికి వ్యూహాత్మక కోణాన్ని జోడించే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్పష్టంచేశారు.

ఎండీఎంకే ముఖ్య కార్యదర్శి పదవికి

దురై వైగో రాజీనామా

చెన్నై: తమిళనాడులోని మరుమలర్చి ద్రావిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) పార్టీకి పెద్ద షాక్ తగిలింది. కీలక నేత పార్టీ పదవికి రాజీనామా చేశారు. ఎండీఎంకే వ్యవస్థాపకుడైన వైపూరి గోపాలస్వామి(వైగో) కుమారుడు, తిరుచిరాపల్లి ఎంపీ దురై వైగో పార్టీ ముఖ్య కార్యదర్శి పదవి నుంచి శనివారం తప్పుకున్నారు. పార్టీల్లో నెల కొన్న అంతర్గత కలహాల వల్లే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పార్టీ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు దురై వైగో 'ఎక్స్'లో పోస్టు చేశారు. తన రాజీనామాకు పార్టీలోని కొందరు వ్యక్తులే కారణమని ఆరోపించారు. ఇకపై సాధారణ కార్యకర్తగా పార్టీకి తనవంతు సేవలు అందిస్తానని చెప్పారు. తమిళనాడులో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దురై వైగో ఎండీఎంకే ముఖ్య కార్యదర్శి పదవికి రాజీనామా చేయడం సంచలనాత్మకంగా మారింది. ఈ అంశంపై ఆదివారం పార్టీ అధిష్టానం సమావేశమై చర్చించనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఎండీఎంకే అధికార డీఎంకే కూటమిలో భాగస్వామ్యపక్షంగా కొనసాగుతోంది.

'వక్ఫ్ బై యూజర్'పై వివాదం సృష్టించే కుట్ర

మల్లికార్జున ఖర్గే ధ్వజం

న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) చట్టం విషయంలో కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు సుప్రీంకోర్టు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. చాలాఏళ్లుగా వక్ఫ్ బోర్డుల అధీనంలో ఉన్న ఆస్తులు వక్ఫ్ బోర్డులకే చెందాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసిందని తెలిపారు. 'వక్ఫ్ బై యూజర్' అంశాన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్దేశపూర్వకంగా వివాదంగా మారుస్తోందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తులపై ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. శనివారం కాంగ్రెస్ ముఖ్యనేతలు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జుల సమావేశంలో ఖర్గే మాట్లాడారు. వక్ఫ్ బోర్డులపై దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తులపై ఇప్పటిదాకా లేని వివాదాలను కొత్తగా సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. వక్ఫ్ బోర్డుల విషయంలో తాము లేవనెత్తిన అంశాలకు సుప్రీంకోర్టు అధిక ప్రాధాన్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

మనిషి.. మరమనిషి సై

చైనా హాఫ్ మారథాన్‌లో సత్తా చాటిన హ్యూమనాయిడ్ రోబోలు

- 21 కి.మీ.ల పరుగుపందెంలో అలరించిన రోబోలు
- పురుషులతో పోటీగా దూసుకెళ్లిన వైనం
- బీజింగ్‌లో విజయవంతమైన రేస్ కార్యక్రమం

మనిషికి దీటుగా కృత్రిమ మేధ ఆన్‌లైన్‌లో అసాధారణ ప్రతిభ చూపిస్తుంటే ఆఫ్‌లైన్‌లో అంటే ప్రత్యక్షంగా హ్యూమనాయిడ్ రోబోలు మనిషికి సవాల్ విసురుతున్నాయి. అనుకున్నదే తడవుగా పరుగుపందెంలో పోటీకి దిగి తమ సామర్థ్యాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేశాయి. కృత్రిమ మేధ సాంకేతికతలో అధునాతన ఆవిష్కరణలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే 21 హ్యూమనాయిడ్ రోబోలు 21 కిలోమీటర్ల పరుగుపందెంలో మనుషులతో పోటీగా పరిగెత్తి శెభాష్ అనిపించుకున్నాయి. మానవులతో సమానంగా పరుగుకు ప్రయత్నించడంతో ప్రపంచంలోనే తొలి హ్యూమనాయిడ్ రోబో హాఫ్ మారథాన్‌గా ఈ కార్యక్రమం చరిత్రకెక్కింది. చైనాలోని బీజింగ్ నగరంలో శనివారం ఈ రోబోలు చేసిన హడావుడి అంతాఇంతా కాదు. మనిషి సృష్టించిన మరమనిషి.. మనిషితోనే పోటీకి సై అనడం చూసేందుకు జనం తండోపతండాలుగా విచ్చేశారు. వాటితో కలిపి సెల్ఫీలు, వీడియోలు తీసుకున్నారు. ట్రాక్‌పై పరుగెడుతున్న రోబోలను ఉత్సాహపరుస్తూ జనం విజిల్స్ వేస్తూ చప్పట్లు కొట్టారు. అమెరికా రోబోటిక్స్ కంపెనీలతో పోటీపడుతూ హ్యూమనాయిడ్ రోబోల రంగంలో ఆధిపత్యం కోసం చైనా ప్రయత్నిస్తున్న తరుణంలో దేశ రాజధాని బీజింగ్‌లో ఇజువాంగ్ హాఫ్ మారథాన్‌ను నిర్వహించడం గమనార్హం.

ఫార్ములా 1 తరహాలో..

ఫార్ములా 1 కార్ల రేసులో మార్గమధ్యంలో కార్ల టైర్లు పాడైతే వెంటనే ట్రాక్ పక్కనే హఠాత్తుగా ఆపేస్తారు. అక్కడున్న సిబ్బంది సెకన్ల వ్యవధిలో టైర్లు మార్చేసి వెంటనే రేస్‌ను కొనసాగించడానికి సాయపడతారు. శనివారం రోబోట్ల హాఫ్ మారథాన్‌లోనూ ఇదే నియమం పాటించారు. వేగంగా పరుగెత్తే రోబోల బ్యాటరీలు పాడైనా, చార్జింగ్ అయిపోయినా నిట్టనిలువుగా అక్కడే ఆగిపోకుండా పక్కనే స్టాప్‌పాయింట్లను సిద్ధంచేశారు. అక్కడ వెంటనే బ్యాటరీలను మార్చుకుని రోబోలు పరుగు కొనసాగించాయి. ఒకదానితో మరొకటి ఢీకొనకుండా ఉండేందుకు మొదట్లోనే వీటిని సమాంతరంగా 1–2 మీటర్ల దూరంలో నిలబెట్టి పోటీని ప్రారంభించారు.

ఎన్నెన్నో సైజులు, ఆకారాలు

బీజింగ్ ఎకనామిక్–టెక్నలాజికల్ డెవలప్‌మెంట్ ఏరియాలో జరిగిన ఈ రేసులో ఒకే డిజైన్‌తో కాకుండా భిన్న పరిమాణాల్లో వేర్వేరు ఆకారాల్లో ఉన్న హ్యూమనాయిడ్ రోబోలు పాల్గొన్నాయి. మారథాన్ పూర్తయ్యాక ఆయా రోబోట్ల తయారీ కంపెనీలు, విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు పలు విభాగాల కింద అవార్డులు అందజేశారు. 'అత్యంత పోటీతత్వం', 'గొప్ప డిజైన్', 'అత్యంత వినూత్న తరహా రోబో' ఇలా పలు అవార్డులు ప్రదానం చేశారు.



పోటీలో విజేతగా నిలిచిన 'తియాన్‌గాంగ్ అల్ట్రా' రోబో వెంట పరుగెత్తుతున్న ఇంజనీర్లు

2 గంటల 40 నిమిషాల్లో ఫినిషింగ్ లైన్‌కు..

ఈ పోటీలో చైనాలోని పలు ప్రముఖ హ్యూమనాయిడ్ రోబో కంపెనీలు, విశ్వవిద్యాలయాలు పోటీపడ్డాయి. తమ అధునాతన రోబోలను రంగంలోకి దింపాయి. ప్రతి రోబోకి ఒక రిమోట్ ఆపరేటర్, ఒక సహాయకుడు వెంటే పరుగెత్తారు. బీజింగ్ కేంద్రంగా పనిచేస్తున్న రోబోట్ ఇన్నోవేషన్ సెంటర్ వారి 'తియాన్‌గాంగ్ అల్ట్రా' రోబో వేగంగా దూసుకొచ్చి విజేతగా నిలిచింది. 21 కిలోమీటర్ల పరుగుపందాన్ని కేవలం 2 గంటల 40 నిమిషాల్లో పూర్తిచేసి ఔరా అనిపించింది. ''మనిషిలాగా ఈ రోబోకు పొడవైన కాళ్లను అమర్చాం. మనిషిలా ఒక పద్ధతిగా పరుగెత్తేలా ప్రత్యేక అల్గారిథమ్‌ను ఇందులో సెట్‌చేశాం. అందుకే గెలుపు సాధ్యమైంది''అని దీని తయారీసంస్థ రోబోటిక్స్ ఇన్నోవేషన్ సెంటర్ చీఫ్ టెక్నాలజీ అధికారి టాంగ్ జియాన్ చెప్పారు. హాఫ్ మారథాన్‌లో పురుషుల విభాగంలో 12,000 మంది పాల్గొనగా ఇథియోపియాకు చెందిన ఎలియాస్ దెస్తా అందరి కంటే వేగంగా ఒక గంట రెండు నిమిషాల్లో మారథాన్‌ను పూర్తిచేసి విజేతగా నిలిచాడు. ఫిబ్రవరినెలలో హాఫ్ మారథాన్‌లో ప్రపంచ పరుగువీరుడు, ఉగాండా అథ్లెట్ జాకబ్ కిప్లిమో ఇదే 21 కి.మీ.ల హాఫ్ మారథాన్‌ను కేవలం 56 నిమిషాల్లో పూర్తిచేయడం తెల్సిందే.

ఇక్కడ పరుగు ముఖ్యం కాదు..!

''ఇక్కడ కేవలం సరళరేఖ మార్గంలో పరుగు పందెం ముఖ్యం కాదు. అంతకుమించినవి ఎన్నో ఉన్నాయి. రోబోలు వేగంగా పరుగెత్తేటప్పుడు కూడా స్థిరంగా ఉండగల్గడం, ట్రాక్‌పై మలుపుల వద్ద తూలిపడిపోకుండా చూసుకోవడం, ట్రాక్‌పై జారిపోయే స్వభావం ఉన్న చోట జాగ్రత్తగా పరుగెత్తడం, ఎత్తుపల్లాలున్న చోట్ల వేగాన్ని అందుకు తగ్గట్లు మార్చుకోవడం వంటివన్నీ కీలకం. ఎంత వేగంతో వెళ్తే ఎంత బ్యాటరీ అయిపోతుంది?. గజిబిజి పరుగులో రోబో భాగాలు వదులుకాకుండా చూసుకోవడం వంటివన్నీ ముఖ్యమే''అని బీజింగ్ హ్యూమనాయిడ్ రోబోట్ ఇన్నోవేషన్ సెంటర్ సీఈఓ జియాంగ్ యూజువాన్ చెప్పారు. చైనాలో హ్యూమనాయిడ్ రోబోల మార్కెట్ మరో ఐదేళ్లలో ఏకంగా 119 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుందని ఓ అంచనా. ''రోబోల మారథాన్ ఇక్కడితో ముగిసినా హ్యూమన్ టెక్నలాజికల్ అభివృద్ధి శకం ఇక్కడితోనే మొదలుకానుందనే చెప్పాలి. నేటి స్ఫూర్తితో మరిన్ని సంస్థలు ఈ రంగంలో ముందుకొస్తాయి. భవిష్యత్ హ్యూమనాయిడ్ శకానికి ఇది నాంది''అని ఇజువాంగ్ స్థానిక యంత్రాంగం కమిటీ డిప్యూటీ డైరెక్టర్ లియాంగ్ లెయాంగ్ వ్యాఖ్యానించారు.

– బీజింగ్

కాల్పులకు 'ఈస్టర్' సెలవు

తాత్కాలిక విరమణ ప్రకటించిన పుతిన్



మాస్కో: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉక్రెయిన్‌తో జరిగే యుద్ధంలో తాత్కాలికంగా కాల్పుల విరమణను పాటించనున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. మాస్కో కాలమానం ప్రకారం శనివారం రాత్రి 6 గంటల నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు దాదాపు 30 గంటలపాటు ఇది అమల్లో ఉంటుందన్నారు. ఇదే విధమైన కాల్పుల విరమణకు ఉక్రెయిన్ ముందుకు రావాలని కోరారు. ఆ దేశం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఆర్మీ చీఫ్ వలెరీ గెరాసిమోవ్‌తో సమావేశం అనంతరం పుతిన్ ఈ మేరకు ప్రకటన చేశారు. అదే సమయంలో, రష్యా బలగాలు కాల్పుల విరమణ ఉల్లంఘనలకు, శత్రువు దుందుడుకు, రెచ్చగొట్టే చర్యలకు దీటుగా స్పందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాల్పుల విరమణపై ఉక్రెయిన్ ప్రతిస్పందనను బట్టి, ఈ సంక్షోభాన్ని ముగించే విషయంలో ఆ దేశానికి నిజంగా చిత్తశుద్ధి ఉన్నదీ లేనిదీ తెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇంధన వనరులే లక్ష్యంగా 30 రోజుల పాటు పరస్పరం దాడులకు పాల్పడరాదనే నిబంధనను ఇప్పటికే పలుమార్లు ఉక్రెయిన్ ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య ఒప్పందం కుదిరి, యుద్ధం ఆగని పరిస్థితుల్లో తాము మరోదారిని ఎంచుకుంటామంటూ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో శుక్రవారం హెచ్చరికలు చేయడం తెల్సిందే.

ప్రాణాలతో పుతిన్ చెలగాటం: జెలెన్‌స్కీ

పుతిన్ కాల్పుల విరమణ ప్రకటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. తమ బలగాలు కాల్పుల విరమణకు అంగీకరించవని ఆయన స్పష్టం చేశారు. పుతిన్ మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ మండిపడ్డారు. 'మా గగనతలంలో రష్యా షహీద్ డ్రోన్ల సంచారం, మా సైరెన్ల మోతలు ఆగడం లేదు'అని రష్యాను నిందించారు. విరమణ సమయాన్ని మరిన్ని బలగాలను సమీకరించుకునేందుకు, తమపై దాడులను ముమ్మరం చేసేందుకే పుతిన్ వాడుకుంటారని ఆరోపించారు.

6 గంటల నిద్ర, 2 గంటల వ్యాయామం

ఇదే నా ఆరోగ్య రహస్యం: అమిత్ షా



న్యూఢిల్లీ: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన ఆరోగ్య రహస్యాన్ని వివరించారు. సరైన ఆహారం, రోజులో ఆరు గంటల నిద్ర, రెండు గంటలపాటు వ్యాయామం అనే సూత్రాలను తు.చ. తప్పక పాటించడం వల్లే ఫిట్‌గా ఉన్నట్లు వెల్లడించారు. లివర్ డే సందర్భంగా శనివారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్‌లో జరిగిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. 2020 నుంచి పాటిస్తున్న ఆరోగ్య సూత్రాల వల్లే బరువు తగ్గానన్నారు. 'కంటి నిండా నిద్ర, నీరు, సరైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం అనే నియమాలను పాటిస్తున్నా. వీటి ఫలితంగానే ఎలాంటి ఇంగ్లిష్ మందులను వాడాల్సిన అవసరం నాకు ఇప్పటివరకు రాలేదు. డయాబెటిస్ వంటి వ్యాధుల బారిన పడలేదు'అని ఆయన వివరించారు. నేటి యువతరం కూడా ఇటువంటి నియమాలను పాటించి, మరో 40–50 ఏళ్ల ఆయుర్దాయం పెంచుకోవాలని, దేశాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. 'శారీరక ఆరోగ్యం కోసం రోజులో రెండు గంటలను వ్యాయామం కోసం కేటాయించండి, మెదడు ఆరోగ్యం కోసం ఆరుగంటలపాటు నిద్రపోండి. ఇది చాలా అవసరం. ఇదే నా అనుభవం'అని ఆయన పేర్కొన్నారు. అనంతరం, అమిత్ షా పాటిస్తున్న ఆరోగ్య సూత్రాలను ప్రధాని మోదీ ఎక్స్‌లో కొనియాడారు. 'ఆహారంలో నూనెలను తగ్గించుకోవడం వంటి చిన్నచిన్న మార్పులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఒబెసిటీపై అవగాహన కల్పిద్దాం. ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం'అంటూ ఆయన పిలుపునిచ్చారు.

ఢిల్లీలో కూలిన బహుళ అంతస్తుల భవనం

11 మంది మృతి, 11 మందికి గాయాలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని శక్తి విహార్ ప్రాంతంలో శనివారం బహుళ అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో 11 మంది చనిపోగా, 11 మంది క్షతగాత్రులయ్యారు. ముస్తఫాబాద్‌లోని 20 ఏళ్లనాటి నాలుగంతస్తుల భవనం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా కూలి, శిథిలాల దిబ్బగా మారిపోయింది. శిథిలాల కింద పడి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆ భవన యజమాని తెహ్సీన్, ఆయన కుమారుడు, కోడలు, వారి ఆరేళ్లలోపు ముగ్గురు పిల్లలు, తెహ్సీన్ మరో కోడలు ఉన్నారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం కొందరినిడిశ్చార్జి చేశారు. వీరిలో తెహ్సీన్ మరో కుమారుడు చాంద్ కూడా ఉన్నారు. తెహ్సీన్ భార్య సహా 9 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటన సమయంలో ఆ భవనంలో 22 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులతోపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలను ప్రారంభించారు.

ప్రమాదకరమైన ఘటన

ఘటనా ప్రాంతంలో సహాయక చర్యలను ఎన్‌డీఆర్‌ఎఫ్ డీఐజీ మొహ్సెన్ షాహిదీ పర్యవేక్షించారు. భవనాలు ఇలా ఆకస్మికంగా కూలడాన్ని సాంకేతికంగా తాము 'పాన్‌కేక్ కొల్లాప్స్'గా పిలుస్తుంటామన్నారు. 'ఇది ప్రమాదకరమైంది. ఇలాంటి సమయాల్లో బాధితులు ప్రాణాలతో బయటపడేందుకు అవకాశాలు చాలా తక్కువ. అయినప్పటికీ, సహాయక చర్యలు చురుగ్గా కొనసాగిస్తున్నాం'అని చెప్పారు. ఇరుకైన ప్రాంతం కావడంతో శిథిలాలను జాగ్రత్తగా తొలగించాల్సి వచ్చిందని వివరించారు. బాధితులందరినీ ముందుగా గురు తేజ్ బహదూర్ ఆస్పత్రికి తరలించామన్నారు.

నిర్మాణ పనులే కారణమా?

గ్రౌండ్ ఫ్లోర్‌లో కొత్తగా మూడు దుకాణాల నిర్మాణం కోసం చేపట్టిన పనులే ప్రమాదానికి కారణం కావచ్చని పోలీసులు తెలిపారు. కొన్నేళ్లుగా మురుగు నీరు భవనం గోడల్లోకి చొరబడుతుండటం వల్ల పగుళ్లతో బలహీనపడి ప్రమాదానికి దారితీసినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిసరాల్లో భూమి కంపించిందన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రమాదకరమైన స్థితిలో ఇటువంటి నాలుగైదు భవనాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. భవనం కుప్పకూలి పలువురు మృతి చెందడంపై సీఎం రేఖా గుప్తా విచారం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ఘటనాస్థలిలో శిథిలాలను తొలగిస్తున్న సహాయక సిబ్బంది

సుప్రీంకోర్టే చట్టాలు చేస్తే పార్లమెంట్‌ను మూసేయాలి

బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే వివాదాస్పద వ్యాఖ్య

న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానంపై సీనియర్ బీజేపీ నేత, నాలుగుసార్లు ఎంపీగా గెలిచిన నిషికాంత్ దూబే తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలుచేశారు. ''సుప్రీంకోర్టే చట్టాలు చేసేదుంటే ఇక పార్లమెంట్ ఎందుకు?. పార్లమెంట్‌ను మూసేయండి. సంసద్‌భవన్ తలుపులు మూసేయండి''అని దూబే అన్నారు. చట్టాల పరిశీలనలో ఇటీవల రాష్ట్రపతికి సైతం సుప్రీంకోర్టు 90 రోజుల గడువు విధించడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ శుక్రవారం ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ అసహనం వ్యక్తంచేసిన నేపథ్యంలో ఆయనకు పరోక్ష మద్దతు పలుకుతూ శనివారం దూబే తన 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. ''సుప్రీంకోర్టులో దురహంకార ధోరణి కనిపిస్తోంది. రాజ్యాంగం ద్వారా చట్టసభలకు దఖలుపడిన 'చట్టాలుచేసే అధికారం'ను సుప్రీంకోర్టు హరిస్తోంది. సుప్రీంకోర్టులోని జడ్జీలను రాష్ట్రపతే నియమిస్తారు. అలా తమను నియమించిన రాష్ట్రపతికే సుప్రీంకోర్టు జడ్జీలు '90 రోజుల గడువు'అంటూ అధికార పరిధిని నిర్దేశిస్తున్నారు. వక్ఫ్ చట్టానికొచ్చేసరికి కోర్టు దృక్కోణం మారిపోయింది. వక్ఫ్ బై యూజర్ నిబంధన సరిగా లేదని చెబుతోంది. అయోధ్యలోని రామమందిర కేసు వంటి ఇతర హిందూ ఆలయాల అంశాల్లో పురాతన స్థలాలకు డాక్యుమెంట్లు అడిగిన ఇదే సుప్రీంకోర్టు ఇప్పుడు వక్ఫ్(సవరణ)చట్టం విషయానికొచ్చేసరికి మసీదుల పాత డాక్యుమెంట్లు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తోంది''అని దూబే వ్యాఖ్యానించారు.

త్వరలో 30 ఎంబసీలు, 17 కాన్సులేట్ల మూసివేత

అమెరికా యోచన

వాషింగ్టన్: అమెరికాలో ఇప్పటికే వేలాది మంది ఫెడరల్ ఉద్యోగులు తొలగించిన ట్రంప్ సర్కార్ త్వరలో విదేశాల్లోని తమ రాయబార కార్యాలయాల సిబ్బందిపైనా తొలగింపు వేటు వేయనుందని తెలుస్తోంది. అమెరికా ప్రభుత్వంలోని అంతర్గత మంత్రిత్వశాఖకు సంబంధించిన డాక్యుమెంట్లలో ఆయా వివరాలు ఉన్నట్లు అమెరికా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రధానంగా యూరప్, ఆఫ్రికా ఖండాల్లో ఎక్కువ రాయబారకార్యాలయాలు, కాన్సులేట్లను శాశ్వతంగా మూసేయాలని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా 30 ఎంబసీలు, 17 కాన్సులేట్ కార్యాలయాలకు తాళాలు పడే అవకాశముంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ వ్యయ నియంత్రణ ప్రతిపాదనల్లో భాగంగా ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమిస్తోందని తెలుస్తోంది. సోమాలియా, ఇరాన్ దేశాల్లోనూ అమెరికా తన ప్రాధాన్యాన్ని తగ్గించుకోనుంది.

మూడో దశ చర్చలు 26న

రోమ్‌లో ముగిసిన ఇరాన్, అమెరికా రెండో దఫా చర్చలు

రోమ్: అణు కార్యక్రమాలను ఇరాన్ మరింతగా వేగవంతం చేసిన నేపథ్యంలో ఆ దేశంతో అమెరికా మొదలెట్టిన రెండో దఫా చర్చలు శనివారం రోమ్‌లో ముగిశాయి. తొలి దఫా చర్చలు ఒమన్‌లో ముగియగా రెండో రౌండ్ చర్చలు ఇటలీ వేదికగా శనివారం జరిగాయి. ఇటలీ రాజధాని రోమ్ నగరానికి సమీపంలోని క్యామిలూసియా ప్రాంతంలోని ఒమన్ రాయబార కార్యాలయంలో ఈ పరోక్ష చర్చలు జరిగాయి. అమెరికా తరఫున అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఇరాన్ తరఫున ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీలు చర్చల్లో పాల్గొన్నారు. ఈ చర్చలకు ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్ బుసైదీ మధ్యవర్తిగా వ్యవహరించారు. అయితే రెండోదఫా చర్చల్లో ఎలాంటి పురోగతి ఉందనే వివరాలను ఇరుదేశాలు వెల్లడించలేదు. అయితే ఏప్రిల్ 26వ తేదీన ఒమన్‌లో స్టీవ్ విట్కాఫ్‌తో మూడో దఫా చర్చలు జరగనున్నాయని ఇరాన్ మంత్రి అబ్బాస్ చెప్పారు. ''ఇరాన్ గొప్పగా, సుసంపన్నంగా ఉంటే సరిపోతుంది. అణ్వస్త్ర సామర్థ్యంతో పనిలేదు. ఆ సామర్థ్యాన్ని సాధించకుండా అడ్డుకోవడమే మా లక్ష్యం''అని ట్రంప్ శుక్రవారం వ్యాఖ్యానించారు. ''మేం ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగానే మెలిగాం. సమస్యలకు దౌత్యమార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు కట్టుబడి ఉన్నాం. సంప్రదింపులు కొనసాగుతాయి''అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ శనివారం తన 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. చర్చలు ముందు ఇరాన్ మంత్రి అరాగ్చీ ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీతో భేటీ అయ్యారు. తదుపరి చర్చల్లో రష్యా సైతం భాగస్వామి కానుందని వార్తలొచ్చాయి.

బుల్లెట్‌కు బలైన భారతీయ విద్యార్థిని

- రెండు కార్లలోని వ్యక్తుల మధ్య కాల్పులు
- దూసుకొచ్చిన బుల్లెట్ తగిలి బస్టాప్‌లో చనిపోయిన హర్‌సిమ్రత్‌కౌర్
- కెనడాలో విషాద ఘటన

న్యూయార్క్/తరన్ తారన్(పంజాబ్): ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి అక్కడ అనూహ్య ఘటనల్లో భారతీయులు ప్రాణాలు కోల్పోతున్న విషాద పర్వానికి ముగింపు కనిపించట్లేదు. తాజాగా కెనడాలో రెండు వాహనాల్లోని వ్యక్తుల మధ్య జరిగిన కాల్పుల ఘటనల్లో అభం శుభం తెలియని ఒక భారతీయ విద్యార్థిని బుల్లెట్ గాయాలకు బలైంది. పంజాబ్‌లోని తరన్ తారన్ జిల్లా ధుండా గ్రామానికి చెందిన 21 ఏళ్ల హర్‌సిమ్రత్ కౌర్ రంధావా కెనడాలో కాల్పుల ఘటనలో మృతిచెందారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి ఒంటారియో ప్రావిన్సులోని హామిల్టన్ నగరంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మృతి వార్త తెల్సి పంజాబ్‌లోని సొంతూరులో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె మృతదేహాన్ని వెంటనే భారత్‌కు తరలించాలని, నిందితులను కఠినంగా శిక్షించేలా కెనడా సర్కార్‌పై భారత ప్రభుత్వం ఒత్తిడితేవాలని సిమ్రత్ కుటుంబసభ్యులు డిమాండ్‌చేశారు.

అసలేం జరిగింది?

ఉన్నత విద్య కోసం సిమ్రత్ రెండేళ్ల క్రితం కెనడాకు వెళ్లారు. అక్కడ మొహాక్ కాలేజీలో చదువుకుంటున్నారు. రోజులాగే బుధవారం రాత్రి తాత్కాలిక ఉద్యోగం చేసే చోటుకు వెళ్లేందుకు హ్యామిల్టన్‌లోని అప్పర్ జేమ్స్, సౌత్ బెండ్ రోడ్ వీధిలోకి వచ్చారు. అక్కడే ఉన్న బస్టాప్‌లో నిల్చుని బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న రెండు వాహనాల్లోని వ్యక్తులు పరస్పరం గన్‌లతో కాల్పులు జరుపుకున్నారు. ఈ సందర్భంలో వేరే దిశలో దూసుకొచ్చిన ఒక బుల్లెట్ సిమ్రత్ ఛాతీలోకి దూసుకెళ్లింది. దీంతో విపరీతంగా రక్తమోడుతూ అక్కడే కుప్పకూలారు. విషయం తెల్సి అక్కడికొచ్చిన పోలీసులు ఈమెను వెంటనే ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. తుపాకీ బుల్లెట్లు సమీపంలోని ఇంట్లోకి సైతం దూసుకెళ్లాయి.

వీడియోలు ఉంటే ఇవ్వండి

ఘటనపై హ్యామిల్టన్ పోలీసులు వెంటనే దర్యాప్తు మొదలెట్టారు. నిందితుని కోసం వేట మొదలెట్టారు. కాల్పుల తర్వాత ఆ రెండు వాహనాలు వెంటనే ఘటనాస్థలి నుంచి వెళ్లిపోయాయని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. వాస్తవంగా ఏం జరిగిందని తెల్సుకునేందుకు సీసీటీవీ వంటి వీడియో ఫుటేజీలను సంపాదించేందుకు పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారు. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో అదే రోడ్‌లో వెళ్తున్న వాహనాల్లోని డ్యాష్‌క్యామ్ కెమెరా రికార్డులను ఇవ్వాలని స్థానికులను పోలీసులు కోరారు. భారతీయ విద్యార్థి మృతి పట్ల విదేశాంగ శాఖ తీవ్ర విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు టొరంటోలోని భారత కాన్సులేట్ జనరల్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. ''కాల్పుల్లో అమాయక భారతీయురాలు ప్రాణాలు కోల్పోవడం చాలా విచారకరం. సిమ్రత్ కుటుంబసభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నాం. మృతదేహం తరలింపుసహా అన్నిరకాల సహాయసహకారాలు ప్రభుత్వం నుంచి అందుతాయి''అని పేర్కొంది.



హర్‌సిమ్రత్ కౌర్

ఉల్కాపాతపు వెలుగులు

ఏప్రిల్ 22న ఆకాశంలో కనువిందు

అంతరిక్ష వీక్షకులకు మరో రెండు రోజుల్లో పండుగే. లైరెడ్ ఉల్కాపాతం వారికి కావాల్సినంతగా కనువిందు చేయనుంది. ఉత్తరార్ధ గోళంలోని వారు ఏప్రిల్ 22న తెల్లవారుజాము నుంచి కనీసం రెండు రోజుల పాటు ఈ ఖగోళ అద్భుతాన్ని తనివితీరా ఆస్వాదించవచ్చు. మబ్బుల వంటివేమీ లేకుండా వాతావరణం పొడిగా, వీలైనంత చీకటిగా ఉంటే చాలు. గంటకు కనీసం 10 నుంచి 20 దాకా ఉల్కలు భూ వాతావరణంలోకి ప్రవేశించి ప్రకాశవంతంగా మండిపోతూ కన్పిస్తాయి. ఒక్కోసారి వాటి సంఖ్య గంటకు 100 దాకా కూడా ఉంటుంది. ఈ వార్షిక ఖగోళ వింత సాధారణంగా ఏప్రిల్ 20 తర్వాత ఏర్పడుతూ ఉంటుంది.

ఏమిటి ఇవి: ఏటా భూమిని పలకరించే ఈ ఉల్కలను లైరెడ్స్‌గా పిలుస్తారు. వీటి మూలాలు లైరా నక్షత్రరాశిలో ఉండటమే అందుకు కారణం. అక్కడినుంచి పుట్టుకొచ్చిన థాచర్ అనే తోకచుక్క ఈ ఉల్కలకు మాతృస్థానం. థాచర్‌ను 1861లో తొలిసారిగా గుర్తించారు. ఇది సూర్యుని చుట్టూ 415 ఏళ్లకు ఓసారి చొప్పున తిరుగుతుంటుంది. ఆ క్రమంలో ఏటా ఏప్రిల్ చివర్లో భూమికి అతి సమీపంగా వస్తుంది. అప్పుడు దాని తోక తాలూకు శిథిలాలు భూ వాతావరణంలోకి ప్రవేశిస్తుంటాయి. కొన్ని అనామకంగా అదృశ్యమైపోతాయి. మరికొన్ని మాత్రం ప్రకాశవంతంగా మండిపోతూ అందమైన వెలుతురు వలయాలను సృష్టిస్తాయి. అందుకే వీటిని తారా సమూహంగా కూడా పిలుస్తుంటారు.

ఎప్పుడు చూడొచ్చు: ఏప్రిల్ 22 తెల్లవారుజామున 3 నుంచి 5 గంటల మధ్య సమయంలో లైరెడ్స్‌ను వీక్షించేందుకు అత్యంత అనువైనది. ఆ సమయంలో వాటి సంఖ్య, వెలుతురు రెండూ గరిష్టంగా ఉంటాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఇటీవలి సంవత్సరాల్లో అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గింది. ముఖ్యంగా 2023-24లో.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఏకంగా 34 శాతం తగ్గిపోయింది. కరోనా తరవాత అమెరికా మన విద్యార్థులకు ఇచ్చే వీసాల సంఖ్య కూడా తగ్గింది. 2024లో వీసాల సంఖ్యలో 14 శాతం తగ్గుదల కనిపించింది. మనతో పోలిస్తే.. అమెరికా వెళ్లే చైనా విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. 2019-20 నుంచి చూస్తే చైనా విద్యార్థుల సంఖ్య ఒక్కసారి కూడా లక్ష దాటలేదు.

సంవత్సరం	భారత్	చైనా
2018–19	43,714	1,05,775
2019–20	15,323	14,436
2020–21	80,451	90,310
2021–22	1,15,115	61,894
2022–23	1,30,730	85,950
2023–24	86,110	82,682

ఆధారం: అమెరికా విదేశాంగ శాఖ, బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్

సర్కారు క'బడి'

ప్రభుత్వ పాఠశాలలతో చెడుగుడు

హైస్కూల్లో ఉండే 3-5 తరగతులకు సబ్జెక్టు టీచర్ బోధన రద్దు

- యూపీ స్కూళ్లల్లో 6–8 తరగతులకూ ఎస్జీటీలే
- కొన్నిచోట్ల ఎలిమెంటరీ స్కూల్లోని 1, 2 తరగతులు హైస్కూళ్లకు..
- గందరగోళంగా జీవో 117 ప్రత్యామ్నాయ బోధన విధానాలు
- ప్రైవేటు స్కూళ్లకు మేలు చేసేలా మార్పులు
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు



సాక్షి, అమరావతి: ఇంటి పక్కనున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న పిల్లలు ఇకపై 4 కి.మీ. దూరంలోని హైస్కూళ్లకు వెళ్లాల్సిందే. ఇప్పటివరకు గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6నుంచి 8 తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్లు ఇకపై పాఠాలు చెప్పరు. అలాగే.. హైస్కూల్లోకి మారిన 3నుంచి 5 తరగతులు అక్కడే ఉన్నా వారికి చదువు చెప్పేది ఎస్జీటీలే. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు స్కూళ్లకు దీటుగా మారుస్తామని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం.. సర్కారీ స్కూళ్ల విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోయే పరిస్థితులను తీసుకొస్తోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్కసుతో 117 జీవో రద్దు కోసం కూటమి పెద్దలు చేస్తున్న ప్రయత్నాలు పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నాయి. విద్యా సంస్కరణల పేరుతో తాజాగా చేపట్టిన పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ, బోధన సిబ్బంది కూర్పుపై విద్యావేత్తలు, ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జనవరిలో ఇచ్చిన మార్గదర్శకాలకు భిన్నంగా ఇచ్చిన తాజా ఆదేశాలు విద్యార్థులకు నష్టం చేసేలా ఉన్నాయి. 5 రకాల పాఠశాలలను పునర్ వ్యవస్థీకరిస్తామని ప్రకటించిన విద్యాశాఖ.. తాజాగా ఆరో రకం (1–10 తరగతులు) పాఠశాలలను సృష్టించింది. కొత్త నిబంధనలతో ఏ పాఠశాలలో ఏ టీచర్ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

ఒక్కో స్కూల్‌కు ఒక్కో విధానం

జీవో నం.117కు ప్రత్యామ్నాయంగా తాజాగా విడుదల చేసిన బోధన సిబ్బంది కేటాయింపు నిబంధనల్ని చూసి ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రాథమిక (1–5) తరగతుల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం టీచర్, విద్యార్థుల సంఖ్య 1:30 నిష్పత్తిలో ఉండాలి. అయితే, విద్యాశాఖ ఇచ్చిన మార్గదర్శకాల్లో ఈ చట్టాన్ని కేవలం ఫౌండేషన్ స్కూల్ (1, 2 తరగతులు), బేసిక్ ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే అమలు చేస్తోంది. ఇక మోడల్ ప్రాథమిక పాఠశాలల(1 నుంచి 5)ల్లో 59 మంది విద్యార్థుల వరకు నలుగురు ఎస్జీటీలను కేటాయించింది. ఒకవేళ మిగులు ఎస్జీటీలు అందుబాటులో ఉండి.. 50 మంది విద్యార్థులుంటే ఒక పీఎస్ హెచ్‌ఎంతో పాటు నలుగురు ఎస్జీటీలను కేటాయించింది. అంటే మోడల్ స్కూళ్లకు 1:10 ప్రకారం ఉపాధ్యాయులను ఇచ్చింది. గతంలో 120 మంది దాటితేనే హెడ్ మాస్టర్ అన్న నిబంధనను సడలించింది. గతంలో ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేస్తామని పేర్కొన్నారు. కానీ.. తాజాగా యూపీ స్కూళ్లను కొనసాగిస్తూనే 6–8 తరగతులకు స్కూల్ అసిస్టెంట్లను తొలగించి, వారి స్థానంలో ఎస్జీటీలను కేటాయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా హైస్కూళ్లల్లో 1 నుంచి 10 తరగతుల వరకు బోధన అందించనున్నారు. ఈ హైస్కూళ్లలో 1 నుంచి 5 తరగతుల వరకు బేసిక్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు కానుంది. ఇందులో మొదటి 10 మంది విద్యార్థులకు ఇద్దరు ఎస్జీటీలు (1:5 ప్రకారం), తర్వాత 1:10 నిష్పత్తిలో సిబ్బందిని కేటాయిస్తున్నారు.

తాజా నిబంధనలపై తీవ్ర విమర్శలు

ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఉపాధ్యాయుల కేటాయింపులో ఏకీకృత విధానం లేకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైస్కూళ్లల్లో 3–4 తరగతులు ఉన్నా ఇప్పటివరకు వారికి బోధిస్తున్న సబ్జెక్టు టీచర్ విధానం రద్దు చేయడం, యూపీ స్కూళ్లలోనూ ఉన్నత తరగతులకు ఎస్జీటీలనే కేటాయించడం విస్మయానికి గురిచేస్తోంది. కొన్ని ప్రైమరీ స్కూళ్లలో టీచర్, విద్యార్థుల నిష్పత్తి 1:30గా ఉంటే.. మరికొన్నింటిలో 1:5గా ఉంది. ఈ ఎంపిక ఉపాధ్యాయులను అభద్రతకు గురి చేస్తోంది. ఏలూరు జిల్లాలోని ఓ హైస్కూల్లో ఉన్న బేసిక్ ప్రైమరీ పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ముగ్గురు ఎస్జీటీలు పనిచేసేలా, సమీప గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీ, మరో గ్రామంలో బేసిక్ ప్రైమరీ పాఠశాలలో 29 విద్యార్థులకు ఇద్దరు ఎస్జీటీలను కేటాయించడం గమనార్హం. ఈ అశాస్త్రీయ విధానాలు విద్యావేత్తల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. కొత్తగా వస్తున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లలో టీచర్లకు ఎస్జీటీలుగా పదోన్నతులు ఇచ్చి, పీఎస్ హెచ్‌ఎంలుగా నియమించాలి. స్కూల్ అసిస్టెంట్లు ఉన్నత తరగతులకు బోధించాలి. కానీ ప్రైమరీ స్కూళ్లల్లో హెచ్‌ఎం పోస్టులను స్కూల్ అసిస్టెంట్లతో సర్దుబాటు చేస్తున్నట్లు విద్యాశాఖ చెప్పడం విస్మయం కలిగిస్తోంది.

అంతుబట్టని సర్కారు విధానాలు

వైఎస్సార్ జిల్లాలోని ఒక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రస్తుతం అంగన్‌వాడీ, 1, 2 తరగతులకు ఫౌండేషన్ స్కూల్, 3 నుంచి 10వ తరగతి వరకు హైస్కూల్ కొనసాగుతున్నాయి. 1, 2 తరగతులకు ఎస్జీటీలు బోధిస్తుండగా, మూడో తరగతి నుంచి స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తున్నారు. తాజా నిబంధనలతో ఒకటి, రెండు తరగతులను హైస్కూల్లో విలీనం చేసి, ఇప్పటివరకు అదే హైస్కూల్లో ఉన్న 3–5 తరగతులు అదే ప్రాంగణంలోని ఫౌండేషన్ స్కూల్లోకి తీసుకొచ్చి, ఎస్జీటీతో బోధించనున్నారు. అంటే ఒకటి నుంచి 5 తరగతుల పిల్లలు వేళ్లేది హైస్కూల్‌కే అయినా చదివేది మాత్రం ప్రాథమిక పాఠశాలలోనే. దీంతో హైస్కూల్లోని సబ్జెక్ట్ టీచర్లను సర్‌ప్లస్‌గా చూపిస్తున్నారు. ఉన్నత తరగతులు కొనసాగుతున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్జీటీలకు బదులు స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వాలని, ఒకటి నుంచి 10 తరగతులు కొనసాగుతున్న హైస్కూళ్లలో 3వ తరగతి నుంచి గత ప్రభుత్వం జీవో 117 ద్వారా అమలు చేసిన స్కూల్ అసిస్టెంట్లతో బోధన చేయిస్తేనే విద్యార్థులు, ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. లేదంటే ప్రాథమిక, యూపీ స్కూళ్లలోని విద్యార్థులు ప్రైవేటు బాటపట్టడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాల 'వసంత'ం!

టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ భూకబ్జా బట్టబయలు

- హైదరాబాద్ శేరిలింగంపల్లిలో 39 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- రూ.3 వేల కోట్ల విలువైన స్థలంలో విల్లాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం
- బై నంబర్‌తో తప్పుడు రికార్డులు సృష్టించిన టీడీపీ ఎమ్మెల్యే
- సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే నిర్మాణాలు
- ఇటీవల పలు ఫిర్యాదుల నేపథ్యంలో కదిలిన హైడ్రా



హఫీజ్‌పేట్ సర్వే నెంబర్ 79 ప్రభుత్వ భూమిలో వెలసిన నిర్మాణాలు

సాక్షి, హైదరాబాద్ : స్వరాష్ట్రమే కాదు.. పొరుగు రాష్ట్రం తెలంగాణలోనూ ఆంధ్రప్రదేశ్‌లోని అధికార తెలుగుదేశం పార్టీ నేతలు కబ్జా పర్వం కొనసాగిస్తున్నారు. మైలవరం టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.3 వేల కోట్లు పలికే హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టారు. హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 79కి సంబంధించిన రికార్డులలో 39.06 ఎకరాలు ప్రభుత్వ భూమిగా ఉంది. అయితే బై నంబర్‌తో రికార్డులు సృష్టించిన వసంత కృష్ణప్రసాద్, మరి కొంత మంది ఆ భూమిని ఆక్రమించారు. చుట్టూ ప్రహరీ నిర్మించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ భూమిపై ఎన్నో ఏళ్ల నుంచి సుప్రీంకోర్టులో పిటిషన్ (సీఏస్ 14/58) పెండింగ్‌లో ఉంది. స్టేటస్‌కో పాటించాలని గతంలోనే సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయినా పట్టించుకోకుండా ఏళ్ల క్రితమే నిర్మాణాలు ప్రారంభించి 19 ఎకరాలలో విల్లాలు, అపార్ట్‌మెంట్లు నిర్మించారు. మిగతా 20 ఎకరాలలో షెడ్లు నిర్మించి అద్దెకు ఇచ్చారు. పలు కార్యాలయాలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టారు. కాగా అటు రెవెన్యూ అధికారులు కానీ, ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు కానీ ఈ అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారనే విమర్శలు ఉన్నాయి. ఫైనల్ డిక్రీ రాకుండానే ఈ భూముల్లో నిర్మాణాలు ఎలా చేపడుతున్నారని ఈ పిటిషన్ విచారణ క్రమంలో సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ నేపథ్యంలోనే భూముల కబ్జాపై గత మూడు నెలలుగా మరిన్ని ఫిర్యాదులు అందడంతో శనివారం పోలీస్ బందోబస్తుతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ భూమిలోని షెడ్లు, కార్యాలయాలతో కూడిన నిర్మాణాలను కూల్చివేశారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే శిక్షార్హులని పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులపై మియాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కాగా, ఈ భూమికి 79/1 బై నంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ 39.06 ఎకరాలు రెవెన్యూ రికార్డులలో ఇప్పటికీ ప్రభుత్వ భూమి (పోరంబోకు)గానే ఉంది.

నాజిల్ డైవర్జెంట్ పరీక్ష విజయవంతం



పీఎస్ఎల్‌వీలో నాలుగో దశలో నాజిల్ ఇది

సూళ్లూరుపేట: పీఎస్ఎల్‌వీ రాకెట్ నాలుగోదశలో వినియోగించే ద్రవ ఇంజిన్ నాజిల్ డైవర్జెంట్ పరీక్షలు విజయవంతమయ్యాయి. తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ నుంచి ఈ ప్రయోగాన్ని నిర్వహించి విజయాన్ని సాధించినట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ తన వెబ్‌సైట్ ద్వారా శనివారం తెలియజేసింది.

గోధుమ పంటను అంచనా వేసినశాటిలైట్

దేశవ్యాప్తంగా గోధుమ పంట గురించి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖకు భూ పరిశీలన ఉపగ్రహాలు నేషనల్ రిమోట్ సెన్సింగ్ స్పేస్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) ద్వారా సమగ్ర సమాచారాన్ని అందించినట్టు ఇస్రో తన వెబ్‌సైట్‌లో తెలిపింది. ఈవోఎస్–04 (రిశాట్–1ఏ), ఈవోఎస్–6 (ఓషన్‌శాట్–3), రిసోర్స్‌శాట్–2ఏ ఉపగ్రహాల నుంచి ఆప్టికల్, సింథటిక్ ఆపార్చర్ రాడార్ (సార్) రిమోట్ సెన్సింగ్ డేటాసెట్‌లను ఉపయోగించి గోధుమ పంటను అంచనా వేసినట్టు పేర్కొంది.

మాజీ మంత్రి రోజాపై గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

అక్కిరెడ్డిపాలెం(విశాఖ): గాజువాక టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుపై ఈనెల 17న తిరుపతిలో మాజీ మంత్రి ఆర్.కె. రోజా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గాజువాక పోలీస్ స్టేషన్‌లో టీడీపీ అంగన్‌వాడీ, డ్వాక్రా కమిటీ అధికార ప్రతినిధి ఎర్ర మాధవీలత ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే పల్లాపై చేసిన అనుచిత వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

రికార్డుల గల్లంతు.. అప్‌డేట్ కాని మ్యుటేషన్

612 గ్రామాల్లో రెవెన్యూ రికార్డులు గల్లంతు

2.27 లక్షల మంది రైతులకు ఐడీలు మిస్సింగ్

ముందుకు సాగని ఫార్మర్ రిజిస్ట్రీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ (ఏపీఎఫ్ఆర్) ముందుకు సాగడం లేదు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయ లోపం ఫార్మర్ రిజిస్ట్రీ నమోదులో ప్రతిబంధకంగా మారింది. ఫార్మర్ రిజిస్ట్రీలో అవకతవకలను మార్చి నెలాఖరు నాటికి చక్కదిద్దాలని తొలుత భావించినప్పటికీ.. సాంకేతిక సమస్యల కారణంగా ఏప్రిల్ 15లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయినా ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని భావిస్తున్నారు.

రికార్డుల గల్లంతే ప్రధాన సమస్య

రాష్ట్రంలో 612 గ్రామాల్లో ల్యాండ్ రికార్డ్స్ గల్లంతైనట్టు గుర్తించారు. మరోవైపు స్టేట్ ఫ్యామిలీ డేటా బేస్ (ఎస్ఎఫ్‌డీబీ)లో 6 వేలకు పైగా గ్రామాల్లో 2.27 లక్షల రైతుల ఖాతాల వివరాలు దొరకడం లేదు. ఎస్ఎఫ్‌డీబీ డేటా ప్రకారం డీ పట్టా, జిరాయితీ, అసైన్డ్, ఇనామ్, ఇతర భూ వివరాలు కూడా కనిపించడం లేదు. యాజమాన్య హక్కు బదలాయింపు (ల్యాండ్ మ్యుటేషన్) 2024 నవంబర్ నుంచి అప్డేట్ కాలేదు. రీ సర్వే పూర్తయిన గ్రామాలు, ల్యాండ్ పార్సిల్ మ్యాప్స్ (ఎల్‌పీఎం) రికార్డ్స్ డేటాతో పాటు ఆర్ఓఎఫ్ఆర్ వెబ్‌సైట్‌లోని అటవీ భూ సాగుదారుల వివరాలు కూడా ఫార్మర్ రిజిస్ట్రీతో అనుసంధానం కాకపోవడం ఫార్మర్ రిజిస్ట్రీ ముందుకు సాగకపోవడానికి కారణాలుగా చెబుతున్నారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, రాయలసీమ జిల్లాల్లో ఈ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని గుర్తించారు. ఈ కారణంగానే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసిన రైతులకు విశిష్ట సంఖ్య జారీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. వీటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించి పూర్తిస్థాయిలో డేటాను అందజేయాలని వ్యవసాయ శాఖ పలుమార్లు అభ్యర్థించినా రెవెన్యూ శాఖ నుంచి కనీస స్పందన కరువైంది. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు వెబ్ అప్లికేషన్ స్థానంలో మొబైల్ అప్లికేషన్ తీసుకు రావాలని, తద్వారా వెరిఫికేషన్, అప్రూవల్ మరింత వేగవంతం చేయాలని భావించారు. కానీ సాంకేతిక సమస్యలు వెబ్ అప్లికేషన్‌కు ఇబ్బందికరంగా మారాయి.

ఐదో స్థానానికి దిగజారిన ఏపీ

దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి గతేడాది అక్టోబర్‌లో శ్రీకారం చుట్టగా, మన రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరి 11న ప్రారంభించారు. తొలి దశలో పీఎం కిసాన్ లబ్ధిదారులు, మలి దశలో భూమిలేని కౌలుదారులను గుర్తించి విశిష్ట సంఖ్యను జారీ చేయాల్సి ఉంది. వెబ్‌ల్యాండ్ డేటా ప్రకారం రాష్ట్రంలో పీఎం కిసాన్ లబ్ధిదారులు 60 లక్షల మంది ఉండగా.. మార్చి 22 నాటికే 40 లక్షల మంది రైతుల వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదుతో జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ ఆ తర్వాత ఒక్కో స్థానం దిగజారిపోతూ వస్తోంది. గడచిన నెల రోజుల్లో కేవలం 4 లక్షల మందిని మాత్రమే నమోదు చేయడంతో రాష్ట్రం ఐదో స్థానానికి పడిపోయింది. ఫార్మర్ రిజిస్ట్రీ డాష్‌బోర్డు ప్రకారం ఇప్పటివరకు 44.03 లక్షల మంది రైతుల వివరాలు నమోదు చేయగా.. 35 లక్షల మందికి ఫార్మర్ ఐడీ అప్రూవ్ అయినట్టుగా చెబుతున్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ శాఖ నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లేకపోవడంతో ఫార్మర్ రిజిస్ట్రీలో వెనుకబడిపోయామని.. లేదంటే ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించే వారమని వ్యవసాయ శాఖ చెబుతోంది.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత యువకుడు ఆత్మహత్యాయత్నం

- తన భూమిని టీడీపీకి చెందిన సర్పంచ్ ఆక్రమించాడని
- ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని ఆవేదన




తహసీల్దార్ కార్యాలయం ఎదుట కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నరసింహులు

కమలాపురం: వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం వై కొత్తపల్లెలో దళితులకు కేటాయించిన స్థలాన్ని టీడీపీకి చెందిన సర్పంచి ఆక్రమించుకున్నాడని, దీనిపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు స్పందించక పోవడంతో విసుగు చెంది అదే గ్రామానికి చెందిన నరసింహులు అనే దళిత యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు..1994లో అప్పటి ప్రభుత్వం సర్వేనెంబరు 100/726లో 2.30 ఎకరాలు కేటాయించింది. ఇందులో 30మందికి ఎకరం స్థలంలో ప్లాట్లు వేసి కేటాయించారు. మిగతా 1.30 ఎకరా స్థలాన్ని స్థానిక దళితుల సామాజిక కార్యకలాపాల నిమిత్తం విడిచిపెట్టారు. కాగా గ్రామ సర్పంచి ప్రతాప్ రెడ్డి ఆ స్థలాన్ని ఆక్రమించాడు. ఈ విషయమై న్యాయం చేయాలని పలుమార్లు కడప, కమలాపురం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ నరసింహులు తిరిగాడు. టీడీపీ నేత ఆక్రమించుకున్న దళితుల స్థలాలను ఆక్రమణ నుంచి కాపాడి అర్హులైన వారికి ఇవ్వాలని పలుమార్లు విన్నవించాడు. ఈ క్రమంలో శనివారం కమలాపురం తహసీల్దార్ శివరామిరెడ్డిని కలిసి న్యాయం చేయాలని వేడుకున్నాడు.ఈ విషయమై కొద్ది రోజుల కిందట గ్రామానికి వచ్చి సదరు స్థలాన్ని పరిశీలించినా, న్యాయం చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని తహసీల్దారును నరసింహులు అడిగాడు. స్పందన లేక పోవడంతో ఆవేదన చెందిన నరసింహులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమీపంలో వున్న పోలీసులు సకాలంలో స్పందించి ఒంటిపై నీళ్లుచల్లి అడ్డుకున్నారు.

ఎట్టకేలకు డీఎస్సీ షెడ్యూల్ విడుదల

డీఎస్సీ–2025 మొత్తం పోస్టులు 16,347



సాక్షి, అమరావతి: దాదాపు 11 నెలలుగా మెగా డీఎస్సీ అంటూ అభ్యర్థులను ఊరిస్తూ వచ్చిన ప్రభుత్వం శనివారం రాత్రి ఎట్టకేలకు డీఎస్సీ–2025 షెడ్యూల్ విడుదల చేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని ఖాళీలను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు ప్రకటించారు. గత ప్రభుత్వం 6,100 పోస్టులతో ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి.. మెగా డీఎస్సీ ఇస్తామంటూ ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆశలు రేకెత్తించారు. అధికారం చేపట్టాక 16,347 డీఎస్సీ పోస్టుల భర్తీ ఫైల్‌పై తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు గతేడాది డిసెంబర్ నాటికే పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎట్టకేలకు అభ్యర్థుల వయో పరిమితిని 44 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం 16,347 పోస్టుల కోసం షెడ్యూల్ వెలువరించింది. ఇందులో ఎస్జీటీ 6,599, స్కూల్ అసిస్టెంట్ 7,487, పీఈటీ 2 పోస్టులు ఉన్నాయి. దీంతోపాటు ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, సాంఘిక, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించి మరో 2,259 స్టేట్/జోనల్ పోస్టులు ఉన్నాయి. పోస్టుల వివరాలు, పరీక్షల షెడ్యూల్, సిలబస్ తదితర వివరాలను ఆదివారం ఉదయం 10 గంటల నుంచి విద్యా శాఖ వెబ్‌సైట్‌లో ఉంచనున్నట్లు పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. వివరాలకు https:// cse. ap. gov.in / https// apdsc. apcfss. in వెబ్‌సైట్‌లను చూడవచ్చు.

ఉమ్మడి జిల్లాల వారీగా పోస్టుల ఖాళీలు ఇలా..

జిల్లా	తెలుగు	హిందీ	ఇంగ్లీష్	లెక్కలు	ఫిజిక్స్	బయాలజీ	సోషల్	ఫిజికల్‌ఎడ్యుకేషన్	ఎస్జీటీ
శ్రీకాకుళం	37	11	65	33	14	34	70	81	113
విజయనగరం	14	14	23	8	32	20	62	63	210
విశాఖపట్నం	26	28	55	59	39	58	91	139	239
తూర్పు గోదావరి	65	78	95	64	71	103	132	210	423
పశ్చిమ గోదావరి	42	61	84	40	40	64	103	181	420
కృష్ణా	39	25	93	52	54	142	135	123	545
గుంటూరు	42	57	69	35	58	86	109	166	521
ప్రకాశం	39	23	95	94	24	70	106	72	106
నెల్లూరు	39	18	84	63	76	63	103	107	115
చిత్తూరు	38	17	104	30	29	63	130	86	976
వైఎస్సార్	34	18	81	44	30	53	65	82	298
అనంతపురం	37	28	103	43	66	72	111	145	202
కర్నూలు	82	114	81	90	66	74	112	209	1,817

షెడ్యూల్ ఇదీ

దరఖాస్తుల స్వీకరణ, ఫీజు చెల్లింపు: నేటినుంచి మే 15వ తేదీ వరకూ

మాక్ టెస్ట్: మే 20 నుంచి

హాల్‌టికెట్ల డౌన్‌లోడ్: మే 30 నుంచి

పరీక్షలు: జూన్ 6 నుంచి జులై 6 వరకు

ప్రాథమిక కీ విడుదల: ప్రతి పరీక్ష పూర్తయిన రెండవ రోజున

అభ్యంతరాల స్వీకరణ: ప్రాథమిక కీ విడుదలైన 7 రోజుల వరకు

ఫైనల్ కీ: అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన 7 రోజుల తర్వాత విడుదల చేస్తారు

మెరిట్ జాబితా: ఫైనల్ కీ విడుదల చేసిన 7 రోజుల తర్వాత విడుదల చేస్తారు

క్లుప్తంగా...

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు

సాక్షి, అమరావతి: డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లోనూ ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులిచ్చారు. గతంలో ఉన్న ఎస్సీ 59 ఉపకులాలను 3 గ్రూపులుగా వర్గీకరించి రిజర్వేషన్లు అమలు చేయాలని సూచించారు. గ్రూప్–1లో రెల్లి 12 ఉపకులాలకు ఒకశాతం రిజర్వేషన్, గ్రూప్–2లో మాదిగ 18 ఉపకులాలకు 6.5శాతం, గ్రూప్–3లో మాల 29ఉపకులాలకు 7.5శాతం చొప్పున మొత్తం 15శాతం రిజర్వేషన్లు అందించాలని స్పష్టం చేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, బ్యాక్‌లాగ్ పోస్టులు రోస్టర్ పాయింట్ల ప్రాతిపదికన చేపట్టాలని పేర్కొన్నారు.

వక్ఫ్ కేసుల్లో టీడీపీ నిజాలను దాచిపెడుతోంది

ఏపీ ముస్లిం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్ మండిపాటు

సాక్షి, అమరావతి: వక్ఫ్‌బిల్లుకు మద్దతు ఇచ్చి ముస్లిం సమాజాన్ని వెన్నుపోటు పొడిచిన టీడీపీ ఇప్పుడు కిరాయి వ్యక్తులను రంగంలోకి దించి చిల్లర రాజకీయం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ మండిపడ్డారు. వక్ఫ్ కేసుల్లో వాస్తవాలను వక్రీకరిస్తూ టీడీపీ చేస్తున్న దుష్ప్రచారం ఆపాలని హితవు పలికారు. వక్ఫ్ పిటిషన్లను సుప్రీం ధర్మాసనం ఒక ప్రత్యేక కేసుగా పరిగణించిందన్నారు. వక్ఫ్ సవరణలో రాజ్యాంగ ఉల్లంఘనలను, మత వివక్షను ధర్మాసనం గుర్తించిందన్నారు. టీడీపీ తీరు మారకుంటే మైనారిటీల ఆగ్రహానికి గురికాకతప్పదని మునీర్ అహ్మద్ హెచ్చరించారు.

హజ్ యాత్రకు ప్రత్యేక ఏర్పాట్లు

మంత్రి ఫరూక్, తెలంగాణ సలహాదారు షబ్బీర్ అలీ సమీక్ష

సాక్షి, అమరావతి: హజ్–2025 యాత్రకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల సమన్వయ కమిటీ సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ సచివాలయంలో ఏపీ మంత్రి ఫరూక్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ ఎంబార్కేషన్ సెంటర్ నుంచి ఏపీ హాజీల ప్రయాణం ఈ నెల 29 నుంచి ప్రారంభమవుతుందని ఫరూక్ తెలిపారు.ఉమ్మడి రాష్ట్రాల మైనారిటీ సంక్షేమ మంత్రిత్వ శాఖల సమన్వయంతో యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు, లేకుండా చర్యలు తీసుకునేందుకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించినట్లు ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించండి

మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అన్ని యూఎల్బీల్లోను భారీగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ–వేస్ట్) ను సేకరించాలని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సూచించారు. శనివారం మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లతో మంత్రి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, అన్ని శాఖల అధికారులు, ప్రజల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

గుజరాత్ పర్యటనకు మంత్రి నారాయణ

పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలో అధికారుల బృందం గుజరాత్‌లో పర్యటించనుంది. అమరావతి నిర్మాణంలో భాగంగా పలు అంశాలను పరిశీలించేందుకు ఈనెల 20, 21 తేదీల్లో గుజరాత్‌లోని పలు ప్రాంతాలను సందర్శించి అధ్యయనం చేయనుంది.

క్లుప్తంగా...

22న వైఎస్సార్‌సీపీ పీఏసీ సమావేశం

సాక్షి,అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 22వ తేదీ (మంగళవారం) ఉదయం 10.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) తొలి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి కమిటీ సభ్యులందరూ హాజరుకానున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

ప్రధాని పర్యటనకు నోడల్ అధికారిగా వీరపాండియన్

సాక్షి, అమరావతి: రాజధాని పనులు పునఃప్రారంభించేందుకు మే 2న అమరావతికి వస్తున్న ప్రధాని మోదీ పర్యటనకు నోడల్ అధికారిగా వీరపాండియన్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాని మోదీ పాల్గొనే కార్యక్రమాలు, బహిరంగ సభకు సంబంధించి వివిధ శాఖల బాధ్యతలను ఆ శాఖల అధికారులకు అప్పగించారు. అధికారులు వారికి అప్పగించిన విధులకు హాజరవడంతో పాటు బ్లూ బుక్ నిబంధన ప్రకారం ప్రభుత్వం సూచించిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రోజువారీ పనుల పురోగతిని కంట్రోల్ రూమ్‌కు నివేదించాలని సీఎస్ సూచించారు.

పాస్టర్లకు ఇచ్చినవి పాత బకాయిలేగా

వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ మండిపాటు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాస్టర్లకు ఏడాదిపాటు ఇవ్వాల్సిన గౌరవ వేతనం బకాయిల్లో ఏడు నెలలకు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏదో గొప్ప మేలు చేసినట్టు బిల్డప్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. క్రైస్తవులకు కూటమి ప్రభుత్వం మేలు చేస్తోందంటూ టీడీపీకి చెందిన ఏపీఎస్ సీఎంఎఫ్‌సీ మాజీ చైర్మన్ మద్దిరాల జోసెఫ్ ఇమ్మానుయేల్ వ్యాఖ్యలను జాన్‌వెస్లీ ఖండిస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాస్టర్లకు రూ.50 కోట్లకు పైగా బకాయిలను చెల్లించాల్సి ఉండగా రూ.29.49 కోట్లు మాత్రమే ఇచ్చి ఎంతో చేశామని ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఇంకా రూ.21 కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019–24 పాలనలో క్రైస్తవుల సంక్షేమంలో భాగంగా 1,82,270 మందికి రూ.416.56 కోట్లను అందించారన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో క్రైస్తవులకు ఎప్పుడూ అంత మొత్తాన్ని ఖర్చు చేయలేదన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తు వివరాలను వెల్లడించడానికి ప్రభుత్వం మూడు వారాల కాలయాపన చేయడాన్ని క్రైస్తవ సమాజం మరిచిపోదన్నారు.

సెక్టోరియల్ అధికారులుగా ఎస్‌జీటీలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టులో సెక్టోరియల్ అధికారులుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల (ఎస్‌జీటీ)కు అవకాశం కల్పించారు. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టులో స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే అవకాశం ఉండేది. తాజా ఆదేశాల ప్రకారం ఎస్‌జీటీలకు అవకాశం కల్పించారు.ఈ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక టీచర్ల అసోసియేషన్ (ఆప్టా) ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు పర్యవేక్షణ కమిటీ

సాక్షి, అమరావతి: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లలో పేద విద్యార్థులకు ప్రవేశం కల్పించేలా సమగ్ర శిక్ష కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో నిర్ణీత శాతం మేర పేద విద్యార్థులకు ఉచిత విద్యను విధిగా అమలు చేసేందుకు జిల్లా అడ్మిషన్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలు షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులు తీసుకునేలా కమిటీలు జిల్లాల్లో పర్యవేక్షించాలని ఆదేశించారు. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్‌తో నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలల రిజిస్ట్రేషన్ శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ ప్రక్రియను ఉప విద్యాశాఖాధికారి (డీవైఈవో), స్థానిక ఎంఈవోలు పర్యవేక్షించాలి. కరపత్రాలు, బ్యానర్లు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాల్సిందిగా సూచించారు.

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా సంతోషరావు కొనసాగింపు

ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) సీఎండీగా కె.సంతోషరావును కొనసాగిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పదవీకాలం ఆదివారంతో పూర్తవుతుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ సీఎండీగా సంతోషరావు కొనసాగుతారని ఆదేశాల్లో పేర్కొన్నారు.

కప్పం కట్టలేం

రాష్ట్రం నుంచి పారిపోతున్న పారిశ్రామికవేత్తలు

కూటమి నేతల బెదిరింపులతో బెంబేలు



- వాటిని తట్టుకోలేక మూతపడుతున్న యూనిట్లు
- తమ పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు
- జేఎస్‌డబ్ల్యూ నవీన్ జిందాల్‌పై అక్రమ కేసులు
- దీంతో మన రాష్ట్రం వదిలేసి మహారాష్ట్రలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతున్న జేఎస్‌డబ్ల్యూ
- రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెడుతున్న అదానీ గ్రూపుపై పచ్చ పత్రికలతో విష ప్రచారం
- అదానీ కృష్ణపట్నం పోర్టులో కప్పం కట్టాలంటూ సోమిరెడ్డి అనుచరుల దాడి
- ఆర్టీపీఎస్ బూడిద లారీలు మాకంటే.. మాకంటూ.. బీజేపీ, టీడీపీ నేతల ఫైట్
- మామూళ్ల కోసం శ్రీకాకుళం యూబీ బీర్ల లారీలను అడ్డుకున్న టీడీపీ నేతలు
- సత్యసాయి జిల్లా గ్రీన్‌టెక్ రెడీమిక్స్‌లో వాటాలు డిమాండ్ చేస్తున్న మంత్రి
- ఎమ్మెల్యే వేధింపులతో పల్నాడులో మూత పడిన చెట్టినాడ్, భవ్య సిమెంట్
- అనకాపల్లి కోకోకోలా ప్లాంట్‌లో వాటాల కోసం జనసేన ఎమ్మెల్యే అరాచకం
- రెడ్‌బుక్ రాజ్యాంగంతో బాబోయ్ ఏపీ అంటున్న పారిశ్రామికవేత్తలు

కొత్త పెట్టుబడులు తేవడం కంటే.. ఉన్న కంపెనీల్లో వాటాలు మామూళ్లపైనే శ్రద్ధ..! శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ప్రతి జిల్లాలో అందినంత వసూళ్లు..! వసూళ్ల వేధింపులు భరించలేక యూనిట్లకు తాళాలు వేసుకుని పోతున్నవారు కొందరు.. ఏకంగా పెట్టుబడులను పక్క రాష్ట్రాలకు తరలిస్తున్న మరికొందరు..! వెరసి కూటమి సర్కారు కప్పం దెబ్బకు పారిశ్రామికవేత్తలు బెంబేలెత్తుతున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఏపీకో దండం అంటూ పారిపోతున్నారు.

సాక్షి, అమరావతి: యునైటెడ్ బ్రూవరీస్, కోకోకోలా.. చాలా పెద్ద సంస్థలు. ఇలాంటి కంపెనీలే రాష్ట్రంలో కూటమి పార్టీల నేతల వసూళ్లు, ఒత్తిళ్లపై నేరుగా కేంద్ర ప్రభుత్వానికే ఫిర్యాదు చేశాయంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. వైఎస్ఆర్ జిల్లాలో రూ.9 వేల కోట్లతో ఉక్కు ఫ్యాక్టరీతో పాటు విజయనగరంలో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత నవీన్ జిందాల్‌ను కూటమి సర్కారు సినీ నటి కాదంబరి జత్వానీని అడ్డుపెట్టుకుని కేసులు పెట్టి మరీ వేధిస్తోంది. దీంతో ఆ గ్రూప్ రాష్ట్రంలో పెట్టుబడులను ఆపేసి మహారాష్ట్రకు వెళ్లిపోయింది. రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేలా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

- ఏపీలో పోర్టులు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో భారీ పెట్టుబడులకు ముందుకొచ్చిన అదానీ గ్రూప్‌పై కూటమి పచ్చ పత్రికల ద్వారా విషం చిమ్మడంతో ఆ ప్రాజెక్టులు డోలాయమానంలో పడ్డాయి. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వద్ద అదానీ గ్రూప్ పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం చేపడితే తమకు కమీషన్లు ఇవ్వలేదని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరులు గూండాగిరీ చేశారు. ఆ సంస్థ కార్యాలయంపై రాళ్లతో దాడికి దిగి యంత్ర సామగ్రిని ధ్వంసం చేసి సిబ్బందిని గాయపర్చారు. అదానీ నిర్వహిస్తున్న కృష్ణపట్నం పోర్టు సిబ్బందిపై టీడీపీ ఎమ్మెల్యే నేరుగా వెళ్లి దాడి చేశారంటే కూటమి నేతల బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

కేంద్రానికే మొర

శ్రీకాకుళం జిల్లాలోని యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీపై బీజేపీ ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు, ఆయన అనుచరులు బెదిరింపులకు దిగారు. కంపెనీకి వచ్చే ప్రతి లారీపై రూ.వెయ్యి చొప్పున నెలకు రూ.కోటిన్నర కప్పం కట్టాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేం అని చెప్పడంతో ఎమ్మెల్యే అనుచరులు కంపెనీపై దాడి చేసి ఉద్యోగులను చితకబాదారు. కంపెనీ ప్రతినిధులు ఈ వ్యవహారంపై నేరుగా కేంద్రానికి ఫిర్యాదు చేశారు.

- మామూళ్ల కోసం అనకాపల్లి జిల్లాలో ఉన్న కోకోకోలా ఫ్యాక్టరీపై యలమంచిలి జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ బెదిరింపులకు దిగడంతో ఆ కంపెనీ ప్రతినిధులు నేరుగా కేంద్రానికి, సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు.
- చెప్పుకొంటూ పోతే మంత్రుల దగ్గర నుంచి ప్రతి ఎమ్మెల్యే తమ శక్తి మేరకు మామూళ్ల కోసం బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు.

కొత్తవి రాకపోయేసరికి పాతవి తమ ఖాతాలోకి

కొత్తగా పెట్టుబడులను ఆకర్షించడంలో పూర్తిగా విఫలమై దావోస్ నుంచి ఉత్తి చేతులతో తిరిగొచ్చిన సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు మంత్రి లోకేశ్.. గత ప్రభుత్వంలో వచ్చిన ప్రాజెక్టులను వారి ఖాతాలోకి వేసుకుంటూ గొప్పలు చెప్పుకొంటున్నారు. ఎన్టీపీసీ దేశంలోనే తొలిసారిగా రూ.1,10,000 కోట్లతో రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ యూనిట్ ఏర్పాటు చేసేలా 2023 విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ఒప్పందం చేసుకుంది. అన్ని పరిపాలన అనుమతులు, భూ బదలాయింపులు గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయి. దాన్ని కూడా తామే తీసుకొచ్చినట్లు బాబు, లోకేశ్ డప్పు కొంటుకుంటున్నారు.

- గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.పది లక్షల కోట్లకుపైగా గత ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంటే కూటమి సర్కారు తమ ఖాతాలోకి వేసుకుంటోంది. కాకినాడ గ్రీన్‌కో, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ వంటి వాటినీ తమ ఘనతగానే చెప్పుకొంటున్నారు.
- వైఎస్ జగన్ దావోస్ పెట్టుబడుల సమావేశానికి వెళ్లి ఆర్సెలర్ మిట్టల్ గ్రూప్ సీఈవో ఆదిత్య మిట్టల్‌తో ప్రత్యేకంగా సమావేశమై ఏపీలో పెట్టుబడులకు ఒప్పించారు. అయితే, ఒక్కసారి కూడా నేరుగా కలవకుండానే ఒక్క ఫోన్ కాల్‌తో అనకాపల్లిలో స్టీల్ ప్లాంట్‌ను తామే తీసుకొచ్చామని కూటమి నేతలు చెప్పుకొంటున్నారు.

మరికొన్ని చిలక్కొట్టుళ్లు

- రామాయపట్నం పోర్టు నిర్మాణ పనుల్లో తమకు వాటా ఇవ్వాలంటూ లారీలను అడ్డుకున్న కందుకూరు టీడీపీ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
- తమ నియోజకవర్గం గుండా వెళ్లే గ్రానైట్ లారీలపై కప్పం కట్టాల్సిందేనని పల్నాడు, ప్రకాశం ఎమ్మెల్యేల హుకుం
- నంద్యాలలో పొగాకు గోదాంల దగ్గరనుంచి చికెన్ షాపుల వరకు కమీషన్లు
- కప్పం కడితేనే గనులకు లీజ్ ఇస్తుండటంతో 50 శాతం పడిపోయిన ఆ శాఖ ఆదాయం
- నెల్లూరు జిల్లాలో రొయ్యల ఫీడ్ తయారు చేసే వాటర్‌బేస్ కంపెనీలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది కాంట్రాక్టు తమకే ఇవ్వాలంటూ ఒత్తిడి
- కృష్ణపట్నం పోర్టు సమీపంలోని పామాయిల్ తయారీ యూనిట్ల నుంచి లారీ కదలాలంటే సొంత టోల్ ట్యాక్స్ చెల్లింపు

సిమెంట్ పరిశ్రమల్లో మరీ దారుణ పరిస్థితి

తాజాగా పల్నాడు జిల్లాలో ఉన్న సిమెంట్ కంపెనీలపై స్థానిక ఎమ్మెల్యేలు మామూళ్లు, వాటాలు అంటూ దందాకు దిగారు. ముడి సరుకు, సిమెంట్ సరఫరాను అడ్డుకోవడంతో చెట్టినాడ్ సిమెంట్, భవ్య సిమెంట్ సంస్థలు ఉత్పత్తిని నిలిపివేసి యూనిట్లకు తాళాలు వేసి వెళ్లిపోయాయి. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

- తెలుగు రాష్ట్రాల్లో కీలకమైన ఒక తెలుగు చానల్‌ను తమ దారిలోకి తెచ్చుకోవడానికి ఆ సంస్థకు ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలకు చెందిన సున్నపురాయి సరఫరాను కూటమి సర్కారు నిలిపివేసింది. ఈ నేపథ్యంలో కార్యకలాపాలను నిలిపేయడానికి ఈ సంస్థ సిద్ధమైంది.
- రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి వచ్చే బూడిదను తీసుకువెళ్లే విషయంలో టీడీపీకి చెందిన జేసీ ప్రభాకరరెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి బహిరంగానే బాహాబాహీకి దిగిన సంగతి తెలిసిందే. కాంట్రాక్టు మాకు కావాలంటే మాకు కావాలంటూ కొట్టుకోవడంతో పంచాయితీ చివరకు సీఎం చంద్రబాబు వద్దకు చేరింది.
- నంద్యాల జిల్లాకు చెందిన ఒక మంత్రి సిమెంట్ కంపెనీలకు ఎర్రమట్టి సరఫరాపై తమ పార్టీకే చెందిన నాయకుడితో గొడవకు దిగారు. దీంతో అల్ట్రాటెక్ సిమెంట్స్ బూడిద, మట్టి సరఫరా లేక ఇబ్బందులను ఎదుర్కొంది.
- సిమెంటు సరఫరా దందాలో ఎస్పీకి ఫిర్యాదు చేసినందుకు తమ పార్టీ ఎమ్మెల్యేపైనే బీజేపీకి చెందిన ఎంపీ ఫైర్ అయ్యారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది.
- శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన మరో మంత్రి గ్రీన్ టెక్ రెడీమిక్స్ కంపెనీలో వాటాలు ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగారు.

అస్మదీయులపై అవ్యాజమైన ప్రేమ

ప్రీమియర్ ఎనర్జీస్‌కు రూ.1,573 కోట్ల ప్రోత్సాహకాలు

- నాయుడుపేట సెజ్‌లో 106.6 ఎకరాలు కేటాయింపు
- శ్రీ సత్యసాయి జిల్లాలో పెట్రా సిలికాన్‌కు 224.35, మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్ వైడ్‌కు 329 ఎకరాలు
- రామ్‌కో సిమెంట్స్‌కు నంద్యాల జిల్లాలో 79.91 ఎకరాలు..
- విజయనగరం జిల్లాలో మా మహా మాయకు మరో 82.80 ఎకరాలు
- ప్రొటేరియల్, స్నేహ ఫామ్స్, ఎల్‌జీ వెండర్స్, డిక్సన్, టాప్‌స్టోన్స్‌కు ప్రత్యేక రాయితీలు
- ఉత్తర్వులు జారీ చేసిన పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్

సాక్షి, అమరావతి: పరిశ్రమలకు కారుచౌకగా భూములు, భారీ ప్రోత్సాహకాలు, రాయితీలను ప్రకటిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.4,200.07 కోట్లతో నాయుడుపేట సెజ్‌లో 8 గిగావాట్ల సామర్థ్యంతో సోలార్ పీవీ సెల్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్న ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్‌పై రాష్ట్ర ప్రభుత్వం అవ్యాజమైన ప్రేమను చూపింది. కేవలం 1,500 మందికి మాత్రమే ఉపాధి కల్పిస్తామని చెప్పిన ఈ యూనిట్‌కు ఏకంగా రూ.1,573 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ఎకరం రూ.60 లక్షలు చొప్పున 106.6 ఎకరాలను కేటాయించింది. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర వద్ద మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్ వైడ్ లిమిటెడ్ రూ.1,197 కోట్లతో రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికి తొలి దశ యూనిట్ ఏర్పాటుకు ఎకరా రూ.7లక్షలు చొప్పున 329 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఐఐసీ ఈ భూములను ఎకరా రూ.21.95 లక్షలు చొప్పున సేకరించినప్పటికీ రూ.49.18 కోట్ల నష్టానికి మ్యాట్రిక్స్ వరల్డ్ వైడ్‌కు భూములను కేటాయించింది. రెండో దశకు అవసరమైన 671 ఎకరాలను కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

- విజయనగరం జిల్లాలో ఇప్పటికే ఉన్న మా మహామాయ సంస్థ రూ.2,063 కోట్లతో ప్రతిపాదించిన స్టీల్ ప్లాంట్ విస్తరణ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం రూ.797.96 కోట్ల రాయితీలు ప్రకటించింది. ప్రస్తుతం యూనిట్ ఉన్న ప్రాంతంలోనే మరో 82.80 ఎకరాలను ఏపీఐఐసీ సేకరించి ఇవ్వడానికి అనుమతించింది. ఈ భూమిలో 25.88 ఎకరాల్లో ఉన్న నీటి వనరులను ముందస్తు అనుమతులతో వినియోగించుకోవడానికి కూడా ఆమోదం తెలిపింది.
- శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.585.64 కోట్లతో ఇంటిగ్రేటెడ్ క్వార్ట్జ్ యూనిట్ ఏర్పాటు చేయనున్న పెట్రా సిలికాన్‌కు 224.35 ఎకరాలను కేటాయించింది.
- నంద్యాల మండలం కోటపాడులో సుమారు రూ.478 కోట్లతో రామ్‌కో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ పరిశ్రమకు 79.91 ఎకరాలను కేటాయించింది.
- తిరుపతి జిల్లా శ్రీ సిటీలో సుమారు రూ.1,055.55 కోట్లతో ప్రొటేరియల్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్న అమ్రోఫస్ మెటల్ తయారీ యూనిట్‌కు రూ.237.71 కోట్ల రాయితీలతోపాటు ఇతర ప్రోత్సాహకాలను ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- స్నేహ ఫామ్స్ రూ.459.97 కోట్లతో నెల్లూరు, పశ్చిమ గోదావరి, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న కోళ్ల దాణా, మొక్కజొన్న నిల్వ గోడౌన్లు, బాయిలర్ ఫామ్స్‌కు రూ.67.44 కోట్ల ప్రోత్సాహకాలకు అనుమతించింది.
- శ్రీ సిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వెండర్స్ ఏర్పాటు చేస్తున్న వివిధ యూనిట్లకు పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది.
- డిక్సన్ టెక్నాలజీస్ తిరుపతి, కొప్పర్తి ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లకు సంబంధించి రూ.3.08 కోట్ల లీజ్ రెంటల్ అండ్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ (ఈవోటీ) ఫీజును, టాప్‌స్టోన్ మెటల్స్‌కు సంబంధించి రూ.28.82 లక్షల ఈవోటీని రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు.

మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు భూములు చట్ట విరుద్ధం


ఈఏఎస్ శర్మ బహిరంగ లేఖ



సాక్షి, అనకాపల్లి: నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఏపీఐఐసీకి చెందిన 2,300 ఎకరాల భూమిని ఇవ్వడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ అన్నారు. పోర్ట్ నిర్మాణం కోసం సేకరించిన భూమిని ప్రైవేట్ సంస్థల ఏర్పాటుకు కట్టబెట్టడం సరికాదన్నారు. ఇది 2013లో కేంద్రం ప్రవేశపెట్టిన భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. తక్షణం ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన పలు అంశాలను ఈ లేఖలో ప్రస్తావించారు. భూములకు సంబంధించి రికార్డులలో ఏపీఐఐసీ పేరు ఉన్నా, ఆ భూముల యజమానులు, చిన్నకారు రైతులు ఇంకా సాగులోనే ఉన్నారని తెలిపారు. ఇంకా వారికి పూర్తిగా నష్ట పరిహారం అందలేదని కూడా పేర్కొన్నారు.

ఉత్తరాంధ్రకు వడగాడ్పుల ప్రభావం

- నేడు, రేపు ఠారెత్తనున్న ఎండలు
- వారం రోజుల తర్వాత తగ్గనున్న ఉష్ణోగ్రతలు



సాక్షి, విశాఖపట్నం: భానుడు రెండు రోజుల పాటు ఉత్తరాంధ్ర జిల్లాలపై ప్రభావం చూపనున్నాడు. ఆది, సోమవారాల్లో సాధారణం కంటే 4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయని ఏపీ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. 20న 12 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 19 మండలాల్లో వడగాడ్పులు, 21న 10 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 12 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయన్నారు. తీవ్ర వడగాడ్పుల ప్రభావం మాత్రం ఉత్తరాంధ్ర జిల్లాలపైనే ఉంటుందని తెలిపారు. 20వ తేదీన విజయనగరం జిల్లాలోని 10 మండలాల్లో, పార్వతీపురం మన్యం జిల్లాలోని 2 మండలాల్లో మాత్రమే ఆదివారం వడగాడ్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. 21న మన్యం జిల్లాలో 10 మండలాల్లో తీవ్ర వడగాడ్పుల ప్రభావం ఉంటుంది. కర్ణాటక, తమిళనాడు, రాయలసీమ మీదుగా ఉపరితల ద్రోణి సముద్రమట్టానికి 1.5 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. వారం రోజులపాటు అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వారం రోజుల అనంతరం ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టే సూచనలున్నాయని తెలిపారు.

మేం చెప్పిందే వేదం... కేసులు కట్టమంటే కట్టాలి

మా వాళ్లపైనే కేసులు రాస్తావా?
టీడీపీ నాయకులు ఫోన్ చేస్తే తీయవా?
ఉద్యోగం వదిలి వెళ్లిపో!
ఎక్సైజ్ సీఐ శిరీషాదేవిపై టీడీపీ ఎమ్మెల్యే థామస్ ఆగ్రహం
కన్నీళ్లు పెట్టుకున్న మహిళా సీఐ
'సాక్షి' టీవీ రిపోర్టర్ సెల్‌ఫోన్ లాక్కుని డేటా తొలగింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'అధికారంలో ఉన్నది మా ప్రభుత్వం. మేం చెప్పిందే వేదం. మేం ఏం చెప్పినా వినాలి. కేసులు కట్టమంటే కట్టాలి. వద్దంటే మానేయాలి. అలా ఉంటేనే ఉద్యోగం చేయాలి. లేదంటే ఉద్యోగం వదిలి వెళ్లిపో..' అంటూ చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే థామస్... ఎక్సైజ్ సీఐ శిరీషాదేవిపై చిందులు తొక్కారు. శనివారం కార్వేటి నగరంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే థామస్‌కు టీడీపీ నేతలు... ఎక్సైజ్ సీఐపై ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ కార్యాలయంలో తమకు చోటులేదని, టీడీపీ నాయకులపైనే సీఐ కేసులు పెడుతున్నారని, తాము ఫోన్లు చేసినా సీఐ తీయడం లేదని ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన ఎమ్మెల్యే 'ఏయ్.. ఏమనుకుంటున్నావ్. వాళ్లకు కుర్చీలు వేసి కూర్చోబెట్టి మా నాయకులొస్తే నిలబెడతావా? ఉద్యోగం వదిలి వెళ్లిపో... మా ప్రభుత్వంలో ఇలాంటి పిచ్చివేషాలు వేస్తే ఊరుకోం. ఏం మేం ఫోన్ చేస్తే తీయవా?. నీకు సీఎం చంద్రబాబే ఫోన్ చేయాలా? ఆయన చెబితేనే వింటావా?' అంటూ నాయకులు, కార్యకర్తలు, మీడియా ఎదుట మహిళా అధికారి అని కూడా చూడకుండా అవమానించారు. దీంతో సీఐ తన సిబ్బంది ముందు తలదించుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు.

'సాక్షి వాళ్లను ఎవరు రమ్మన్నారు.. బయటకు గెంటండి'

మహిళా సీఐపై ఎమ్మెల్యే చిందులేస్తున్న దృశ్యాన్ని చిత్రీకరించడానికి సెల్‌ఫోన్ బయటకు తీసిన 'సాక్షి' టీవీ విలేకరిపై ఎమ్మెల్యే, కూటమి నాయకులు రెచ్చిపోయారు. 'ఎవర్రా.. నిన్ను లోపలికి పంపింది. సాక్షి వాళ్లు ఎందుకొస్తారు. మర్యాదగా బయటకెళ్లు' అంటూ అనుచిత వ్యాఖ్యలతో అవమానించారు. విలేకరి సెల్‌ఫోన్ లాక్కుని అందులోని డేటాను తొలగించి బయటకు గెంటేశారు. ఆ తర్వాతా ఎక్సైజ్ సీఐని ఎమ్మెల్యే బూతులు తిట్టారని తెలిసింది.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే సామాజిక న్యాయం

- వ్యవస్థాగతంగా మరింత బలోపేతం అవుదాం
- పార్టీ బీసీ విభాగం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో వక్తలు
- కూటమి పార్టీలకు బీసీల సత్తా చూపిద్దామని పిలుపు


తమ్మినేని సీతారామ్


జోగి రమేష్


ధర్మాన కృష్ణదాస్

సాక్షి, అమరావతి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపిన ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ అని ఆ పార్టీ బీసీ విభాగం నేతలు కొనియాడారు. పార్టీ నేతలెవరైనా కాలర్ ఎగరేసుకుని తిరిగేలా వైఎస్ జగన్ పాలించారని చెప్పారు. సామాజిక న్యాయం విషయంలో ఇదివరకెన్నడూ లేని విధంగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. వ్యవస్థాగతంగా మరింత బలోపేతం అవుదామని చెప్పారు. తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో శనివారం ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ.. బీసీలు ఎవరికీ భయపడనవసరం లేదన్నారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ కాదని.. బ్యాక్ బోన్ క్లాసెస్ అని మన నాయకుడు జగన్ నిర్వచించారన్నారు. కూటమి పాలనలో అరాచకాలు అణగారిన వర్గాలపైనే ఎక్కువగా జరిగాయని చెప్పారు. అనంతపురం జిల్లాలో బీసీ నేత కురుబ లింగమయ్యను దారుణంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్ పాలనలో బీసీ కులాలు ఆత్మగౌరవంతో జీవించాయన్నారు. అన్ని రంగాల్లోనూ అవకాశాలను అందుకుని, రాజ్యాధికారాన్ని అనుభవించాయని గుర్తు చేశారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రాచగొల్ల రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలన బీసీలకు స్వర్ణయుగం అని కొనియాడారు. బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాడు వెంకటరమణ మాట్లాడుతూ.. కూటమి పార్టీలకు బీసీల సత్తా చూపిద్దాం అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. పూలే ఆశయాలను జగనన్న కొనసాగించారని చెప్పారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కూటమి సూపర్ సిక్స్ మోసాలను బయటపెడతామని చెప్పారు.

కూటమి దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

సమాజంలో అన్ని వర్గాలకు సమన్యాయం అందించి ప్రగతికి బాటలు వేయాలని అన్ని రాజకీయ పార్టీలు చెబుతాయని, దాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించింది ఒక్క వైఎస్సార్‌సీపీనే అని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సంక్షేమం విషయంలో వైఎస్ జగన్ చెప్పనివి కూడా చేసి ఆ తర్వాత ప్రజల వద్దకు వెళ్లారని గుర్తు చేశారు. చంద్రబాబుది అవకాశవాద రాజకీయమని, అధికారంలోకి రాగానే దోచుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారని విమర్శించారు. కూటమి దుష్ప్రచారాన్ని తిప్పికొడదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చంద్రబాబు దుర్మార్గపు పాలనను ప్రజల్లోకి తీసుకెళదామని చెప్పారు. వ్యవస్థాగతంగా మరింత బలోపేతం అవుదామని, గతంలో కంటే మెరుగ్గా పూర్తి స్థాయి కమిటీలు నియమించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు లేళ్ళ అప్పిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో నారాయణ విజయదుందుభి

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్‌–2025 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థ చరిత్ర సృష్టించింది. ఓపెన్‌ కేటగిరీలో ఆలిండియా టాప్‌–20లో బణిబ్రత మాజీ 1వ ర్యాంకు, టి.శివెన్‌ వికాస్‌ 9వ ర్యాంకు, సారవ్‌ 12వ ర్యాంకు, అర్చిస్మాన్‌ నంది 13వ ర్యాంకు, సన్నద్య షరాఫ్‌ 19వ ర్యాంకు, ఆయుష్‌ సింఘాల్‌ 20వ ర్యాంకు కైవసం చేసుకున్నారని విద్యాసంస్థల డైరెక్టర్స్‌ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలిండియా అన్ని కేటగిరీల్లో 10లోపు 13 ర్యాంకులతో పాటు.. 100 లోపు 94 ర్యాంకులు, 1,000 లోపు 750 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

శ్రీచైతన్య సంచలనం

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్‌–2025 ఫలితాల్లో శ్రీచైతన్య సంచలనం సృష్టించింది. 300కి 300 మార్కులతో ఆలిండియా ఓపెన్‌ కేటగిరీలో ఫస్ట్‌ ర్యాంక్‌ వంగ అజయ్‌ రెడ్డితో పాటు ఆలిండియా ఓపెన్‌ కేటగిరీలో దేవ్‌దత్తా మాజి ఫస్ట్‌ ర్యాంక్, తోష్నివల్‌ శివెన్‌ 9వ ర్యాంకు, సాక్షం జిందాల్‌ 10వ ర్యాంకుతో ఆలిండియా ఓపెన్‌ కేటగిరీలో టాప్‌ 10లోపు 4 ర్యాంకులు, 100లోపు 27 ర్యాంకులు, 1,000లోపు 150కి పైగా ర్యాంకులు, ఆల్‌ కేటగిరీలో 10లోపు 10 ర్యాంకులూ సాధించినట్లు శ్రీచైతన్య అకడమిక్‌ డైరెక్టర్‌ సుష్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత మూడేళ్లలో తెలుగు రాష్ట్రాల నుంచి వరుసగా జేఈఈ మెయిన్‌లో 300కి 300 సాధిస్తూ హ్యాట్రిక్‌ రికార్డు సృష్టించిన ఘనత శ్రీచైతన్యకే దక్కుతుందన్నారు.

ఎస్‌ఆర్‌ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: జేఈఈ మెయిన్‌–2025 ఫలితాల్లో ఎస్‌ఆర్‌ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం విడుదలైన ఈ ఫలితాల్లో అన్ని కేటగిరీలు కలిపి జాతీయస్థాయిలో వి.నాగసిద్ధార్థ 5వ ర్యాంకు, పాటిల్‌ సాక్షి 48వ ర్యాంకు, ఎం.అరుణ్‌ 60వ ర్యాంకు, ఎం.రవిచంద్రారెడ్డి 65వ ర్యాంకు సాధించారని ఎస్‌ఆర్‌ విద్యాసంస్థల చైర్మన్‌ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. అలాగే వై.భరణిశంకర్‌ 88వ ర్యాంకు, బి.సురేశ్‌ 98, దాసరి ఫణీంద్ర 116, మోదెల్లా వెంకటకౌశిక్‌ 141, ఈర్ల బిందుశ్రీ 142, గుట్ట దిలీప్‌రెడ్డి 190, భూక్య వినోద్‌ 246, సీహెచ్‌ షణ్ముఖసాయి 274, బి.ధనషణ్ముఖశ్రీ 410, కాగితపు దీపక్‌ 491, పుత్తూరు ఉజ్వల్‌ 509వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. ఆయా విద్యార్థులు ఎస్‌ఆర్‌ కీర్తి ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెట్టారని అభినందించారు.

సత్తా చాటిన 'భాష్యం'

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్‌–2025 ఫలితాల్లో భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల చైర్మన్‌ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని భాష్యం మెయిన్‌ క్యాంపస్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ విద్యార్థిని గుత్తికొండ జి.సాయిమనోజ్ఞ మాత్రమే ఆంధ్రప్రదేశ్‌ నుంచి 100 పర్సంటైల్‌ సాధించి చరిత్ర సృష్టించిందన్నారు. ఓపెన్‌ కేటగిరీలో అఖిల భారత స్థాయిలో 18వ ర్యాంకు కైవసం చేసుకున్న సాయి మనోజ్ఞ మహిళా కేటగిరీలో ఆలిండియా టాపర్‌గా నిలిచిందని వివరించారు. తమ విద్యార్థులు కె.సాయి షణ్ముఖరెడ్డి అఖిల భారత స్థాయి ఓపెన్‌ కేటగిరీలో 52వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్‌ విభాగంలో 2వ ర్యాంకును పొందాడని తెలిపారు. మొత్తం 100లోపు 16 ర్యాంకులతోపాటు ఆల్‌ ఇండియా 200లోపు 28 ర్యాంకులు, 500లోపు 60 ర్యాంకులు, 1,000లోపు 82 ర్యాంకులు కైవసం చేసుకుని 73.24శాతం సక్సెస్‌ రేట్‌తో సత్తా చాటారన్నారు.

'శశి'కి జాతీయ స్థాయి ర్యాంకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జేఈఈ మెయిన్‌ ఫలితాల్లో తమ విద్యార్థులు మరోసారి జాతీయ స్థాయిలో అసాధారణ ర్యాంకులతో విజయభేరి మోగించారని శశి విద్యాసంస్థల చైర్మన్‌ బూరుగుపల్లి రవికుమార్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల్లో జి.అనుపాజ్‌ 26వ ర్యాంకు, డీఎంఎస్‌ మణికంఠ రెడ్డి 63వ ర్యాంకు, ఎ.శివరామ్‌ 142వ ర్యాంకు, బి.నిఖిల 159వ ర్యాంకు, ఏఎల్‌ జ్ఞానప్రకాష్‌ 168వ ర్యాంకు, కె.జైకిషన్‌ 225వ ర్యాంకు సాధించారని వివరించారు. ఇంకా 100లోపు రెండు ర్యాంకులు, 500లోపు 12 ర్యాంకులు, 1,000 లోపు 19 ర్యాంకులు, 10వేలలోపు 101 ర్యాంకులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను శశి విద్యాసంస్థల వైస్‌ చైర్మన్‌ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ అభినందించారు.

శ్రీ ప్రకాష్‌ విద్యార్థుల ప్రతిభ

తుని: జేఈఈ మెయిన్‌ ఫలితాల్లో శ్రీ ప్రకాష్‌ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్‌ విజయ్‌ప్రకాష్‌ తెలిపారు. కె.సత్య సాయి శ్రీనివాస్‌ భగవాన్‌ 77వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు తమ విద్యార్థులు 23 మంది అర్హత సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శ్రీ ప్రకాష్‌ విద్యాసంస్థల అధినేత సీహెచ్‌కే నరసింహారావు, ప్రిన్సిపాల్‌ వీవీఎస్‌ఎస్‌ భానుమూర్తి, అకడమిక్‌ ఇన్‌చార్జి డి.శ్రీలక్ష్మి అభినందించారు.

శ్రీ విశ్వశాంతి విజయకేతనం

ఉయ్యూరు: జేఈఈ మెయిన్‌ ఫలితాల్లో కృష్ణా జిల్లా ఉయ్యూరులోని శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారు. విశ్వశాంతి విద్యార్థిని తుమ్మలచర్ల హారిక 99.97 శాతం పర్సంటైల్‌తో ప్రతిభ చాటింది. పలువురు విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారు. హారికతోపాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల చైర్మన్‌ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, అకడమిక్‌ డైరెక్టర్‌ మాదల సూర్యశేఖర్‌ సత్కరించి అభినందనలు తెలిపారు.

కేకేఆర్‌ గౌతమ్స్‌ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: జేఈఈ మెయిన్‌లో కృష్ణాజిల్లా గుడివాడలోని తమ పూర్వ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారని కేకేఆర్‌ గౌతమ్స్‌ హైస్కూల్‌ ప్రిన్సిపాల్‌ ఎం.సత్యారామ్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో 100 లోపు తొమ్మిది ర్యాంకులు తమ విద్యార్థులు సాధించడం కేకేఆర్‌ గౌతమ్స్‌ విద్యాసంస్థ ప్రత్యేకతను చాటిందన్నారు. ఎన్‌.హేమంత్‌ అభిరాయ్‌ 18వ ర్యాంక్, వై. జస్వంత్‌ చౌదరి 22వ ర్యాంక్, ఎల్‌.చర్విత 22వ ర్యాంక్‌ సాధించారని పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను కేకేఆర్‌ గౌతమ్స్‌ యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

తిరుమల జయకేతనం

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ మెయిన్‌ పరీక్షలో తిరుమల ఐఐటీ అండ్‌ మెడికల్‌ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్‌ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.ప్రణీత్‌ 2వ ర్యాంకు, కె.యశ్వంత్‌ సాత్విక్‌ 3వ ర్యాంకు, పి.శరత్‌ సంతోష్‌ 9వ ర్యాంకు, వి.తేజశ్రీ 18వ ర్యాంకు, టి.జశ్వంత్‌దొర 30వ ర్యాంకు, కె.అభినవ్‌ 45వ ర్యాంకు, కె.యశ్వంత్‌రాజా 46వ ర్యాంకు, జి.సుజోష్‌రాజా 66వ ర్యాంకు, ఇ.వర్షిత్‌ 75వ ర్యాంకు, ఎం.కారుణ్యరాజ్‌ 86వ ర్యాంకు, కె.వెంకట రామవినీష్‌ 100వ ర్యాంకు సాధించారని వివరించారు. వీరితోపాటు 120, 153, 154, 159, 191 ర్యాంకులను తమ విద్యార్థులు కైవశం చేసుకున్నారన్నారు. 1,000లోపు 84 మంది, 5,000లోపు 318 మంది, 10,000లోపు 562 మంది, 20,000లోపు 944 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. కోచింగ్‌ తీసుకున్న విద్యార్థుల్లో 2,618 మంది అడ్వాన్స్‌డ్‌ పరీక్షకు అర్హత పొంది 92 శాతం సక్సెస్‌ రేటు సాధించారని చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను తిరుమలరావు అభినందించారు.

'ఆదిత్య' విద్యార్థుల అద్భుత ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ మెయిన్‌ ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్‌ నల్లమిల్లి శేషారెడ్డి తెలిపారు. ఆల్‌ ఇండియా స్థాయిలో కె.రుత్విక్‌ 23వ ర్యాంకు, పి.ఆదిత్య అభిషేక్‌ 46 ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. వీరితోపాటు తమ విద్యార్థులు 109, 111, 112, 118, 135, 144, 155, 206, 212, 280, 300, 309, 342, 359, 395, 524 ర్యాంకులను పొందారని వివరించారు. 2వేలలోపు 44, 5 వేలలోపు 102 ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి, హాస్టల్‌ డైరెక్టర్‌ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, కో ఆర్డినేటర్‌ కె.లక్ష్మీకుమార్‌ అభినందించారు.

ఐఐటీలో ఈసీఈలో చేరడమే లక్ష్యం



'సాక్షి'తో జేఈఈ మెయిన్‌ మహిళల విభాగం టాపర్‌ సాయి మనోజ్ఞ

- రోజుకు 12 గంటలు ప్రిపరేషన్‌కు సమయం కేటాయించా
- గ్రాండ్‌ టెస్ట్‌లు, మోడల్‌ టెస్ట్‌లు రాస్తూ తప్పులు సరిదిద్దుకున్నా
- ఏయే రకంగా ప్రశ్నలు వస్తాయో ఊహించి అందుకు తగ్గట్లు అభ్యాసం చేశా

పదో తరగతి (ఐసీఎస్‌ఈ): 588 మార్కులు
ఇంటర్: 987 మార్కులు
జేఈఈ మెయిన్‌ జనవరి సెషన్: 295 మార్కులు
జేఈఈ మెయిన్‌ ఏప్రిల్‌ సెషన్: 300 మార్కులు

'జేఈఈ మెయిన్‌ జనవరి సెషన్‌లోనూ 100 పర్సంటైల్‌ సాధించా. కానీ మార్కులు తగ్గడంతో 300 మార్కులు లక్ష్యంగా ఏప్రిల్‌ సెషన్‌కు హాజరయ్యా. నిర్దిష్ట ప్రణాళికతో ఆ మార్కులు సాధించగలిగా' అని జేఈఈ మెయిన్‌ మహిళల విభాగం ఏపీ టాపర్, గుంటూరుకు చెందిన గుత్తికొండ సాయిమనోజ్ఞ చెప్పింది. ఐఐటీలో ఈసీఈలో బీటెక్‌ చేయడమే తన లక్ష్యమన్న మనోజ్ఞ 'సాక్షి'తో తన ప్రిపరేషన్‌ తీరుతెన్నులను పంచుకుంది.

కాన్సెప్ట్స్‌పై అవగాహనతో..: జేఈఈ మెయిన్‌ పరీక్షలో విజయానికి.. ఆయా సబ్జెక్ట్‌లలో కాన్సెప్ట్‌ల పై, ప్రాబ్లమ్స్‌ సాల్వ్‌ చేసే సమయంలో ఫార్ములా లను అన్వయించే విధానంపై పట్టు సాధించా. ఇది ఎంతో ఉపయోగపడింది. పరీక్షలో ప్రశ్నలకు సరైన సమాధానం ఇచ్చేందుకు తోడ్పడింది.

టెన్త్‌ నుంచే జేఈఈ దిశగా..: ఐఐటీలో చేరాలనే లక్ష్యంతో పదో తరగతి నుంచే ప్రిపరేషన్‌ సాగించా. ఇంటర్‌కు ఐసీఎస్‌ఈ నుంచి బోర్డ్‌ సిలబస్‌ వైపు మారా. ఇందులో ఉండే అంశాలు జేఈఈ సిల బస్‌కు అనుగుణంగా ఉండటం, బోధన, పుస్తకాలు ఎక్కువగా లభించడమే అందుకు కారణం.

ప్రిపరేషన్‌ ఇలా..: జేఈఈలో విజయం సాధించేందుకు ఇంటర్‌ తొలిరోజు నుంచే రోజుకు కనీసం 12 గంటలు ప్రిపరేషన్‌కు సమయం కేటాయించేదాన్ని. గ్రాండ్‌ టెస్ట్‌లు, మోడల్‌ టెస్ట్‌లకు హాజరవడం కూడా ఎంతో ప్రయోజనం చేకూర్చాయి. ఆ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినప్పుడల్లా ఏయే అంశాల్లో ఎందుకు మార్కులు తగ్గాయో తెలుసుకొని వెంటనే వాటిని సరిదిద్దుకుంటూ ప్రిపరేషన్‌ సాగించా. ఒక టాపిక్‌ను చదివేటప్పుడు అందులో ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడుగుతారో ఊహించి అభ్యాసం చేశా. ప్రతి సబ్జెక్ట్‌కు నిర్దిష్ట సమయం కేటాయించుకొని ఆ సమయంలో ఆ సబ్జెక్ట్‌లోని టాపిక్‌ను పూర్తిచేయడం నాకు ఎంతో ఉపయోగపడింది.

జనవరి సెషన్‌లో 295 మార్కులు: జేఈఈ మెయిన్‌ జనవరి సెషన్‌లో కూడా నాకు 100 పర్సంటైల్‌ వచ్చింది. కానీ మార్కులు 295 మాత్రమే వచ్చాయి. దీంతో 300కు 300 మార్కులు సాధించాలనే లక్ష్యంతో ఏప్రిల్‌ సెషన్‌కు హాజర య్యా. బోర్డ్‌ పరీక్షలు ముగిశాక పూర్తి సమయం రివిజన్‌కు, మోడల్‌ టెస్ట్‌లకు కేటాయించా. వాటి ఫలితంగానే ఇప్పుడు 300 మార్కులు వచ్చాయి.

ఐఐటీలో ఈసీఈ చేస్తా..: జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కూడా ప్రిపరేషన్‌ సాగిస్తున్నా. అందులో మంచి ర్యాంకుతో ఐఐటీలో ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ ఇంజనీరింగ్‌ (ఈసీఈ) బ్రాంచ్‌లో బీటెక్‌లో చేరడమే నా లక్ష్యం. ఆ తర్వాత అదే రంగంలో ఉన్నతవిద్య, ఉద్యోగం దిశగా అడుగులు వేయాలనుకుంటున్నా. నా విషయంలో నాన్న కిశోర్‌ చౌదరి, అమ్మ పద్మజల ప్రోత్సాహం ఎంతో ఉంది. నాన్న ఇంజనీరింగ్‌ కాలేజీలో అధ్యాపకులుగా ఉండటంతో ఇంజనీరింగ్‌పై ఆసక్తి పెరిగింది.

పొరపాట్లు దిద్దుకొని 100 పర్సంటైల్‌ సాధించా



'సాక్షి'తో జేఈఈ మెయిన్‌ టాపర్‌ వంగల అజయ్‌రెడ్డి

- ఐఐటీ బాంబేలో సీఎస్‌ఈలో చేరడమే లక్ష్యం
- ఇష్టంతో చదివితే.. ఒత్తిడి ఉండదు

పదో తరగతి: 9.7 జీపీఏ
ఇంటర్‌ ఫస్టియర్: 465 మార్కులు
జేఈఈ మెయిన్‌ తొలి సెషన్‌ మార్కులు: 276
జేఈఈ మెయిన్‌ రెండో సెషన్‌ మార్కులు: 300

సాక్షి, ఎడ్యుకేషన్: 'జనవరి సెషన్‌లో చిన్న పొరపాట్ల వల్ల 100 పర్సంటైల్‌ కొద్దిలో కోల్పోయా. పొరపాట్లను సరిదిద్దుకొని.. మ రింత ప్రాక్టీస్‌ చేసి 100 శాతం మార్కులే లక్ష్యంగా ఏప్రిల్‌ సెషన్‌ రాశా. ఇష్టంతో చదివితే ఎలాంటి మానసిక ఒత్తిడి ఉండదు' అని జేఈఈ–మెయిన్‌ ఫలితాల్లో 300 మార్కులతో టాపర్‌గా నిలిచిన వంగల అజయ్‌రెడ్డి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధించి ఐఐటీ–ముంబైలో సీఎస్‌ఈలో చేరడమే తన లక్ష్యమన్న అజయ్‌ 'సాక్షి'తో తన విజయ ప్రస్థానాన్ని పంచుకున్నాడు.

అన్నయ్య స్ఫూర్తి.. వ్యక్తిగత ఆసక్తితో..: ఐఐటీల్లో బీటెక్‌ చేయాలనే సంకల్పానికి మా అన్నయ్య అక్షయ్‌రెడ్డి స్ఫూర్తి ఎంతో ఉంది. ప్రస్తుతం ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్‌ సివిల్‌ ఇంజనీరింగ్‌ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఐఐటీల్లో ఇంజనీరింగ్‌ పూర్తి చేస్తే కెరీర్‌ బాగుంటుందని చెప్పేవాడు. దీంతో నాకు కూడా ఐఐటీపై ఆసక్తి పెరిగింది. అదే లక్ష్యంగా తొమ్మిదో తరగతి నుంచే జేఈఈ దిశగా అడుగులు వేశా.

కర్నూలు నుంచి హైదరాబాద్‌కు..: ఐఐటీలో చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నాక కర్నూలు నుంచి హైదరాబాద్‌కు వచ్చా. నాన్న వెంకటరమణారెడ్డి ఎంతో ప్రోత్సహించారు. తొమ్మిదో తరగతి నుంచి ఐఐటీ ఫౌండేషన్‌ కోర్సులో చేరా. బేసిక్స్‌తో మొదలు పెట్టి జేఈఈకి అవసరమైన అన్ని అంశాలపై అవగాహన ఏర్పరచుకున్నా.

ఒత్తిడి లేదు..: టెన్త్‌ అయ్యాక ఇంటర్, జేఈఈకి ఏకకాలంలో ప్రిపరేషన్‌ సాగించా. రోజుకు 14 గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించా. కానీ ఎప్పుడూ ఒత్తిడికి గురికాలేదు. కాలేజీలో స్టడీ మెటీరియల్, వీక్లీ టెస్ట్‌లు, గ్రాండ్‌ టెస్ట్‌లు రాస్తూ ఎప్పటికప్పుడు పొరపాట్లను సరిదిద్దుకొని ప్రిపేర్‌ అవడంతో విజయం చేకూరింది.

జనవరిలో సెషన్‌లో లోపాలతో..: జేఈఈ మెయిన్‌ జనవరి సెషన్‌లో 276 మార్కులు (99.996 పర్సంటైల్‌) వచ్చాయి. కాలిక్యులేషన్స్‌కు ఎక్కువ సమయం తీసుకోవడం, సమాధానాలు గుర్తించడంలో పొరపాట్లే అందుకు కారణమని గుర్తించా. ఫిజిక్స్‌లో 90 మార్కులే రావడంతో ఆ సబ్జెక్ట్‌పై మరింత దృష్టి పెట్టా. సబ్జెక్ట్‌పరంగా లోటుపాట్లు సరిదిద్దుకుంటూ ఏప్రిల్‌ సెషన్‌కు సిద్ధమయ్యా. ఇంటర్‌ పరీక్షల తర్వాత పూర్తి సమయం కేటాయించి ప్రతి సబ్జెక్ట్‌లో ప్రతి కాన్సెప్ట్‌పై కూలంకషంగా అధ్యయనం చేయడంతో.. ఏప్రిల్‌ సెషన్‌లో ఆశించిన ఫలితం పొందగలిగా. మూడు సబ్జెక్ట్‌లలోనూ నూటికి నూరు శాతం మార్కులు వచ్చాయి.

హార్డ్‌వర్క్, వ్యూహం ఉండాలి..: జేఈఈ మెయిన్‌ వంటి పోటీపరీక్షలకు సిద్ధమయ్యేందుకు కష్టపడేతత్వంతోపాటు వ్యూహం ఉండాలి. ప్రతి టాపిక్‌ అధ్యయనానికి తగిన సమయం కేటాయించుకోవాలి. రివిజన్‌ స్ట్రాటజీ, బలహీనతలను గుర్తించడం ఎంతో ముఖ్యం. దీనివల్ల ఏ టాపిక్‌లో వెనుకబడ్డామో తెలుసుకొని వాటిని పరిష్కరించుకునే సంసిద్ధత పొందొచ్చు.

ఐఐటీ బాంబేలో సీఎస్‌ఈలో చేరడం: జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కూడా ప్రిపేర్‌ అవుతున్నాను. అందులో మంచి ర్యాంకు సాధించి ఐఐటీ ముంబైలో సీఎస్‌ఈ బ్రాంచ్‌లో బీటెక్‌లో అడుగు పెట్టడమే లక్ష్యం. బీటెక్‌ పూర్తి చేశాక... భవిష్యత్తు లక్ష్యంపై ఆలోచిస్తాను.

నేనెవరో తెలీదా చలసాని!

- తెలియకుండానే నాకు డబ్బులిచ్చారా?
- విజయ డెయిరీ చైర్మన్‌ చలసాని ఆంజనేయులును నిలదీసిన మహిళ



సాక్షి, అమరావతి: విజయ డెయిరీ చైర్మన్‌ చలసాని ఆంజనేయులు స్పా సెంటర్లు, పబ్‌ల పేరుతో లైంగిక నేరాలకు పాల్పడుతున్నాడంటూ ఇటీవల తీవ్ర ఆరోపణలు చేసిన కొడాలి ప్రమీల అనే మహిళ.. తాజాగా మరో వీడియో విడుదల చేశారు. తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, చలసాని చేస్తున్న దారుణాలను వివరించారు. తానెవరో తెలియదంటూ చలసాని బుకాయిస్తున్నాడని.. ఆయన లైంగిక నేరాలకు పాల్పడ్డాడనేందుకు ఆధారాలున్నాయని.. బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్‌ విసిరారు. ఇప్పుడు ఈ వీడియో కూడా సోషల్‌ మీడియాలో కలకలం సృష్టిస్తోంది. అందులో బాధితురాలు ఏమన్నారంటే.. 'నేనెవరో తెలియదంటున్నారు. నేననే మనిషినే లేకపోతే.. నాతో చలసాని ఆంజనేయులు ఇంట్లో ఎలా పని చేయించుకున్నారు? వాస్తవాలు చెప్పడంతో నాపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు. నేనెప్పుడూ విజయ డెయిరీ, కృష్ణా మిల్క్‌ గురించి మాట్లాడలేదు. చలసాని ఆంజనేయులు, వేమూరి వెంకట సాయి, యశ్వంత్, చక్రపాణి, పాలడుగు నాని గురించే చెప్పాను. ఎండీ ఈశ్వర్‌బాబు నేనేదో అభాసుపాలు చేస్తున్నానని అంటున్నారంట. వాళ్ల కుటుంబానికి ఇలాగే జరిగితే తెలుస్తుంది నేను పడే బాధ ఏంటో! నేను ఏ తప్పూ చేయలేదంటున్న ఆంజనేయులుకు చాలెంజ్‌ చేస్తున్నాను. బహిరంగ చర్చకు వస్తారా.. ఎంత మంది అమ్మాయిలను వాడుకున్నారో ఆధారాలతో సహా నిరూపిస్తా. మాజీ ఎమ్మెల్యే కొడుకు, మీ అల్లుడితో కలిసి మీరు పబ్‌ పెట్టలేదా? ఆ పబ్‌కు నాచేత అమ్మాయిలను రప్పించుకోలేదా? కష్టమర్ల దగ్గర రూ.10 వేలు తీసుకుని మాకు రూ.3 వేలు చేతిలో పెట్టలేదా! అడిగితే మమ్మల్ని చిత్రహింసలకు గురి చేయలేదా? ఈ విషయాలన్నీ ప్రముఖ తెలుగు దినపత్రిక హనుమాన్‌ జంక్షన్‌ విలేకరికి తెలుసు. నా ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేక.. అప్పుల వల్ల ఆంజనేయులు ఏం చెప్పినా చేశాను. పబ్‌లతో పాటు ఎక్కడికంటే అక్కడికి అమ్మాయిలను సరఫరా చేశాను. నేను నా ఆరోగ్యం కుదుటపడిన తర్వాత అతనిపైనా, అతని చెంచాలపైనా కేసు పెడతా' అని బాధితురాలు పేర్కొన్నారు.

టాప్‌ ఐఐటీల్లో స్థానమే లక్ష్యం..

జేఈఈ మెయిన్స్‌లో టాప్‌ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, టాప్‌ ఐఐటీలే లక్ష్యంతో దూసుకువెళతామని పేర్కొంటున్నారు. టాపర్స్‌ లక్ష్యాలు వారి మాటల్లోనే...

ఐఐటీ ముంబై సీఎస్‌ఈ బ్రాంచ్‌ లక్ష్యం



మా స్వస్థలం ఒంగోలు. నాన్న శ్రీనివాసరెడ్డి ఒక ప్రైవేటు కళాశాలలో ల్యాబ్‌ టెక్నీషియన్. అమ్మ లక్ష్మీ నరసమ్మ ప్రైవేటు ఇంజినీరింగ్‌ కళాశాలలో మాథ్స్‌ అధ్యాపకురాలు. ప్రణాళిక ప్రకారం చదవడం ద్వారానే మెరుగైన ర్యాంకు పొందాను. ముంబై ఐఐటీలో సీఎస్‌ఈ విభాగంలో సీటు సాధించమే లక్ష్యం.

– కాప సాయి షణ్ముఖరెడ్డి, 52వ ర్యాంకు, ఓపెన్‌ కేటగిరీ

వీకెండ్‌ టెస్టులే ఫలితాన్నిచ్చాయి



మా స్వస్థలం విజయవాడ. నాన్న కృష్ణమోహన్‌ ఆకాశవాణిలో ఉద్యోగి. టెన్త్‌లో 583, ఇంటర్‌లో 970 మార్కులు వచ్చాయి. వీకెండ్, గ్రాండ్‌ టెస్టులు అధిక మార్కుల సాధనకు దోహదం చేశాయి. ఐఐటీలో చదవాలనే లక్ష్యంతో అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధమవుతున్నాను.

– కానేటి యశ్వంత్, 13వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీ

చెన్నై ఐఐటీ సీటు సాధిస్తా



మా స్వస్థలం గుంటూరు జిల్లా నకరికల్లు మండలం రూపెనగుండ్ల. కళాశాలలో ఇచ్చిన ప్రణాళికను ఫాలో అవుతూ, వీక్లీ, గ్రాండ్‌ టెస్టులలో దొర్లిన తప్పులను ఎప్పటి కప్పుడు సరి చేసుకుని ముందుకు వెళ్లడం ద్వారా మెరుగైన ర్యాంకు తెచ్చుకున్నాను. చెన్నై ఐఐటీలో సీఎస్‌ఈలో సీటు సాధిస్తాను.

– దారా సుభాష్, 8వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీ

ఐఐటీలో చదవాలన్నదే కోరిక



పల్నాడు జిల్లా కారంపూడి మండలం నరమాలపాడు గ్రామం మా స్వస్థలం. తరగతి గదిలో అధ్యాపకులు చెప్పిన అంశాలను పునశ్చరణ చేసుకుని, చదవడం ఈ స్థాయిలో ర్యాంకు సాధనకు దోహదం చేసింది. అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన ర్యాంకు సాధించి, ఐఐటీలో చదవాలనే లక్ష్యంతో ఉన్నాను.

– పి. లక్ష్మీనారాయణ, 11వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్

టెండర్‌ విషయాల్లో జోక్యం చేసుకోలేం

108, 104 టెండర్‌ నిబంధనలపై హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యవసర వైద్యం, సంచార వైద్యం కోసం ఉద్దేశించిన 108, 104 సేవల టెండర్ల విషయంలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. టెండర్ల వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని గుర్తు చేసింది. టెండర్ల ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఓ విద్యార్థి ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్‌) దాఖలు చేయడం వెనుక అనుమానాలు వ్యక్తం చేసింది. ఎవరో వెనుక ఉండి ఈ పిల్‌ను దాఖలు చేసినట్లు ఉందని వ్యాఖ్యానిస్తూ పిల్‌ను కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్‌ చీమలపాటి రవి ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. 108, 104 సేవల కోసం ఈ ఏడాది జనవరి 31న జారీ చేసిన టెండర్‌ నిబంధనలను సవాలు చేస్తూ విజయవాడకు చెందిన విద్యార్థి యు.రవితేజ హైకోర్టులో ఇటీవల పిల్‌ దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్‌ తరఫున సీనియర్‌ న్యాయవాది గంటా రామారావు వాదనలు వినిపిస్తూ..కొందరికి అనుకూలంగా టెండర్‌ నిబంధనలను రూపొందించారన్నారు. కావాల్సిన వారికి టెండర్‌ దక్కేలా చేసి, ఇతరులెవ్వరూ రాకూడదన్న రీతిలో టెండర్‌ నిబంధనలను తయారు చేశారని తెలిపారు. దీనివల్ల పలువురు టెండర్‌ ప్రక్రియలో పాల్గొనలేకపోయారన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి వాదనలు వినిపిస్తూ..టెండర్‌ ప్రక్రియలో ముగ్గురు బిడ్డర్లు పాల్గొన్నారని, వారిలో ఒకరికి టెండర్‌ కేటాయింపు జరిగిందన్నారు.

అభ్యర్థుల వయో పరిమితిని పెంచాలని కోర్టులు ఆదేశించలేవు: హైకోర్టు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో గరిష్ట వయో పరిమితి పెంపు విషయంలో హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితిని పెంచాలని కోర్టులు ఆదేశించజాలవని న్యాయస్థానం స్పష్టం చేసింది. వయో పరిమితి పెంపు నిర్ణయం పూర్తిగా అధికారుల పరిధిలోని వ్యవహారమని పేర్కొంది. ఓసారి వయో పరిమితిని సడలించిన తరువాత తిరిగి మరోసారి వయో పరిమితిని సడలించే ప్రశ్నే తలెత్తదన్న విద్యాశాఖ అధికారుల వాదనతో ఏకీభవించింది. సర్వశిక్ష అభియాన్‌ పథకంలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆర్ట్‌ ఎడ్యుకేషన్‌ పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌ పోస్టుల భర్తీ విషయంలో గరిష్ట వయో పరిమితిని సడలించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ 2012లో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్‌ జస్టిస్‌ కుంభజడల మన్మథరావు ఇటీవల తీర్పు వెలువరించారు.

8 కేటగిరీల్లో 11,489 పోస్టులు హుష్‌!

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాల కోత

మరో 11 కేటగిరీ పోస్టులకు ఇంకా ఖరారు కావాల్సిన సంఖ్య

ఇప్పటికే తగ్గిన పోస్టుల్లో అత్యధికం మహిళా పోలీసులవే



ఉద్యోగుల కేటగిరీ వారీగా ఇప్పటిదాక తగ్గిపోయిన ఉద్యోగాల సంఖ్య..

కేటగిరీ	మొత్తం పనిచేసే ఉద్యోగులు	కోత పెట్టిన ఉద్యోగాలు
పంచాయతీ కార్యదర్శి గ్రేడ్‌ 5	7,033	2,042
డిజిటల్‌ అసిస్టెంట్	9,828	663
వెల్ఫేర్‌ అండ్‌ ఎడ్యుకేషన్‌ అసిస్టెంట్	10,069	999
గ్రామ మహిళా పోలీసు	9,820	5,497
వార్డు అడ్మిన్‌ సెక్రటరీ	3,260	437
వార్డు డేటా ప్రాసెస్‌ సెక్రటరీ	3,517	2
వార్డు వెల్ఫేర్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ సెక్రటరీ	3,606	92
వార్డు మహిళా పోలీసు	3,730	1,757

సచివాలయాల్లో గ్రేడ్‌ 1 నుంచి గ్రేడ్‌ 5 వరకూ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తుంటారు. 2019, 2020లో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్‌ 5 కేటగిరీలో రిక్రూట్‌ అయిన వారి సంఖ్య 7,033

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల క్రమబద్ధీకరణ పేరుతో వేలాది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎసరు పెట్టే ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో మొత్తం 19 కేటగిరీల్లో ఉద్యోగులు పనిచేస్తుండగా.. రేషనలైజేషన్‌ ప్రక్రియలో భాగంగా జనరల్‌ కేటగిరీ (మల్టీ పర్పస్‌) ఉద్యోగులుగా పేర్కొన్న 8 కేటగిరీల్లో ఏకంగా 11,489 పోస్టులకు కోత పెట్టేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్‌ అసిస్టెంట్, వెల్ఫేర్‌ అండ్‌ ఎడ్యుకేషన్‌ సెక్రటరీ, మహిళా పోలీసుల కేటగిరీ ఉద్యోగుల విషయంలో ఏ సచివాలయంలో ఎవరుండాలి.. ఎవరు కొనసాగకూడదు అనే అంశంపై ప్రభుత్వం కసరత్తు పూర్తిచేసింది. గ్రామ సచివాలయాల్లో సంబంధిత నాలుగు కేటగిరి ఉద్యోగులలో 9,201 పోస్టులు తగ్గిపోయాయి. వార్డు సచివాలయాల్లో వార్డు అడ్మిన్‌ సెక్రటరీ, వార్డు డేటా ప్రాసెసింగ్‌ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ సెక్రటరీ, వార్డు మహిళా పోలీసు కేటగిరీ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయగా.. అందులో 2,288 పోస్టులకు కోత పెట్టేశారు.

టెక్నికల్‌ కేటగిరీ ఉద్యోగుల కోసం 'క్లస్టర్లు'

రేషనలైజేషన్‌ ప్రక్రియకు ప్రభుత్వం నిర్ధారించిన నిబంధన ప్రకారం.. మిగిలిన 11 కేటగిరీల (టెక్నికల్‌) ఉద్యోగులను రెండు మూడు సచివాలయాలకు ఒకరు చొప్పున నియమించాల్సి ఉండడంతో, రాష్ట్రంలోని 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను క్లస్టరు వారీగా వర్గీకరించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. 15,004 గ్రామ వార్డు సచివాలయాలను 7,600 దాకా క్లస్టర్లు వారీగా వర్గీకరించాలని జిల్లాల నుంచి ఎంపీడీవోలు, మున్సిపల్‌ కమిషనర్లు ప్రతిపాదనలు పంపారు. వర్గీకరణకు జిల్లాల ఇన్‌చార్జ్‌ మంత్రులు, కలెక్టర్ల ఆమోదం అనంతరం, సచివాలయాల ఉద్యోగులలో కోతల సంఖ్య మూడు రెట్లు పెరిగే అవకాశం ఉందన్న చర్చ సాగుతుంది.

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ లేనట్లే..!

క్రమబద్ధీకరణ పేరుతో సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులలోనే వేల మంది ఉద్యోగులను మిగులుగా తేల్చి, వారిని ఇతర శాఖల్లో అవసరాలకు ఉపయోగించుకోవాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా అధికారులు పేర్కొంటున్నారు. ఫలితంగా ప్రస్తుతం సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అవకాశాలే లేకపోవడంతో పాటు ఇప్పుడు సచివాలయాల్లో పనిచేసే మిగులు ఉద్యోగులనే ఇతర శాఖల్లో ఖాళీలకు ఉపయోగించుకోవడం కారణంగా ఆయా శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ తలుపులు క్లోజ్‌ అయినట్లేనని స్పష్టమవుతుంది. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి శిక్షణ తీసుకుంటున్న లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలపై ప్రభుత్వం నీరు జల్లే పరిస్థితి.

1.34 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించిన జగన్‌ సర్కార్‌..

ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం, సంక్షేమ పథకం ఎటువంటి అవినీతి, పైరవీలు, పక్షపాతానికి తావులేకుండా చిట్టచివరి స్థాయి వరకు సమర్థవంతంగా చేరవేసే ఉద్దేశంతో గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019లో రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 11,162 గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లో మరో 3,842 వార్డు సచివాలయాలను మొత్తం 15,004 గ్రామ వార్డు సచివాలయాలు అప్పట్లో ఏర్పాటయ్యాయి. ఒక్కో సచివాలయంలో 10- 11 మంది ఉద్యోగులు చొప్పున పనిచేసేలా మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో మొత్తం 1,49,235 మంది దాక పనిచేసేలా రూపకల్పన చేశారు. 15,004 సచివాలయాల్లో పనిచేసేందుకు.. అప్పట్లో గ్రామాల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలుగా పనిచేసే వారికి అదనంగా మరో 1.34 లక్షల కొత్త ప్రభుత్వ ఉద్యోగాలను అప్పటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2019 జూలైలోనే మంజూరు చేసి, కేవలం నాలుగు నెలల్లో భారీగా భర్తీ ప్రక్రియను సైతం పూర్తి చేసింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సత్యమేవ జయతే
సాక్షి
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'
WWW.SAKSHI.COM
పేజీలు: 14+10+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00
సంపుటి: 18
సంచిక: 28
ఆదివారం 20-4-2025
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

!! సర్వేజనా సుఖినోభవంతు !!

వివిఐటి ప్రారంభం నుండి కూడా మా ఆనందం, సంతోషం మా విద్యార్థుల విజయం, మా విద్యార్థుల తల్లిదండ్రులు, మా సహచరుల ఆనందంలోనే ఉంది అని నమ్మాము. ఆ బలమైన నమ్మకమే మమ్ములను ఇక్కడ వరకు తీసుకువచ్చింది.

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

ఇకపై

వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్శిటీ గా

మారిందని బాధ్యతతో కూడిన ఆనందంతో ప్రకటిస్తున్నాము.

2007లో వివిఐటి ప్రారంభ సభలో మేము మా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఒక వాగ్దానాన్ని చేశాం, "మేము వివిఐటి విద్యార్థులు అని చెప్పుకోవడానికి గర్వపడే స్థాయిలో వివిఐటిని ఉంచేదాక విశ్రమించం" ఆ వాగ్దానాన్ని నిలుపుకున్నామని గర్వంగా చెప్పగలం. ఇప్పుడు మన వివిఐటి విశ్వవిద్యాలయం మొదటి బ్యాచ్ విద్యార్థులు, తల్లిదండ్రులకు మరో వాగ్దానం చేస్తున్నాం **"వివిఐటి విశ్వవిద్యాలయం లోకమంతటా ప్రసిద్ధి చెందేదాకా విశ్రమించం".**

ON THE RIGHT PATH

SUCCESS IS A GIVEN

TEST 1 : 24-04-2025 - 02.00 PM
TEST 2 : 30-04-2025 - 11.00 AM
VVIT ADMISSION TEST
VVITAT
@ VVIT UNIVERSITY CAMPUS
MAX MARKS: 90 - DURATION: 90 MIN





Absolute Discipline

మన VVIT UNIVERSITY
VASIREDDY VENKATADRI
INTERNATIONAL TECHNOLOGICAL UNIVERSITY

Absolute Education

NAMBUR, GUNTUR, A.P, INDIA - 522 508. ✆: 91003 05336, 99594 04336, 77029 43336. WWW.VVITUNIVERSITY.COM, **AP-EAPCET : VVIT**


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+10+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 28

SUNDAY Special | ఆదివారం 20-4-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకుంటున్నారా?

గతంలో ప్రెగ్నెన్సీ ప్లానింగ్ అంటూ ఏదీ ఉండేది కాదు.. మారుతున్న పరిస్థితుల్లో ప్రెగ్నెన్సీ ప్లానింగ్ వల్ల తల్లికి, పుట్టబోయే బిడ్డకు కలిగే ప్రయోజనాలపై కథనం.

- ఫ్యామిలీలో



లక్నో 'సూపర్' విక్టరీ

ఉత్కంఠ పోరులో లక్నో సూపర్ జెయింట్స్ 2 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచింది. మార్క్‌రమ్ (45 బంతుల్లో 66), ఆయుశ్ బదోని (34 బంతుల్లో 50) రాణించారు.

- స్పోర్ట్స్‌లో



ఈ ఏడాది భారత్‌లో పర్యటిస్తా

ఈ ఏడాది భారత్‌లో తన పర్యటన కోసం ఎదురుచూస్తున్నానని టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ చెప్పారు.

వివరాలు జాతీయంలో ▸



ఢిల్లీలో కూలిన భవనం

ఢిల్లీలోని శక్తి విహార్ ప్రాంతంలో భవనం కుప్పకూలడంతో 11 మంది చనిపోగా.. మరో 11 మంది క్షతగాత్రులయ్యారు.

వివరాలు జాతీయంలో ▸



బీజేడీ చీఫ్‌గా నవీన్ పట్నాయక్

బిజూ జనతాదళ్ పార్టీ అధ్యక్షుడుగా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ వరుసగా 9వసారి ఎన్నికయ్యారు.

వివరాలు జాతీయంలో ▸



బుల్లెట్‌కు బలైన భారత విద్యార్థిని

కెనడాలో రెండు వాహనాల్లోని వ్యక్తుల మధ్య జరిగిన కాల్పుల్లో అభం శుభం తెలియని ఒక భారతీయ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది.

వివరాలు జాతీయంలో ▸

అగ్నివీర్ వాయు పోస్టులకు రిక్రూట్‌మెంట్

- రేపటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం



సాక్షి, విశాఖపట్నం: బెంగళూరు వేదికగా అగ్నివీర్ వాయు (మ్యుజిషియన్స్) పోస్టులకు రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నట్లు రక్షణ శాఖ ప్రకటించింది. బెంగళూరు కబ్బన్‌రోడ్డులోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ రేస్ కోర్స్ క్యాంపస్‌లో ఈ నియామక ప్రక్రియ జరుగుతుంది. జూన్ 10 నుంచి 18 వరకు జరిగే ర్యాలీలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు పాల్గొనవచ్చు. ఈనెల 21 ఉదయం 11 గంటల నుంచి మే 11 రాత్రి 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న తర్వాత తాత్కాలిక అడ్మిట్ కార్డ్ జారీ చేసిన వారు మాత్రమే ఈ ర్యాలీకి హాజరయ్యేందుకు అనుమతి ఉంటుంది. 2005 జనవరి 1 నుంచి 2008 జూలై 1 మధ్యలో జన్మించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల, బోర్డు నుంచి కనీస పాస్ మార్కులతో మెట్రిక్యులేషన్, పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణత పొందిన వారు అర్హులని ఎయిర్‌ఫోర్స్ అధికారులు స్పష్టం చేశారు. వివరాలకు సికింద్రాబాద్‌లోని ఎయిర్‌మెన్ సెలెక్షన్ సెంటర్–12కు గానీ లేదా 040–27758212 నంబర్‌కు గానీ, defender-rollers@gov.in మెయిల్ ద్వారా గానీ సంప్రదించవచ్చు.

మిర్చి రైతు ▸ కంట్లో కారం

ధర లేక రైతులకు వాటిల్లిన నష్టం రూ.8,827 కోట్లు

మిర్చి రైతులను నిలువునా ముంచిన రాష్ట్ర ప్రభుత్వం

- కనిష్ట స్థాయికి పతనమైన మిర్చి ధరలు.. కేంద్రానికి లేఖల పేరిట బాబు సర్కార్ నాటకాలు
- మద్దతు ధర లేదు.. మార్కెట్ ఇంటర్వెన్షన్ లేదు
- గత సీజన్‌లో మేలు రకం కాయలు క్వింటాల్ రూ.27 వేలు
- ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.6–8 వేలు కూడా దక్కని పరిస్థితి
- గత ఏడాది తాలు కాయలకు రూ.14–16వేల మధ్య పలికిన ధర
- ఈ ఏడాది తాలు కాయలకు రూ.3–4 వేల లోపే
- ఈ ఆదాయం కూలీలకూ సరిపోదంటూ రైతుల కన్నీరు
- ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టపోతున్న రైతులు

6లో



కూలీల ఖర్చులకూ సరిపోవు



ప్రకాశం జిల్లా ఎర్రకోట గ్రామానికి చెందిన ఈ రైతు పేరు **కురవా హనుమంత.** 1.50 ఎకరాల్లో మిర్చి పండించారు. ఎకరాకు లక్షన్నరకు పైగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. మొత్తంగా 9 క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. ఇప్పటికే క్వింటాల్ రూ.8 వేల చొప్పున 3 క్వింటాళ్లు విక్రయించిన హనుమంత.. ఈ రోజు మరో 6 క్వింటాళ్లను మార్కెట్‌కు తీసుకొచ్చారు. బాగున్న కాయలకు క్వింటాల్‌కు రూ.6 వేలకు మించి ఇవ్వలేమంటున్నారని, తాలు కాయలకు రూ.2,500 ఇస్తామంటున్నారని హనుమంత వాపోతున్నారు. ఈ సొమ్ములు కూలీలకు కూడా సరిపోదు. ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు మద్దతు ధర రూ.11,781 అని చెప్పిందని.. ఏ ఒక్కరికి ఈ ధర దక్కడం లేదన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటుంటే.. ప్రభుత్వం వ్యాపారులతో కుమ్మక్కైనట్టు కనిపిస్తోందని హనుమంత ధ్వజమెత్తారు.

తగ్గిన ర్యాంకర్లు

- జేఈఈ మెయిన్–2025 ఫలితాల్లో గతేడాది 56 మందికి 100 పర్సంటైల్
- ఈసారి 24 మందికే పరిమితం
- వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురికి చోటు
- గుంటూరు అమ్మాయి సాయి మనోజ్ఞకు 100 పర్సంటైల్.. బాలికల విభాగంలో ఆలిండియా టాపర్‌గా గుర్తింపు



బాలికల విభాగంలో టాపర్
సాయి మనోజ్ఞ



ఈడబ్ల్యూఎస్ విభాగంలో టాపర్
వంగల అజయ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్, తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్–2025 ఫలితాలు శుక్రవారం అర్ధరాత్రి విడుదలయ్యాయి. గతేడాదితో పోలిస్తే దాదాపు అన్ని కేటగిరీల్లో కటాఫ్ పర్సంటైల్ ఈసారి స్వల్పంగా తగ్గింది. జనరల్, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల్లో అర్హుల సంఖ్యలోనూ స్వల్పంగా తగ్గుదల కనిపించింది. మరోవైపు గతేడాదితో పోలిస్తే 100 పర్సంటైల్ సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా సగానికి పడిపోయింది. గతేడాది జేఈఈ మెయిన్ ఫలితాల్లో 100 పర్సంటైల్ సాధించిన విద్యార్థులు దేశవ్యాప్తంగా 56 మంది ఉండగా ఈసారి కేవలం 24 మందే 100 పర్సంటైల్ సాధించారు. తెలుగు రాష్ట్రాల నుంచి ర్యాంకర్లు సైతం భారీగా తగ్గిపోయారు. గతేడాది జేఈఈ మెయిన్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన 21 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించగా ఇప్పుడు నలుగురు (హర్ష్ ఎ.గుప్తా, వంగల అజయ్‌రెడ్డి, బణిబ్రత మజీ, గుత్తికొండ సాయిమనోజ్ఞ) మాత్రమే ఉండటం గమనార్హం. గుంటూరుకు చెందిన సాయి మనోజ్ఞ మహిళల కేటగిరీలో ఆలిండియా టాపర్‌గా నిలిచి రికార్డు సృష్టించింది. కాగా అజయ్‌రెడ్డి ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడు.

14.75 లక్షల మందిలో 2.50 లక్షల మంది అడ్వాన్స్‌డ్‌కు..

జేఈఈ మెయిన్–2025 జనవరి, ఏప్రిల్ రెండు సెషన్లకు కలిపి 15,39,848 మంది

మిగతా 2వ పేజీలో ▸

పట్టపగలే పార్కులో డీఎస్సీ అభ్యర్థిని ఆత్మహత్య



కర్నూలు: పట్టపగలే ఓ పార్కులో ఉరేసుకుని ఉపాధ్యాయ ఉద్యోగ అభ్యర్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నూలులో చోటుచేసుకుంది. నగరంలోని ఖానా ఖజానా ప్రాంతంలోని పార్కులో డీఎస్సీ అభ్యర్థి నాగలక్ష్మి (27) ఊయలకు చున్నీతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వివరాలు.. కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలం మేకడోన గ్రామానికి చెందిన నాగలక్ష్మి స్థానికంగా ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ డీఎస్సీకి శిక్షణ తీసుకుంటోంది. శనివారం పార్కులో ఎవరూ లేని సమయంలో ఆమె చున్నీతో ఉరేసుకుంది. కాసేపటి తర్వాత స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మూడో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఆమె దగ్గర లభించిన ఆధారాలతో తల్లిదండ్రులకు సమాచారమందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు.



హైదరాబాద్ దారుస్సలాంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న అసదుద్దీన్ ఒవైసీ

'వక్ఫ్'పై దేశవ్యాప్త ఉద్యమం

- దారుస్సలాం బహిరంగ సభలో మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ
- వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రం ఉపసంహరించేదాకా పోరాటం ఆగదని స్పష్టీకరణ
- రైతు చట్టాల రద్దుకు అన్నదాతలు అనుసరించిన బాటను అనుసరిస్తామని వెల్లడి
- జూన్ 1 వరకు నిరసనల కార్యాచరణ ప్రకటించిన ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు

2లో

అరాచకానికి పరాకాష్ట

విశాఖ మేయర్ పీఠం కబ్జా!

బలం లేకపోయినా కూటమి పెద్దల బరితెగింపు

- అవిశ్వాసం పేరుతో జీవీఎంసీ మేయర్‌ను అనైతికంగా దించిన వైనం
- అడుగడుగునా కార్పొరేటర్లకు బెదిరింపులు, ప్రలోభాలు.. మున్నార్ క్యాంప్‌నకు వెళ్లి మరీ బెదిరింపులకు పాల్పడిన వైనం
- సీఎం రమేశ్ ప్రత్యేక విమానంలో వెళ్లిన టీడీపీ నేతలు సీతంరాజు, ప్రణవ్
- విదేశాల్లోనూ క్యాంపు రాజకీయం.. అక్కడి నుంచి నేరుగా దసపల్లాకు..
- హోటల్ నుంచి ప్రత్యేక బస్సుల్లో జీవీఎంసీ కార్యాలయానికి తరలింపు.. వైఎస్సార్‌సీపీ, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు ఓటింగ్‌కు దూరం
- సరిగ్గా 74 ఓట్లతో నెగ్గామంటూ ప్రకటించుకుని సంబరాలు
- 500 మంది పోలీసులను అడ్డుపెట్టుకుని బీసీ మహిళపై కక్ష సాధింపు

2లో



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ శశికళ కేరళలో బస చేసిన హోటల్‌ను తనిఖీ చేస్తున్న టీడీపీ నేత సీతంరాజు సుధాకర్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు



చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

- బీసీ మహిళను విశాఖ మేయర్ పదవి నుంచి దించేయడం దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీకి 58 స్థానాలు.. మీకు కేవలం 30
- ఈ లెక్కన మీకు మేయర్ పదవి ఎలా వస్తుంది?

2లో

ఇదండీ సంగతి



డోంట్ వర్రీ సార్! ఇలా అయితేనే మీ టార్గెట్ పూర్తవుతుంది!



శ్రీసత్యసాయి జిల్లాలో కాలిపోతున్న అటవీ ప్రాంతం

అడవుల్లో అగ్గి.. పర్యావరణం బుగ్గి!

వేసవి ప్రమాదాలకు మానవుని స్వార్థం తోడు

బూడిదవుతున్న వేలాది ఎకరాల అటవీ ప్రాంతం

తగ్గిపోతున్న అటవీ విస్తీర్ణం.. చేతులెత్తేసిన అటవీ శాఖ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వేసవిలో అటవీ ప్రాంతాల కొండలు, గుట్టలు, బంజరు భూములు అగ్ని కీలల్లో దగ్ధమవుతున్నాయి. దీంతో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, కర్నూలు, ఖమ్మం, కోలార్, బళ్లారి వంటి జిల్లాల్లో రూ.వేల కోట్ల విలువైన అటవీ సంపద బూడిదవుతోంది. 43 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతల వల్ల మంటలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఫలితంగా అటవీ విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతూ పచ్చదనం కనుమరుగవుతోంది. ఈ ప్రభావం పర్యావరణ సమతుల్యత దెబ్బతినడానికి దారితీస్తోంది.

కారణాలు అనేకం..

- ప్రకృతి పరంగా తీవ్ర ఉష్ణోగ్రతలు ప్రమాదాలకు ఒక కారణంకాగా, మానవుని స్వార్థం, నిర్లక్ష్యం, అవగాహనలేమి అగ్ని ప్రమాదాలకు కారణాలుగా మారుతున్నాయి.
- గొర్రెలు, మేకల కాపరులు కొత్త గడ్డి, ఆకుల కోసం పాత గడ్డిని కాల్చడం సర్వసాధారణమైంది.
- కొన్నిచోట్ల గ్రామీణ యువత సరదా కోసం, మరికొన్ని చోట్ల మత్తు పదార్థాల ప్రభావంతో మంటలు పెడుతున్నారు.
- చాలా ప్రాంతాల్లో వేటగాళ్ల గడ్డిని అడ్డంగా భావించి కాల్చుతున్నారు.
- కొందరు సెల్‌ఫోన్ రీల్స్ కోసం కూడా కొండలకు నిప్పు పెడుతున్నట్లు ఇటీవల గుర్తించారు.
- అక్రమ కలపను నరకడం కోసం కూడా అడవులను నాశనం చేస్తున్నారు.
- అటవీ శాఖ ఈ సమస్యల ముందస్తు పరిష్కారంలో విఫలమవుతోంది. మంటలు చెలరేగిన తర్వాత వాటిని ఆర్పడానికి మాత్రమే పరిమితమవుతోంది.
- అగ్ని కీలలకు కారకులపై క్రిమినల్ కేసులు నమోదు కాకపోవడం, శిక్షలు విధించకపోవడం వల్ల దుశ్చర్యలు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయి.

అటవీ రక్షణపై దృష్టి అవశ్యం..

ఉపాధి హామీ పథకం ద్వారా వర్షాకాలంలో విత్తనాలు నాటడం, మొక్కలు పెంచడం, గడ్డి తొలగించడం వంటి కార్యక్రమాలను విస్తృతం చేయడం ద్వారా అడవులను కొంతవరకు రక్షించే అవకాశం ఉంటుంది. అలాగే వేసవిలో అటవీ రక్షణకు గార్డుల నియామకం, డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టడం, ఎత్తయిన టవర్ల నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలి. ఇందుకు ఆయా ప్రాంతాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, అగ్ని ప్రమాదాల నిరోధక చట్టాలను కఠినంగా అమలు చేయాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యలను అధిగమించకపోతే భవిష్యత్ తరాలకు తీరని నష్టం వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత 22 ఏళ్లుగా రాష్ట్రంలో 39.5 వేల హెక్టార్ల చెట్లు దహనమైనట్లు గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ సంస్థ చేసిన అధ్యయనంలో తేలింది. ఇది 20.7 మెట్రిక్ టన్నుల సీఓ–2(కార్బన్ డై ఆక్సైడ్)కి సమానం. ముఖ్యంగా వైఎస్సార్, అనంతపురం, నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాల్లో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

పర్యావరణానికి తీవ్ర ముప్పు..

అగ్ని కీలలు చెట్లు, జంతువులు, పక్షులు, గడ్డి మొక్కలు, కీటకాలను నాశనం చేస్తున్నాయి. భూసారం క్షీణించడం, జంతువులు, పక్షుల సంతానోత్పత్తి తగ్గడం, కొన్ని జాతులు అంతరించిపోవడం, కార్బన్ డయాక్సైడ్ విడుదలతో వాయు కాలుష్యం పెరుగుదల వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ అంశాలు పర్యావరణ వ్యవస్థకు తీవ్ర ముప్పును కలిగిస్తున్నాయి.

– జే ప్రతాప్‌రెడ్డి, సాహితి గగన్ మహల్ ట్రస్ట్, పర్యావరణ సంరక్షణ సమితి, పెనుకొండ, సత్యసాయి జిల్లా

తగ్గిన ర్యాంకర్లు

▶ మొదటి పేజీ తరువాయి



దరఖాస్తు చేసుకోగా 14,75,103 మంది హాజరయ్యారు. తుది ఫలితాల్లో నిర్దేశించిన కటాఫ్ పర్సంటైల్ సాధించి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2,50,236 మంది అర్హత సాధించారు. ఈ ఏడాది జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు స్వల్పంగా తగ్గాయి. ఓపెన్ కేటగిరీలో 93.102 పర్సంటైల్‌గా కటాఫ్‌ను నిర్ణయించగా గతేడాది ఇది 93.236గా నమోదైంది. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో కటాఫ్‌ను 80.383గా నిర్ణయించగా గతేడాది 81.326గా నమోదైంది. ఓబీసీ కేటగిరీలో గతేడాది 79.675 పర్సంటైల్ ఉండగా ఈ ఏడాది 79.431 గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో కటాఫ్ పర్సంటైల్ వరుసగా 61.15, 47.90గా నమోదైంది. మరోవైపు పరీక్షల్లో అక్రమాలకు పాల్పడ్డ 110 మంది విద్యార్థుల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిలిపేసింది.

ఈ నెల 23 నుంచి అడ్వాన్స్‌డ్‌కు రిజిస్ట్రేషన్

జేఈఈ మెయిన్ ఫలితాల్లో 2,50,236 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించడంతో అందుకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 23 నుంచి ప్రారంభంకానుంది. మే 2 వరకు దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఉంది. మే 18న రెండు పేపర్లుగా అడ్వాన్స్‌డ్ పరీక్షలు జరగనున్నాయి. అడ్వాన్స్‌డ్ ఫలితాలను జూన్ 2న ప్రకటించనున్నట్లు ఐఐటీ కాన్పూర్ ప్రాథమికంగా వెల్లడించింది. అడ్వాన్స్‌డ్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఐఐటీల్లో 17 వేలకుపైగా సీట్లను భర్తీ చేయనున్నారు. అలాగే జేఈఈ మెయిన్ ర్యాంకుల ద్వారా ప్రవేశం కల్పించే ఎన్ఐటీల్లో దాదాపు 24 వేలు, ట్రిపుల్ ఐటీల్లో 8,500, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఇతర విద్యాసంస్థల్లో దాదాపు 9 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి.

జేఈఈ-మెయిన్ 2025 కటాఫ్ పర్సంటైల్ ఇలా..

కేటగిరీ	పర్సంటైల్	అర్హులు
జనరల్	93.102	97,321
ఈడబ్ల్యూఎస్	80.383	25,009
ఓబీసీ	79.431	67,614
ఎస్సీ	61.152	37,519
ఎస్టీ	47.902	18,823
పీడబ్ల్యూడీ	0.007	3,950
మొత్తం అర్హులు		2,50,236

అరాచకానికి పరాకాష్ట
విశాఖ మేయర్ పీఠం కబ్జా!

బలం లేకపోయినా కూటమి పెద్దల బరితెగింపు

అవిశ్వాసం పేరుతో జీవీఎంసీ మేయర్‌ను అనైతికంగా దించిన వైనం

బెదిరింపులు.. ప్రలోభాలు.. సరిపడా బలం లేకపోయినా అధికారం అండతో బరితెగింపు.. వెరసి కూటమి పెద్దలు బలవంతంగా గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ పీఠంపై కూర్చున్న బీసీ సామాజిక వర్గ (యాదవ) మహిళను దించేశారు. ఎవరి పక్షాన ఎంత మంది కార్పొరేటర్లు ఉన్నారో ప్రజలందరికీ స్పష్టంగా తెలిసినప్పటికీ.. తామే గెలిచినట్లు ప్రకటించేసుకోవడం కూటమి ప్రభుత్వానికే చెల్లింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ దానికి విజయం ముసుగు వేసుకుని నిస్సిగ్గుగా సంబరాలు చేసుకుంటున్న తీరు విస్తుగొలుపుతోంది.

మొత్తం కార్పొరేటర్లు	: 98
వైఎస్సార్‌సీపీ	: 58
టీడీపీ	: 30
జనసేన	: 03
బీజేపీ	: 01
సీపీఐ	: 01
సీపీఎం	: 01
స్వతంత్రులు	: 04
ఎక్స్‌అఫీషియో సభ్యులు	: 13

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ నగర పాలక సంస్థను చేజిక్కించుకునేందుకు కూటమి ప్రభుత్వం అనైతిక రాజకీయానికి ఒడిగట్టింది. గెలవడానికి సరిపడా బలం లేకపోయినా, విదేశాల్లో క్యాంపులు నడుపుతూ.. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లను బెదిరిస్తూ, ప్రలోభాలకు గురిచేస్తూ.. అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన 74 ఓట్లతో (63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) విజయం సాధించామంటూ ప్రకటించుకుంది. జీవీఎంసీలో మొత్తం 98 వార్డులున్నాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో 58 వార్డులను వైఎస్సార్‌సీపీ, 30 వార్డులను టీడీపీ దక్కించుకున్నాయి. వైఎస్సార్‌సీపీ.. బీసీ మహిళను అక్కడ మేయర్ పీఠంపై కూర్చోబెట్టింది. ఈ క్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎలాగైనా సరే ఆ పీఠాన్ని కైవశం చేసుకోవాలని కుట్ర పన్నింది. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లను అధికార బలంతో లాగేసుకునే ప్రయత్నం చేస్తూ అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చింది. అనైతిక రాజకీయం చేస్తున్నందున శనివారం ప్రవేశ పెట్టనున్న అవిశ్వాస తీర్మాన సమావేశానికి తాము హాజరు కాబోమంటూ వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు స్పష్టం చేశారు. అధికార పార్టీ బెదిరింపులు, ఆగడాలకు జడిసి స్థానికంగా అందుబాటులో లేకుండా కేరళ వెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న కూటమి పెద్దలు.. మున్నార్‌లోని ఒక హోటల్‌లో ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బలవంతంగా తీసుకొచ్చేందుకు శుక్రవారం కొచ్చిన్‌కు ప్రత్యేక విమానాన్ని పంపారు. అందులో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్, ఆరోగ్య శ్రీ ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్ తదితరులు వెళ్లారు. అక్కడి నుంచి మున్నార్‌లోని హోటల్‌కు వెళ్లి అర్ధరాత్రి ఒకటిన్నర గంటలకు వారిని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశారు. స్థానిక పోలీసులతో వెళ్లి బెదిరించారు. 'సీఎం రమేష్‌కు చెందిన ప్రత్యేక విమానం అందుబాటులో ఉంది. మాతో వస్తే అన్ని రకాలుగా చూసుకుంటాం' అని ప్రలోభాలకూ గురిచేశారు. అయితే, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల నుంచి వచ్చిన సమాధానాలతో వారు అక్కడి నుంచి చల్లాగా జారుకున్నారు. అంతకు ముందు ఆయా కార్పొరేటర్లకు ఉన్న వ్యాపారాలను మూసి వేయిస్తామని బెదిరిస్తూ కొద్ది మందిని బలవంతంగా విదేశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను విశాఖకు తీసుకొస్తుండగా కొందరు కార్పొరేటర్లు తాము అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయమని తెగేసి చెప్పారు. దీంతో వారిని బెదిరించి.. మరీ చుట్టుముట్టి తీసుకొచ్చారు.

హోటల్ టు జీవీఎంసీ

విదేశాల నుంచి శుక్రవారం రాత్రి విశాఖ నగరానికి వచ్చిన కార్పొరేటర్లను నేరుగా దసపల్లా హోటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి నేరుగా రెండు బస్సుల్లో కూటమికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కార్పొరేటర్లను జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లారు. అయితే, కేవలం కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను మాత్రమే ఐడీ కార్డు చూసి మరీ లోపలికి పంపిస్తామని ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ చెప్పిన మాటకు అక్కడ విలువ లేకుండా పోయింది. అసలు బస్సుల్లో ఎవరెవరు ఉన్నారో కూడా పట్టించుకోకుండా పోలీసులు గేట్లను బార్లా తెరిచారు. రెండు బస్సులు లోపలికి వెళ్లిన తర్వాత గేట్లు మూసేశారు. బస్సులు లోపలికి వెళ్లే సమయంలో జీవీఎంసీ ప్రధాన గేటు పైభాగం ఊడిపోయింది. అయినప్పటికీ బస్సులను మాత్రం ఆపలేదు. ఈ బస్సుల్లో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ అనుచరుడు సునీల్, భీమిలి ఎమ్మెల్యే గంటా పీఏ రాజేష్‌లు కూడా దర్జాగా లోపలికి వెళ్లారు. ఎటువంటి హోదా లేకపోయిన దాడి రత్నాకర్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ కుమారుడు బండారు అప్పలనాయుడు నేరుగా ఈ బస్సుల్లో లోపలికి వెళ్లిపోయారు. గేటు బయట బస్సులను ఆపి.. గుర్తింపు కార్డులను చూపిన తర్వాత లోపలికి అనుమతిస్తే.. కార్పొరేటర్లు అటు నుంచి అటే ఓటింగుకు రాకుండా వెళ్లిపోతారనే భయంతోనే ఇలా చేశారు. ఇందుకు అధికారులు, పోలీసులు కూడా సహకరించారు. అనంతరం సరిగ్గా అవసరమైన బలం 74 ఓట్లతో గెలిచామని ప్రకటించుకున్నారు. ఈ కుతంత్రం ఎక్కడా బెడిసి కొట్టకుండా ఏకంగా 500 మంది పోలీసులను వాడుకున్నారు. కూటమి పెద్దల ఒత్తిళ్లకు లొంగకుండా ఈ అవిశ్వాస తీర్మానానికి దూరంగా ఉన్న వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లను సర్వత్రా అభినందిస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

- బీసీ మహిళను విశాఖ మేయర్ పదవి నుంచి దించేయడం దుర్మార్గం
- విశాఖ కార్పొరేషన్‌లో మీ బలం ఎంత?
- వైఎస్సార్‌సీపీకి 58 స్థానాలు.. మీకు కేవలం 30
- ఈ లెక్కన మీకు మేయర్ పదవి ఎలా వస్తుంది?
- పోలీసులను అడ్డుపెట్టుకుని గూండాయిజం, బెదిరింపులు
- అప్పటికీ లొంగకపోతే దాడులకు బరితెగిస్తున్నారు
- ఇది మీ దుర్మార్గపు రాజకీయాలకు ప్రత్యక్ష సాక్ష్యం
- దేవుడు, ప్రజలే మీకు గుణపాఠం చెబుతారు
- ఒత్తిళ్లకు తలొగ్గక చిత్తశుద్ధి చాటుకున్న కార్పొరేటర్లకు అభినందనలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలిచ్చిన తీర్పును అపహాస్యం చేస్తూ.. గూండాయిజంతో బెదిరింపులు, ప్రలోభాలకు పాల్పడి విశాఖపట్నం మేయర్‌గా ఉన్న బీసీ మహిళను పదవి నుంచి దించేశారని మండిపడ్డారు. మీరు చేస్తున్న దుర్మార్గపు రాజకీయాలకు ఇదే ప్రత్యక్ష సాక్ష్యం అని నిప్పులు చెరిగారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల్లో సరిపడా బలం లేకపోయినా.. అధికార దుర్వినియోగం, కండ బలంతో వాటిని చేజిక్కించుకోవడానికి చంద్రబాబు కుటిల రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఇది అధికార దుర్వినియోగం కాదా?

'ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రకారం 98 డివిజన్లు ఉన్న విశాఖపట్నం కార్పొరేషన్‌లో వైఎస్సార్‌సీపీ గుర్తుపై పోటీ చేసి 58 స్థానాలను మా పార్టీ వాళ్లు గెలుచుకోగా, టీడీపీ కేవలం 30 సీట్లు మాత్రమే గెలిచింది. ఈ లెక్కన మీకు మేయర్ పదవి ఏరకంగా వస్తుంది? బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ యాదవ కులానికి చెందిన మహిళను మేం మేయర్ పదవిలో కూర్చోబెడితే.. మీరు అధికార దుర్వినియోగం చేస్తూ, కోట్లాది రూపాయలతో ప్రలోభ పెట్టి, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ.. వారిని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు దిగుతున్నారు. అప్పటికీ లొంగకపోతే మా పార్టీ కార్పొరేటర్లు విడిది చేసిన హోటల్‌పై మీ నాయకులతో, పోలీసులతో దాడులు చేయించారు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు సీసీ టీవీ వీడియోల (ఫుటేజీ) రూపంలో ఇప్పుడు ప్రజల ముందే ఉన్నాయి. మరి దీన్ని ప్రజాస్వామ్యం అంటారా? అవిశ్వాసం ప్రక్రియ స్వేచ్ఛగా జరిగిందని అనుకోవాలని అంటారా? ఇది అధికార దుర్వినియోగం కాదా? మరో ఏడాది గడిస్తే ఇప్పుడున్న కౌన్సిల్ పదవీ కాలం పూర్తవుతుందని తెలిసీ, మళ్లీ ఎన్నికలు వస్తాయని తెలిసి కూడా, ప్రజలకు ఫలానా మంచి చేశాను అని చెప్పి ఓట్లు అడిగే ధైర్యం మీకు లేదు చంద్రబాబూ.. అందుకే అన్యాయమైన రాజకీయాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని సమాధి చేస్తున్నారు. మీ అప్రజాస్వామిక విధానాలకు దేవుడు, ప్రజలే గుణపాఠం చెబుతారు. ఇన్ని ప్రలోభాలు పెట్టినా, బెదిరింపులకు గురిచేసినా తలొగ్గక పార్టీ వైపు, ప్రజల వైపు నీతి, నిజాయితీగా నిలబడి చిత్తశుద్ధి చాటుకున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను, అలాగే వామపక్షాలకు చెందిన కార్పొరేటర్లను అభినందిస్తున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల్లో అధికారం లేకపోయినా, బలం లేకపోయినా.. అధికార దుర్వినియోగం, కండ బలంతో వాటిని చేజిక్కించుకోవడానికి చంద్రబాబు సాగిస్తున్న కుటిల ప్రయత్నాలను దీటుగా ఎదుర్కొని నిలబడుతున్న మా పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలకు మరోసారి హ్యాట్సాఫ్ చెబుతున్నా' అని పేర్కొన్నారు.

ఇదీ ఒక గెలుపా?

- అడ్డదోవలో అవిశ్వాసం.. నైతికంగా ఓడిపోయారు
- వైఎస్సార్‌సీపీ నేత కురసాల కన్నబాబు మండిపాటు
- విశాఖ మేయర్ అవిశ్వాస తీర్మానంలో కూటమి కుట్రలు బట్టబయలు
- పార్టీ విప్ ఉల్లంఘనపై ఫిర్యాదు.. గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం/ దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో కూటమి పార్టీలు అడ్డదోవలో గెలిచినా, నైతికంగా మాత్రం ప్రజల ముందు ఓటమి పాలయ్యారని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు మండిపడ్డారు. ఇదీ ఒక గెలుపా అని నిలదీశారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి పార్టీల కుట్రలు, కుతంత్రాలు మరోసారి బయటపడ్డాయని, అధికార బలంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కొందరిని ప్రలోభాలకు గురిచేసి, బెదిరింపులతో భయపెట్టి ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేశారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి పార్టీలు ఎన్ని ఒత్తిళ్లు చేసినా, బెదిరింపులు దాడులు చేసినా.. తెగువ చూపి.. పార్టీకి అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు చేతులెత్తి నమస్కరిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీలోనే ఉన్న కార్పొరేటర్ల అంతు చూస్తామని ఇప్పటికీ బెదిరిస్తున్నారని, ఉత్తరాంధ్రకు అలాంటి సంస్కృతిని తీసుకురావొద్దని హెచ్చరించారు. విశాఖ మేయర్ స్థానం కోసం జరిగిన కుట్రను చూస్తుంటే 1995లో చంద్రబాబు వైస్రాయ్ హోటల్ ఉదంతాన్ని మించి ఉందని చెప్పారు. మేయర్ స్థానం జనరల్ రిజర్వ్ అయినా యాదవ కులానికి చెందిన ఒక బీసీ మహిళకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేయర్‌గా అవకాశం కల్పిస్తే.. చంద్రబాబు మాత్రం కుట్రలు చేసి బీసీ మహిళలను పదవీచ్యుతురాలిని చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒకటో రెండో మున్సిపాలిటీల్లో టీడీపీ విజయం సాధిస్తే, వాటిని కూడా గెలుచుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎవర్నీ ప్రలోభ పెట్టొద్దని, ఎన్నికల ప్రక్రియను గౌరవించాలని తమ నాయకుడు వైఎస్ జగన్ చెప్పారన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ గ్రేటర్ విశాఖ మేయర్‌పై గత నెల 21న అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చినప్పుడే వారికి బలం లేదని అందరికీ తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం విశాఖ ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని కోల్పోయిందని చెప్పారు. విప్‌ను ఉల్లంఘించిన కార్పొరేటర్లపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న కురసాల కన్నబాబు, చిత్రంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నేతలు

అర్ధరాత్రి కిడ్నాప్ చేద్దామనుకున్నారు

అర్ధరాత్రి వేళ నేను బస చేసిన రిసార్ట్‌కు వచ్చి బెదిరింపులకు దిగారు. బలవంతంగా తీసుకెళ్దామనుకున్నారు. ఇది సమంజసమా? న్యాయవాదిని కూడా అయిన నన్ను ఇబ్బంది పెడతారా? మహిళలు, దళితులంటే కూటమి ప్రభుత్వానికి గౌరవం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నన్ను గుర్తించి టికెట్ ఇచ్చారు. నిరంతరం పార్టీ కోసమే పని చేస్తాను. డబ్బుల కోసం నీతిమాలిన రాజకీయాలు చేయలేను. నేను అమ్ముడుపోను. కూటమి నేతలు రాజకీయ మంటే వ్యాపారం అనుకుంటున్నారు. మమ్మల్ని బెదిరించడం దుర్మార్గం. ఇది నా ఒక్కరికే సంబంధించిన విషయం కాదు. పార్టీలో ఉన్న వారందరి పరువుకు సంబంధించినది. న్యాయ పోరాటం చేస్తాం. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం.

– శశికళ, 55వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ

'వక్ఫ్' పై దేశవ్యాప్త ఉద్యమం

దారుస్సలాం బహిరంగ సభలో మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ వ్యతిరేకంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం పేరుతో ఓ నల్ల చట్టాన్ని తీసుకొచ్చారని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఆ చట్టాన్ని మోదీ సర్కారు తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను కేంద్రం వెనక్కి తీసుకొనేలా దేశవ్యాప్తంగా అన్నదాతలు పోరాడిన స్ఫూర్తితో నల్ల చట్టాన్ని ఉపసంహరించే వరకు దేశ వ్యాప్తంగా తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. శనివారం రాత్రి హైదరాబాద్ దారుస్సలాం మైదానంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేంగా జరిగిన బహిరంగ సభలో ఒవైసీ ప్రసంగించారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రెహ్మానీ అధ్యక్షతన జరిగిన సభలో డీఎంకే ఎంపీ మహ్మద్ అబ్దుల్లా, వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ హఫీజ్ ఖాన్, బీఆర్ఎస్ మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు సయ్యద్ నిసార్ హుస్సేన్ హైదర్ ఆఘా, మౌలానా మతీనుద్దీన్ ఖాద్రీ, మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిరసనల కోసం కార్యాచరణ

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు కార్యాచరణ ప్రకటించింది. ఈ నెల 30న రాత్రి 9 గంటలకు తెలుగు రాష్ట్రాల్లో 10 నిమిషాలు లైట్లు ఆర్పి కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపాలని కోరింది. అలాగే మే 18న రౌండ్ టేబుల్ సమావేశాలు, మే 22న హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లో మహిళల బహిరంగ సభ, మే 25న అన్ని జిల్లాలో మానవహారం, జూన్ 1న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించింది.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



పుస్తకావిష్కరణ
మొగల్రాజపురం: స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో విశాలాంధ్ర సి.రాఘవాచారి సంపాదకీయాలు- జాతీయ అంశాలు నాల్గో సంపుటిని సీపీఐ కేంద్ర కార్యదర్శి నారాయణ శనివారం ఆవిష్కరించారు.



ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'
ఈస్టర్ సందర్భంగా క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం 'రన్ ఫర్ జీసస్' శాంతి ర్యాలీ నిర్వహించారు. పలువురు బిషప్‌లు, పెద్ద సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు. -4లో



అద్భుతం.. సాగరతీరం
కృష్ణాజిల్లా జేసీ గీతాంజలి శర్మ శనివారం హంసలదీవి సాగరతీరాన్ని కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. తాబేళ్ల పిల్లలను సముద్ర బాట పట్టించారు. -4లో

రుణం కొందరికే!

- ఎన్టీఆర్ జిల్లాలో రుణాల మంజూరు టార్గెట్ 2,335 యూనిట్లు మాత్రమే
- వచ్చిన దరఖాస్తులు 34,767
- అర్హత, పారదర్శకతకు తావే లేదు
- సిఫార్సులకే అవకాశమంటూ ప్రచారం
- యూనిట్లు పెంచాలని విన్నవిస్తున్న దరఖాస్తుదారులు

ఇచ్చేవి గోరంత.. ప్రచారం కొండంత



జి.కొండూరు కమ్యూనిటీ హాలులో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)



జి.కొండూరు: మాటలు కోటలు దాటుతున్నాయి గానీ.. చేతలు మాత్రం గడప కూడా దాటడం లేదన్నట్లు తయారైంది కూటమి ప్రభుత్వ తీరు. పేద ప్రజలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం అందిస్తోన్న కార్పొరేషన్ రుణాల మంజూరులో ప్రభుత్వం కేటాయించిన యూనిట్లకు, వచ్చిన దరఖాస్తులకు నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉంది. యూనిట్ల కేటాయింపు వందల్లో ఉంటే దరఖాస్తులు మాత్రం వేలల్లో వచ్చాయి. సిఫార్సు లేనిదే రుణాల మంజూరు కష్టమని ప్రచారం జరగడంతో ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు కూడా ముప్పై శాతానికి పైగా దరఖాస్తుదారులు వెనకాడారు. యూనిట్ల కేటాయింపులో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి మరిన్ని యూనిట్లను కేటాయిస్తే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని దరఖాస్తుదారులు ఆశిస్తున్నారు.

కేటాయింపులు అంతంతమాత్రమే..

అన్ని సామాజిక వర్గాల్లో నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా రాయితీపై అందించే వ్యక్తిగత రుణాల కేటాయింపు అంతంమాత్రంగానే ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్‌లకు రుణాల మంజూరు కోసం 2,335యూనిట్లను ప్రభుత్వం కేటాయించగా 34,767మంది దరఖాస్తులు చేశారు. వీరికి యాభైశాతం ప్రభుత్వం రాయితీపై యూనిట్ కాస్ట్ ఆధారంగా రుణాలను మంజూరు చేస్తారు. అదే విధంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలు 990యూనిట్లను ప్రభుత్వం టార్గెట్‌గా కేటాయించగా ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఎస్సీ రుణాలకు ప్రభుత్వ రాయితీ 40శాతం నుంచి ప్రారంభమై ఎంచుకున్న యూనిట్ ఆధారంగా రాయితీని అందిస్తారు.

సిఫార్సులు ఉంటేనే రుణాలు..

కార్పొరేషన్ రుణాల కోసం ముందస్తుగానే కూటమి నాయకులు తమ అనుచరులకు ఇప్పించుకునేందుకు జాబితాను సిద్ధం చేసుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇంటర్వ్యూల అనంతరం మండల స్థాయి కూటమి నాయకులు తయారు చేసి ఇచ్చిన జాబితానే మండల పరిషత్ అధికారులు లాగిన్ నుంచి బ్యాంకర్లకు పంపినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఎన్టీఆర్ జిల్లాలో వివిధ కార్పొరేషన్‌ల ద్వారా రుణాల టార్గెట్, దరఖాస్తుల వివరాలు..

కార్పొరేషన్	రుణాల టార్గెట్	దరఖాస్తులు
బీసీ	1,466	23,975
కాపు	508	6,840
ఈడబ్ల్యూఎస్	361	3,952
ఎస్సీ	990	(ప్రక్రియ కొనసాగుతోంది)

గత ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల పేరుతో నగదు బదిలీకి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా అన్ని సామాజిక వర్గాలలో 45-60 ఏళ్ల మధ్య వయస్సుగల మహిళలకి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ ఆర్థిక సాయం తిరిగి చెల్లించాల్సిన అవసరం కూడా లేదు. ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులను గుర్తించి పథకాన్ని అమలు చేశారు. ఈ పథకాలతో పాటు మరికొన్ని నగదు బదిలీ పథకాల ద్వారా లబ్ధి పొందిన ఎన్నో కుటుంబాలు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగారు. కానీ ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రాయితీపై అందించే వ్యక్తిగత రుణాలకు కూడా టార్గెట్‌లు పెట్టడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విధంగా అయితే కూటమి అనుకూలస్తులే లబ్ధి పొందుతారు తప్ప అసలైన పేద కుటుంబాలకు మేలు జరగదని దరఖాస్తుదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

పారదర్శకత పాటించాలి..



కార్పొరేషన్ రుణాల మంజూరులో పారదర్శకత పాటించాలి. ఇంటర్వ్యూలలో ఎంపిక చేసిన దరఖాస్తుదారుల జాబితా నుంచి డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తే న్యాయం జరుగుతుంది. వేలల్లో దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో రుణాల మంజూరు టార్గెట్‌ను పెంచాలి.
– పొన్నం శ్రీనివాసరావు, రజక సంఘం నాయకుడు, జి.కొండూరు గ్రామం

టార్గెట్‌లు వద్దు..



కార్పొరేషన్ రుణాలకు పరిమితి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేయాలి. దరఖాస్తు చేసిన అభ్యర్థులను ఇంటర్వ్యూల అనంతరం తుదిజాబితా నుంచి డ్రా పద్ధతిలో ఎంపిక చేయాలి. పారదర్శకత పాటించకపోతే అసలైన పేదలకు న్యాయం జరగదు.
– పులిపాక ప్రకాశ్, జనసేన నాయకుడు, జి.కొండూరు

అన్యాయం జరుగుతోంది..



మాదిగ, మాల, రెల్లి కార్పొరేషన్‌లు విడివిడిగా ఉన్నప్పుడు ఎస్సీ కార్పొరేషన్ పేరుతో ఉమ్మడిగా రుణాలను మంజూరు చేయడం వల్ల అధిక జనాభా ఉన్న వర్గానికి సంక్షేమ రంగంలో అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి కార్పొరేషన్‌ల వారీగా పరిమితి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలను అందించాలి.
– మందా నాగమల్లేశ్వరరావు, ఏపీ ఎంఆర్‌పీఎస్ అమరావతి అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

విమానాశ్రయం(గన్నవరం): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనలో భాగంగా మే రెండో తేదీన గన్నవరం విమానాశ్రయానికి విచ్చేస్తున్న సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ ఆదేశించారు. ప్రధాన మంత్రి పర్యటన నేపథ్యంలో విమానాశ్రయంలో ఎస్పీ ఆర్.గంగాధర రావు, జేసీ గీతాంజలిశర్మతో కలిసి కలెక్టర్ పలు శాఖల జిల్లా అధికారులతో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరావతి రాజధాని పునఃప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు పీఎం విచ్చేస్తున్నట్లు తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రధానితో పాటు పలు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎయిర్‌పోర్ట్‌కు వస్తారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అదే సమయంలో సాధారణ ప్రయాణికులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ముందుగానే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునేలా సమాచారం అందించాలని సూచించారు.

న్యూస్‌రీల్

'అద్దె గర్భం' అనుమతులపై సమీక్ష



లబ్బీపేట(విజయవాడతూర్పు): సహాయక పునరుత్పత్తి సాంకేతికత(ఏఆర్‌టీ), అద్దె గర్భం(సరోగసి) చట్టం–2021 అమలులో భాగంగా జిల్లా మెడికల్ బోర్డు శనివారం సమావేశమైంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద్దె గర్భం సేవలు పొందడానికి దరఖాస్తు చేసుకున్న ఏడుగురు దంపతుల అప్లికేషన్‌లను పరిశీలించారు. వారు అర్హత కలిగి ఉన్నారో లేదో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని సూచనలు చేశారు. వాటిని అమలు చేస్తే అనుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. సమావేశంలో ఎస్‌హెచ్‌ఎం కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ నవీన్, జీజీహెచ్ ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ కేశవచంద్ర, పిడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పి. అనిల్‌కుమార్, డాక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన డీఎంహెచ్ఓ..

ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్రా- స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తమ సిబ్బందితో కలిసి కార్యాలయం పరిధిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డెప్యూటీ డెమో ప్రభాకరరెడ్డి, సత్యనారాయణ, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సురక్షిత తాగునీరు



నందిగామరూరల్: ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల సురక్షిత తాగునీటిని అందించడమే జల్ జీవన్ మిషన్ లక్ష్యమని కేంద్ర జల్ జీవన్ మిషన్ వెరిఫికేషన్ బృంద సభ్యుడు హరిపాల్‌సింగ్ అన్నారు. మండలంలోని పెద్దవరం, పాతబెల్లంకొండవారిపాలెం, లింగాలపాడు, అడవిరావులపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లోని జల్ జీవన్, ప్రజల తాగునీటికి సంబంధించిన పనులను శనివారం ఆయన పరిశీలించారు. లింగాలపాడు, అడవిరావులపాడు గ్రామాలలో కొందరు జల్ జీవన్ మిషన్ పనులలో అవకతవకలు జరిగాయని ఆరోపించగా.. స్పందించిన బృంద సభ్యుడు పనులు పూర్తి స్థాయిలో జరగలేదని ఇంకా జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాలలో ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటికి పరీక్షలు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విద్యాసాగర్, ఏఈ రవికుమార్, తేజ, సర్పంచ్‌లు సూరా వెంకట నర్సమ్మ, బొల్లినేని పద్మజ పాల్గొన్నారు.

నాట్యశాస్త్రానికి యునెస్కో గుర్తింపుపై హర్షం



కూచిపూడి(మొవ్వ): యునెస్కో మెమొరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో నాట్య శాస్త్రాన్ని ప్రత్యేకంగా నమోదు చేశారని కేంద్ర సాంస్కృతిక పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వెల్లడించటంతో ప్రముఖ కూచిపూడి నాట్య క్షేత్రం కూచిపూడిలో కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర యోగి కళాపీఠంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, నాట్య విద్యార్థులు కలిసి నటరాజ స్వామికి శనివారం పూలమాలవేసి ఆనందోత్సాహాలతో స్వీట్లు పంచుకొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు గుడివాడ విద్యార్థులు

గుడివాడ టౌన్: ఖేలో ఇండియా జూనియర్ ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు గుడివాడ ఎస్‌పీఎస్ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాద్ శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన డి.రాకేష్, టి.తిమోతి, సాజిత్‌ఖాన్, బి.జయ సూర్యతేజ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. మే నాలుగు నుంచి 11వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలోని గయ పట్టణంలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు తమ విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

అన్ని వర్గాలనూ మోసం చేసిన కూటమి

- సంక్షేమం లేదు.. అంతా క్షామమే
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం
- రాజ్యసభ సభ్యుడు, కృష్ణా, గుంటూరు జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సంఘీభావం తెలుపుతున్న ఎంపీ సుబ్బారెడ్డి, అవినాష్, మాజీ మంత్రులు జోగి రమేష్, వెలంపల్లి, ఎమ్మెల్సీలు అరుణకుమార్, రుహుల్లా, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది, ఇతర నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీనీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ కృష్ణా, గుంటూరు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. పది నెలల పాలనలోనే పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక విద్యార్థులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యకర్గ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షుల పదవీ బాధ్యతల స్వీకారోత్సవం శనివారం విజయవాడలోని ఓ ఫంక్షన్ హాలులో ఘనంగా జరిగింది. పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎప్పుడు మంచి చేయాలని ఆలోచన చేసేవారన్నారు. వైద్య రంగాన్ని మెరుగు పరిచి పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా చూశారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను నిర్వీర్యం చేస్తున్నట్లు ఆరోపించారు. వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తోందని, ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్దాం..

కూటమి ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్దామని కార్యకర్తలు, నాయకులకు వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. రైతుల పరిస్థితి అధ్వానంగా మారిందని, గతంలో వైఎస్సార్ సీపీ రైతులకు అండగా నిలిచి, గిట్టుబాటు ధర కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. పేదలకు మేలు చేసేందుకు అందించిన సంక్షేమ పథకాలను కూటమి అటకెక్కించిందన్నారు. నిత్యం వైఎస్సార్ సీపీపై అసత్య ప్రచారాలు చేస్తూ, తమ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. సంపద సృష్టి పేరుతో అందరినీ మభ్యపెడుతోందన్నారు.

కార్యకర్తకు పెద్దపీట..

రాబోయే రోజుల్లో కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ పెద్దపీట వేస్తుందన్నారు. కార్యకర్తలందరూ క్రమశిక్షణతో పనిచేయాలని, కష్టపడిన ప్రతి ఒక్కరికీ పదవులు వస్తాయన్నారు. మాజీ మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, జోగి రమేష్, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, మొండితోక జగన్మోహనరావు, నల్లగట్ల స్వామిదాసు, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్ కుమార్, ఎండీ రూహుల్లా, జగ్గయ్యపేట పార్టీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి, డెప్యూటీ మేయర్‌లు అవుతు శ్రీశైలజరెడ్డి, బెల్లం దుర్గతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల సభ్యులు

తెరపైకి ఎమ్మెల్యే వసంత భూ బాగోతం

- హైదరాబాద్ కొండాపూర్‌లో 39ఎకరాలను ఆక్రమించి నిర్మాణాలు
- వాటిని కూల్చివేసిన హైడ్రా అధికారులు

సాక్షి నెట్‌వర్క్: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ భూ కబ్జా వ్యవహారం ఆ నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. తనంత నిజాయితీపరుడు మరెవరూ లేరని, తాను చేసే వ్యాపారాలన్నీ సక్రమమేనని రాజకీయ ప్రసంగాలలో వసంత వెంకటకృష్ణ ప్రసాద్ చెప్పే ఊక దంపుడు ఉపన్యాసాలన్నీ ప్రజలను మభ్య పెట్టేందుకే అని తేలిపోయింది. హైదరాబాద్ కొండాపూర్‌లో వసంత వెంకటకృష్ణప్రసాద్ భూ కబ్జా బాగోతాన్ని హైడ్రా బట్టబయలు చేయడంతో ఆయన అక్రమ వ్యాపార సామ్రాజ్యం గురించి బాహ్య ప్రపంచానికి తెలిసింది.

ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని..

హైదరాబాద్ కొండాపూర్‌లో సర్వేనంబర్ 79లో గల ప్రభుత్వ భూమి 39ఎకరాలను వసంత వెంకటకృష్ణప్రసాద్ ఆక్రమించి ఫామ్ హౌస్, కార్యాలయంతో పాటు కమర్షియల్ షెడ్లను నిర్మించారనే ఆరోపణతో హైడ్రా శనివారం అక్రమ నిర్మాణాలన్నింటిని కూల్చి వేసింది. ఈ అక్రమ నిర్మాణాలకు సంబంధించి గతంలోనే నోటీసులు జారీ చేసినప్పటికీ యాజమాన్యం స్పందించక పోవడంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు తెలుస్తోంది. అంతేకాక స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకొని అది ప్రభుత్వ స్థలం అని బోర్డును కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ కూల్చివేతల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు ఎమ్మెల్యే వసంత కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ హైడ్రా వెనక్కి తగ్గలేదని చెబుతున్నారు. ఆ భూమి తాము కొనుగోలు చేశామని, తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ హైడ్రా అధికారులు కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలు ప్రారంభించారని వసంత వెంకటకృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు సమాచారం.

ఈ-వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

పటమట(విజయవాడతూర్పు): ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈ- వేస్ట్) వల్ల తీవ్ర అనర్థాలు పొంచి ఉన్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ఈ-వ్యర్థాల సేకరణను ఉద్యమంగా చేపట్టి, వాటిని రీసైక్లింగ్ చేయడం ద్వారా విలువైన లోహాల వృథాలను అరికట్టడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో భాగస్వాములు కావాలని కోరారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వీఎంసీ ఆధ్వర్యంలో శనివారం బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు కాలనీలో ఈ-వ్యర్థాల ప్రత్యేక నిర్వహణ (స్పెషల్ డ్రైవ్) కార్యక్రమానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ నెలలో ఈ-వ్యర్థాల సేకరణ ప్రత్యేక డ్రైవ్‌గా చేపట్టినట్లు తెలిపారు. నగరంలో నిత్యం 700 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉండే లెడ్, కాడ్మియం, మెర్క్యురీ, బెరీలియం వంటి మూలకాలు అతి ప్రమాదకరమైనవని, వాటిని బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే భూమి, నీరు, గాలి కలుషితం అవుతాయని, ఫలితంగా ప్రజలు రోగాలబారిన పడతారని వివరించారు. అనంతరం స్థానికుల నుంచి ఈ-వ్యర్థాలను సేకరించారు. వీఎంసీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ జోనల్ కమిషనర్ కె.షమ్మీ, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

24 గంటలూ ఆన్‌లైన్ సేవలు

బంటుమిల్లి: రాష్ట్రంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్ ట్రెజరీల్లో 24 గంటలూ ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నామని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ డాక్టర్ నేతల మోహన్‌రావు తెలిపారు. స్థానిక సబ్ ట్రెజరీని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. డీడీ ఎస్.రవికుమార్, ఎస్‌టీఓ గోపీకృష్ణతో కలసి ఆన్‌లైన్ రికార్డులు, మాన్యువల్ రికార్డులను పరిశీలించి అభినందించారు. ఉద్యోగుల జీతాల బిల్లులు, మెడికల్ బిల్లులు, పింఛన్‌దారుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని ఎస్‌టీఓ గోపీకృష్ణను ఆదేశించారు. అనంతరం మోహన్‌రావు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 206 సబ్ ట్రెజరీల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అత్యవసర సేవల్లో ఎక్కడ జాప్యం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎఫ్, డీఏ ఎరియర్స్‌ను త్వరలో చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలలో పీజీ సెట్ హెల్ప్‌లైన్ కేంద్రం

మచిలీపట్నం రూరల్: స్థానిక ఎస్ఎస్ఆర్ కళాశాలలో పీజీ సెట్ హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎల్.సుశీల తెలిపారు. పీజీ సెట్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సౌలభ్యం కోసం, వారి అనుమానాల నివృత్తి కోసం ఈ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కృష్ణా విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో అమలు చేస్తున్న కోర్సులపై సాధ్యమైనంత ఎక్కువ మంది విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశమన్నారు. మచిలీపట్నం పరిసర ప్రాంత విద్యార్థులు హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన బాపులపాడు మండలం వీరవల్లిలోని కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీలో శనివారం చోటుచేసుకుంది. ట్రాన్స్‌పోర్ట్ కూలీగా పనిచేస్తున్న రేమల్లేకు చెందిన ఈడే రమేష్ (21) డ్యూటీ ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళుతుండగా డివైడర్‌ను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు నష్టపరిహారం కోరుతూ పాల ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. విధులు ముగించుకుని వస్తుండగా ఫ్యాక్టరీ ప్రాంగణంలోనే ప్రమాదానికి గురై మరణించటంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌పోర్టర్, కుటుంబ సభ్యులకు నచ్చజెప్పటంతో ఆందోళన విరమించారు. వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్భుతం.. హంసలదీవి సాగరతీరం

కుటుంబసభ్యులతో కలిసి తీరంలో సేదతీరిన జేసీ గీతాంజలి శర్మ



బీచ్ వద్ద తాబేళ్ల పిల్లలను సముద్రం వైపు విడిచిపెడుతున్న జేసీ గీతాంజలి శర్మ

కోడూరు: ప్రకృతి రమణీయ దృశ్యాలకు నెలవైన హంసలదీవి సాగరతీరం అద్భుతంగా ఉందని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. కుటుంబసభ్యులతో కలిసి జేసీ సాగరతీరాన్ని శనివారం వేకువజామున సందర్శించారు. పాలకాయతిప్ప శింకు నుంచి పవిత్ర కృష్ణా, సాగర సంగమం వరకు పడవ ప్రయాణం చేసి ప్రకృతి అందాలను తిలకించారు. మడ చెట్ల వివరాలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగర సంగమ విశిష్టతను రెవెన్యూ అధికారులు జేసీకి వివరించారు. అక్కడ కొంతసేపు సేదతీరి పాలకాయతిప్ప బీచ్‌లో పర్యటించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాబేళ్ల సంతానోత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి అయిన తాబేళ్ల పిల్లలను కుటుంబ సభ్యులతో కలిసి జేసీ సముద్ర బాట పట్టించారు. తాబేళ్ల పిల్లలు సముద్రం వైపు బుడిబుడి అడుగులు వేసుకుంటూ వెళ్తున్న దృశ్యాలను కెమెరాల్లో బంధించారు. పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో ఉన్న వివిధ రకాల జీవరాశుల నమూనాలను ఆసక్తిగా తిలకించారు. మెరైన్ ఎస్ఐ పూర్ణమాధురి, రెవెన్యూ, అటవీ, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రతో పరిశుభ్రంగా గ్రామాలు

జిల్లా పంచాయతీ అధికారి లావణ్యకుమారి



మైలవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని, డీపీవో లావణ్యకుమారి తదితరులు

మైలవరం: స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి లావణ్యకుమారి తెలిపారు. మైలవరం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో గ్రామ పంచాయతీ, వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచ్చల విడిగా ప్లాస్టిక్ వస్తువులు వినియోగించడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని చెప్పారు. క్యారీ బ్యాగులు ఎక్కడబడితే అక్కడ పడేయడంతో భూమి ఉపరితలంలో పేరుకుపోతున్నాయని తెలిపారు. దీంతో వర్షపు నీటిని భూమి పీల్చుకోలేకపోతుందని పేర్కొన్నారు. వాడిన ప్లాస్టిక్ వస్తువులను పంచాయతీ పారిశుద్ధ్య వాహనం వచ్చినపుడు అప్పగిస్తే వాటిని దూరంగా డంప్ చేస్తారని వెల్లడించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యవంతమైన గ్రామాలను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రోగం వచ్చాక మందులు వాడేకన్నా రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం మేలన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతి బాబు మాట్లాడుతూ ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్మికులను సత్కరించారు. తహసీల్దారు అబ్దుల్ ధారియా, సర్పంచ్ మంజుభార్గవి, తదితరులు పాల్గొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ వేస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరిప్రసాద్, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు, పాల్గొన్న బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, ఇతర ఫాదర్లు



లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రీస్తు సందేశం సమస్త మానవాళికి శాంతి సందేశం కావాలని విజయవాడ కేథలిక్ డయోసిస్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, సీఎస్ఐ కృష్ణా, గోదావరి డయోసిస్ బిషప్ టి. జార్జికొర్నేలియస్ పిలుపునిచ్చారు. ఈస్టర్ (పాస్కా) సందర్భంగా ఏపీ ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చిలు, నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. పటమటలోని సెయింట్ పాల్స్ చర్చి వద్ద బిషప్‌లు జోసఫ్ రాజారావు, కొర్నేలియస్, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్‌లు పునరుత్థానుడైన క్రీస్తును స్వాగతిస్తూ కాగడాలు వెలిగించి ఆనందోత్సాహాల మధ్య రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్‌లు రాజారావు, కొర్నేలియస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఎంతో భక్తి విశ్వాసాలతో జరుపుకుంటున్నారని చెప్పారు. ఫాదర్ మువ్వల ప్రసాద్, ప్రెసిడెంట్ అండ్ డైరెక్టర్ పాస్టర్ ఎస్. జయకుమార్ బాబు మాట్లాడుతూ రన్ ఫర్ జీసెస్ తెలుగు రాష్ట్రాల్లో దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ సెయింట్ పాల్స్ బసిలికా సీఎస్ఐ చర్చి ప్రాంగణానికి చేరుకొంది. రన్ ఫర్ జీసెస్ స్టేట్ కో-ఆర్డినేటర్ శివాజీరాజు అల్లూరి విశ్వప్రసాద్, ప్రవీణ్, కరుణానిధి, మాజీ డెప్యూటీ మేయర్ ఎస్. గ్రిటన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఎస్ పీజీ డిప్లొమో కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం):2025-27 స్పోర్ట్స్ కోచింగ్ స్పెషలైజేషన్ 41వ బ్యాచ్‌లో ప్రవేశానికి పాటియలాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఎస్ఎన్ఐఎస్) నోటిఫికేషన్ జారీ చేసినట్లు కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డీఎస్‌డీవో ఝాన్సీలక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. స్పోర్ట్స్ కోచింగ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సు ప్రవేశానికి జిల్లాలోని అర్హులైన కోచ్‌లు దరఖాస్తు చేసుకోవాలని సూచించా రు. ధరఖాస్తులను మే రెండో తేదీ లోపు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనారోగ్య కారణాలతో మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వైఎస్సార్ కాలనీలో చోటు చేసుకుంది. ఘటనపై మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గద్దం విజయలక్ష్మి కుమార్తె రోజాకుమారికి తాడేపల్లికి చెందిన శ్యాంబాబుకు ఇచ్చి వివాహం జరిపించారు. కరోనా సమయంలో శ్యాంబాబు మృతి చెందాడు. అప్పటి నుంచి పుట్టింటిలోనే ఉంటున్న కుమార్తె కొద్ది రోజుల కిందట మెట్లపై కాలు జారి తలకు గాయం కాగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. శనివారం ఉదయం తల్లి విజయలక్ష్మి మందుల కోసం ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న రోజాకుమారి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది.

పెద ఓగిరాలలో భారీ చోరీ



చోరీ జరిగిన ఇంటి వద్ద తనిఖీ చేస్తున్న డాగ్ టీం

ఉయ్యూరు రూరల్: మండలంలోని పెద ఓగిరాలలో శనివారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. ఇంటి యజమాని నిద్రిస్తున్న క్రమంలో చోరీ జరిగినట్లుగా కంకిపాడు సీఐ మురళీకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన మా రెడ్డి మాధవి ఒంటరిగా ఉంటుంది. భర్త వ్యాపారం రీత్యా గుంటూరులో ఉంటారు. కుమారుడు అమెరికాలో సెటిల్ అయ్యాడు. మాధవి ఒక్కరే ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో దుండగులు వెనుక తలుపుకున్న తాళం వద్ద గొళ్లాన్ని విరగ్గొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.15 లక్షల నగదుతో పాటు కొంత బంగారాన్ని దొంగిలించినట్లు తెలిపారు. ఘటన సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో పరిశీలించారు. గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు ఘటన స్థలాన్ని సందర్శించి బాధితురాల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు.

బైక్ చోరీ....

భారీ చోరీ జరిగిన ప్రాంతానికి దగ్గరలోనే ఇంటి బయట నిలిపి ఉంచిన ఓ బైకును సైతం దొంగలు అపహరించారు. ప్రతిరోజు ఇంటి లోపల భద్రపరచుకునే వాహన యజమాని శుక్రవారం రాత్రి బయటనే పార్కింగ్ చేసి ఉంచడంతో దుండగులు ఆ బైకును సైతం దొంగిలించారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయండి



స్టిక్కర్ ఆవిష్కరిస్తున్న శివస్వామి, గోకరాజు గంగరాజు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హనుమజ్జయంతిని పురస్కరించుకుని హిందూ సమాజానికి ధైర్య సాహసాలను ఇచ్చే హనుమాన్ శోభాయాత్ర (బైక్ ర్యాలీ)ను విజయవంతం చేయాలని శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి పిలుపునిచ్చారు. వచ్చేనెల 22న విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరగబోయే శోభాయాత్ర స్టిక్కర్, పోస్టర్ విడుదల కార్యక్రమం మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శివస్వామి పాల్గొని వీహెచ్‌పీ కేంద్రీయ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, వీహెచ్‌పీ ప్రాంత కోశాధికారి దుర్గాప్రసాద్ రాజు, వీహెచ్‌పీ విజయవాడ మహానగర్ అధ్యక్షులు సానా శ్రీనివాస్‌తో కలిసి బైక్ స్టిక్కర్, వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. విశ్వ హిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 06940

COACHING

■ KR's IIT & Medical Academy: Inter Better/Supply & EAMCET, Polycet Short Term Coaching by 25 yrs. Exp. Faculty in VJA ✆ 98485 58159, 81431 96636

DANCE CLASSES

■ సమ్మర్ క్యాంప్ : యంగ్‌స్టార్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ A/C. పిల్లలకు డ్యాన్స్, ఆల్ వైస్టన్ డ్యాన్స్, జుంబా, ఏరోబిక్స్ HIP HOP ఏ వయస్సువారికైనా నేర్పించబడును. సంప్ర. ✆ 98850 84443

PARAMEDICAL

■ పారామెడికల్ Diploma in Medical Laboratory Technology, Diploma in Operation Theater Teachnology, Diploma in Anaesthesia Technology, Diploma in Cardiology, MPHA కోర్సు, Inter, MLT, Inter MPHW (F) అడ్మిషన్లు జరుగుచున్నవి. తమ్మినేని ఇనిస్టిట్యూట్, విజయవాడ. డా॥ టి. రామకృష్ణ ✆ 98482 42880.

REAL ESTATE

■ విజయవాడలో 6 సెంట్ల ఇంటి స్థలం (1.25 Cr) నూజివీడు మెయిన్‌రోడ్‌లో జి+1 ఇల్లు, య. 1.25 సెంట్ల స్థలం (2 Crores) అమ్మకమునకు కలవు. వాట్సాప్ మాత్రమే 95158 77494 ✆ 97019 35757

■ గొల్లపూడి, రాయనపాడు, కంచికచర్ల పరిసర ప్రాంతాలలో వెంచర్లలో గల ప్లాట్స్, కమర్షియల్, అపార్ట్‌మెంట్స్, పొలాలు అమ్మదలచిన వారు సంప్రదించండి ✆ 83096 51864

■ మా వద్ద న్యూ & ఓల్డ్ 2 & 3BHK ఫ్లాట్స్, ఇండిపెండెంట్ బిల్డింగ్స్, ఖాళీ స్థలాలు కలవు. అమ్మదలచినా, కొనదలచినా సంప్ర॥ ✆ 93477 87259, 88860 78491

FLAT FOR SALE

■ 2 BHK ఫ్లాట్, భారతీనగర్ మెయిన్‌రోడ్, విజయవాడ ఫ్లాట్ నెం. 304, 3వ ఫ్లోర్, JMD టవర్స్ నందు కార్ పార్కింగ్, కబోర్డ్స్‌తో అమ్మకమునకు కలదు. ✆ 99666 40222

■ 3 BHK, 2140 Sft Delux Flat కానూరు ఉమాశంకర్ నగర్‌లో & 2 BHK 1270 Sft Flat 100 Ft రోడ్, నియర్ బందర్ రోడ్ Cell: 93904 72429, 92478 76734

■ విజయవాడ మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ డోర్ నెం. 40-9/12-3 ఫ్లాట్ నెం. 79, A+ బిజినెస్ ప్రక్క రోడ్ 1 BHK గ్రౌండ్‌ఫ్లోర్, 560 Sft ఫ్లాట్ అమ్మకానికి కలదు. 38 చ॥గ॥ 32 లక్షలు ✆ 96181 50279

■ నెలకు 80,000 అద్దెలు వచ్చే 250 చ॥గ॥ నిర్మించిన G+3 pent house గల బిల్డింగ్ విజయవాడ ప్రసాదంపాడు లో అమ్మకమునకు కలదు. రేట్ 3.25 cr సెల్ : 9440873584

PLOT FOR SALE

■ తేలప్రోలు రైల్వే స్టేషన్‌ని ఆనుకొని 1550 చ.గజాలు గల రెండు ప్లాట్‌లు అమ్మకమునకు కలవు. సంప్రదించండి. నో మీడియేటర్స్. ✆ 9985897171

■ AP రాజధాని, వెలగపూడి (అమరావతి)కి, గొల్లపూడి నూరాయపాలెం కనెక్టివిటీ బ్రిడ్జికి దగ్గరలో VJA-HYD NH రోడ్డుకి 2వ బిట్టు, మారుతి షోరూమ్ వెనుక 1500 చ.గజాల కమర్షియల్ బిట్ అమ్మకం. ✆ 79010 12567.

■ VJA, రామవరప్పాడు, ఇన్నోటెల్-SLV మధ్యలో 80 అ॥రోడ్డును ఆనుకొని 350 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీలో LP వెంబర్‌తో ఓపెన్ ప్లాట్స్ కొరకు ✆ 99123 93377

■ Bhavanipuram700sqds, Currency Nagar 1500sq, EluruRoad 1000sq, Gosala 180sq Poranki 400sq, Kanuru 400, 650sq Commercial Plots Sale. ✆ 833 299 6699

■ MSR Devolopers వారి నూతన వెంచర్ 13-04-2025 ఆదివారం ప్రారంభం. విందు: మ॥ 12 గం.ల. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరలలో 60 గజాల నుండి ప్లాట్స్ కలవు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సింగ్‌నగర్ D-MART ఎదురు, ఇంటర్నేషనల్ స్కూల్ దగ్గరలో, కరెంట్, తారు రోడ్ల సౌకర్యాలతో వెంటనే నిర్మాణానికి అనువైన ప్లాట్స్ అమ్మకానికి కలవు. ✆ 84999 50666, 84999 51666

■ విజయవాడ భవానిపురం, HB కాలనీ బైపాస్ రోడ్డులో 172గ॥ (50x31), W/F, HIG ఇండిపెండెంట్ హౌస్ 1.90 Crore కి & కండ్రికలో 600గ॥ ప్లాటు అమ్మబడును. 8898548151

TO-LET

■ KMV VIVAAN, 100 Feet Raod, Poranki, East Face, 3 BHK, Semi Furnished Luxury Apartment, 15th Floor. Contact: 83318 64874

■ మాచవరం దుర్గిరాల బలరామకృష్ణయ్య వీధిలో ఉన్న శ్రీ సూర్య హిల్ వ్యూ అపార్ట్‌మెంట్స్‌లో గల రెండు 3 బెడ్ రూమ్ ఫ్లాట్లు 2D, 5C అద్దెకు ఇవ్వబడును. సంప్ర: 9396644789, 9849911530

SERVICES

BUSINESS OFFER

■ వ్యాపార అవకాశం. విజయవాడ, ఏలూరు రోడ్డు, మారుతీనగర్‌లో మంచి రన్నింగ్‌లో ఉన్న బెలూన్ డెకరేషన్ షాపు ఫుల్ సెటప్‌తో అమ్మకమునకు కలదు. సంప్ర : ✆ 73823 59491 & 96181 64991

■ పర్సనల్, వ్యవసాయ భూములకు, రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు, ఇండస్ట్రీయల్ లకు ఫైనాన్స్ సలహాల కొరకు సంప్రదించండి. ఫోన్ : 90632 90864

■ ITR/Salary Slip లేకుండా 48/గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు- Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి:7406393987

AMBULANCE SERVICE

■ 24/7 యమర్జెన్సీ అంబులెన్స్ సర్వీస్: A/c, వెంటిలేటర్ & రన్నింగ్ ఫ్రీజర్ బాక్స్ సదుపాయం కలదు. ✆ 939 111 5067, 888 153 8888 ఆల్ ఇండియా అంబులెన్స్ సదుపాయం కలదు.

SECOND SALES

■ కంప్యూటర్ ఆఫీసులకు పాఠ్శాలలకు పనికివచ్చే మెటీరియల్ క్రొత్తది తక్కువ ధరలో లభించును. సంప్రదించండి. ✆ 79956 71568

WANTED

■ రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ నందు పనిచేయుటకు అనుభవం గల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఏలూరురోడ్, విజయవాడ. ✆ 95423 82368

■ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో పార్ట్‌టైం/ఫుల్‌టైంగా జాబ్ చేయుటకు M/F కావలెను. మార్కెటింగ్‌లో ఉన్నవారికి ప్రాధాన్యత. Qul : డిగ్రీ వ: 28Yrs- Sal+INC కలవు ✆ 88862 49038, 94909 23564

■ Wanted Teachers : 50 Years (E.M) School requires teachers for all subjects from 3rd to 10th class. Salary : 8,000 to 18,000 + P.F & E.S.I. Negotiable in deserving cases. Send resumes by Whatsapp to Cell : 98480 63355, 94930 63355, Kommareddy (E.M) High School, Bantumilli, Krishna District.

■ ఉయ్యూరు సెంటర్‌లో ఉన్న హాస్పిటల్‌కు అనుభవమున్న నర్స్ మరియు ఫార్మసిస్ట్ కావలెను. ✆9985897171

■ విజయవాడ సిటీలో Male కేర్‌టేకర్స్, ఇబ్రహీంపట్నం దగ్గర అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డ్స్, హాస్పిటల్ & షాపింగ్ మాల్స్‌లో ఆయాలు కావలెను. ✆ 9959595909

■ బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS స్టేట్ & సెంట్రల్ ఎంప్లాయిస్ కావలెను వయసు 60 to 70 సంవత్సరాలు జీతం 12000 to 15000. ✆ 6304181391

■ AJ Pharmacy, రామవరప్పాడు దగ్గర ప్రసాదంపాడు, మందుల షాపు లో పని చేయుటకు వర్కర్స్ కావలెను. ఫుల్ టైం /పార్ట్ టైం : ✆ 7997 66 99 11.

■ విజయవాడ పరిసర ప్రాంతాల్లో మగ సెక్యూరిటీ 12H, 8H, వయస్సు 20 to 45 గల చదువు 8th to 10th, మంచి జీతం 10k to 15k. ✆ 6300 205 484, 73828 96876

■ VIBA EV TECHNOLOGIES (EV టెక్నీషియన్ కోచింగ్ సెంటర్) నందు పనిచేయుటకు స్టాఫ్ అర్జెంటుగా కావలెను. రిసెప్షనిస్ట్-జీతం(12k to 15k), సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఆకర్షణీయమైన యువతులు (Females)కి అవకాశం (వయస్సు 20-35) జీతం: (15k to 25k), ఆఫీస్‌బోయ్ -జీతం(10k to 12k), EV టెక్నీషియన్ జీతం(20k to 25k) డోర్ నెం : 75-7-17, భవాని హాస్పిటల్ ఎదుట, భవానీపురం, విజయవాడ -522012. సెల్ : 93988 41896

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీ: 20-25000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671

■ ఎలక్ట్రీషియన్స్ మరియు హెల్పర్స్ కావలెను. వయస్సు: 18-30 సం॥లోపు, హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. సంప్ర॥ ✆ 93921 33234.

■ శ్రీసాయి అంజన చిట్‌ఫండ్స్, గాంధీనగర్, విజయవాడ నందు పనిచేయుటకు రికవరీ స్టాఫ్ (Male) కావలెను. సంప్ర : ✆ 76600 08326, 63034 19997

■ కావలెను. కేర్ టేకర్స్ నర్సులు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే వుండి చూసుకొనుటకు అత్యధిక జీతం+ వ+భో. ఆంధ్ర హోమ్‌కేర్స్ VJA ✆ 91608 35559, 93473 80332

■ విజయవాడ, కానూరులో గల విద్యాసంస్థకు వైస్ ప్రిన్సిపాల్స్ -3 (M), (15000), టెలికాలర్స్ -15 (F) (9000 & 15000) కావలెను. హాస్టల్ వసతి + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. ✆ 94408 24347

■ టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ బ్యాంక్ అనుబంధ సంస్థలో కావలెను. Sal + Inc-40 వేలు, 30 yrs +, Q : 10th+, రిటైర్డ్, వ్యాపారస్తులు, గృహిణులు, RMP డాక్టర్స్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ✆ 90524 70111

■ Wanted Lady Telecallers, Qly: Inter, Degree, Salary: Fixed / Incentives/ Commission, S.N. Puram, VJA-11. ✆ 81439 04246

■ విజయవాడలోని ఇంట్లో పనిచేయుటకు ఒక లేడీ కావలెను. వయస్సు: 25-48. జీతం: 10,000/-, రూం + భోజనం ఫ్రీ. సంప్ర: ✆ 90005 68487

■ పోరంకిలోని ప్రముఖ పబ్లికేషన్స్‌కు అనుభవం గల DTP ఆపరేటర్లు, లేడీ అకడమిక్ కో-ఆర్డినేటర్స్, అకౌంటెంట్స్ కావలెను. అర్హత & అనుభవం బట్టి జీతం నిర్ణయించబడును. ✆ 77300 35678

■ మా ప్రొడక్ట్స్ మార్కెటింగ్ చేయుటకు 20 సం॥ నుండి 50 సం॥లోపు వారు కావలెను. డైలీ అలవెలన్స్ రూ. 300/- నెల శాలరీ : రూ. 15,000/- నుండి రూ. 30 వేలు వరకు ✆ 83175 28192

■ కుంచనపల్లిలో అపార్ట్‌మెంట్‌కి సెక్యూరిటీ గార్డ్స్ శాలరీ 15000, ASO శాలరీ 20,000/- 12 గం. డ్యూటీ (26 రోజులకు), వెలగపూడిలో ఆఫీస్ బాయ్ శాలరీ 18,500/-, సెక్యూరిటీ గార్డ్ శాలరీ 19000/- + ESI + PF ✆ 79894 28979

■ S.V. కెమికల్స్ : హౌస్ క్లీనింగ్ ప్రొడక్ట్స్ నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేయుటకు M/F యువతీ/యువకులు కావలెను. Qly : 10th పైన ✆ 99128 97878 / 76706 64345

■ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ విజయవాడలో పని చేయుటకు Field Executives (Sal: 15 to 22K + Incentive), Tele Callers (Sal: 10K to 15K + Incentive) కావలెను. సంప్ర. 92484 86177

■ మచిలీపట్నంలోని ప్రముఖ 'నేచురల్స్' నందు వర్క్ చేయుటకు లేడి రిసెప్షనిస్ట్ మరియు లేడి బ్యూటీషియన్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్ర. ✆ 97010 14646

■ లేడీ టెలీకాలర్స్ - 10 No.s - మరియు మేల్ ఆఫీస్ అసిస్టెంట్-1, ప్రముఖ ఆఫీసులో పనిచేయుటకు కావలెను. Q.10th/ఇంటర్, కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి. జాబ్ లొకేషన్ విజయవాడ. ✆ 99669 88544

■ తన్మయిఓల్డేజ్‌హోమ్, YSRసర్కిల్‌వద్ద VJA పెద్దవారికి సేవచేయుటకు ఆడా, మగ వర్కర్లు, వంట మనుషులు కావలెను. వ: 20-50 సం॥. 96524 23559/70939 11010/9573000987

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 8520980099, 8520874499

■ సాయిరామ్ హోంకేర్: hydలో బేబీకేర్, పేషెంట్ కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు/నర్సులు ఇంటిపని/వంటపనికి మనుషులు(ఆడ/మగ) కావలెను. జీ: 18వేలు. Ph: 9949094607, 9908454607

■ ప్రస్టేజ్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 9014885406

గమనిక

[illegible]

కారు పల్టీకొట్టి నలుగురికి తీవ్ర గాయాలు

- భార్యాభర్తతో పాటు ఇద్దరు పిల్లలకు గాయాలు
- హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతుండగా ఘటన



నున్న హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్టీకొట్టిన కారు

నున్న(విజయవాడరూరల్): వెస్ట్ బైపాస్ జాతీయ రహదారి నున్న గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలతో పాటు ఇద్దరు పిల్లలకు గాయాలైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న కారు విజయవాడ వెస్ట్ నేషనల్ బైపాస్ రోడ్డులో నున్న స్లిప్‌వే వద్దకు వచ్చేసరికి కంట్రోల్ తప్పి రోడ్డు పక్కన ఉన్న సిమెంటు దిమ్మను వేగంగా ఢీ కొట్టింది. కారు పల్టీకొట్టగా డ్రైవింగ్ చేస్తున్న పాము కాసుబాబు లోపల ఇరుక్కు పోయాడు. ఆయన భార్య శిరీషకు తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరు మగ పిల్లలకు గాయాలు కాగా ఒక బాబుకి కుడి కాలు విరిగింది. హైవేపై వెళుతున్న ప్రయాణికులు,సెక్యూర్టీ సిబ్బంది హుటాహుటిన ప్రమాద ప్రాంతానికి వెళ్లి కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. నేషనల్ హైవే అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాకినాడకు చెందిన పాము కాసుబాబు హైదరాబాద్ రెడ్డీస్ ల్యాబ్‌లో ఐటీ మేనేజర్ గా పని చేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో ఇద్దరు పిల్లలు భార్యతో కలిసి కారులో కాకినాడు వెళుతున్నారు. నేషనల్ హైవే పక్కన టవర్ నిర్మాణం పనులు నిమిత్తం రోడ్డుపై పనులు పూర్తి కాలేదు. రోడ్డు సగభాగంలో రబ్బిష్ కుప్పలు పోసి సింగిల్‌వే మూసివేసి ఉండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న నున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరు దుర్మరణం



రోడ్డు ప్రమాదం పరిశీలిస్తున్న ఎస్ఐ గణేష్‌కుమార్

బంటుమిల్లి: మండల పరిధిలోని నారాయణపురం గ్రామ శివారులో 216 జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరు టీవీ మెకానిక్‌లు దుర్మరణం చెందారు. ఎస్ఐ గణేష్‌కుమార్ కథనం మేరకు... మచిలీపట్నం పట్టణానికి చెందిన వాసా బత్తుల వీరాచారి (40), అనకాపల్లి శివప్రసాదు (40) ద్విచక్రవాహనంపై రాజమండ్రి వెళ్లి పనులు పూర్తి చేసుకుని మచిలీపట్నం తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం 6 గంటల సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు.

ఉద్యోగం పేరుతో రూ. 22 లక్షలు స్వాహా

పెనమలూరు: ఉద్యోగం పేరుతో మహిళ వద్ద రూ. 22 లక్షల సొమ్ము సైబర్ నేరగాళ్లు స్వాహా చేసిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప గ్రామానికి చెందిన నూకల విజయశ్రీ ఉద్యోగం కోసం ప్రయత్నాల్లో ఉంది. ఆమె ఆన్‌లైన్‌లో రెంట్‌కామ్ అనే వెబ్‌సైట్‌లో చాట్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమెతో చాటింగ్ చేసి గ్రూప్‌లో చేర్చారు. ఆన్‌లైన్‌లో ఆమెకు టాస్కు ఇవ్వగా సకాలంలో పూర్తి చేసింది. దీంతో సైబర్ నేరగాళ్లు సొమ్ము పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని విజయశ్రీకి ఆశ చూపి నమ్మించారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి ఈ నెల 5 నుంచి 7వ తేదీల్లో విజయశ్రీ పలు దఫాలుగా రూ. 22,09,857 ఆన్‌లైన్‌లో సొమ్ము ట్రాన్స్‌ఫర్ చేసింది. సొమ్ము బదిలీ అయిన తర్వాత గ్రూప్‌లో ఉన్న వ్యక్తులు స్పందించడం మానేశారు. దీంతో తాను మోసపోయానని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

మంగొల్లు(వత్సవాయి): ఫ్యాన్‌కు ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఏలూరి నరసింహారావు, స్వాతి దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె అయిన ఏలూరి రాజ (14) జగ్గయ్యపేటలోని ఒక ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తల్లి స్వాతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు దూసుకెళ్లి మహిళ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు పక్కన బుట్టలు అల్లుకునే వారిపై కారు దూసుకెళ్లిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గుప్తా సెంటర్ చోటుచేసుకుంది. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన పిల్లి యశోద కుటుంబం గుప్తాసెంటర్‌లోని షాదీఖానా రోడ్డు పక్కన బుట్టలు అల్లుకుంటూ జీవనం సాగిస్తోంది. శనివారం యశోద, ఆమె మామ లక్ష్మయ్య, అత్త పిల్ల రాములమ్మ, ఆడపడుచు దుర్గా రోడ్డు పక్కన కూర్చుని బుట్టలు అల్లుకుంటున్న సమయంలో కుమ్మరిపాలెం వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు వారిపైకి దూసుకెళ్లింది. కారు రాములమ్మ (50) పైకి ఎక్కింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను భవానీపురంలోని ఓ హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షించి ఆమె మృతి చెందినట్లు చెప్పారు. ఈ ఘటనపై మృతిరాలి కోడలు యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయరూ !

- నిరుపయోగంగా బందరు కాల్వ ఒడ్డున అనువైన ప్రాంతం
- వాకింగ్ ట్రాక్‌తో స్థానికులకు ప్రయోజనకరం
- కాల్వ ఒడ్డున గతంలో ఏర్పాటు చేసిన గ్రీనరీ ధ్వంసం



వాకింగ్ ట్రాక్, గ్రీనరీ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రాంతం

లబ్బీపేట(విజయవాడతూర్పు): దట్టమైన మొక్కలు పెరిగి, సర్పాలు సంచరించే లబ్బీపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి పిచ్చయ్య వీధి చివర ఉన్న డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ వరకు బందరు కాల్వ ఒడ్డున వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్‌తో పాటు గ్రీనరీ ఏర్పాటు చేయాలని లబ్బీపేట ప్రాంత వాసులు కోరుతున్నారు. అలా చేయడం ద్వారా స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకు అనువుగా ఉంటుందంటున్నారు. అంతేకాకుండా బందరు కాల్వ ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని చెబుతున్నారు.

గతంలో ఉన్న పార్కులో సబ్‌స్టేషన్ ఏర్పాటు

పిచ్చయ్యవీధి చివరి నుంచి ఫకీరుగూడెం వరకు బందరు కాల్వ ఒడ్డున గతంలో పార్కు ఉండేది. పిల్లలకు ఆట వస్తువులు కూడా ఉండేవి. ఆ పార్కులో సగ భాగంలో డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్‌తో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. దీంతో మిగిలిన కొద్ది ప్రాంతంలోనే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, గ్రీన్‌లాండ్స్ ప్రాంతం వాళ్లు వాకింగ్ చేస్తున్నారు. అదే విధంగా డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్, శ్రీ వేంకటేశ్వర స్వామి గుడి మధ్యలో కూడా గ్రీనరీని పెంచి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

దట్టంగా పెరిగిన చెట్లు..

బందరు కాల్వ ఒడ్డున ఆ ప్రాంతంలో గతంలో గ్రీనరీ ఏర్పాటు చేసి, రోడ్డు పక్కన ఐరన్ మెష్ కూడా వేశారు. అనంతరం గ్రీనరీని పట్టించుకోక పోవడంతో వర్షాకాలంలో చెట్లు దట్టంగా పెరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో సర్పాలు తిరుగుతున్నాయని, రాత్రి వేళల్లో రోడ్లపైకి, ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఉండే క్వార్టర్లలోకి కూడా పలు మార్లు వచ్చాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా మద్యం బాబులు సైతం చెట్ల మధ్యలోకి వెళ్లి మద్యం సేవిస్తున్నట్లు చెబుతున్నారు. దట్టంగా పెరిగిన మొక్కలను ఇటీవల కొంత మేర తొలగించారు. ఇంకా ఆర్ అండ్ బీ భవనం ఎదురుగా అలాగే ఉన్నాయి. ఆ ప్రాంతం అంతా మొక్కలు తొలగించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని కోరుతున్నారు.



దట్టంగా పెరిగిన మొక్కలు

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి..



బందరు కాల్వ ఒడ్డున దట్టంగా పెరిగిన మొక్కలు తొలగించి ఆహ్లాదకరంగా ఉండేలా పచ్చని మొక్కలు పెంచడంతో పాటు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. పాములు ఇళ్లలోకి వస్తుండటంతో ఇప్పటికే కొందరు ఇళ్లు ఖాళీ చేసి మరో ప్రాంతానికి వెళ్లిపోయారు. నగర పాలక సంస్థ స్పందించి గ్రీనరీ, వాకింగ్ ట్రాక్ చేస్తే ఆహ్లాదకరంగా ఉంటుంది. – ఎండీ అబీద్, లబ్బీపేట

క్లుప్తంగా

ఫైలేరియాపై మలేరియా సిబ్బందికి శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫైలేరియాస్ వ్యాధికి సంబంధించి మలేరియా విభాగంలో పనిచేస్తున్న సబ్‌యూనిట్ అధికారులు, ఎంపీహెచ్ఎస్‌కి శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. లబ్బీపేటలోని జిల్లా మలేరియా కార్యాలయంలో డీఎంఓ డాక్టర్ మోతీబాబు అధ్యక్షతన జరిగిన శిక్షణలో రాష్ట్ర ఫైలేరియా ప్రతినిధి శ్రీహరివెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఫైలేరియా కేసుపై భౌతిక ప్రదర్శనతో పాటు గ్రేడింగ్, చికిత్స, వైకల్య నివారణ, కిట్ వాడకం, రాత్రి రక్తపూతలు పరీక్ష, చికిత్సలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులకు కళ్ల జోళ్ల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులకు కళ్ల జోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులకు మాక్సివిజన్ హాస్పిటల్ సహకారంతో గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 74 మందిలో దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ నగర అధ్యక్షురాలు డాక్టర్ వి.శ్రీదేవి విద్యార్థులకు కళ్ల జోళ్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. కంటి చూపులో తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలన్నారు. విద్యార్థులకు కళ్ల జోళ్లు అందించిన రోటరీ క్లబ్ సభ్యులకు పాఠశాల హెచ్ఎం మాతంగి కోటయ్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీవీ మురళీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ రిజర్వేషన్ పెంపుపై హర్షం

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడాకారుల ప్రయోజనాలను కాంక్షిస్తూ స్పోర్ట్స్ రిజర్వేషన్ 2 నుంచి 3 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంపై ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో 29 క్రీడలకు మాత్రమే స్పోర్ట్స్ రిజర్వేషన్ వర్తించేదని, 3శాతం అమలుతో 65 క్రీడలకు రిజర్వేషన్ వర్తిస్తుందని ప్రకటించారు.

ఏ, బీ కేటగిరీలుగా విభజించడం దురదృష్టకరం : కేపీ రావు

65 క్రీడలలో 36 క్రీడలను 'ఏ' కేటగిరీగా మిగిలిన క్రీడలను 'బి' కేటగిరీగా విభజిస్తూ జీవో విడుదల చేయడం దురదృష్టకరమని ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.పి.రావు శనివారం ఓ ప్రకటనలో అభిప్రాయం వ్యక్తం చేశారు. జీవోను సవరించాలని కోరారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేశారు. విజయవాడ అంబాపురానికి చెందిన చిల్లపల్లి లక్ష్మీప్రసన్న, చిన్నారావులు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. చిన్నారావు డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో అప్పులు చేసినట్లు చిన్నారావు తరుచూ భార్యకు చెప్పేవాడు. ఈ నెల 17న లారీ ఆఫీసుకు వెళ్లి వస్తానని బైక్‌పై బయటకు వెళ్లాడు. 18వ తేదీ ఉదయం చిన్నారావు బైక్ వైఎస్సార్ రింగ్ వద్ద ఉన్నట్లు తెలిసిన వారు చెప్పారు. దీంతో ఆందోళన చెందిన ఆమె అక్కడకు వెళ్లగా బైక్ ఉంది. భర్తకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆందోళన చెందిన లక్ష్మీప్రసన్న తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో లక్ష్యాలను చేరుకోవాలని డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంత కుమార్ అన్నారు. దుర్గాపురానికి చెందిన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం పూర్ణానందంపేట స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లిష్ మీడియం ఎలిమెంటరీ స్కూల్ కార్యాలయానికి శనివారం కుర్చీలు అందజేశారు. హెచ్ఎం పద్మలత, క్లబ్ కోశాధికారి, గుర్రం ఏడుకొండలు పాల్గొన్నారు.

రైల్వే హాస్పిటల్‌లో ఉచిత ఫైబ్రో స్కాన్ శిబిరం



రైల్వే హాస్పిటల్‌లో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న సీఎంఎస్ డాక్టర్ శ్రీనివాసు, సిబ్బంది

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జైడస్ లైఫ్ సైన్సెస్ సహకారంతో విజయవాడ రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలోని రేడియాలజీ బ్లాక్‌లో ఉచిత ఫైబ్రో స్కాన్(లివర్) స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలేయ సంబంధిత వ్యాధులు, వాటి నివారణ, చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఊబకాయం, మద్యపానం, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం, హెచ్‌బీవీ/హెచ్‌సవీ ఇన్‌ఫెక్షన్ లక్షణాలతో బాధపడుతున్న రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. మానవ శరీరంలో కాలేయం ముఖ్యమైన అవయవమని, క్రమం తప్పకుండా వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కాలేయ సంబంధిత రుగ్మతల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, జైడస్ లైఫ్ సైన్సెస్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్



సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్‌లో పాల్గొన్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాలపై పట్టు సాధించాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాథమిక పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులతో సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నగరంలోని గాంధీ హిల్ ప్రాంగణంలో ఉన్న ప్లానిటోరియం, భవానీపురంలోని అప్‌కాస్ట్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పాములకాలువ వద్ద ఉన్న బృందావన్ పార్క్‌ను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని సైన్స్ పరికరాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించి అక్కడ ఉన్న నమూనాలు పని చేసే విధానాలపై అవగాహన పొందారు. అనంతరం డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆయా సైన్స్ అంశాలపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్ తదితర కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులను ఈ టూర్‌కు తీసుకెళ్లామని చెప్పారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రాజకుమార్, ఉమాదేవి, షేక్ సైదా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శారదా విద్యార్థుల ప్రతిభ



ఎ.దేవిశ్రీప్రియ, 1783వ ర్యాంకు



ఎం.జయపాల్, 56వ ర్యాంకు



సి.రాజేష్ నాగసాయి, 515వ ర్యాంకు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జేఈఈ మెయిన్స్ – 2025 ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి వివిధ కేటగిరిల్లో ఉత్తమ ర్యాంకులు పొందారని శారదా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని కళాశాల ఆవరణలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన ఈ పరీక్షలో ఎం.జయపాల్–56వ ర్యాంకు, సి.రాజేష్ నాగసాయి–515వ ర్యాంకు, ఎ.దేవీశ్రీప్రియ–1783వ ర్యాంకు, జి.హరీష్‌రాజు–2024వ ర్యాంకు, ఎస్‌వీ.నాగచరణ్–9693వ ర్యాంకు పొందారన్నారు. శారదా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి మాట్లాడుతూ తమ విద్యా సంస్థ నుంచి 650 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు అయ్యారని, వారిలో 350 మందికిపైగా విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే.ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ రావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో చైతన్య విద్యార్థులకు ర్యాంకులు



విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జేఈఈ మెయిన్స్ – 2025 పరీక్షలో తమ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో ఆలిండియాలో ఉత్తమ ర్యాంకులు పొందారని చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మద్దినేని మురళీకృష్ణ చెప్పారు. జేఈఈ–మెయిన్స్ పరీక్షలో ర్యాంకులు పొందిన విద్యార్థులను లబ్బీపేటలోని చైతన్య విద్యాసంస్థ ఆవరణలో శనివారం అభినందించారు. విద్యార్థులు టపాసులు కాల్చి స్వీట్లు పంచి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పీహెచ్ఎస్ఎస్.కార్తీక్–75వ ర్యాంక్, పి.ప్రణయ్ సాయి ముకేష్–81వ ర్యాంక్, వి.ఈశ్వర్ కార్తీక్–94వ ర్యాంక్ సాధించారన్నారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 24 మంది 500 లోపు ర్యాంకు, వెయ్యి లోపు ర్యాంకు 41 మంది విద్యార్థులు పొందారని చెప్పారు. విజయంలో ముఖ్యపాత్ర పోషించిన అధ్యాపకులను, ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మురళీకృష్ణతో పాటు కళాశాల డీన్స్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

మార్కెట్‌లోకి మధుర ఫలం



బందరు రోడ్డులో విక్రయానికి ఉంచిన మామిడి పండ్లు



మామిడి పండ్లు

నగరంలో మామిడి పండ్ల సీజన్ ప్రారంభమైంది. పండ్ల రారాజైన మామిడి విక్రయాలు ఏలూరు రోడ్డు, బందరు రోడ్డుతో పాటు నగర వ్యాప్తంగా జోరందుకున్నాయి. నోరూరించే మామిడి పండ్లను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా శనివారం క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఏలూరు రోడ్డులో విక్రయిస్తున్న మామిడి పండ్లు

'ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం'

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో పి.చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏఈవో మాట్లాడుతూ.. ఇంద్రకీలాద్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడంతో పాటు ఆలయ పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆలయ అధికారులు, సిబ్బంది చీపుర్లు పట్టి ఆలయ సేవలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న అగ్ని మాపక వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కొత్తపేట అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు పేర్కొన్నారు. అగ్ని మాపక వారోత్సవాలను పురస్కరించుకుని షేక్ రాజా హాస్పిటల్, శ్రీయాస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అనుకోని రీతిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు పాటించి మంటలను అదుపు చేయాలన్నారు. ఇందు కోసం అందుబాటులో ఉన్న అగ్నిమాపక పరికరాల గురించి ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలని చెప్పారు. ముఖ్యంగా బహుళ అంతస్తులు, జనసంచారం అధికంగా ఉండే హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్‌లో తప్పని సరిగా మంటలను అదుపు చేసే కెమికల్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వంటగ్యాస్ లీకై మంటలు వ్యాపిస్తే, ఆందోళన చెందకుండా మంటలను అదుపు చేసే విధానాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది సీహెచ్.విజయ్‌కుమార్, ఆర్.నరేంద్ర, ఆషేరు, వి.వి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ విద్యార్థుల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ విద్యార్థులు నలుగురు 99 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు అకడమిక్ హెడ్ ధీరజ్‌కుమార్ మిశ్రా తెలిపారు. విజయవాడలోని తమ క్యాంపస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు మధుసూదనరెడ్డి యేరువ 99.89 శాతం, ఉజ్వల్ బవన్న డోరపాడల 99.56 శాతం, నిదీష్ యేమిని 99.54 శాతం, నితీష్ సుంకర 99.33 శాతం మార్కులు సాధించారన్నారు. ఈ ఫలితాలు విద్యార్థుల దృఢ సంకల్పం, అకడమిక్ అద్భుతతను ప్రదర్శిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విజయానికి తాము గర్వపడుతున్నామని చెప్పారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో అకడమిక్ హెడ్ ధీరజ్‌కుమార్ మిశ్రా

జేఈఈ మెయిన్స్‌లో శ్రీనివాస గ్రావిటీ సత్తా



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు, అధ్యాపకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జేఈఈ మెయిన్స్–2025 ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి అత్యధిక పర్సంటైల్ సాధించారని శ్రీనివాస గ్రావిటీ కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలోని కళాశాల ఆవరణలో అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పరీక్షకు హాజరైన 100 మంది విద్యార్థుల్లో 45 మంది విద్యార్థులు 90 శాతం పర్సంటైల్ సాధించారన్నారు. వివిధ కేటగిరీల్లో 34 మంది జేఈఈ–2025 అడ్వాన్స్ పరీక్షకు ఎంపికయ్యారని చెప్పారు. ఓ.చాందినీ ఆలిండియా 758వ ర్యాంకు సాధించిందన్నారు. కళాశాల సెక్రటరీ పరుచూరి నీలిమ మాట్లాడుతూ.. అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో ప్రతి ఏటా మంచి ఫలితాలు సాధించగలుగుతున్నామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ వైపీఆర్, అధ్యాపకులు అభినందించారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



పరుచూరి విజయలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్ రాజు అన్నారు. ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఈస్టర్ పండుగ సందర్భంగా శనివారం సినీ సంగీత విభావరి, కళాకారులకు ఆత్మీయ సత్కారం చేశారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ప్రణవి మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన బీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్, దూపాటి శ్రీదేవి, ప్రభలశ్రీనివాస్, శివశర్మ పాల్గొన్నారు, భారతి, సుహాసిని, మల్లీశ్వరి, సుశీల్‌కుమార్ ఈస్టర్‌గీతాలు, క్లాసికల్ చిత్రగీతాలను ఆలపించారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మికి లెజండరీ కల్చరల్ బిరుదుతో సత్కరించారు.


జానపద సంప్రదాయాన్ని కాపాడుకోవాలి

విజయవాడకల్చరల్: జానపద సంప్రదాయాన్ని కాపాడుకోవాలని పీఎంకే ఫైన్‌ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పసుపులేటి వెంకరమణ అన్నారు. ఏపీ చలనచిత్ర అభివృద్ధి మండలి, పీఎంకే ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న కళారూపాల ప్రదర్శనలు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం జరిగిన కార్యక్రమంలో వెంకటరమణ మాట్లాడుతూ జానపద గీతాలు జాతీయ సంపదగా అభివర్ణించారు. సినీ రంగస్థల నటుడు ఆనంద్‌కొప్పుల పాల్గొన్నారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు జానపద గీతాలను ఆలపించారు.

ఆత్మహత్య తప్ప గత్యంతరం లేదు

పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గండిగనమల గ్రామానికి చెందిన ఈ రైతు పేరు **కుచ్చే నాయక్.** ఏడెకరాల్లో మిర్చి సాగు చేశారు. 7 సవర్ల బంగారం తాకట్టు పెట్టి రూ.3 లక్షలు, వడ్డీ వ్యాపారుల నుంచి రూ.4 లక్షలు అప్పులు తెచ్చారు. ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి పంట కోసం రూ.12 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. నల్లతామర, ఇతర తెగుళ్లతో ఎకరాకు 15 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ఇప్పటికే రెండు కోతలయ్యాయి. మూడో కోతలవుతున్నాయి. 'ఈరోజు 150 బస్తాలు మార్కెట్‌కు తెచ్చాను. క్వింటా రూ.6 వేలు మించి అడగడం లేదు. ఇష్టమైతే ఇవ్వండి లేదంటే వదిలేయండి' అంటున్నారని నాయక్ వాపోతున్నారు. విత్తనాలకు రూ.లక్షన్నర, దుక్కి దున్నటానికి రూ.లక్ష, మందులకు రూ.3 లక్షలు, ఎరువులు, నీళ్లకు రూ.3.5 లక్షలు, కోతలకు రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.12 లక్షలైందని చెప్పారు. 7 ఎకరాలకు రూ.7 లక్షల వరకు అప్పులు మిగులుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఆత్మహత్య తప్ప తమకు వేరే గత్యంతరం కనిపించడం లేదని నాయక్ వాపోతున్నారు.





ధర లేక రైతులకు వాటిల్లిన నష్టం రూ.8,827 కోట్లు

మిర్చి రైతులను నిలువునా ముంచిన ప్రభుత్వం

మిర్చి రైతుల కంట్లో కారం

యార్డులో అడుగడుగునా దోపిడీయే

మిర్చి యార్డులో అడుగు పెట్టింది మొదలు రైతులు నిలువునా మోసపోతూనే ఉన్నారు. 35 కేజీల బస్తాకు 1-2 కేజీల మచ్చుకాయలు తీసుకుంటున్నారు. మరోవైపు వే మేన్‌ల సమక్షంలో కాటా వేయాల్సి ఉండగా.. ఎగుమతి గుమాస్తాలే కాటా వేస్తున్నారు. టిక్కీకి 33 కేజీల 800 గ్రాములు తూకం వస్తే.. 33 కేజీలుగానే పరిగణిస్తున్నారు. ఆ విధంగా 35 కేజీల బస్తాకు కనీసం నాలుగైదు కిలోలు మిర్చిని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. కాపలా కాసే వాళ్లకు బస్తాకు రూ.8.50 చొప్పున రైతుల నుంచే వసూలు చేస్తున్నారు. ఇలా అన్ని విధాలుగా రైతులు మోసపోతూనే ఉన్నారు.



95% మందికి సగటు ధర రూ.6 -8 వేలే

2024-25 సీజన్‌లో 4.90 లక్షల ఎకరాల్లో మిర్చి పంట సాగవగా... ఎకరాకు 20-25 క్వింటాళ్ల చొప్పున గరిష్టంగా 11.67 లక్షల టన్నులు దిగుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ ఏడాది నల్లతామరతో పాటు ఇతర చీడపీడలు, వరుస వైపరీత్యాల ప్రభావంతో ఎకరాకు 10-15 క్వింటాళ్ల దిగుబడి రావడం కష్టమైంది. గరిష్టంగా 15 క్వింటాళ్ల చొప్పున73.56 లక్షల క్వింటాళ్లు దిగుబడులొచ్చినట్టు అంచనా. ఇందులో కనీసం 47.60 లక్షల క్వింటాళ్లు గుంటూరు మిర్చి యార్డుకు వస్తుంది. ఏప్రిల్ 17 నాటికి 32.22 లక్షల క్వింటాళ్లు యార్డుకు వచ్చాయి. మే 10 వరకు మిర్చి లావాదేవీలు జరుగుతాయి కాబట్టి మిగిలిన అంచనా సరుకు కూడా మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. గతేడాది మేలు రకం కాయల ధర క్వింటాల్‌కు రూ.21 వేల నుంచి రూ.27 వేల వరకు వచ్చింది. తాలు రకం కాయలకు రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు ధర లభించింది. కానీ.. ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. మొత్తం రైతుల్లో 5 శాతం మందికి మాత్రమే గరిష్టంగా క్వింటాల్‌కు రూ.10,000కు పైగా ధర లభించింది. మిగిలిన 95 శాతం రైతులకు సగటున క్వింటాల్‌కు దక్కిన ధర కేవలం రూ.6 వేల నుంచి రూ.8 వేలు మాత్రమే.

పెట్టుబడి కూడా దక్కని దుస్థితి

గతేడాది క్వింటాల్‌కు గరిష్టంగా రూ.27 వేల ధర లభించగా.. సగటున రూ.20 వేల చొప్పున దక్కింది. సగటు ధర రూ.20 వేల చొప్పున 73.56 లక్షల క్వింటాళ్లకు కలిపి రైతులకు మొత్తంగా రూ.14,711 కోట్ల ఆదాయం లభించింది.

ఈ ఏడాది సగటు ధర కాకుండా.. కేవలం గరిష్ట ధర రూ.8 వేల చొప్పున చూస్తే రైతులకు దక్కనున్న మొత్తం కేవలం రూ.5,884 కోట్లు మాత్రమే.

ఈ లెక్కన మిర్చి రైతులు ఈ ఏడాది మూటగట్టుకుంటున్న నష్టం రూ.8,827 కోట్లు. మరోవైపు ఎకరంలో మిర్చి సాగుకు సగటున అయ్యే పెట్టుబడి రూ.1.50- 2 లక్షల పైమాటే. అంటే సగటున ఎకరాకుప్రతి రైతు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు నష్టపోతున్నారు.

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం మిర్చి రైతు కంట్లో కారం కొడుతోంది. సర్కారు నిలువునా దగా చేయడంతో మిర్చి రైతులు అక్షరాలా రూ.8,827 కోట్ల నష్టాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. ముందెన్నడూ లేనివిధంగా ఓ వైపు ట్రేడర్లు, మరోవైపు ప్రభుత్వం నిలువునా మోసగించడంతో ఏంచేయాలో దిక్కుతోచని దుస్థితిలో మిర్చి రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. రోడ్డెక్కి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మిర్చి రైతులు ఎదుర్కొంటున్న అవస్థలపై గుంటూరు మిర్చి యార్డు నుంచి 'సాక్షి' అందిస్తున్న గ్రౌండ్ రిపోర్ట్.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

మద్దతు ధర పేరిట దొంగాట

మిర్చి యార్డులో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు చేస్తున్న మోసాల కంటే కూటమి ప్రభుత్వ పెద్దలు చేసిన మోసానికే రైతులు ఎక్కువగా బలైపోతున్నారు. విదేశాలకు ఎగుమతుల ఆర్డర్లు తగ్గడంతో పంట మార్కెట్‌కు వచ్చే సమయంలోనే ధరల పతనం మొదలైంది. మరోవైపు నిల్వలు పేరుకుపోవడంతో మసాలా కంపెనీలు కూడా కొనుగోళ్లు నిలిపివేశాయి. డిసెంబర్‌లో మొదలైన ధరల పతనం జనవరి నాటికి పతాక స్థాయికి చేరుకుంది. ఈ విషయాన్ని ముందుగానే గుర్తించిన ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రంతో పాటు మార్కెటింగ్ శాఖ హెచ్చరికలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటించి.. బాసటగా నిలబడిన తర్వాత సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖల పేరిట హడావుడి చేశారు. క్వింటాల్ మిర్చికి రూ.11,781 చొప్పున మద్దతు ధర ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం నమ్మబలికింది. వాస్తవానికి భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) నిర్దేశించిన ధర క్వింటా రూ.10,035. ఎప్పుడైనా ధరలు పతనమైనప్పుడు ఈ మద్దతు ధరకు, రైతుకు దక్కిన ధరకు మధ్య ఉన్న వ్యత్యాసం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో రైతులకు చెల్లించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి రైతుల్ని ఆదుకోవాల్సింది పోయి కేంద్రానికి లేఖలు రాశామని కొంతసేపు.. సీఎం చంద్రబాబు కేంద్రమంత్రితో భేటీ అయ్యారని, తాము నిర్దేశించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్రం దిగి వచ్చేసిందంటూ సీఎం సహా కేంద్ర, రాష్ట్ర మంత్రులు పోటీపడి మరీ ప్రకటనలు గుప్పించారు. తీరా చూస్తే గడచిన రెండు నెలల్లో ఈ మద్దతు ధరకు ఒక్క క్వింటాల్ మిర్చిని కూడా కొనుగోలు చేయలేదు. కూటమి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిన తర్వాత మార్కెట్‌లో ధరలు మరింత దారుణంగా పడిపోయాయి.





మార్కెటింగ్ శాఖ ప్రతిపాదనలు బుట్టదాఖలు

ధరల పతనాన్ని ముందుగా పసిగట్టిన మార్కెటింగ్ శాఖ మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద మార్కెట్‌లో జోక్యం చేసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దిగుబడుల్లో కనీసం 30 శాతం (3 లక్షల టన్నుల పైగా) మిర్చిని సేకరిస్తే రూ.3,480 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. ఆ భారం కేంద్రమే భరించేలా ఒప్పిస్తామని తొలుత రాష్ట్ర ప్రభుత్వం నమ్మబలికింది. ఆ తర్వాత మార్కెట్ ధర, మద్దతు ధరకు మధ్య వ్యత్యాసంలో 50 శాతం (మిగతా 50 శాతం కేంద్రం) భరించేలా ఫిబ్రవరి మూడో వారంలో మార్కెటింగ్ శాఖ అధికారులు రెండోసారి ప్రతిపాదించారు. ఎకరాకు 5 క్వింటాళ్ల చొప్పున 25 శాతం (2.9 లక్షల టన్నులు) పంటకు రూ.846.15 కోట్లు, 50 శాతం (5.83 లక్షల టన్నులు) పంట కొనుగోలుకు రూ.1,692.31 కోట్లు, 75 శాతానికి (8.75 లక్షల టన్నులు) రూ.2,538.46 కోట్లు ఖర్చవుతుందంటూ ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనలు కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంది.

నిలువునా మోసం

కాగా.. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో భేటీ అనంతరం తాము నిర్దేశించిన కనీస మద్దతు ధర రూ.11,781 చొప్పున మొత్తం దిగుబడుల్లో 75 శాతం పంటను కేంద్రమే కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చిందంటూ సీఎం సహా ప్రభుత్వ పెద్దలు నమ్మబలికారు. మిర్చి రైతులు, ఎగుమతిదారులతో సమావేశమైన సీఎం చంద్రబాబు మద్దతు ధర రూ.11,781 కంటే తక్కువగా మార్కెట్ ధర ఉంటే ఆలోచిద్దామంటూ సమస్యను గాలికొదిలేశారు. 10 రోజుల్లో మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుందామంటూ ప్రకటన చేసి రెండు నెలలు కావస్తున్నా మిర్చి రైతుల ఊసెత్తడం లేదు. వాస్తవానికి ఇప్పుడున్న పెట్టుబడులను బట్టి క్వింటాల్ రూ.25 వేలకు తక్కువైతే రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి. అయితే, ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర రూ.11,781కు కూడా కొనే నాథుడు కనిపించడం లేదు. దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు భరోసా కల్పించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కనీసం వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు కూడా రైతుల వైపు కన్నెత్తి చూడటం లేదు. కనీసం స్థానికంగా ఉండే మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం రైతులను పట్టించుకోవడం లేదు.

ఎలా బతకాలో అర్థం కావడం లేదు

నాలుగు ఎకరాల్లో తేజ రకం మిరప వేశా. 8 లక్షలు పెట్టుబడి పెట్టాను. వాతావరణం బాగోలేదు. పంట తెగుళ్ల బారిన పడింది. ఎకరాకు 14 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. మేలు రకం కాయలకు గత సీజన్‌లో రూ.25 వేలు వచ్చింది. తాలు రకం కాయలకు రూ.14 వేల నుంచి 17 వేల మధ్య ధర వచ్చింది. ఈ ఏడాది మేలు రకం కాయలకే రూ.6 వేల నుంచి రూ.8 వేల మించి రాలేదు. తాలు రకం కాయలైతే రూ.3 వేలకు అడుగుతున్నారు. ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

– కె.ఎల్లయ్య, పుల్లల చెరువు, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా



ఇంకా తక్కువకు అడుగుతారేమో ..

రెండెకరాలకు రూ.5 లక్షల పెట్టుబడి పెట్టాను. ఎకరాకు 10 క్వింటాళ్లు కూడా రాలేదు. నిన్న క్వింటాల్ మిర్చి రూ.7 వేలకు అడిగారు. ఈ రోజు వెళ్తే రూ.6 వేలు ఇస్తామంటున్నారు. రేపు ఇంకా తక్కువకు అడుగుతారేమో!

– మునెప్ప, కంబాదు, పెద్దకడ్రు మండలం, కర్నూలు జిల్లా



జగన్ ఉన్నప్పుడు రేటు బాగుంది

ఎకరాకు పెట్టుబడి రూ.2 లక్షలు దాటిపోయింది. ధర పడిపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఈ ఏడాది పంటంతా అమ్మినా ఎకరాకు రూ.లక్ష కూడా వచ్చేలా లేదు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు క్వింటాల్‌కు రూ.22 వేల నుంచి రూ.27 వేల వరకు లభించింది. ఇప్పుడు రూ.6 వేలకు అడుగుతున్నారు. నేను 44 బస్తాలు తెచ్చాను. ప్రభుత్వం ఇస్తామన్న రూ.11,781 ఎక్కడ ఇస్తున్నారు. ఎవరికి ఇస్తున్నారో చెప్పాలి.


– ఎస్.అచ్చయ్య, పుల్లల చెరువు, కర్నూలు జిల్లా




జిల్లా వార్తలు









ఆరోగ్యం సల్లకుండ

గతంలో మట్టి పాత్రల్లోనే వంటలు చేసుకునేవారు. కాలక్రమేణా స్టీల్ గిన్నెలు, రైస్ కుక్కర్లు వినియోగిస్తున్నారు. ఆరోగ్యరీత్యా మట్టి పాత్రల వినియోగం మేలని నిపుణులు చెబుతుండటంతో వాటికి మళ్లీ క్రేజ్ పెరిగింది. కుండలు మాత్రమే కాకుండా మట్టితో తయారు చేసిన వాటర్ బాటిల్స్, పలు రకాల వంట పాత్రలను తయారుచేసి అమ్ముతున్నారు కుమ్మరులు. మట్టి కుండలు, పాత్రలను నగర శివారు ప్రాంతమైన కొత్తూరు తాడేపల్లిలో విక్రయిస్తున్నారు. ఈ దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన



వినుకొండ: మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా మక్కెన చినరామయ్య ఆడిటోరియంలో జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు కొనసాగుతున్నాయి. నాలుగ పళ్ల సైజు విభాగంలో 10 జతలు పాల్గొన్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మక్కెన వెంకట్రావు, అనుమాల సుబ్బారెడ్డి, మదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గరెడ్డి, అక్కిరెడ్డి, రొడ్డా నాగిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, జక్కిరెడ్డి, నాగిరెడ్డి, గురువారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు యథావిధిగా అమలు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును యథావిధిగా అమలు చేయాలని ఏపీ ప్రగతిశీల బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ ఎం.రామకృష్ణ కోరారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ప్రమాదవశాత్తూ మృతి చెందిన కార్మికుడికి తక్షణమే రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. సహజ మరణం చెందిన కార్మికుడికి సంక్షేమ బోర్డు నుంచి రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికుడికి రూ. 5వేలు ఇవ్వాలన్నారు. సంక్షేమ బోర్డులో చేరిన కార్మికుడు జీవిత కాలం బోర్డులో సభ్యుడిగా కొనసాగించాలని విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాలను తక్షణమే ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను పిల్లలకు స్కాలర్‌షిప్స్, పెళ్లి కానుక పథకాలను అమలు చేయాలని చెప్పారు. అనంతరం 19 మందితో కన్వీనస్ కమిటీ ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ఎం.రామకృష్ణ, కమిటీ సభ్యులుగా జి.హరికృష్ణారెడ్డి, షేక్ మీరా వాలి, వి.రమణ, బిట్రా సాంబశివరావు, ఎన్‌వీ కృష్ణ, జి.శంకర్, వీరయ్య, వి.చిట్టిబాబు, ఎం.రాజు, రాజశేఖర్, తాళం సత్యనారాయణ, రమేష్, బాలరాజు, వై.రమేష్‌ను ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ ఎం.రామకృష్ణ

మద్దతు ధర కోసం దేశవ్యాప్త ఆందోళన

ఏపీ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరయ్య, ప్రసాద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు సాధించేందుకు దేశవ్యాప్త ఆందోళన చేపట్టాలని ఏఐకేఎస్ జాతీయ మహాసభలు తీర్మానించాయని ఏపీ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలిపారు. విజయవాడ హనుమాన్‌పేటలోని సీపీఐ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఇటీవల నిర్వహించిన మహాసభల తీర్మానాలను మీడియాకు వెల్లడించారు. దేశ వ్యాప్త రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలతోపాటు కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు, రాష్ట్రాల పరిధిలో ఉండాల్సిన వ్యవసాయరంగాన్ని స్వాధీన పర్చుకొనే ప్రయత్నాలను తిప్పికొట్టాలని మహాసభ తీర్మానించిందన్నారు. కేంద్ర తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, నేషన్ కో ఆపరేటివ్ పాలసీ వంటి పథకాలను చట్టం రూపం దాల్చకుండా అడ్డుకోవాలని తీర్మానం చేశామని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజధానిలో మరో 44 వేల ఎకరాల భూములు సమీకరించాలని నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతుల ప్లాట్లను అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతులకు రక్షణ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రైతులకు రూ. 10వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలన్నారు. సమావేశంలో కౌలు రైతు సంఘం నాయకులు పి. జమలయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్న పాలకులు

సీపీఐ కేంద్ర కార్యదర్శి కె.నారాయణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాజ్యాంగాన్ని కాపాడి అమలు చేయాల్సిన అధికార పార్టీలోని వారే రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని సీపీఐ కేంద్ర కార్యదర్శి కె.నారాయణ అన్నారు. విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో విశాలాంధ్ర సి.రాఘవాచారి సంపాదకీయాలు–జాతీయ అంశాలు నాల్గో సంపుటి ఆవిష్కరణ సభ శనివారం రాత్రి జరిగింది. కె.నారాయణ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అధికారంలో ఉన్న వారే రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రపతిని రబ్బరు స్టాంప్‌గా మార్చారని ధ్వజమెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని సైతం నరేంద్ర మోదీ, అమిత్ షాలు వారి చెప్పు చేతల్లో పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థను సైతం బీజేపీ చేతుల్లో పెట్టుకుందని తెలిపారు. తమకు అనుకూలంగా తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులకు గవర్నర్ వంటి పదవులు కట్టబెడుతోందని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాఘవాచారి రాసిన 152 సంపాదకీయలను పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమన్నారు.

ఎమర్జెన్సీ అనే పేరు లేకుండా పత్రికా స్వేచ్ఛను పాలకులు హరిస్తున్నారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ సి.రాఘవాచారితో ఒకసారి స్నేహం చేస్తే వదిలేవారు కాదన్నారు. రాఘవాచారి సతీమణి జ్యోత్స్న, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ నాయకులు అక్కినేని వనజ, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సభకు జమిందార్ అధ్యక్షత వహించారు. సభకు ముందుగా సి.రాఘవాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న నారాయణ

దుర్గమ్మకు సంగీతార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్త నారద గానసభ బృందం సంగీతార్చన చేసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గాయకులు ఆకురాతి కోదండ రామయ్య గాత్ర కచేరీతో భక్తజనులు పరవశించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై నిర్వహించిన సంగీతార్చనకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారి కీర్తనలను విని పరవశించారు. సుమారు రెండు గంటల పాటు సంగీతార్చన సాగింది.

రాజధాని రైతులకు న్యాయం చేయండి

తాడేపల్లి రూరల్: ల్యాండ్ పూలింగ్‌కు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నారంటూ ప్రచారం జరుగుతోందని, సీఆర్డీఏ అధికారులు ఆ ప్రచారాన్ని ఖండించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. శనివారం ఉండవల్లి రైతులతో ఆయన సమావేశమయ్యారు. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉండవల్లి నుంచి ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకున్నారని, ప్లాట్లు కేటాయించారు గానీ, 11 ఏళ్లవుతున్నా.. వాటిని అభివృద్ధి చేయలేదని, ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇవ్వాలని రైతులను సీఆర్డీఏ అధికారులు కోరుతున్నారని పేర్కొన్నారు. రైతులు భూములు ఇవ్వకుండానే ఇచ్చారంటూ కొన్ని పత్రికలు, యూట్యూబ్ చానళ్లలో ప్రచారం జరుగుతోందని, గతంలో ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేసేటప్పుడు రైతుల అభిప్రాయం తీసుకోవాలని పేర్కొన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రభుత్వం రైతులను గుప్పెట్లో పెట్టుకోవడానికి యత్నిస్తోందని విమర్శించారు. రాజధాని రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉండవల్లిలో జోన్-9 ఎత్తివేయాలని, బహుళ అంతస్తులు కట్టుకునేలా రైతులకు అనుమతి ఇవ్వాలని, ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని, అప్పుడు రైతులు సానుకూలంగా స్పందించి స్పీడ్ యాక్సెస్ రోడ్‌కు భూములు ఇవ్వడానికి ముందుకు వస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది సంపర శ్రీనివాసరావు, రైతులు డాక్టర్ గాదె కన్నారావు నాయుడు, దంటు బాలాజీ రెడ్డి, పి.వీరాస్వామి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

గుంటూరు ఎడ్యుకేషన్: నల్లచెరువులోని అంబేడ్కర్ ఎయిడెడ్ పాఠశాలలో సర్దుబాటుపై పని చేస్తున్న ఇద్దరు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, డి.రవిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, విద్యార్థుల హాజరు నమోదులో అవకతవకలు, మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల సంఖ్యను పెంచి చూపడం, సరైన రికార్డులను నిర్వహించకపోవడం వంటి అంశాలపై ఎంఈఓ, డీవైఈఓలతో విచారణ జరిపించిన డీఈఓ రేణుక వారి నివేదిక ఆధారంగా సంబంధిత ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. పాఠశాలను డీఈఓ రేణుక తనిఖీ చేసిన సమయంలో 46 మంది విద్యార్థులను ఆన్‌లైన్ హాజరులో నమోదు చేయడం, తీరా పాఠశాలలో భౌతికంగా హాజరైన విద్యార్థులు తొమ్మిది మందే ఉండటంపై విచారణకు ఆదేశించారు. దీనిపై రెండు రోజుల క్రితం డీవైఈవో, ఎంఈవో పాఠశాలకు స్వయంగా వెళ్లి, సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇచ్చారు.

ఈస్టర్ పర్వదినం ప్రత్యేకం

దేవుని విమోచన కార్యక్రమంలో అత్యంత శకిమంతమైనది క్రీస్తు పునరుత్థాన శక్తే. మానవునికి మరణం తోనే జీవితం అంతం కాదని పునరుత్థానం తెలియజేసింది. ప్రతి మనిషి సదాకాలము దేవునితో కలిసి జీవించవచ్చన్న గొప్ప నిరీక్షణ కలిగింది. ఎందుకంటే యేసు అంటున్నాడు 'పునరుత్థానం జీవం నేనే. నా యందు విశ్వాసముంచు వాడు చనిపోయినను బ్రతుకును. బతికి నాయందు విశ్వాసముంచు వాడు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు'.

మరణమా నీ ముల్లెక్కడ?



శుక్రవారం సిలువ వేయబడిన యేసును తలచుకొని యూదా మతపెద్దలు యేసు ఇక శాశ్వతంగా మట్టిలో కలిసి పోయాడని సంబర పడ్డారు. వారిలో ఆ దుష్ట తలంపు పెట్టిన అపవాదియైన సాతాను దేవునిపై విజయం సాధించానని ఇక ఈ లోకం అంతా తన చెప్పు చేతల్లో ఉండిపోతుందని భ్రమ పడ్డాడు. అయినా ఎందుకైనా మంచిదని క్రీస్తును ప్రత్యేకంగా అరిమత్తయి ఏర్పాటు చేసిన సమాధి చుట్టూ ఎవరు తొలగించలేని పెద్ద రాతిని ఏర్పాటు చేశారు. బలమైన రోమా సైనికులను సమాధికి కాపలాగా పెట్టారు. క్రీస్తు మూడవ దినమున లేస్తానని చెప్పిన మాట నెరవేరకుండా శతవిధాలుగా తమ ప్రయత్నం వారు చేశారు. ఇక ఏసు చరిత్ర శాశ్వతంగా ఖననం చేశామని ఇక ఎప్పటికీ తామే మతపెద్దలుగా యూదా ప్రజలను తమ అధీనంలోనే వుంచుకోవచ్చని రోమా అధికారులకు లంచం కడుతూ తమ పబ్బం గడుపుకోవచ్చని కలలుగంటూ శనివారం అంతా హాయిగా నిద్రపోయారు. మరోపక్క యేసు చేసిన అద్భుత సూచక క్రియలు చూసి ఆయన పరలోక దివ్య వాక్కులు విన్న ప్రజలు యేసు సిలువ మరణాన్ని జీర్ణించు కోలేని స్థితిలో వుండిపోయారు. యూదా గలిలయా సమరియ ప్రాంతాల్లో క్రీస్తు ద్వారా స్వస్థత పొందిన గుడ్డి, కుంటి, మూగ, చెవిటి వారు, కుష్టు రోగులు మరణించి క్రీస్తుతో బతికింపబడినవారు, క్రీస్తును అభిమానించేవారు, వివిధ అద్భుతాలను చూసినవారు యేసు మరణంతో శోకసంద్రంలో మునిగిపోయారు. చివరకు యేసుతో మూడున్నర సంవత్సరాలు తిరిగిన ఆయన శిష్యులు యూదా మతపెద్దలకు భయపడి యెరూషలేము పట్టణంలో ఓ గదిలో దాక్కుండిపోయారు. అయినా దేవుని ప్రవచనాలు నెరవేరక తప్పవు కదా! భూమి పునాదులు వేయక ముందే ఆయన ఏర్పాటు చేసిన రక్షణ ప్రణాళిక అనాది సంకల్పం నెరవేరక తప్పదు కదా!

యేసు పునరుత్థాన శక్తి

యేసు తన శరీరంలో సిలువ ద్వారా పాపానికి శిక్ష విధించి బలి అర్పణగా శరీరాన్ని సమర్పించడం ద్వారా మరణంపై సాతాను కున్న అధికారాన్ని నాశనం చేశాడు. మనుషుల్లో మరణం పట్ల ఉన్న భయాన్ని పునరుత్థాన శక్తితో తీసివేయడం ద్వారా దేవునితో ధైర్యంగా విశ్వాసంతో ముందుకు కొనసాగడానికి బాటలు వేశాడు. ప్రథమ మానవుడైన ఆదామును సాతాను లోబరుచుకొని మరణానికి పాత్రుడుగా చేశాడు. ఫలితంగా పుట్టిన ప్రతి మనిషి గిట్టక తప్పని పరిస్థితి నెలకొంది. అయితే కడపటి ఆదాముగా వచ్చిన యేసు పునరుత్థానం ద్వారా ఆ శాపం పూర్తిగా తొలగించబడింది. అంటే మనుష్యుని ద్వారా ఎలా మరణం వచ్చిందో మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానం కలిగింది. ఈ ప్రక్రియ ద్వారా క్రీస్తులా ప్రతి ఒక్కరూ పునరుత్థానం పొందే అవకాశం లభించింది.

తొలగింపబడిన రాయి

ఆదివారం ఉదయమే ఇంకా తెల్లవారకముందు యేసు ద్వారా స్వస్థత పొందిన మగ్దలేని మరియ, కొంతమంది ధైర్యవంతులైన స్త్రీలు సుగంధ ద్రవ్యాలను తీసుకొని యేసును సమాధి చేసిన చోటుకు చేరుకున్నారు. రోమా అధికారక ముద్రతో వేయబడ్డ ఆ పెద్ద రాయి ఎవరు తొలగిస్తారన్న ఆలోచన ఆ మహిళకు కలిగింది. తీరా సమాధి వద్దకు వచ్చి చూస్తే వారి జీవితంలో ఎన్నడు కలుగనంత విభ్రాంతికి లోనయ్యారు. అప్పటికే సమాధి మీద రాయి తొలగించబడింది. అంతకు క్రితమే యేసు సమాధిమీద ఉన్నరాయి పరలోకం నుండి ప్రభువుదూత దొర్లించినట్లు లేఖనాలలో రాయబడింది. ఆ ప్రాంతంలో భూకంపం వచ్చింది. అక్కడ కావలి వున్న రోమా సైనికులు భయపడి చచ్చినవారిలా పరుండిపోయారు. స్త్రీలు అక్కడికి వచ్చినప్పుడు రాయి దొర్లించబడి ఉండటం చూశారు. సమాధి లోపల యేసు దేహం వారికి కనిపించలేదు. అప్పుడు దూత ప్రత్యక్షమై "సజీవుడైన క్రీస్తును మృతులలో ఎందుకు వెదుకుచున్నారు? ఆయన ముందుగా చెప్పిన విధంగా లేచి యున్నాడు. ఈ శుభవర్తమానం శిష్యులకు తెలియజేయండి" అని చెప్పడంతో స్త్రీలు మహానందంతో వెనుకకు తిరిగారు.

పునరుత్థానుడైన క్రీస్తు

యేసు చెప్పిన విధంగానే చనిపోయిన మూడవరోజు మృత్యుంజయుడై లేచాడు. దానితో ప్రపంచ చరిత్రలో మరణాన్ని గెలిచి లేచిన చారిత్రాత్మిక పురుషుడిగా నిలిచి పోయాడు. ప్రపంచ చరిత్ర క్రీస్తుపూర్వం క్రీస్తు శకంగా చీలిపోయింది. పునరుత్థానుడైన యేసు ముందుగా తనను వెదకడానికి వచ్చిన స్త్రీలకు కన్పించి వారికి శుభమని చెప్పి ముందు మీరు వెళ్ళి నా శిష్యులకు గలిలయ వెళ్ళమని చెప్పి అక్కడ వారిని కలుస్తానని చెప్పాడు.

ఈలోగా సమాధికి కాపలాగా ఉన్న రోమా సైనికులు ప్రధాన యాజకుల వద్దకు పోయి యేసు మరణం నుండి లేచిన సంగతి వివరించారు. వారు రోమా సైనికులకు లంచం ఇచ్చి ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దని చెబుతూ మేము రాత్రివేళ నిద్దుర పోతుంటే యేసు శిష్యులు వచ్చి యేసు శరీరాన్ని ఎత్తుకు వెళ్ళారని అబద్ధం చెప్పండి ఒకవేళ అధికారులు ఏమన్నా హడావుడి చేస్తే వారిని మేము చూసుకుంటామని నచ్చచెప్పి పంపించివేశారు. అయితే యేసు చెప్పిన విధంగానే గలిలయ శిష్యులకు దర్శనం ఇచ్చాడు.

ఈ ఈస్టర్ పండుగ సమయంలో యేసు పునరుత్థాన శక్తి ప్రతి ఒక్కరం పొందుదం గాక! ఆమేన్!!

– మన్య జ్యోత్స్న రావు

నవోదయాన్నిచ్చిన ఆదివారం

మానవ చరిత్రలో ఆ ఆదివారం ఎన్నటికీ మరవురానిది. ఎందుకంటే యేసుక్రీస్తు అన్ని కుత్రలనూ, దుర్మార్గాలనూ, దౌర్జన్యాలనూ పటాపంచలు చేసి సమాధినీ, మరణాన్నీ గెలిచి సజీవుడు కావడం ద్వారా దీనులు, పాపులు, నిరాశ్రయులందరికీ నవోదయాన్నిచ్చిన దినం ఆ ఆదివారం...

యేసుక్రీస్తు మానవరూప ధారియైన రక్షకుడుగా ఈ లోకానికి తన పరమ తండ్రి ఆదేశాలు, సంకల్పాలను అమలుపర్చడానికి విచ్చేసిన దైవకుమారుడు, అంటే అన్నివిధాలా దేవుడే!!!. అలాగైతే జననానికి, మరణానికి, పునరుత్థానానికి దేవుడు అతీతుడు కదా... మరి ఇదంతా ఎందుకు జరిగింది? అన్న ప్రశ్న తప్పక రావాలి.

నాలుగేళ్ల ఒక బాలుడు నీళ్లు పెద్దగా లేని ఒక బావిలో పడ్డాడు. అయ్యో అంటూ జనం బావి చుట్టూ గుమికూడారు. వాడసలే భయకంపితుడై ఉన్నాడు. పైగా పసితనం, అంతా గందరగోళం.. గట్టిగా ఏడుస్తున్నాడు. ఇంతలో ఒకాయన బావి వద్దకొచ్చి లోనికి తొంగి చూశాడు. వెంటనే అక్కడున్న ఒక తాడు తన నడుముకు కట్టుకొని అక్కడున్న వారితో తనను లోనికి దించమన్నాడు. అతన్ని చూసి పిల్లాడు మహదానందంతో 'డాడీ' అని గట్టిగా అరిచి తండ్రిని కరిచి పట్టుకున్నాడు. తండ్రి వాడిని చంకకేసుకొని గట్టిగా కరుచుకొని తమను పైకి లాగమన్నాడు. పిల్లాడు బావిలో పడిపోతే అందరికీ సానుభూతే!! కాని పర్యవసానాలాలోచించకుండా చనిపోయేందుకు కూడా తెగించి కొడుకును కాపాడుకునే శక్తి ఒక్క తల్లి, తండ్రి ప్రేమకు మాత్రమే ఉంటుంది. శుక్రవారం నాడు సిలువలో అదే జరిగింది. పాపిని కాపాడేందుకు పరమ తండ్రి కుమారుడిగా, రక్షకుడుగా చనిపోయేందుకు కూడా సిద్ధపడి యేసుప్రభువు బావిలోకి దూకాడు. నేను చనిపోయినా ఫరవాలేదు, నా కుమారుడు బతికితే చాలు అనుకునేదే నిజమైన తండ్రి ప్రేమ. పరమ తండ్రిలో ఆయన అద్వితీయ కుమారుడు, కుమారునిలో పరమ తండ్రి సంపూర్ణంగా విలీనమైన అపారమైన ప్రేమ ఆ దైవత్వానిది. బావిలోనుండి కొడుకుతో సహా బయటికొచ్చిన సమయమే యేసు మరణాన్నీ గెలిచి సజీవుడైన ఈస్టర్ ఆదివారపు నవోదయం.

నేనే పునరుత్థానాన్ని... నేనే జీవాన్ని

ఆయన ఆరోహణుడు కావడం కళ్లారా చూసిన అనుభవంతో ఆయన అనుచరుల జీవితాలు సమూలంగా పరివర్తన చెందాయి. ఆయన సజీవుడైన దేవుడు అన్న నిత్యసత్యం వారి జీవితాల్లో లోతుగా ప్రతిష్ఠితమై వారంతా ఒక బలమైన చర్చిగా శక్తిగా ఏర్పడి, ఆ తర్వాత సువార్త సత్యం కోసం ప్రాణాలు కూడా త్యాగం చేసేందుకు సంసిద్ధమయ్యే ధైర్యాన్ని వారికిచ్చింది. మరణానికి మనిషిపై పట్టు లేకుండా చేసిన నాటి ఉదంతమే ఈస్టర్ అనుభవం.

యేసుప్రభువు నేనే పునరుత్థానాన్ని, జీవాన్ని అని కూడా ప్రకటించి, తానన్నట్టే చనిపోయి తిరిగి లేవడం ద్వారా తానే జీవాన్నని రుజువు చేసుకున్నాడు. తనలాగే విశ్వాసులు కూడా పురుత్థానం చెంది పరలోకంలో తమ దేవుని సహవాసంలో నిత్య జీవితాన్ని పొందుతారని ప్రభువు బోధించాడు.

– డా. సుభక్త

హెల్త్

సమ్మర్... చైల్డ్ కేర్!



ఎండలు మండిపోతున్నాయి. పిల్లలకు సెలవులూ వచ్చాయి. నీడపట్టున ఉండాల్సిన పిల్లలు కాస్తా సెలవుల్లో ఆడుకోవడం కోసం ఎండల్లోకి వెళ్తే...? అది మరింత ప్రమాదం. ఈ వేసవి వేడిమితో చిన్నారులకు వచ్చే సమస్యలేమిటో, ఈ సెలవుల ఎండల్లోంచి పిల్లలను కాపాడుకోవడం ఎలాగో తెలిపే కథనమిది.

పిల్లలకు ఆటల్లో ఒళ్లు తెలియకపోవడమే కాదు... ఎండ తీవ్రతా తెలియదు. ఇప్పటికే ఎర్రటిఎండ మండుతోంది. ఇంతటి ఎండల తీవ్రత వల్ల ఆరుబయట ఆడే పిల్లలకు వడదెబ్బ మొదలుకొని, డీహైడ్రేషన్ వరకు ఎన్నో సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నీడపట్టున ఉంటే వడదెబ్బ తగలదని కొందరి అభిప్రాయం. కానీ నీడ ఉన్నప్పటికీ అక్కడ వేడిమి తీవ్రత ఎక్కువగా ఉంటే వడదెబ్బ తగిలే ప్రమాదం లేకపోలేదు. వేసవిలో చిన్నారులకు ఎండ ముప్పులు ఏయే రూపాల్లో వస్తాయో చూద్దాం.



ఎండ తీవ్రతతో సమస్యలివి...

మజిల్ క్రాంప్స్: దేహం తన జీవక్రియలను కొనసాగించడానికి మెదడు నుంచి ప్రతి నరానికీ ఆదేశాలు అందుతూ ఉంటాయి. ఈ ఆదేశాలన్నీ లవణాలలోని విద్యుదావేశం కలిగిన అయాన్లు నరాల ద్వారా ప్రసరించడం వల్ల కండరాలకు ఆదేశాలందుతూ ఉంటాయి.

ఎండవేడిమి తీవ్రతతో చెమట రూపంలో నీటినీ, లవణాలనూ కోల్పోవడం వల్ల నరాల ద్వారా మెదడునుంచి కండరాలకు సరైన ఆదేశాలందవు. దాంతో డీ-హైడ్రేషన్‌కు గురి కాగానే కండరాలు బిగుసుకుపోతాయి. వీటినే మజిల్‌క్రాంప్స్‌గా చెబుతారు. మజిల్‌క్రాంప్స్ వస్తే వెంటనే దేహానికి నీటిని అందించాలి.

పిల్లల్లో మజిల్ క్రాంప్స్ వస్తే: పిల్లలకు మజిల్‌క్రాంప్స్ కారణంగా కండరాలు బిగదీసుకుపోతుంటే వారికి 'ఓరల్-రీ-హైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణాన్ని తాగించాలి. ● ఓఆర్ఎస్ అందుబాటులో లేకపోతే కొబ్బరినీళ్లు కూడా తాగించవచ్చు. ● ఓఆర్ఎస్‌గానీ, కొబ్బరినీళ్లుగానీ అందుబాటులో లేకపోతే... ఒక అరటిపండు తినిపించి, మంచినీళ్లు తాగించాలి. అరటిపండులో పొటాషియం వంటి లవణాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అరటిపండూ, నీళ్లతో అవి చాలా వరకు భర్తీ అవుతాయి.

వడదెబ్బ: ఒక్కోసారి చాలా ప్రాణాంతకంగా మారే మెడికల్ ఎమర్జెన్సీ కండిషన్ ఈ వడదెబ్బ. శరీర జీవక్రియలన్నీ సక్రమంగా జరగడానికి అవసరమైన ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్. కానీ పిల్లలు వడదెబ్బకు లోనైతే వారి శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పెరిగిపోతుంది. వాస్తవానికి శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీలు మెయింటెయిన్ అయ్యేందుకు మెదడులోని హైపోథెలామస్ అనే గ్రంథి తోడ్పడుతుంది. దేహ ఉష్ణోగ్రత పెరిగినప్పుడు చెమటలు పట్టి... దేహంలోంచి ఉష్ణోగ్రతను తీసుకుని ఆ చెమటలు ఆవిరైపోతూ ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత ఒకే స్థాయిలో మెయింటైన్ అవుతుంటుంది. కానీ



దేహ ఉష్ణోగ్రత అదే పనిగా పెరిగిపోతూండటంతో స్వేదగ్రంథులు అలసిపోయి ఇక ఏమాత్రం పనిచేయని స్థితికి చేరుకుంటాయి. దాంతో శరీరం వేడెక్కుతున్నా... దాన్ని నియంత్రిస్తూ ఉష్ణోగ్రత సమంగా ఉండేలా చేయడానికి అవసరమైన యంత్రాంగం విఫలం కావడంతో దేహ ఉష్ణోగ్రత ఇంకా ఇంకా పెరిగిపోతుంది. దీనికి ఓ సూచన కూడా ఉంటుంది. పిల్లల చంకల్లోనూ చెమట పట్టని స్థితి రావడం ఒక్కోసారి పిల్లలు స్పృహ తప్పిపోయి అపస్మారక స్థితికి చేరడం వడదెబ్బను సూచిస్తాయి.

వడదెబ్బలో లక్షణాలివి...

● వికారం; ● వాంతులు; ● కళ్లు తిరగడం; ● నీరసం; ● స్పృహ తప్పడం; ● ఫిట్స్ రావడం; ● చివరగా కోమాలోకి వెళ్లడం జరగవచ్చు.

వడదెబ్బకు చికిత్స: దేహ ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారెన్‌హీట్‌కు చేరి అంతకంతకూ పెరుగుతుంటే... ఆ కారణంగా మెదడు, గుండె, మూత్రపిండాలు, కాలేయం వంటి కీలకమైన అవయవాల పనితీరు తీవ్రంగా దెబ్బతింటుంది. అప్పుడు శరీర ఉష్ణోగ్రతను మళ్లీ సాధారణ స్థాయికి (నార్మల్‌కు) తీసుకురావడం అవసరం.

ఒంటి ఉష్ణోగ్రత 100 ఫారెన్‌హీట్‌కు మించుతున్నట్లు తెలియగానే వెంటనే పిల్లలను చల్లటి గాలి సోకేలా ఫ్యాన్ కింద ఉంచాలి. ఫ్యాన్ కింద కూడా వేడిగాలి వస్తుంటే పిల్లల దుస్తులను వదులు చేసి, ఒంటికి చల్లగాలిని బాగా తగలనివ్వాలి. దుస్తులు ఇబ్బందికరంగా ఉంటే నడుముకు చిన్న ఆచ్ఛాదన ఉంచి, బట్టలన్నీ తీసేయాలి. చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో ఒళ్లంతా తుడుస్తూ చల్లటి గాలి ఒంటికి వేగంగా తగులుతూ వెళ్లేలా చూడాలి. ఇలా ఒళ్లు త్వరగా చల్లబడుతుంది.

● ఈ చర్యల తర్వాత కూడా శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే పిల్లల చంకల కింద / గజ్జల దగ్గర ఐస్ గడ్డలనుంచాలి. దాంతో శరీరం మరింత చల్లబడుతుంది. అప్పటికీ శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే, దాన్ని మెడికల్ ఎమర్జెన్సీగా గుర్తించి వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

ఒబేస్ పిల్లలకు జాగ్రత్త అవసరం!

మామూలు పిల్లలతో పోలిస్తే కాస్త ఒబేస్‌గా ఉండే పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆ పిల్లల ఒంట్లోంచి నీళ్లు కోల్పోతున్నప్పుడు ఆ నీటితో పాటు విలువైన ఖనిజలవణాలనూ కోల్పోతున్నారని గ్రహించాలి. స్థూలకాయమున్న పిల్లలు బాగా ఆటలాడుతున్నప్పుడు ప్రతి కిలోకు 50 మిల్లీలీటర్ల నీరు కోల్పోవచ్చు. దాంతో తమ పిల్లలు బరువు కోల్పోతూ, ఆరోగ్యంగా మారుతున్నారంటూ పెద్దలు అపోహ పడటం సరి కాదు. వాళ్లు విలువైన ఖనిజలవణాలు కోల్పోయి డీ-హైడ్రేషన్‌కు గురవుతున్నారనే విషయాన్ని గ్రహించాలి. అందుకే ఇలా బరువు తగ్గుతున్నప్పుడు పెద్దలు వారి ఒంటిలో జరిగే జీవక్రియలకు (మెటబాలిక్ యాక్టివిటీస్‌కు) అవసరమైన నీటిని వెంటవెంటనే భర్తీ చేస్తూ ఉండాలి. అందుకే స్థూలకాయులైన పిల్లలు వెంటవెంటనే మరింత బరుతు తగ్గుతున్నట్లు గ్రహిస్తే పెద్దలు వారి ఒంట్లోకి తగిన ఎలక్ట్రొలైట్స్ పంపించేందుకు కొబ్బరినీళ్లు, గ్లూకోజ్ వంటివి ప్రతి 20 నిమిషాలకొకసారి తాగిస్తూ ఉండటం తప్పనిసరి.

ఎండ దుష్ప్రభావాల నివారణ ఇలా...

● ఎండవేళల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా ఇంట్లోని చల్లటి ప్రదేశాల్లోనే ఆడుకునేలా ప్రోత్సహించాలి. ● ఎండవేళల్లో ఇన్‌డోర్ గేమ్స్‌కు మాత్రమే వారిని పరిమితం చేస్తే బాగుంటుంది. ● ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారిని ఇంట్లోనే, అందునా ఇంట్లో కూడా చల్లగా ఉండే ప్రదేశాల్లోనే ఉండేలా చూడాలి. ● ఆటల్లో పూర్తిగా నిమగ్నమైపోయిన పిల్లలు తరచూ మంచినీళ్లు తాగకపోవచ్చు. అందుకే తరచూ వారు కొద్దికొద్దిగా మంచినీళ్లు తాగుతుండేలా చూడాలి. వీలైతే మధ్య మధ్యలో కొబ్బరినీళ్లు, పళ్లరసాలు కూడా ఇవ్వవచ్చు.

ఇలాంటి కొద్దిపాటి జాగ్రత్తలతో పిల్లలు వేసవి దుష్ప్రభావాలకు లోనుకాకుండా జాగ్రత్త పడాలి. సాయంత్రాలు బాగా చల్లబడ్డ తర్వాతనే వాళ్లను ఔట్‌డోర్ గేమ్స్‌కు అనుమతించాలి.

ఎండల్లో పిల్లలు ఎక్కువగా చెమట వల్ల నీరూ, లవణాలూ కోల్పోతున్నారని తెలియడానికి విపరీతంగా చెమట పట్టడమే సూచన అని కొందరు అపోహపడుతుంటారు. అది వాస్తవం కాదు. పిల్లలతో పోలిస్తే పెద్దల్లో చెమట గ్రంథులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఉష్ణోగ్రత పెరగగానే చెమటలు పట్టడం పెద్దల్లోనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. కానీ పిల్లల్లో అలా కాదు. వాళ్లలో పెద్దల మాదిరిగా చెమటలు పట్టాలంటే చాలా ఎక్కువ ఉష్ణోగ్రత అవసరం. ఒంటిని చల్లబరిచే మెకానిజమైన చెమట పట్టడమన్నది పిల్లల్లో కాస్త తక్కువే కావడం వల్ల పెరిగే కొద్దిపాటి వేడిమి కూడా పిల్లలపై ఎక్కువగా దుష్ప్రభావం చూపుతుంది. అందుకే పిల్లలకు పెద్దగా చెమటలు పట్టకపోయినా... వాళ్ల ఒంటి ఉష్ణోగ్రత త్వరగా పెరుగుతుందని తెలుసుకోవడంతోపాటు చిన్నపిల్లల్లో చెమట గ్రంథుల సంఖ్య తక్కువ కాబట్టి వేడెక్కిన ఒళ్లు వెంటనే చల్లబడదు కాబట్టి బాగా చల్లగా ఉండేచోటే వాళ్లు ఆడుకుంటూ ఉండేలా చూడాలి. ఆరుబయటి ఉష్ణోగ్రత బాగా తగ్గాకే వారిని బయట ఆటలాడటానికి అనుమతించాలి.



పెద్దల కంటే పిల్లల్లో చెమట గ్రంథులు తక్కువ కాబట్టి...



డా॥ శివనారాయణ రెడ్డి వెన్నపూస,
సీనియర్ నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్

ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకుంటున్నారా?

గతంలో గర్భధారణ (ప్రెగ్నెన్సీ) ప్లానింగ్ అంటూ ఏదీ ఉండేది కాదు. నిజానికి తమకు కావాల్సినప్పుడు, తమకు అవసరమైన సమయంలోనే ప్రెగ్నెన్సీ వచ్చేలా ప్లాన్ చేసుకుంటే... అది వచ్చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కాబోయే తల్లికీ, పుట్టబోయే బిడ్డకూ చాలా ప్రయోజనాలు ఉంటాయి. తల్లీ బిడ్డా సురక్షితంగా కూడా ఉంటారు. సరైన ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌తో ప్రయోజనాలెలా కలుగుతాయో తెలుసుకుందాం.

గతం తరం యువతుల్లో తమకు ప్రెగ్నెన్సీ వచ్చిన విషయం నెల తప్పిన తర్వాత గానీ తెలిసేది కాదు. అప్పుడు... తమకు పెగ్నెన్సీ వచ్చిందా లేదా అని తెలుసుకోవడం కోసం ఇంట్లోనే కొన్ని పరీక్షలు చేసుకునేవారు. అయితే గర్భధారణను ముందే ప్లాన్ చేసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లల్లో కొన్ని లోపాల నివారణకు ముందునుంచే జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్న మహిళ తాము నెల తప్పాలనుకున్న మూడు నెలల ముందు నుంచే ఫోలిక్ యాసిడ్ అనే పోషకాన్ని తీసుకోవడం వల్ల ప్రయోజనాలుంటాయి. మార్కెట్‌లో మాత్రల రూపంలో దొరికే ఈ ఫోలిక్ యాసిడ్ చాలా చవక. నిజానికి పాలకూర లాంటి ఆకుకూరల్లో అది సమృద్ధిగా ఉంటుంది. పిండంలో వచ్చేందుకు అవకాశమున్న న్యూరల్ ట్యూబ్ (వెన్నుపాము) లోపాలను అది అరికడుతుంది. పుట్టుకతో వచ్చే ఈ వెన్నుపాము



లోపాలను స్పైనాబైఫిడా అంటారు. ఫోలిక్ యాసిడ్ ఇలాంటి అనేక ప్రెగ్నెన్సీ లోపాలను అరికడుతుంది కాబట్టి ప్రెగ్నెన్సీని ప్లాన్ చేసుకున్న మహిళలకు మూడు నెలల ముందునుంచే అబ్‌స్ట్రెటీషియన్స్/ గైనకాలజిస్టులు ఫోలిక్ యాసిడ్ మాత్రలను సూచిస్తుంటారు. ప్రెగ్నెన్సీ ప్లానింగ్ వల్ల స్పైనా బైఫిడా మాత్రమే కాకుండా పోష్టికాహార లోపాల వల్ల పిండదశలో ఎదురయ్యే మరెన్నో సమస్యలూ నివారించవచ్చు. అంతేకాదు... దేశంలోని మహిళల్లో దాదాపు 59 శాతం మందిలో రక్తహీనత (అనీమియా) ఎక్కువ. ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునే మహిళకు ఐరన్ సప్లిమెంట్లు ఇవ్వడం ద్వారా కూడా కాబోయే తల్లీ, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉంది.

గర్భం ప్లాన్ చేసుకున్న నాటి నుంచి మహిళకు అన్ని పోషకాలూ అందేలా ఆరోగ్యకరమైన సమతులాహారాన్ని ఇవ్వడం, అందులో కూరగాయలు, ఆకుకూరలు, తాజాపండ్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలతో ఇటు కాబోయే తల్లి, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ఆ చిన్నారికి తగినంత రోగనిరోధక శక్తి సమకూరేలా జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశముంటుంది.



డా॥ స్వప్న సముద్రాల
సీనియర్ గైనకాలజిస్ట్ అండ్ అబ్‌స్ట్రీషియన్



మొహమ్మద్ అజహరుద్దీన్ స్టాండ్ పేరు తొలగింపు

ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నార్త్ స్టాండ్ పేరుకు సంబంధించి అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. భారత మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ పేరుతో ఈ స్టాండ్ ఉండగా... ఇప్పుడు అజహర్ పేరును తొలగించాలని అంబుడ్స్‌మన్ జస్టిస్ (రిటైర్డ్) వి.ఈశ్వరయ్య ఆదేశాలు జారీ చేశారు. ఈ స్టాండ్‌కు సంబంధించి ఇకపై స్టేడియం అధికారిక కార్యక్రమాల్లో గానీ టికెట్లపై గానీ అజహర్ పేరును వాడరాదని ఆయన హెచ్‌సీఏకు సూచించారు. భారత క్రికెటర్‌గా, కెప్టెన్‌గా అజహర్ చేసిన సేవలను గుర్తిస్తూ 2019లో ఈ స్టాండ్‌కు అతని పేరు పెట్టారు. అయితే ఆ సమయంలో స్వయంగా అజహర్ హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్నాడు. ఈ హోదాలో తనకు వ్యక్తిగతంగా ప్రయోజనం కలిగించే నిర్ణయం తీసుకోవడం పరస్పర విరుద్ధ ప్రయోజనాల (కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రస్ట్) కిందకు వస్తుందని, పైగా జనరల్ బాడీ అనుమతి లేకుండానే ఇది చేశారంటూ లార్డ్స్ క్రికెట్ క్లబ్ ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ అనంతరం అంబుడ్స్‌మన్ తన తీర్పును వెలువరించారు.

లక్నో ‘సూపర్’ విక్టరీ

- అవేశ్ అద్భుత బౌలింగ్
- రాజస్తాన్‌పై 2 పరుగులతో నెగ్గిన సూపర్‌జెయింట్స్



అవేశ్ బౌలింగ్‌లో జైస్వాల్ బౌల్డ్

జైపూర్: ఆఖరి ఓవర్... ఆఖరి బంతిదాకా ఇరు జట్లతోనూ దోబూచులాడిన విజయం చివరకు లక్నో సూపర్‌జెయింట్స్‌ను వరించింది. రాజస్తాన్ రాయల్స్ 6 బంతుల్లో 9 పరుగులు చేయాల్సి ఉండగా... లక్నో బౌలర్ అవేశ్ ఖాన్ అద్భుతం చేశాడు. 6 పరుగులే ఇచ్చి ప్రమాదకర హిట్టర్ హెట్‌మైర్‌ను అవుట్ చేశాడు. దీంతో ఉత్కంఠ రేపిన పోరులో సూపర్‌జెయింట్స్ 2 పరుగులతో అనూహ్యంగా రాయల్స్‌పై గెలిచింది. తొలుత లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (45 బంతుల్లో 66; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఆయుశ్ బదోని (34 బంతుల్లో 50; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, ఆఖరి ఓవర్లో సమద్ (10 బంతుల్లో 30 నాటౌట్; 4 సిక్స్‌లు) చెలరేగాడు. హసరంగకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసి ఓడింది. యశస్వి జైస్వాల్ (52 బంతుల్లో 74; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), రియాన్ పరాగ్ (26 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు.

మార్క్‌రమ్, బదోని ఫిఫ్టీ-ఫిఫ్టీ

పవర్‌ప్లే ముగియక ముందే హిట్టర్లు మార్ష్ (4), పూరన్ (11), పవర్ ప్లే తర్వాత కెప్టెన్ రిషభ్ పంత్ (3) అవుటవడంతో లక్నో 54 పరుగుల వద్ద కీలకమైన మూడు వికెట్లను కోల్పోయింది. ఈ దశలో క్రీజులో ఉన్న ఓపెనర్ మార్క్‌రమ్, ఆయుశ్ బదోని సూపర్‌జెయింట్స్ స్కోరు భారాన్ని మోశారు. ఇద్దరు వేగంగా ఆడటంతో జట్టు పరుగుల జోరందుకుంది. 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న మార్క్‌రమ్ నాలుగో వికెట్‌కు 76 పరుగులు జోడించాక అవుటయ్యాడు. కాసేపటికి బదోని 33 బంతుల్లో బదోని అర్ధ సెంచరీ చేసిన వెంటనే నిష్క్రమించాడు.

సమద్ 4 సిక్సర్లతో...

19 ఓవర్లలో 153/5 వద్ద ఓ మోస్తరు స్కోరు చేసిన లక్నో శిబిరంలో ఆఖరి ఓవర్ ఆనందం నింపింది. సందీప్ వేసిన 20వ ఓవర్లో మిల్లర్ (7 నాటౌట్) సింగిల్ తీసివ్వగా తర్వాత సమద్ 6, 6, 2, 6, 6లతో మొత్తం 27 పరుగులు వచ్చాయి. దీంతో సూపర్‌జెయింట్స్ స్కోరు 180కి చేరింది.

జైస్వాల్ శ్రమించినా...

యశస్వి జైస్వాల్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన కొత్త కుర్రాడు వైభవ్ సూర్యవంశీ (20 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. ఇద్దరి ఓపెనర్ల వేగం రాజస్తాన్‌ను లక్ష్యం వైపు నడిపించింది. తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించాక వైభవ్ ఆటను మార్క్‌రమ్ ముగించగా, నితీశ్ రాణా (8)ను శార్దుల్ పెవిలియన్ చేర్చాడు. తర్వాత జైస్వాల్‌కు జతయిన కెప్టెన్ రియాన్ పరాగ్ రన్‌రేట్ తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. 31 బంతుల్లో ఫిఫ్టీ సాధించిన జైస్వాల్ దూకుడు పెంచాడు. లక్ష్యానికి చేరువైన దశలో 18వ ఓవర్లో జైస్వాల్, పరాగ్‌లను అవుట్ చేసిన అవేశ్...ఆఖరి ఓవర్లో హెట్‌మైర్ (12)కు చెక్ పెట్టాడు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మార్ష్ (సి) హెట్‌మైర్ (బి) ఆర్చర్ 4; మార్క్‌రమ్ (సి) పరాగ్ (బి) హసరంగ 66; నికోలస్ పూరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సందీప్ 11; రిషభ్ పంత్ (సి) జురేల్ (బి) హసరంగ 3; ఆయుశ్ బదోని (సి) దూబే (బి) తుషార్ 50; మిల్లర్ నాటౌట్ 7; సమద్ నాటౌట్ 30; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు)** 180. **వికెట్ల పతనం:** 1-16, 2-46, 3-54, 4-130, 5-143. **బౌలింగ్:** జోఫ్రా ఆర్చర్ 4-0-32-1, తీక్షణ 4-0-32-0, సందీప్ శర్మ 4-0-55-1, తుషార్ దేశ్‌పాండే 4-0-26-1, హసరంగ 4-0-31-2.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) అవేశ్ 74; వైభవ్ (స్టంప్డ్) పంత్ (బి) మార్క్‌రమ్ 34; నితీశ్ రాణా (సి) అవేశ్ (బి) శార్దుల్ 8; రియాన్ పరాగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అవేశ్ 39; జురేల్ నాటౌట్ 6; హెట్‌మైర్ (సి) శార్దుల్ (బి) అవేశ్ 12; శుభమ్ నాటౌట్ 3 ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు)** 178. **వికెట్ల పతనం:** 1-85, 2-94, 3-156, 4-161, 5-175. **బౌలింగ్:** శార్దుల్ 3-0-34-1, అవేశ్ ఖాన్ 4-0-37-3, దిగ్వేశ్ రాఠి 4-0-30-0, మార్క్‌రమ్ 2-0-18-1, ప్రిన్స్ 4-0-39-0, రవి బిష్ణోయ్ 3-0-19-0.



14 ఏళ్ల 23 రోజుల వయసులో...

ఐపీఎల్ వేలం సమయంలోనే అందరి దృష్టినీ ఆకర్షించిన కుర్రాడు వైభవ్ సూర్యవంశీ ఎట్టకేలకు తన తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడాడు. లీగ్ బరిలోకి దిగిన అత్యంత పిన్న వయస్కుడిగా గుర్తింపు తెచ్చుకున్న వైభవ్ తన తొలి బంతికే సిక్స్ బాది సంచలన రీతిలో మొదలు పెట్టాడు. ఎక్స్‌ట్రా కవర్ దిశగా ఆ షాట్‌ను అద్భుతంగా ఆడిన అతని సాహసానికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. చెలరేగిపోతున్న దశలో అనూహ్యంగా స్టంపౌట్ కావడంతో వైభవ్ తట్టుకోలేకపోయినట్లున్నాడు. కన్నీళ్లతో అతను నిష్క్రమించాడు! బిహార్‌కు చెందిన ఈ ప్రతిభాశాలి ఇప్పటికే భారత అండర్-19 జట్టు తరఫున ఆడటంతో పాటు 5 రంజీ మ్యాచ్‌లలో కూడా బరిలోకి దిగాడు. వేలంలో వైభవ్‌ను రాజస్తాన్ రూ.1.10 కోట్లకు తీసుకుంది.



మ్యాచ్ గెలిచాక బట్లర్ విజయనాదం... నిరాశలో స్టార్క్

బట్లర్ జోష్... టైటాన్స్ ఖుష్...

గుజరాత్ సునాయాస విజయం

- 7 వికెట్లతో ఢిల్లీ ఓటమి
- రాణించిన సుదర్శన్, రూథర్‌ఫర్డ్

అహ్మదాబాద్: టి20ల్లో 200 పైచిలుకు లక్ష్యం ఎదురైతే ఏ జట్టయినా హడలెత్తాల్సిందే! భారీ స్కోరును ఛేదించాలంటే ఆఖరిదాకా జోరు కనబరచాలి. శనివారం ఐపీఎల్ మ్యాచ్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ జోస్ బట్లర్ (54 బంతుల్లో 97 నాటౌట్; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) కడదాకా ఇదే చేశాడు. దీంతో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీస్కోరు చేసింది. కెప్టెన్ అక్షర్ పటేల్ (32 బంతుల్లో 39; 1 ఫోర్, 2 సిక్స్‌లు), అశుతోష్ శర్మ (19 బంతుల్లో 37; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కరుణ్ నాయర్ (18 బంతుల్లో 31; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అనంతరం టైటాన్స్ 19.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసి గెలిచింది. బట్లర్ దంచేయగా, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (34 బంతుల్లో 43; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించాడు.

కలసికట్టుగా కొట్టేశారు!

ఢిల్లీ ఇన్నింగ్స్‌లో ఏ ఒక్కరు ఫిఫ్టీ కాదుకదా కనీసం 40 పరుగులైనా చేయలేదు. అయినా సరే జట్టు స్కోరు మాత్రం 200 పరుగులు దాటేసింది. కారణం ఓపెనర్ల నుంచి ఆరో వరుస బ్యాటర్ దాకా అందరిది బాదుడే... దంచుడే! కరుణ్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన అభిషేక్ పొరేల్ (9 బంతుల్లో 18; 3 ఫోర్లు, 1 సిక్స్) రెండో ఓవర్లోనే నిష్క్రమించాడు. ఇన్నింగ్స్‌కు అతడు వేసిన పునాదిని తర్వాత కరుణ్, రాహుల్ (14 బంతుల్లో 28; 4 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్, ట్రిస్టన్ స్టబ్స్ (21 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్), అశుతోష్‌లు తమ మెరుపులతో మరింత పటిష్టం చేశారు.

బట్లర్... తీన్‌మార్

ఈ మ్యాచ్‌లో గుజరాత్ గెలవాలంటే ప్రతి ఓవర్‌కు పదికి పైగానే పరుగులు చేయాలి. ఇలాంటి ఛేదనకు ఓపెనింగ్‌లో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (7) సరైన ఆరంభం ఇవ్వలేదు. కానీ తర్వాత వచ్చిన బట్లర్... క్రీజులో ఉన్న మరో ఓపెనర్ సాయి సుదర్శన్‌తో కలిసి అవసరమైన పరుగుల్ని పేర్చే పనిలో పడ్డాడు. ఇద్దరి వేగంగా ఆడి ఓవర్‌కు 10 పరుగుల చొప్పున రాబట్టారు. 8వ ఓవర్లో 74వ స్కోరు వద్ద కుల్దీప్ యాదవ్.. సుదర్శన్ వికెట్ తీశాడు. అక్కడితో 60 పరుగుల రెండో వికెట్‌కు తెర పడితే... మరో భారీ భాగస్వామ్యానికి బట్లర్‌తో రూథర్‌ఫర్డ్ బాటవేశాడు. బట్లర్ 32 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. 36 బంతుల్లో 66 పరుగుల సమీకరణం ఇరు జట్లను ఊరిస్తుండగా... స్టార్క్ వేసిన 15వ ఓవర్లో బట్లర్ 4, 4, 4, 4, 4, 0లతో 20 పరుగులు పిండుకున్నాడు. గత మ్యాచ్‌లో ‘సూపర్’గా బౌలింగ్ చేసి గెలిపించిన స్టార్క్ ఈ సారి ఒక్క ఓవర్లోనే ప్రత్యర్థికి విజయావకాశం కల్పించాడు. రూథర్‌ఫర్డ్ అవుటైనా రాహుల్ తెవాటియా(11 నాటౌట్) సిక్స్, ఫోర్‌తో ముగించాడు. సెంచరీ చేజారినా... బట్లర్‌లో విజయానందం కనిపించింది.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	7	5	2	10	0.984
ఢిల్లీ	7	5	2	10	0.589
పంజాబ్	7	5	2	10	0.308
లక్నో	8	5	3	10	0.088
బెంగళూరు	7	4	3	8	0.446
కోల్‌కతా	7	3	4	6	0.547
ముంబై	7	3	4	6	0.239
రాజస్తాన్	8	2	6	4	-0.633
హైదరాబాద్	7	2	5	4	-1.217
చెన్నై	7	2	5	4	-1.276

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X బెంగళూరు
వేదిక: ముల్లాన్‌పూర్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

ముంబై X చెన్నై
వేదిక: ముంబై
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పొరేల్ (సి) సిరాజ్ (బి) అర్షద్ ఖాన్ 18; కరుణ్ (సి) అర్షద్ (బి) ప్రసిధ్ 31; రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రసిధ్‌కృష్ణ 28; అక్షర్ (సి) బట్లర్ (బి) ప్రసిధ్ 39; స్టబ్స్ (సి) ప్రసిధ్ (బి) సిరాజ్ 31; అశుతోష్ శర్మ (సి) సబ్-మహిపాల్ (బి) సాయి కిషోర్ 37; విప్రాజ్ (సి) బట్లర్ (బి) ప్రసిధ్ 0; ఫెరీరా (సి) సాయికిషోర్ (బి) ఇషాంత్ 1; స్టార్క్ నాటౌట్ 2; కుల్దీప్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 203. **వికెట్ల పతనం**: 1-23, 2-58, 3-93, 4-146, 5-173, 6-173, 7-191, 8-199. **బౌలింగ్:** సిరాజ్ 4-0-47-1, అర్షద్ ఖాన్ 4-0-46-1, ప్రసిధ్ కృష్ణ 4-0-41-4, రషీద్‌ఖాన్ 4-0-38-0, ఇషాంత్ శర్మ 3-0-19-1, సాయి కిషోర్ 1-0-9-1.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) స్టబ్స్ (బి) కుల్దీప్ 36; శుబ్‌మన్ రనౌట్ 7; బట్లర్ నాటౌట్ 97; రూథర్‌ఫర్డ్ (సి) స్టార్క్ (బి) ముకేశ్ 43; తెవాటియా నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (19.2 ఓవర్లలో 3 వికెట్లకు)** 204. **వికెట్ల పతనం:** 1-14, 2-74, 3-193. **బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 3.2-0-49-0, ముకేశ్ 4-0-40-1, అక్షర్ 2-0-18-0, విప్రాజ్ 4-0-34-0, కుల్దీప్ 4-0-30-1, మోహిత్ శర్మ 2-0-28-0.

సాక్షి సినిమా

అది తెలిసిన రోజు సంగీతం మానేస్తాను

- ఇళయరాజా



పవన్ ప్రభ, ఆకాంక్ష, రూపేష్, ఇళయరాజా, రాజేంద్రప్రసాద్, కీరవాణి

‘‘నాకు ఎంత సంగీతం తెలుసన్నది ముఖ్యం కాదు... సంగీతమే నా గురించి తెలుసుకుంది. నాలోంచి సంగీతం ఎలా వస్తోందో తెలియదు. ఆ సంగతి తెలిసిన మరుక్షణం సంగీతం మానేస్తాను’’ అని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా అన్నారు. రూపేష్, ఆకాంక్షా సింగ్ జంటగా, రాజేంద్రప్రసాద్, అర్చన ముఖ్య తారలుగా నటించిన చిత్రం ‘షష్టిపూర్తి’. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేష్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్ర సంగీతదర్శకుడు ఇళయరాజా టీజర్ రిలీజ్ చేసిన అనంతరం మాట్లాడుతూ–‘‘షష్టిపూర్తి’ ద్వారా కొత్తవాళ్లు తొలి ప్రయత్నం చేశారు. వారిని ప్రోత్సహించాలని ఇక్కడకి వచ్చాను. ఈ సినిమాకి, పని చేసిన అందరికీ దేవుడు ఆశీస్సులు అందించాలి’’ అన్నారు. సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి మాట్లాడుతూ– ‘‘ఈ సినిమాలో ‘ఏదో ఏ జన్మలోదో ఈ పరిచయం ..’ అనే పాట రాశాను. ఇళయరాజాగారి సంగీతానికి పాడాలనుకున్నా ఆ అవకాశం రాలేదు. కానీ, ఆయన సంగీతానికి పాట రాసే అవకాశం వచ్చింది’’ అన్నారు. **రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ** – ‘‘ఇళయరాజా సంగీతం వల్లే ‘లేడీస్ టైలర్’ సినిమా హిట్టయింది. మళ్లీ ఇన్నేళ్లకు నా సినిమాకి ఆయన సంగీతాన్ని అందించడం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది’’ అన్నారు. ‘‘ఇంత గొప్పవారు మా సినిమాకి పని చేయడం సంతోషంగా ఉంది’’ అని పవన్ ప్రభ, రూపేష్ అన్నారు. కాగా ఇళయరాజాకి భారతరత్న ఇవ్వాలన్న ఆకాంక్షను పలువురు ఈ వేదికపై వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ రామ్, కళా దర్శకుడు తోట తరణి, గీత రచయిత చైతన్య ప్రసాద్ మాట్లాడారు.



అశోక్ వర్ధన్, కల్యాణ్ రామ్, విజయశాంతి, శ్రీకాంత్, ప్రదీప్ చిలుకూరి

చిత్ర పరిశ్రమని బతకనివ్వండి

- విజయశాంతి

‘‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’ సినిమాకి గొప్ప విజయాన్నిచ్చిన తెలుగు ప్రేక్షకులకు పాదాభివందనాలు. ఈ చిత్రాన్ని జనాలు బాగా ఆదరిస్తున్నా కొందరు డిస్టర్బ్ చేస్తున్నారు. దాన్ని పైశాచిక ఆనందం అంటారో ఇంకేం అంటారో చెప్పలేం. నిర్మాతలు కోట్లు ఖర్చు పెట్టి సినిమా తీస్తారు. దర్శకుడు, నటీనటులు, సాంకేతిక నిపుణులంతా ఎంతో శ్రమిస్తే ఓ సినిమా రూపొందుతుంది. అలాంటి మూవీపై నెగటివ్ ప్రచారం చేయడం సరికాదు. దయచేసి కొందరు మైండ్‌సెట్‌ని కాస్త మార్చుకోండి. చిత్ర పరిశ్రమని బతకనివ్వండి’’ అని నటి విజయశాంతి ఆగ్రహావేదన వ్యక్తం చేశారు. కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా విజయశాంతి, శ్రీకాంత్, పృథ్వీ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం (ఏప్రిల్ 18) విడుదలైంది. శనివారం నిర్వహించిన బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో **విజయశాంతి మాట్లాడుతూ**–‘‘ప్రతి సినిమా ఆడాలని మేం కోరుకుంటాం. మనస్ఫూర్తిగా సినిమాని దీవించడం నేర్చుకోండి. అంతేకానీ నాశనం చేయకండి. ఎన్ని అబద్ధాలు చెప్పినా చివరికి నిజమే గెలుస్తుంది... సినిమానే గెలుస్తుంది’’ అని పేర్కొన్నారు. ‘‘ఇంత మంచి సినిమా ఇచ్చినందుకు థ్యాంక్యూ అని డిస్ట్రిబ్యూటర్స్ చెబుతుంటే ఆనందంగా అనిపించింది’’ అని కల్యాణ్ రామ్ అన్నారు. ‘‘కల్యాణ్ రామ్, విజయశాంతిగార్ల నటన వల్లే ఈ సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది’’ అని అశోక్ వర్ధన్, ‘‘ప్రేక్షకులకు మా సినిమా చాలా బాగా నచ్చింది’’ అని ప్రదీప్ చిలుకూరి పేర్కొన్నారు. నటులు శ్రీకాంత్, పృథ్వీ రాజ్, స్టంట్ మాస్టర్ రామకృష్ణ, రచయిత రఘురాం మాట్లాడారు.

నమ్మకం బలాన్నిచ్చే విధంగా ఉండాలి

- దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ

‘‘సాధారణంగా ప్రతి సినిమా విషయంలో ఆ సినిమా ఫిల్మ్ మేకర్‌కి ఏదో ఒక అసంతృప్తి ఉంటుంది. కానీ నా కెరీర్‌లో నేను అతి తక్కువ అసంతృప్తితో తీసిన సినిమా ‘సారంగపాణి జాతకం’. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది’’ అని అన్నారు దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ. ప్రియదర్శి, రూపా కొడవాయూర్ జంటగా, ‘వెన్నెల’ కిశోర్, ‘వైవా’ హర్ష, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘సారంగ పాణి జాతకం’. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ఇంద్రగంటి మోహనకృష్ణ చెప్పిన సంగతులు...





- ‘యశోద’ మూవీ తర్వాత సినిమా చేద్దామని శివలెంక కృష్ణప్రసాద్‌గారు అన్నప్పుడు ‘సారంగపాణి జాతకం’ కథ చెబితే, ఆయనకు నచ్చింది. ప్రియదర్శి చేసిన ‘మెయిల్, బలగం’ సినిమాలు, ‘సేవ్ ది టైగర్స్’ సిరీస్ చూసి తనతో మంచి హ్యూమరస్ మూవీ చేయొచ్చనిపించింది. దర్శికి విషయం చెబితే, అంగీకరించాడు. ఈ సినిమాలో ప్రియదర్శి, ‘వెన్నెల’ కిశోర్ ఆటోమొబైల్స్ రంగంలో ఉద్యోగాలు చేస్తుంటారు. ఒకరు సేల్స్‌మేన్, మరొకరు సేల్స్ సర్వీసింగ్ కన్సల్టెంట్. వైవా హర్ష పాత్ర కూడా బాగుంటుంది.
- జాతకాలను నమ్మే పాత్రలో దర్శి నటించాడు. నేను జాతకాలను నమ్ముతానా? అంటే... నా జీవితంలో జ్యోతిష్కులు చెప్పినవి కొన్ని జరిగాయి... మరికొన్ని జరగలేదు. నా 32 యేళ్ల వయసులో దర్శకుడిగా నా తొలి చిత్రం వస్తుందని ఓ జ్యోతిష్కుడు చెప్పాడు. అది జరిగింది. 2016లో మే నుంచి ఆగస్టు మధ్యలో ఓ ప్రమాదం జరుగుతుందని మరో జ్యోతిష్కుడు 2015లోనే హెచ్చరించాడు. నిజంగానే 2016 జూలైలో పెద్ద యాక్సిడెంట్ జరిగింది. అలానే జ్యోతిష్కులు చెప్పినవాటిలో జరగనవీ ఉన్నాయి.
- ఈ సినిమాలో నేను జాతకాన్ని ప్రశ్నించలేదు. ఏ నమ్మకాన్ని అయినా మీరు నమ్ముకోవచ్చు. అది దేవుడు కావొచ్చు.. వాస్తు కావొచ్చు. జాతకం కావొచ్చు. కానీ మామూలు నమ్మకం ఓ మనిషిని బలవంతుడ్ని చేస్తే, మూఢనమ్మకం బలహీనుడిని చేస్తుంది. అప్పుడు మనిషి తన జీవితంతో పాటు తన చుట్టూ ఉన్నవారి జీవితాలనూ అస్తవ్యస్తం చేస్తాడు. అప్పుడు ఎంత గందరగోళం ఏర్పడుతుందనే విషయాన్ని ఈ సినిమాలో హాస్యాస్పదంగా చూపించాం. నమ్మకం మనకు బలాన్నిచ్చే విధంగా ఉండాలి కానీ పిచ్చోడ్ని చేయకూడదు? ఈ సినిమాతో ఇదే చెప్పాలనుకున్నాను.
- ఇక ఓటీటీల్లో సినిమాలు వెంటనే రిలీజ్ కాకుండా దర్శక-నిర్మాతలు-హీరోలు మాట్లాడుకోవాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఆడియన్స్‌ను థియేటర్స్ తీసుకురావడం మరింత కష్టమైపోతుంది. అలా అని ఆడియన్స్ థియేటర్స్‌కు రావడం లేదని కాదు. మార్చి 14న పదో తరగతి ఎగ్జామ్స్ టైమ్‌లో ‘కోర్ట్’ సినిమాను విడుదల చేస్తే బ్లాక్‌బస్టర్ అయ్యింది. ఎమోషనల్ ఎక్స్‌పీరియన్స్‌ని కోరుకుంటున్నారు.
- వాల్మీకీ రామాయణం ఆధారంగా యాక్షన్ అడ్వెంచరస్ మూవీగా ‘జటాయు’ కథ ఉంది. భవిష్యత్‌లో ఈ కథతో సినిమా చేస్తాను.

అబ్బాయిలైతే భరించలేరు

- జాన్వీ కపూర్


‘‘నెలసరి సమయంలో మహిళలు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు.. ఆ బాధ ఎలా ఉంటుందో అనుభవించేవారికి మాత్రమే తెలుస్తుంది. ఆ టైమ్‌లో వారు పడే బాధని ఎవరూ పడలేరు. ఈ స్థితిని అబ్బాయిలు ఒక్క నిమిషం కూడా భరించలేరని కచ్చితంగా చెప్పగలను. ఒకవేళ పురుషులకు నెలసరి వస్తే ఆ నొప్పికి అణు యుద్ధాలే జరిగేవేమో!’’ అని జాన్వీ కపూర్ పేర్కొన్నారు. నెలసరి గురించి ఇటీవల హీరోయిన్ సమంత మాట్లాడిన సంగతి తెలిసిందే. తాజాగా జాన్వీ కపూర్ కూడా పీరియడ్స్‌పై మాట్లాడారు. ‘‘మహిళల నెలసరి బాధను చాలామంది పురుషులు చిన్న విషయం అన్నట్లు చులకనగా చూస్తారు. నాకు నెలసరి సమయంలో విపరీతమైన మూడ్ స్వింగ్స్ వస్తాయి. నా మాట తీరు, చిరాకుని బట్టి నేను పీరియడ్స్‌లో ఉన్నానని ఎదుటి వారికి అర్థమైపోతుంది. నీకు ఇది ఆ సమయమా అని అడుగుతారు. అయితే ఒక్కోసారి వారు అడిగే విధానం బాధ కలిగిస్తుంది. కొందరు వ్యంగంగా మాట్లాడతారు. అయితే అర్థం చేసుకున్నవాళ్లు ‘వెళ్లి విశ్రాంతి తీసుకోండి’ అనడం హ్యాపీగా అనిపిస్తుంది’’ అని చెప్పారు జాన్వీ కపూర్.

ఓటీటీ ఇది చూడొచ్చు

జీవితాన్ని చూపించే కోర్ట్

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తెలుగు చిత్రం కోర్ట్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఏదైనా ప్రమాదం ఎవరికైనా జరిగినపుడే మనకు దాని తాలూకు లోతు తెలుస్తుంది. మనకు అటువంటి ప్రమాదం జరగనంతవరకూ మనం ఆ ప్రమాదానికి ప్రేక్షకులం మాత్రమే. కానీ నిజంగా మనకు ఏదైనా సమస్య వస్తే దాన్ని ఎదిరించి ఎలా పోరాడాలి? అని చూపించిందే ఈ ‘కోర్ట్’ సినిమా. జీవితంలో ఎవ్వరూ రెండు ప్రాంతాలకు వెళ్లకూడదని ప్రార్థిస్తారు. అందులో ఒకటి ఆసుపత్రి అయితే మరోటి కోర్ట్. అందరికీ కోర్ట్ వివాదాలుండవు. వచ్చినవారికి మాత్రమే తెలుస్తుంది కోర్ట్ కష్టం. ముఖ్యంగా మన భారతదేశంలోని కోర్టుల్లో పరిష్కారం కాని కేసులు ఇప్పటికైతే ఒక్క సుప్రీం కోర్టులోనే ఎనభై వేలకుపైనే పెండింగ్లో ఉన్నాయి. ఈ నంబరు చూసి మనం అవునా అని నామమాత్రంగా అనుకుంటాం. కానీ ఎనభై వేలకుపైగా అభాగ్యులు తమకు జరగాల్సిన న్యాయం కోసం ఏళ్లకు ఏళ్లు ఎదురుచూస్తున్నారన్న విషయం మనం అర్థం చేసుకోవాలి. ఇదే విషయాన్ని ‘కోర్ట్’ సినిమాలో ఓ లాయర్ న్యాయదేవత సమక్షంలో చెప్తాడు. అవడానికి ఇది చిన్న సినిమా అయినా పెద్ద సంచలనమే సృష్టించింది. అంతలా ఏముందీ సినిమాలో... చంద్రశేఖర్ అనే నిరుపేద కుటుంబంలోని యువకుడిని భూస్వామి అయిన మంగపతి అన్న కూతురు జాబిలి ప్రేమిస్తుంది. మంగపతి పరువు కోసం కుటుంబ సభ్యులను కూడా చూడని వ్యక్తిత్వం కలవాడు. జాబిలి విషయం తెలుసుకున్న మంగపతి తప్పు చంద్రశేఖర్‌ది కాకపోయినా కోర్టులో కేసు వేస్తాడు. అది కూడా అడ్డమైన సెక్షన్లు పెట్టి... అందులోనూ తీవ్రమైన పోక్సో కేసు కూడా చంద్రశేఖర్‌పై బనాయిస్తాడు. చంద్రశేఖర్ కేసును మోహన్ రావు దగ్గర అసిస్టెంట్‌గా పని చేస్తున్న అనుభవం లేని సూర్యతేజ వాదిస్తాడు. సూర్యతేజ కోర్ట్ కేసు గెలుస్తాడా? లేదా అన్నదే మిగతా ‘కోర్ట్’ సినిమా. ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకుడిని కట్టి పడేస్తుందనే చెప్పాలి. ఈ సినిమాలో సూర్యతేజ పాత్రలో ప్రియదర్శి ఒదిగిపోయారని చెప్పాలి. అలాగే లాయర్‌గా ప్రముఖ నటుడు సాయికుమార్ జీవించారు. వీరిద్దరితో పాటు ప్రతినాయకుడి పాత్రలో మంగపతిగా శివాజీ ప్రేక్షకులను మైమరిపించేలా నటించారు. చంద్రశేఖర్ పాత్రలో హర్ష్ రోషన్, అతని ప్రేయసి జాబిలిగా శ్రీదేవి... ఇద్దరూ భేష్ అనిపించుకున్నారు. ఈ కథ రాసి, తనే దర్శకత్వం వహించారు రామ్ జగదీశ్. ప్రముఖ నటుడు నాని సమర్పణలో ‘కోర్ట్’ సినిమా ఓ మణి మాణిక్యమనే చెప్పాలి. ఆఖరుగా ఒక్క మాట, ‘కోర్ట్’ చూసే ప్రేక్షకులకు సినిమా అయితే చూసినట్టుండదు. ఓ జీవితాన్ని తమ కళ్లతో చూసిన అనుభూతి కలుగుతుంది. అలాగే కోర్టు కేసులపైన కాసింత అవగాహన కలుగుతుంది. స్టేట్ వర్సెస్ నోబడీ ట్యాగ్ లైన్‌తో ఉన్న ఈ సినిమా చూడాల్సింది ఎవ్రీబడీ.. నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. వర్త్ ఫుల్ ఫర్ వీకెండ్ మూవీ.



– ఇంటూరు హరికృష్ణ

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



నిద్ర సుఖమెరగదు..

రిక్షా తొక్కి తొక్కి అలసిన శరీరం కాసింత చెట్టు నీడ దొరకగానే ఇలా నిద్రలోకి జారుకుంది. శనివారం మధ్యాహ్నం ఓ రిక్షా కార్మికుడు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం పక్కనే ఉన్న ఓ చెట్టు నీడన సేద తీరుతుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



రహదారులు వెలవెల..

రోజురోజుకూ భానుడు ఉగ్రరూపం చూపిస్తున్నాడు. ఉదయం పది గంటలు దాటితే రోడ్డు పైకి రావాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి. మండే ఎండల కారణంగా శనివారం మధ్యాహ్నం అనంతపురంలోని టవర్ క్లాక్ ఫ్లైఓవర్ జనసంచారం పెద్దగా లేకుండా ఇలా కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మండు వేసవిలోనూ నిండు కుండలా..

సాధారణంగా ఎండాకాలం వస్తే డ్యాములు, చెరువులు, గుంటలు నీరులేక వెలవెలబోతుంటాయి. అయితే తిరుమలలోని గోగర్భం డ్యాం మాత్రం మండువేసవిలోనూ నిండు కుండను తలపిస్తోంది. శేషాచలం కొండల్లో అకాల వర్షాల కారణంగా గోగర్భం డ్యాంలో ఇలా జలకళ ఉట్టిపడుతోంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

క్లుప్తంగా...

మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

సీఎంకు అంగన్‌వాడీ యూనియన్ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 6,830 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దీంతో పాటు పలు డిమాండ్లు పరిష్కరించాలని సీఎం చంద్రబాబుకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ రాసిన లేఖను శనివారం మీడియాకు విడుదల చేశారు. బాల సంజీవిని యాప్‌లో మార్పులు చేయాలని, వర్కర్లు, హెల్పర్లకు మేలో వేసవి సెలవులు ఇవ్వాలని సీఎంను కోరారు.

ఎస్జీటీలకే 'పీఎస్ హెచ్‌ఎం' పోస్టు ఇవ్వాలి

ఏపీటీఎఫ్ అమరావతి డిమాండ్

సాక్షి, అమరావతి: సంస్కరణల్లో భాగంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలకు కొత్తగా ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ (పీఎస్ హెచ్‌ఎం) మంజూరైతే, ఆ ఖాళీలను ఎస్జీటీలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మిగులు పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేసేందుకు సంఘాలతో చర్చించాలని, ప్రతి పాఠశాలలోను తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టి స్టాఫ్ ప్యాటర్న్ నిర్ణయించాలని పేర్కొన్నారు.

టీచర్ల కేటాయింపు ఒకే రకంగా ఉండాలి

కాగా, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల కేటాయింపులో సమానత్వం ఉండాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసులు, టీ చందనరావు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక పాఠశాలలకు ఒకే తరహా విధానాలు అమలు చేయాలన్నారు.

వేసవి రద్దీతో వీఐపీ సిఫారసు లేఖలకు బ్రేక్

సిఫారసు లేఖలతో వచ్చి వెనుదిరుగుతున్న భక్తులు

తిరుమల: వేసవి సెలవులు మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుండటం, భక్తుల రద్దీ తిరుమలకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ప్రభుత్వ విభాగాల సిఫారసు లేఖలను టీటీడీ స్వీకరించడం లేదు. అయితే దీనిపై టీటీడీ స్పష్టత ఇవ్వకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి తిరుమలకు చేరుకున్న భక్తులు సిఫారసు లేఖలు స్వీకరించడం లేదని తెలుసుకుని వెనుదిరుగుతున్నారు. అయితే సాధారణంగా ప్రతి సంవత్సరం టీటీడీ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 15 నుంచి మూడు నెలల పాటు సిఫారసు లేఖలను స్వీకరించదు. స్వయంగా వచ్చే వీఐపీ ప్రొటోకాల్ పరిధిలోని భక్తులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనాలను కల్పిస్తారు. అయితే ఈనెల 15 నుంచి చాలావరకు సిఫారసు లేఖలను టీటీడీ స్వీకరించడం లేదు. దీనిపై అధికారిక సమాచారాన్ని విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు.

వ్యవసాయంలో నూతన సాంకేతికతను అందిపుచ్చుకున్నాం

వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు

సాక్షి, అమరావతి : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) అమలులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు అన్నారు. ఈ సాంకేతికతను 2023–24లో ప్రవేశపెట్టగా, దాని ఫలితాలు ప్రస్తుతం వస్తున్నాయని చెప్పారు. పీఎంఎఫ్‌బీవై అమలుపై కేంద్ర వ్యవసాయ, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేరళ రాజధాని తిరువనంతపురంలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సమీక్షా సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ సమావేశాల్లో ఏపీ తరఫున పాల్గొన్న వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, దిగుబడి అంచనాల్లో ఖచ్చితత్వం కోసం వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతను ఆంధ్రప్రదేశ్ అందిపుచ్చుకుందన్నారు. దిగుబడి అంచనాల కోసం యస్‌టెక్ సాంకేతికతను, వాతావరణ ఆధారిత బీమా అంచనాల కోసం విండ్స్ సాంకేతికతను అందిపుచ్చుకున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు.

కాటమరాజుకే శఠగోపం

- మాన్యం కాజేసి.. పరిహారం నొక్కేసిన టీడీపీ నాయకుడు
- వెలుగొండ ఆర్‌ఆర్ ప్యాకేజీలో కాటమరాజు ఆలయాలు
- నిర్వాసితులు కానప్పటికీ బినామీ పేర్లతో నిధులు స్వాహా
- టీడీపీ నేత స్వార్థానికి రూ.1.62 కోట్లు నష్టపోయిన స్వామి
- దర్యాప్తు జరపాలంటూ స్పెషల్ కలెక్టర్‌కు ఆలయ పూజారి వినతి

ముంపు భూములు కానప్పటికీ అధికారులతో కుమ్మక్కయ్యారు. దేవుడి సొత్తుకే ఎసరు తెచ్చారు. వచ్చిన సొమ్మును జేబులో వేసుకున్నారు.. కాటమరాజుకే శఠగోపం పెట్టారు. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలంలో టీడీపీ నాయకుడి అవినీతి ఇది. వేసూతల కాటంరాజు ఆలయ భూములను వెలుగొండ ప్రాజెక్టు ముంపులో ఉన్నట్లు చూపించి బినామీ పేర్లతో రూ.1.60 కోట్లు కాజేశాడు. పెద్దారవీడు మండలం గుండంచెర్ల గ్రామానికి సమీపంలో కాటంరాజు స్వామి, గంగాభవానీ ఆలయాలు సర్వే నంబర్లు 629, 630లలోని 7.39 ఎకరాల్లో వందల సంవత్సరాల కిందటి నుంచి ఉన్నాయి. ఇవి వెలిగొండ ప్రాజెక్టు మునక ప్రాంతంలో లేకున్నా గుండంచెర్ల గ్రామ టీడీపీ నాయకుడు ముంపు భూముల కింద చూపి ఆర్‌ఆర్ ప్యాకేజీ పొందారన్న ఆరోపణలున్నాయి.

– యర్రగొండపాలెం



మరో 50 ఎకరాలకూ ఎసరు

దేవుడి మాన్యం ఒకవేళ ముంపులో ఉంటే ఆర్‌ఆర్ చట్టం కింద పరిహారం నిధులు దేవదాయ శాఖకు చెందాల్సి ఉంటుంది. కాగా, టీడీపీ నాయకుడు దేవుని మాన్యం మరో 50 ఎకరాల భూములను కూడా బినామీ పేర్లతో ఆర్‌ఆర్ ప్యాకేజీలో చేర్చి జేబులు నింపుకొన్నారు. తమ ప్రాంతం వారు కానప్పటికీ అర్ధవీడు మండలం మావుటూరు తండాకు చెందిన 13 మంది పేర్లను ప్యాకేజీలో చేర్చి ఒక్కొక్కరికి రూ.12.50 లక్షల ప్రకారం ప్రభుత్వం నుంచి ఇప్పించాడు. ఈయనతో పాటు మరికొందరు.. ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల ప్రకారం రూ.65 లక్షలు తీసుకున్నారు. వీరిలో జిల్లా భూ సేకరణ, రెవెన్యూ అధికారుల హస్తం ఉందని, ఈ అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. అక్రమాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని స్పెషల్ కలెక్టర్‌కు కాటంరాజు ఆలయ పూజారి వినతిపత్రం ఇచ్చారు.

స్వామి భూముల రికార్డులు తారుమారు



వేసూతల కాటమరాజు స్వామికి సంబంధించిన భూముల రికార్డులు తారుమారు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి. సర్వే నంబరు 630లో 2.69 ఎకరాలు, సర్వే నంబర్ 629లో 4.70 ఎకరాలు ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులో స్వామి పేరు ఉన్నాయి. 2016లో కలనూతల రెవెన్యూ పరిధిలో స్వామి, అమ్మవార్ల భూములను కాటమరాజు తండాకు చెందిన దేశావత్ ఆదెమ్మ, బిలావత్ బుజ్జమ్మల పేరు మీద రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేశారు. మామూళ్లకు ఆశపడి రెవెన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేశారు. గత ప్రభుత్వం దేవాలయానికి నిత్యం పూజలు జరిగే విధంగా, ప్రాజెక్టు మునకలో పోకుండా చర్యలు తీసుకుంది.
– పాముల రుషికేశవ, ఆలయాల పూజారి

వాస్తవ లబ్ధిదారులకు నష్టపరిహారం చెందాలి



వెలిగొండ ప్రాజెక్ట్ మునక ప్రాంతాల్లో ఉన్న వాస్తవ లబ్ధిదారులకు నష్టపరిహారం చెందేలా చర్యలు తీసుకోవాలి. కాటమరాజు, గంగా భవాని అమ్మవార్ల ఆలయాలతో పాటు భూములను కూడా బినామీ పేర్లతో ఆర్‌ఆర్ ప్యాకేజీ పొందారు. బినామీల స్థానంలో గుండంచెర్ల గ్రామంలోని ఉన్న 12 మంది చెంచులను అర్హులుగా చేర్చి నష్ట పరిహారం వారికి అందేలా చర్యలు తీసుకోవాలి. కన్నూతల గ్రామంలో ఉన్న 50 మంది చెంచులకు కూడా సాయం అందించాలి. బినామీ పేర్లతో ప్రభుత్వ నిధులను స్వాహా చేసిన టీడీపీ నాయకులు, రెవెన్యూ, భూ సేకరణ అధికారులపై చర్యలు తీసుకోవాలి. స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో గత నెల 28వ తేదీ అర్జీ ఇచ్చినా చర్యలు తీసుకోలేదు.
– గాలి వెంకటరామిరెడ్డి, కార్యదర్శి, వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల సంఘం

ఇల్లు కట్టి చూడు..!



- పెరిగిన సిమెంట్, ఇనుము ధరలు
- అదే స్థాయిలో కలప రేట్లు
- సాధారణ ప్రజలకు భారమైన ఇంటి నిర్మాణం

రాజాం: ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం పెరిగాయి. సామాన్యులకు ఇంటి నిర్మాణం భారంగా మారింది. అందుకే... ఏ నోట విన్నా 'ఇల్లు కట్టి చూడు..' అన్న మాటే వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అదే కోవలో ఇప్పుడు సిమెంట్, ఇనుము ధరలు పైపైకి వెళ్తున్నాయి. వీటిని చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల ప్రస్తుత పరిస్థితుల్లో కలగానే మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

ఆరు నెలల వ్యవధిలో రెండు పర్యాయాలు

గత ఏడాది అక్టోబర్ నెలలో సిమెంట్ ధర పెరిగింది. అప్పట్లో 50 కిలోల సిమెంట్ బస్తా రూ.250 నుంచి రూ.300లకు పెరిగింది. కొద్ది రోజుల్లోనే రూ.300ల నుంచి రూ.340కి, అనంతరం రూ.370లకు పెరిగింది. ఇందులో పీపీసీ, ఓపీసీల ఆధారంగా ధరలు పెరిగాయి. గ్రేడ్ ఆధారంగా ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.70 పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసే ఇంటిని నిర్మించుకోవాలంటే సగటున 300 నుంచి 400 బస్తాల సిమెంట్ ఉండాలి. బస్తాకు ప్రస్తుతం రూ.50లు అదనంగా ధర పెరగడంతో రూ.15వేలు నుంచి రూ.20వేలు వరకు డబ్బులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. కేవలం సిమెంట్ కోసం సగటున రూ.1,40,000 వరకు వెచ్చించాల్సిన పరిస్థితి. ఆరు నెలల వ్యవధిలో రెండు పర్యాయాలు సిమెంట్ ధర పెరగడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇనుము ధర సైతం..

గతంలో టన్ను ఇనుము ధర రూ.52 వేలు ఉండేది. ఆరునెలల కిందట రూ.2 వేలు పెరిగి టన్ను ధర రూ. 54 వేలకు వచ్చింది. ఇప్పుడు ఆ ధర రూ.62వేలకు చేరింది. ఒకేసారి టన్ను ధర రూ.8 వేలు పెరగడంతో సామాన్యులు సతమతమవుతున్నారు.

చిన్న ఇల్లు నిర్మాణానికి ఒకటిన్నర టన్నుల వరకు ఐరన్ అవసరం ఉంటుందని, పెరిగిన ధరల నేపథ్యంలో ముడిసరుకు కొనుగోలుకే ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడి పెడితే కూలీలు, ఇటుకలు ఖర్చులు ఇంకా భారంగా మారుతాయని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఇంటి బిల్లుల మంజూరులో జాప్యం చేస్తోందని, పెరిగిన ధరలు చూస్తుంటే భయం వేస్తోందని ఇళ్లలబ్ధిదారులు వాపోతున్నారు.

ధరలు చూస్తే భయం వేస్తోంది

గతంలో ఇంటి నిర్మాణ ముడిసరుకు సాదాసీదాగా లభించేది. ధరలు కంట్రోల్‌లో ఉండేవి. ప్రస్తుతం ధరలు అమాంతం పెరిగాయి. సిమెంట్, ఇనుము ధర పెరగడంతో ఇంటి నిర్మాణాలు చేయాలంటే భయం వేస్తోంది.
– కర్నాయిన వెంకటరమణ, రాజాం

కాంట్రాక్టు పనులు చేయాలంటే కష్టమే

ప్రభుత్వం కాంట్రాక్టు వర్క్‌లకు సిమెంట్ బస్తా ధర రూ.250లు చెల్లిస్తోంది. బయట మార్కెట్‌లో సిమెంట్ ధర అమాంతంగా పెరిగింది. ఇప్పటికే చాలా నష్టానికి పనులు చేస్తున్నాం. ఇప్పుడు పెరిగిన ధరలతో కాంట్రాక్టు చేయడం కష్టమే.
– ఎల్.రామినాయుడు, కాంట్రాక్టర్, రాజాం

హోటల్ ఫుడ్.. రోగం ఫ్రీ



నెల్లూరు (బారకాసు): జిశ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పెద్ద హోటళ్లు వందకు పైగా ఉన్నాయి. చిన్న చిన్నవి మరో 200కు పైనే ఉంటాయి. వీధుల్లో అమ్ముతున్న ఆహార బండ్లకు లెక్కే లేదు. ఇక్కడ వాడే నూనెలు, కూరల్లో వేసే రంగులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ప్రధానంగా మాంసం, చికెన్, చేపలు, రొయ్యలు వంటి పదార్థాలు నాలుగైదు రోజులైనా నిల్వ ఉంచి వినియోగదారులకు పెడుతున్నారు. హోటల్ ఫుడ్ తింటే.. రోగం ఫ్రీ అన్నట్లుగా పరిస్థితి ఉంది. చాలా హోటళ్లు, టిఫిన్ సెంటర్లకు లైసెన్స్‌లు లేకపోవడం గమనార్హం.

కేసులు, జరిమానాలు.. అయినా మార్పేది?

జిల్లాలోని నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్న హోటల్స్‌పై ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేసి వ్యాపారస్తులపై కేసులు నమోదు చేశారు. అందులో నగరంలోని ఓ హోటల్లో తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు లేకుండా వినియోగదారుడికి ఐస్‌క్రీం అందిస్తున్నట్లు గుర్తించి రూ.10 వేలు జరిమానా విధించారు. ఆత్మకూరులో ఓ రెస్టారెంట్‌లోని వంట గదిలో ఏ విధమైన తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు లేని నూడిల్స్ విక్రయిస్తుండగా రూ.10 వేలు, పలు రకాలైన బ్రాండ్లతో గోలీసోడాలు తయారు చేస్తూ ఏ విధమైన తేదీలు, బ్యాచ్ నంబర్లు లేకుండా ప్రజలకు విక్రయిస్తున్న నాలుగు గోలీసోడా యూనిట్ల యజమానులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, నగరంలోని మాగుంటలే అవుట్‌లో కాంఫెక్షనరీ షాపులో సబ్‌స్టాండర్డ్ కోకోనట్ మిల్క్‌ను విక్రయిస్తున్నందుకు రూ.25 వేలు, స్టోన్‌హౌస్ పేటలో నాణ్యతలేని సబ్ స్టాండర్డ్ కారంపొడి విక్రయిస్తున్న షాపు యజమాని, తయారీదారుడికి రూ.10 వేలు, వంట నూనె లూజుగా విక్రయిస్తున్న 3 షాపుల యజమానులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున జరిమానా విధించారు.

12 శాంపిళ్లు అనారోగ్యంగా గుర్తింపు

గడిచిన ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు పలు హోటల్స్‌లో తనిఖీ చేపట్టి మొత్తం 290 శాంపిల్స్‌ను సేకరించారు. వీటిని ల్యాబ్‌కు పంపించగా 12 శాంపిల్స్ ఆరోగ్యానికి హానికరమని, అలాగే 22 నాణ్యత లేని ఆహారంగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.

➡ నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఓ చిన్న రెస్టారెంట్‌కు లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఇటీవల కుటుంబంతో కలిసి వెళ్లి భోజనం చేశారు. ఇంటికొచ్చిన గంటన్నరకే కడుపులో వికారం. కొద్ది సేపటికే వాంతులు, విరేచనాలు. దీంతో ఆస్పత్రికి పరుగు తీయగా, ఫుడ్ పాయిజనింగ్ అని డాక్టర్ తేల్చి చెప్పారు.

➡ నగరానికి చెందిన మురళి కావలిలోని మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ నాన్‌వెజ్ రెస్టారెంట్‌కు వెళ్లాడు. చికెన్ తిన్న అతనికి నాలుగు గంటల తర్వాత తీవ్ర కడుపు నొప్పి వచ్చింది. వెంటనే నెల్లూరులోని పొగతోటలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకంటే కానీ పరిస్థితి కుదుట పడలేదు.

➡ ఇటీవల ఓ వ్యక్తి అల్పాహారం తినేందుకు నగరంలోని ప్రముఖ హోటల్‌కు వెళ్లి ఇడ్లీ ఆర్డర్ చేశాడు. ఆ ప్లేటులో బొద్దింక ఉండడాన్ని కస్టమర్ గుర్తించి సర్వ్ చేసిన వ్యక్తితోపాటు హోటల్ నిర్వాహకుడిని ప్రశ్నించినా పట్టించుకోకపోవడంతో అతను ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం విదితమే.

ఆధ్యాత్మిక సమాచారం



శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 48,519 మంది స్వామిని దర్శించుకున్నారు. 30,360 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.27 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది.

కల్యాణం.. కమనీయం

రాపూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి తరలించి విశేషంగా అలంకరించారు. తదుపరి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని శోస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరుచ్చిపై కొలువుదీర్చి ఊంజల్ సేవ చేశారు.



పెంచలకోనలో స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

విద్యా సమాచారం



22న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో సుమారు 15 ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 95338 89902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సంస్కృతం..గర్వకారణం

తిరుపతి సిటీ: సంస్కృత భాష దేశానికి గర్వకారణమని ఎస్పీ విష్ణువర్ధన్‌రాజు కొనియాడారు. జాతీయ సంస్కృత వర్సిటీ, సంస్కృత భారతి సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో రెండు రోజుల పాటు జరిగే స్ఫూర్తి సంఘం కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యం కలిగిన సంస్కృత భాషను సమాజంలోని అన్నివర్గాల వారికి అందించే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సంస్కృత భారతి అఖిల భారతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ గోపబంధు మిశ్రా మాట్లాడారు. దేశంలో ప్రతి ఒక్కరికీ సంస్కృతాన్ని చేర్చాలనే లక్ష్యంతో సంస్కృత భారతి పనిచేస్తోందన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అఖిల భారతీయ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ బట్, డాక్టర్ ఎంజీ నందన్‌రావు, డాక్టర్ ఎస్ఎల్ సీతారామ శర్మ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ, వీసీ, అతిథులు

తునికాకు సీజన్ షురూ..

తాజా వర్షాలతో పెరగనున్న ఆకు


కల్లంలో ఎండబెట్టిన చెట్టుపల్లి తునికాకు

- తెలంగాణలో ఇల్లెందు ఏరియాలోనే ధర ఒప్పందం
- 50 ఆకుల కట్టకు రూ.3.31గా ధర నిర్ణయం
- వేసవి పంటగా గిరిజనులకు ఆదాయం

ఇల్లెందు: పోడు సాగుదారులు యాసంగి పంటల అనంతరం పంట వ్యర్థాలను తగులబెట్టారు. దీనికి తోడు ఇటీవల అకాల వర్షాలు కురిశాయి. దీంతో తునికాకు ఏపుగా పెరిగింది. గిరిజనులు మూడో పంటగా భావించే తునికాకు సేకరణ మొదలైంది. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ ఏడాది నాలుగు వారాల ముందే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం చెట్టుపల్లిలో తునికాకు సేకరణ మొదలు కావడం విశేషం. ఈసారి తునికాకు ధరపై ఒప్పందం కూడా కుదిరింది. వేసవి పంటగా భావించే తునికాకు సేకరణ ద్వారా ఆదివాసీ, గిరిజనులకు ఆదాయం సమకూరుతుంది.

గతంలో పండుగ..

పాతికేళ్ల క్రితం తునికాకు సేకరణ పల్లెల్లో పండుగలా జరిగేది. అయితే, పోడు సాగు పెరగడం, అటవీ భూములను ట్రాక్టర్ల ద్వారా దున్నడంతో వేళ్లతో సహా చెట్లను పెకిలించివేశారు. తద్వారా ఆకు సేకరణ క్షీణించింది. నెలల పాటు సాగే ఈ ప్రక్రియ ఇప్పుడు పక్షం రోజులకు మించి జరగడం లేదు. ఇక ధర పెంపునకు ఉద్యమాలు, చర్చలు, ఒప్పందాలు సాగేవి. ఒకరు ఒప్పందం కుదుర్చుకుంటే.. మరొకరు తిరస్కరించటం.. మళ్లీ చర్చలకు పట్టుబట్టడం సాధారణంగా ఉండేది. అయితే, మావోయిస్టులు, ఇతర అజ్ఞాత సంఘాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యూనిట్ల వారీగా వివరాలు		
డివిజన్	యూనిట్లు	సేకరణ లక్ష్యం (స్టాండర్డ్ బ్యాగ్‌లు)
ఇల్లెందు	08	10,600
భద్రాచలం	05	9,700
మణుగూరు	05	5.400
కొత్తగూడెం	04	3,900
కిన్నెరసాని వైల్డ్‌లైఫ్	05	3,200
పాల్వంచ	04	2,300

తగ్గిపోయినందున.. లీగల్ పార్టీలన్నీ కలిసికట్టుగా ఒప్పందాలు చేస్తున్నాయి. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం చెట్టుపల్లిలో జరిగిన సమావేశంలో ఒప్పందం జరగగా.. తొలిసారి ఇక్కడే ఆకు సేకరణ మొదలైంది.

వరంలా మారిన వర్షం

ఈనెల మొదటి వారం నుంచి అడపాదడపా అకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గతంతో పోలిస్తే ఈ దఫా ఆకు ముందే ఏపుగా పెరిగింది. ఈ నేపథ్యాన గుండాల మండలం చెట్టుపల్లిలో తునికాకు సేకరణ మొదలుపెట్టగా.. మిగతా ప్రాంతాల్లోనూ ప్రారంభం కానుంది. వచ్చే నెలాఖరు వరకు సేకరణ ఉంటుంది.


ఆకు సేకరిస్తున్న ఆదివాసీలు (ఫైల్)

భద్రాద్రి జిల్లాలో..

మొక్కలు తగ్గిపోవడంతో అటవీ శాఖ టెండర్లు పిలుస్తున్నా.. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ డివిజన్లలో 31 యూనిట్లకు పలుమార్లు టెండర్లు నిర్వహించగా 26 యూనిట్లకే ఖరారైంది. ఇందులో 12 యూనిట్లకు సంబంధించి ధర ఖరారైంది. ఇక ఖమ్మం అటవీ డివిజన్లలో ఎనిమిది యూనిట్లకు 6 వేల స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ జరిగేది. కానీ మూడేళ్లుగా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

ఏటా పెరుగుతున్న ధర

ప్రస్తుత సీజన్‌లో కాంట్రాక్టర్లు, తునికాకు పోరాట కమిటీ నడుమ ఈనెల 5న గుండాల మండలం చెట్టుపల్లిలో చర్చలు జరిగాయి. గత ఏడాది 50 ఆకుల కట్ట ధర రూ.3.01 ఉండగా.. ఈసారి రూ.3.31గా నిర్ణయించారు. దీంతో గిరిజనులకు ఆదాయం పెరగనుంది. కాగా, పెరిగిన ధర 12 యూనిట్లకే పరిమితం కానుంది. ఈ యూనిట్లలోనే ఆకు నాణ్యతగా ఉండటంతో.. ధర పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. చెట్టుపల్లిలో జరిగిన చర్చల్లో గుండాల, సాయనపల్లి, నీలాద్రిపేట, గంగారం, కంబాలపల్లి, కాచనపల్లి, సుదిమళ్ల, ధనియాలపాడు, కొమరారం, శెట్టిపల్లి, యానంబైల్, పాల్వంచ వైల్డ్‌లైఫ్ యూనిట్లపై ఒప్పందం కుదిరింది.

సద్వినియోగం చేసుకోవాలి..

పది నుంచి పదిహేను రోజులకే తునికాకు సేకరణ పరిమితమవుతోంది. ఈ విషయాన్ని గుర్తించి ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ దఫా 50 ఆకుల కట్ట ధర రూ.3.31గా నిర్ణయమైంది. ఇతర యూనిట్లలోనూ ధర పెంపునకు కృషి చేయాలి.

– కొడెం వెంకటేశ్వర్లు, తుడుందెబ్బ నాయకుడు, గుండాల



వేసవి పంటగా..

ఆదివాసీలు తునికాకు సేకరణను వేసవి పంటగా భావిస్తున్నారు. ధర ఒప్పందం కుదిరినందున అన్ని యూనిట్లలో ఆకు సేకరణ మొదలయ్యేలా అధికారులు చూడాలి. తద్వారా అందరికీ ఉపాధి లభిస్తుంది. లేదంటే గిరిజనులు నష్టపోయే ప్రమాదం ఉంది.

– గొగ్గెల రామస్వామి, ఇల్లెందు



సోనియా, రాహుల్‌ను టచ్ చేస్తే కేంద్రం కూలుతుంది

మాజీ ఎంపీ వీహెచ్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను టచ్ చేస్తే.. దేశంలో బీజేపీ ప్రభుత్వం కుప్పకూలిపోతుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు హెచ్చరించారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై.. పీఎం మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా తప్పుడు కేసులతో ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ, విజయ మాల్యాపై కూడా మనీలాండరింగ్ కేసులు ఉన్నాయని, వాటిపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞత తెలిపేందుకు సభ ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. కృతజ్ఞత సభకు బీసీ కులసంఘాలంతా తరలి రావాలని వీహెచ్ కోరారు.

పొద్దు గూటికి చేరుతుందని..



'పొద్దు గూట్లె పడుతంది.. వాతావరణం చల్లబడ్డది.. జప్పన కుప్పలు పోసి ఇంటికి పోదాం'.. అంటూ వడ్లకుప్పలపై పరదాలు కప్పుతూ కనిపించారు రైతులు. వాతావరణ మార్పులు, అకాలవర్షాలతో తిప్పలు పడుతున్న అన్నదాతలు.. పొద్దుగూకుతున్న సమయంలో పనుల్లో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి నిప్పులు కురిపించిన భానుడి ప్రతాపానికి వడ్లు ఆరబోసి.. సాయంకాలం వేళ.. సూర్యాస్తమయ సమయంలో కుప్పలు చేస్తున్న రైతులు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక శివారులో కనిపించారు.


– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

బీబీనగర్ ఎయిమ్స్‌లో అత్యాధునిక సేవలు

పేదలకు చేరువగా ఖరీదైన వైద్యం

- సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షలు అందుబాటులో..
- రోగులకు డిజిటల్ మెడికల్ కార్డులు
- ఈ ఏడాది చివరి నాటికి పూర్తి స్థాయి వైద్యం
- ఎయిమ్స్‌లో వైద్యవిద్యతో పాటు పరిశోధనలు

సాక్షి, యాదాద్రి: బీబీనగర్ ఎయిమ్స్‌లో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతోంది. పేద, గ్రామీణ, పట్టణప్రాంత ప్రజలు తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు, వైద్యం పొందుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రంగాపూర్ వద్ద 201 ఎకరాల స్థలంలో ఎయిమ్స్ ఉంది. రూ.1,300 కోట్లతో చేపట్టిన ఎయిమ్స్ భవన సముదాయ నిర్మాణం పూర్తి కావొస్తోంది. నూతన క్యాంపస్‌లో విద్యార్థులు, వైద్యులతోపాటు రోగుల కోసం అవసరమైన భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ప్రధాని మోదీ ఎయిమ్స్ నూతన క్యాంపస్‌ను ప్రారంభించే దిశగా పనులు జరుగుతున్నాయి.



అందుబాటులో 35 రకాల వైద్య సేవలు

బీబీనగర్ ఎయిమ్స్‌లో 35 రకాల వైద్య సేవలందిస్తున్నారు. రోజూ సగటున 2 వేల మంది రోగులు వస్తున్నారు. ఆర్థోపెడిక్ విభాగంలో ప్రతిరోజు 300 వరకు ఓపీ ఉంటుంది. ఇటీవల క్లినికల్ హెమటాలజీ సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రారంభించారు. ఇందులో కేన్సర్ రోగులకు చికిత్స అందిస్తున్నారు. న్యూరో సర్జన్, హార్ట్ సర్జన్, రుమటాలజీ, డెంటల్ విభాగాలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం నాలుగు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. వీటిలో సగటున రోజు 20 వివిధ రకాల సర్జరీలు జరుగుతున్నాయి. అత్యాధునిక లాప్రోస్కోపిక్ సర్జరీలు చేస్తున్నారు. ఎంఆర్ఐ, సీటీస్కాన్ వంటి అత్యాధునిక పరీక్షలు చేస్తున్నారు. రోగులకు ఉచితంగా భోజన వసతి కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అన్నిరకాల రోగనిర్ధారణ పరీక్షలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 130 మంది వైద్యులు ఉన్నారు. 120 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులు. పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చేస్తున్న 131 మంది డాక్టర్లు, 535 మంది నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరితోపాటు కొత్తగా ఏర్పాటు చేసే సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో 26 మంది కొత్త డాక్టర్లు, 15 మంది కొత్త ఫ్యాకల్టీని నియమిస్తున్నారు.

క్యాంపస్ నిర్మాణాలివీ..

ఎయిమ్స్ భవన నిర్మాణ పనులను 2023, ఏప్రిల్ 8న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. డాక్టర్ల నివాస భవనాలు, సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్ల వసతి గృహాలు సిద్ధంగా ఉన్నాయి. నర్సింగ్, పరిపాలనా సిబ్బందికి రెండు టవర్లు పూర్తి కావచ్చాయి. రోగుల వెంట వచ్చే సహాయకుల కోసం నైట్ షెల్టర్, ఆస్పత్రి భవనం, అకడమిక్ బ్లాక్, ఆడిటోరియం, గెస్ట్‌హౌస్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌లు సిద్ధమవుతున్నాయి. పీజీ విద్యార్థుల కోసం నిర్మిస్తున్న భవనం మూడు నెలల్లో పూర్తి కానుంది. వైద్యులు, వైద్య విద్యార్థుల కోసం క్రీడా సేవలు, అగ్నిమాపక కేంద్రం, పోలీసు ఫోర్స్‌కు భవనాలు పూర్తి కావచ్చాయి.

వినియోగంలోకి వచ్చిన 5 భవనాలు

నూతనంగా నిర్మిస్తున్న భవనాల్లో 5 భవనాలు వినియోగంలోకి వచ్చాయి. ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం బాలుర హాస్టల్, 19 అంతస్తుల భవనంలో బీఎస్సీ కోర్సులు నిర్వహిస్తున్నారు. మరో 20 అంతస్తుల భవనంలో వైద్య విద్యార్థినులు, రెసిడెంట్ వైద్యులుంటారు. పక్కనే ఆయుష్ భవనం పూర్తయింది. అమృత్ నివాస్ భవనం, ఆర్థిక స్తోమత కలిగిన రోగులకు పేమెంట్ గదులు నిర్మిస్తున్నారు. అకాడమీ భవనం, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలు నిర్మిస్తున్నారు.


ఎయిమ్స్ ఓపీ వద్ద క్యూకట్టిన రోగులు

అదనపు ఐసీయూ పడకలు

సీ.ఎఫ్ బ్లాకులో పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో 300కి పైగా అదనపు పడకలు రానున్నాయి. ఐసీయూ కోసం 70 పడకలు ఉంటాయి. ఈ బ్లాకుల్లో మరిన్ని వార్డులు, అత్యవసర సేవలు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, ప్రస్తుతం ఉన్న ఆరు డయాలసిస్ పడకలను 18కి పెంచుతారు. ఇందులో 16 ఆపరేషన్ థియేటర్లు వస్తాయి. మరొకటి కేన్సర్ రోగులకు చికిత్స చేసే రేడియోథెరపీ బ్లాక్ ఏర్పాటు చేస్తారు.

రోగులకు డిజిటల్ మెడికల్ కార్డులు

ఎయిమ్స్‌లో చికిత్స పొందిన రోగుల మెడికల్ రికార్డులు కూడా డిజిటలైజ్ చేస్తున్నారు. డిజిటలైజేషన్ వల్ల రోగులకు ఆరోగ్య స్థితి సులభంగా తెలుస్తుంది. క్యూకట్టే పరిస్థితి లేకుండా సులభంగా వైద్య సేవలు పొందవచ్చు.

పీజీ కోర్సులు

ఎయిమ్స్ వైద్య విద్యలో సూపర్ స్పెషాలిటీ కోర్సులను ఈ సంవత్సరం ప్రారంభిస్తున్నారు. డెర్మటాలజీ, బ్లడ్ బ్యాంక్, రేడియో థెరపీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఫిజికల్ మెడికల్ రీహాబిలిటేషన్ కోర్సుల పీహెచ్‌డీ విద్యను అందిస్తున్నారు. టెక్నికల్ కోర్సుల్లో సీటీ స్కాన్, హెల్త్ ఇన్ఫర్మేటిక్ (డిజిటల్ హెల్త్) ఎంఆర్ఐ వంటివి ఉన్నాయి. నర్సింగ్ కోర్సును ప్రారంభించారు.

21 నుంచి ఎల్లో ఫీవర్ టీకా..

విదేశాలకు వెళ్లే వారికి తప్పనిసరైన ఎల్లో ఫీవర్ నివారణ టీకా ఈనెల 21 నుంచి ఇవ్వనున్నారు. అలాగే ఐదేళ్లలోపు పిల్లలకు అత్యవసర వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ యూనిట్‌ను సిద్ధం చేస్తున్నారు. దోమ కాటు వల్ల ఎల్లో ఫీవర్ వస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు 42 దేశాలు ఎల్లో ఫీవర్ టీకాను తప్పనిసరి చేశాయి. టీకా వేసుకున్నట్లు సర్టిఫికెట్ ఉంటేనే విదేశీయులను అనుమతిస్తాయి. ప్రధానంగా ఆఫ్రికా, గల్ఫ్ దేశాల్లో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఎల్లో టీకా ఇచ్చేందుకు ఎయిమ్స్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. దీనికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ఈనెల 21వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. కేవలం రూ.300కే ఎల్లో ఫీవర్ టీకా ఎయిమ్స్‌లో ఇస్తారు. టీకా తీసుకోకుండా ఆయా దేశాలకు వెళ్లినట్లయితే అక్కడ విమానాశ్రయాల్లో వారం రోజులు క్వారంటైన్ చేస్తారు.


సీటీ స్కాన్ యంత్రాన్ని పరిశీలిస్తున్న డైరక్టర్ వికాస్ భాటియా

అత్యాధునిక వైద్యం అందిస్తాం..



బీబీనగర్ ఎయిమ్స్‌లో రోగులకు మెరుగైన అత్యాధునిక వైద్యం అందిస్తాం. ఇందుకోసం మూడు విభాగాల మీద దృష్టి సారించాం. మెడికల్ విద్య, ఆస్పత్రిలో వైద్యసేవలు, రోగుల సంరక్షణ, వివిధ రకాల పరిశోధనలతో నిపుణులైన డాక్టర్లు, నర్సులు టెక్నీషియన్ల వంటి సాంకేతిక నిపుణులను తయారు చేస్తున్నాం. 2025–26 సంవత్సరంలో ఎయిమ్స్‌లో పూర్తి స్థాయి వైద్యం అందిస్తాం. తెలంగాణ, ఏపీ నుంచి రోగులు ఎయిమ్స్‌కు వచ్చి సేవలు పొందుతున్నారు.

– డాక్టర్ వికాస్ భాటియా, ఎయిమ్స్ డైరెక్టర్

దడ పుట్టిస్తున్న ఎండలు

ఎండలు దంచికొడుతున్నాయి. పొద్దంతా వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇళ్లలో ఉండలేక, బయటికి రాలేక సతమతమవుతున్నారు. అవసరార్థం బయటికొచ్చిన వారు.. చెట్ల నీడ కనిపిస్తే చాలు.. వాటికింద సేదదీరుతున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో స్థానికుల తిప్పలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


బస్సుల కోసం ఎండలో తిప్పలు



గొడుగుల నీడన పాదచారులు


బస్సుల కోసం నిరీక్షిస్తూ.. చెట్ల కింద సేదదీరుతూ..

మరో ప్రపంచం పిలుస్తోంది... రండి!

వెండితెరపై ఆడియన్స్‌కు అద్భుతమైన విజువల్ ఎక్స్‌పీరియన్స్, సినిమాటిక్ టెక్నాలజీని చూపించేందుకు మన తెలుగు హీరోలు, దర్శక-నిర్మాతలు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇందుకోసం కథల్లో సరికొత్త ప్రపంచాలను, ప్రాంతాలను క్రియేట్ చేసి, ఆడియన్స్‌ను ఆహ్వానించేందుకు రెడీ అవుతున్నారు. ఇలా 'మరో ప్రపంచం పిలుస్తోంది... రండి' అంటూ ఆడియన్స్‌ను థియేటర్స్‌కు తీసుకువచ్చేందుకు రెడీ అవుతున్న కొన్ని చిత్రాలపై కథనం.


● చిరంజీవి

విశ్వంభర వరల్డ్

ఫాంటసీ జానర్‌లో చిరంజీవి హీరోగా 'అంజి, జగదేకవీరుడు అతిలోక సుందరి' వంటి సినిమాలొచ్చాయి. కొంత గ్యాప్ తర్వాత చిరంజీవి మళ్లీ ఈ జానర్‌లో 'విశ్వంభర' మూవీ చేస్తున్నారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 'బింబిసార' సినిమాలో కొంత భాగం కథ 500బీసీ టైమ్‌లో సాగుతుంది. ఈ సీక్వెన్స్‌లో వచ్చే సన్నివేశాలు సిల్వర్ స్క్రీన్‌పై ఆడియన్స్‌కు మంచి విజువల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చాయి. కాగా మరోసారి తన విజువల్ విజన్‌ను 'విశ్వంభర' సినిమాలోనూ చూపించనున్నారు వశిష్ఠ. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్‌లో సరికొత్త విజువల్స్ కనిపిస్తున్నాయి. పంచభూతాలైన గాలి, నీరు, ఆకాశం, నిప్పు, భూమి ఈ సినిమా కథలో కీలకంగా ఉంటాయనే ప్రచారం సాగుతోంది. ఇలా 'విశ్వంభర' సినిమాలోని కొంత భాగం ఆడియన్స్‌ను మరో ప్రపంచానికి తీసుకువెళ్తుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఒక స్పెషల్ సాంగ్ మినహా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిందని తెలిసింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ డేట్‌పై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇక ఈ మూవీలో ఆంజనేయ స్వామి భక్తుడు భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపిస్తారని తెలిసింది. త్రిషా, ఆషికా రంగనాథ్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటించగా, చిరంజీవి చెల్లెలి పాత్రల్లో ఇషా చావ్లా, పసుపులేటి రమ్య కనిపిస్తారని సమాచారం. యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్, విక్రమ్ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

నాలుగో ప్రపంచం కూడా ఉందా?

కురుక్షేత్ర యుద్ధానికి ఆరువేల సంవత్సరాల తర్వాత ప్రపంచం ఎలా ఉండబోతోందో ఊహించి, దర్శకుడు నాగ్ అశ్విన్ తీసిన సైన్స్ ఫిక్షన్ మూవీ 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ హీరోగా, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్ ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం ఇది. ఈ మూవీలో 2898 ఏడీ సమయంలో కాశీ నగరం ఎలా ఉంటుందో ఊహాత్మకంగా, కల్పితంగా స్క్రీన్‌పై ఆడియన్స్‌కు చూపించారు దర్శకుడు నాగ్ అశ్విన్. అలాగే ఇదే చిత్రంలో కాంప్లెక్స్, శంభాల అనే మరో రెండు కొత్త ప్రపంచాలను కూడా చూపించారు. అయితే నాలుగో ప్రపంచం కూడా ఉందని, ఇది 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ 'కల్కి 2898 ఏడీ పార్ట్ 2'లో కనిపిస్తుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఇక ప్రస్తుతం 'కల్కి 2898 ఏడీ' సినిమా సీక్వెల్ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌తో బిజీగా ఉన్నారు నాగ్ అశ్విన్. తొలి భాగం చిత్రీకరణ సమయంలోనే సీక్వెల్‌ని కూడా కొంత భాగం చిత్రీకరించారట. అయితే సీక్వెల్ చిత్రీకరణ 2026లో పూర్తి స్థాయిలో ప్రారంభం కావొచ్చని, 2028 ప్రారంభంలో ఈ మూవీ రిలీజ్ అవుతుందనే టాక్ ప్రచారంలో ఉంది. ఇక ఈ మూవీని భారీ బడ్జెట్‌తో వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించనున్నారు. అలాగే ప్రభాస్ హీరోగా 'హను-మాన్' ఫేమ్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో 'బ్రహ్మరాక్షస' అనే మూవీ రానుందని, ఈ మూవీ కోసం ప్రశాంత్ వర్మ ఓ అద్భుతమైన ప్రపంచాన్ని రెడీ చేస్తున్నారని ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇంకా ప్రభాస్ మరో మూవీ 'సలార్' కోసం ఖాన్సార్ అనే ఓ కొత్త ప్రాంతాన్ని సృష్టించారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఈ ఖాన్సార్ గురించి మరింతగా 'సలార్' రెండో భాగం 'సలార్: శౌర్యాంగపర్వం'లో ఉండనున్నట్లుగా తెలిసింది.


● ప్రభాస్


● అల్లు అర్జున్

సైన్స్ లోకం

ఆడియన్స్‌ను ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకు వెళ్లనున్నారు హీరో అల్లు అర్జున్. తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఓ మూవీ రానుంది. ఈ మూవీ కోసం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నారట అట్లీ. ఇందుకోసమే ప్రస్తుతం అట్లీ విదేశీ వీఎఫ్ఎక్స్ నిపుణులతో కలిసి ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ చేస్తున్నారు. ఈ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. వెండితెరపై అట్లీ చూపించనున్న ఈ సరికొత్త సైన్స్ ఫిక్షన్ మూవీలో కొన్ని కొత్త రకాల జంతువులు కూడా కనిపిస్తాయనే ప్రచారం సాగుతోంది. అంతేకాదు... ఈ మూవీలో అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేస్తారని, హీరోయిన్స్‌గా జాన్వీ కపూర్, దిశా పటానీ, శ్రద్ధా కపూర్‌ల పేర్లను మేకర్స్ పరిశీలిస్తున్నారని సమాచారం. ఈ ఏడాది చివర్లో చిత్రీకరణను ప్రారంభించనున్నారు. కళానిధి మారన్ సమర్పణలో సన్‌పిక్చర్స్ సంస్థ ఈ మూవీని భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. 2027లో ఈ మూవీ రిలీజ్ అయ్యేలా సినిమా షూటింగ్‌ను ప్లాన్ చేస్తున్నారట. మరోవైపు దర్శకుడు త్రివిక్రమ్‌తో అల్లు అర్జున్ ఓ మూవీ అంగీకరించిన సంగతి తెలిసిందే. మైథలాజికల్ ఫిల్మ్ ఇది. భారతీయ ఇతిహాసాల నుంచి ఇప్పటివరకు రాని ఓ సరికొత్త పాయింట్‌తో త్రివిక్రమ్ ఈ మూవీ చేయనున్నారని, ఇందుకోసం స్క్రీన్‌పై కొత్త ప్రపంచాన్ని టీమ్ రూపొందించనుందని సమాచారం. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ పతాకాలపై సూర్యదేవర రాధాకృష్ణ, అల్లు అరవింద్ ఈ సినిమా నిర్మించనున్నారు.

అంజనాద్రిలో జై హనుమాన్

బ్లాక్‌బస్టర్ మూవీ 'హను-మాన్'లో దర్శకుడు ప్రశాంత్ వర్మ అంజనాద్రి అనే ఊరుని చూపించారు. తేజా సజ్జా హీరోగా నటించిన చిత్రం ఇది. నిరంజన్ రెడ్డి, చైతన్యా రెడ్డి ఈ సినిమాను నిర్మించారు. కాగా 'హను-మాన్' సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' మూవీ రానుంది. ప్రశాంత్ వర్మయే ఈ సినిమాకూ దర్శకత్వం వహిస్తున్నారు. 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి ఈ మూవీలో హీరోగా చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'జై హను మాన్' సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివర్లో 'జై హనుమాన్' చిత్రీకరణలో పాల్గొంటారట రిషబ్ శెట్టి. కాగా... 'జై హనుమాన్' మూవీలో రాముడు, లక్ష్మణుడి పాత్రల ప్రస్తావన కూడా ఉంటుందని, 'హను-మాన్' సినిమా క్లిఫ్ హ్యాంగర్ వీడియోను చూసిన వారికి అర్థమయ్యే ఉంటుంది. సో... 'జై హనుమాన్' సినిమా మరింత పెద్ద స్పాన్‌తో రూపొందనుందని తెలుస్తోంది. సో... ఆటోమేటిక్‌గా 'అంజనాద్రి' స్పాన్ కూడా పెరుగుతుందని ఊహించవచ్చు. ఇలా... అంజనాద్రిలో 'జై హనుమాన్' సాహసాలు, విన్యాసాలు చూసేందుకు మాత్రం చాలా సమయం ఉంది. 2027లో మూవీ రిలీజ్ కావొచ్చు. ఇంకా హను-మాన్‌లో నటించిన తేజా సజ్జా ఈ సినిమా సీక్వెల్ 'జై హనుమాన్'లోనూ ఉంటారని తెలిసింది. అలాగే తేజా సజ్జా హీరోగా 'మిరాయ్' అనే సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ మూవీ రానుంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాకు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మంచు మనోజ్ విలన్‌గా కనిపిస్తారు. ఈ చిత్రం ఆగస్టు 1న విడుదల కానుంది.


● రిషబ్ శెట్టి


● తేజా సజ్జా


● నాగచైతన్య

మిస్టిక్ థ్రిల్లర్

'విరూపాక్ష' సినిమాలో రుద్రవనం అనే కల్పిత విలేజ్‌లో జరిగే సంఘటనలు ఆడియన్స్‌ను అలరించాయి. సాయిదుర్గా తేజ్ హీరోగా కార్తీక్ దండు దర్శకత్వం వహించిన ఈ మూవీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ తర్వాత హీరో నాగచైతన్యతో దర్శకుడు కార్తీక్ దండు మరో మిస్టిక్ థ్రిల్లర్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ మిస్టిక్ థ్రిల్లర్ మూవీ చిత్రీకరణ ఆల్రెడీ ప్రారంభమైంది. కాగా ఈ చిత్రం కోసం 'రుద్రవనం' మాదిరి మరో ప్రాంతాన్ని సృష్టిస్తున్నారట కార్తీక్ దండు. ఆల్రెడీ రిలీజ్ చేసిన ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. ఓ పక్షి కన్నులో ఓ పెద్ద పర్వతంపై నాగచైతన్య ఉన్నట్లుగా ఈ సినిమాలో కనిపిస్తుంది. అలాగే ఈ మూవీలో నాగచైతన్య ఓ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తారని తెలిసింది. ఇక ఈ మూవీలో నాగచైతన్య సరసన మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారని తెలిసింది. సుకుమార్, బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా రిలీజ్ కావొచ్చు.


● ఆది సాయికుమార్

వెయ్యేళ్ల క్రితం

ఆధ్యాత్మిక ప్రపంచం 'శంబాల'కు ఆడియన్స్‌ను తీసుకువెళ్లనున్నారు హీరో ఆది సాయికుమార్. జియో సైంటిస్ట్‌గా ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న చిత్రం 'శంబాల'. కాల్పనిక ప్రపంచం శంబాల నేపథ్యంలో యుగంధర్ ముని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పదివేల సంవత్సరాల క్రితం, వెయ్యి సంత్సరాల క్రితం, 1980... ఇలా మూడు కాలమానాల్లో ఈ సినిమా కథనం సాగుతుందని చిత్రయూనిట్ పేర్కొంది. అర్చనా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో శ్వాసిక మరో లీడ్ రోల్‌లో యాక్ట్ చేస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా కోసం ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను తీశారు మేకర్స్. త్వరలోనే టీజర్, ట్రైలర్, రిలీజ్ డేట్ లపై స్పష్టత ఇవ్వనున్నట్లుగా మేకర్స్ ఇటీవల తెలిపారు.


● నాని

ప్యారడైజ్

'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ప్యారడైజ్'. ఈ పీరియాడికల్ ఫిల్మ్‌లో నాని సరికొత్తగా కనిపిస్తున్నారు. 1980 నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని తెలిసింది. ఈ సినిమాలో సికింద్రాబాద్ కుర్రాడిలా నాని నటిస్తారని తెలిసింది. ఈ మూవీ ఆడియన్స్‌కు సరికొత్త విజువల్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇవ్వనుంది. అప్పటి కాలాన్ని రీ-క్రియేట్ చేసే పనిలో ఉన్నారు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. ఓ తెగ నాయకుడిగా నాని కనిపిస్తారని, గుర్తింపుకోసం పోరాడే ఓ తెగ నేపథ్యంలో ఈ మూవీ సాగుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. 'దసరా' సినిమాను నిర్మించిన సుధాకర్ చెరికూరియే ఈ సినిమానూ నిర్మించనున్నారు. ప్రస్తుతం 'హిట్ 3' సినిమా ప్రమోషన్స్‌తో నాని బిజీగా ఉన్నారు. మే 1న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఇక మే రెండో వారం నుంచి 'ప్యారడైజ్' సినిమా చిత్రీకరణలో నాని పాల్గొంటారని తెలిసింది. 'ప్యారడైజ్' సినిమాను వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే.


● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

కిష్కింధపురి!

ఆడియన్స్ కోసం 'కిష్కింధపురి' అనే హారర్ అండ్ మిస్టీరియస్ వరల్డ్‌ను క్రియేట్ చేస్తున్నారట బెల్లంకొండ సాయిశ్రీనివాస్. కౌశిక్ పెగళ్లపాడి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మాణంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఈ మూవీ చేస్తున్నారు. ఈ హారర్ అండ్ మిస్టిక్ థ్రిల్లర్ మూవీకి 'కిష్కింధపురి' అనే టైటిల్‌ను అనుకుంటున్నారట మేకర్స్. హారర్ ఎలిమెంట్స్, ప్రేతాత్మల ప్రస్తావన, ఆధ్యాత్మిక అంశాలతో ఈ మూవీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అతి త్వరలోనే ఈ మూవీకి చెందిన మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి.

ఇలా ఈ తరహాలో ఆడియన్స్‌ను మరో కొత్త ప్రపంచానికి లేదా కొత్త ప్రాంతానికి తీసుకుని వెళ్లే హీరోలు, దర్శక-నిర్మాతలు మరి కొంతమంది ఉన్నారు.

- ముసిమి శివాంజనేయులు


● అనురాగ్ కశ్యప్

షారుక్ ఖాన్ కంటే బిజీగా ఉన్నా!

''నేను సిటీ మాత్రమే మారాను. అంతే కానీ సినిమాలు చేయడం మానలేదు. ఫ్రస్ట్రేషన్ కారణంగా నేను అన్నీ వదిలేసి వెళ్లిపోయానని అనుకునేవాళ్లకు నేను చెప్పేది ఒక్కటే. ప్రస్తుతం హీరో షారుక్ ఖాన్‌గారి కంటే నేను బిజీగా ఉన్నాను. అలా బిజీగా ఉండాలి కూడా. కాకపోతే ఆయనంత డబ్బు సంపాదించను. 2028 వరకు నా డేట్స్ ఖాళీగా లేవు'' అని ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్, యాక్టర్ అనురాగ్ కశ్యప్ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన ఓ పోస్ట్ షేర్ చేశారు. ''దర్శకునిగా కూడా నేను ఫుల్ బిజీ బిజీగా ఉన్నాను. ప్రస్తుతం ఐదు సినిమాలు నా చేతిలో ఉన్నాయి. వాటిలో మూడు చిత్రాలు ఈ ఏడాది, మరో రెండు సినిమాలు వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్తాయి. క్షణం తీరిక లేనంత పని దొరికింది. దీనివల్ల ప్రతి రోజూ మూడు ప్రాజెక్టులకు 'నో' చెబుతున్నాను. కాబట్టి నా గురించి మాట్లాడేవారు ఇప్పటికైనా నోరు మూసుకొని ఉండండి'' అని కౌంటర్ ఇచ్చారు అనురాగ్ కశ్యప్.


● ఇమ్రాన్‌ఖాన్

పదేళ్ల తర్వాత..

బాలీవుడ్‌లో 'కిడ్నాప్ (2008), లక్ (2009), బ్రేక్ కే బాద్' (2010) తదితర చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు ఇమ్రాన్ ఖాన్. కానీ 2015లో వచ్చిన హిందీ చిత్రం 'కట్టీ బట్టీ' తర్వాత ఎందుకో కానీ ఇమ్రాన్ ఖాన్ మరో సినిమా చేయలేదు. అయితే పదేళ్ల తర్వాత ఇప్పుడు ఇమ్రాన్ ఖాన్ ఓ సినిమా సైన్ చేశారు. డానిష్ అస్లాం దర్శకత్వంలో హిందీలో ఓ రొమాంటిక్ సినిమా రానుంది. ఈ చిత్రంలో ఇమ్రాన్ ఖాన్, భూమీ ఫడ్నేకర్, గుర్ఫతే పీర్జాదా మెయిన్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శనివారం ముంబైలో అధికారికంగా ప్రారంభమైంది. ఇమ్రాన్, భూమి, గుర్ఫతే పాల్గొంటుండగా చిత్రయూనిట్ కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతోంది. ఇలా పదేళ్ల తర్వాత ఇమ్రాన్ ఖాన్ మళ్లీ కెమెరా ముందుకు వచ్చి, ఆర్టిస్టుగా మేకప్ వేసుకున్నారు. ఈ మూవీ ఈ ఏడాదే నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో డైరెక్ట్‌గా స్ట్రీమింగ్ కానుందని బాలీవుడ్ సమాచారం.


● కాజల్ అగర్వాల్

పెద్దితో స్పెషల్ సాంగ్?

'నేను పక్కా లోకల్ పక్కా లోకల్.. పక్కా లోకలే...' అంటూ హీరోయిన్ కాజల్ అగర్వాల్ వేసిన డ్యాన్సుల్ని ప్రేక్షకులు అంత సులువుగా మరచిపోలేరు. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన 'జనతా గ్యారేజ్'(2016) సినిమాలో తొలిసారి ప్రత్యేక పాటలో సందడి చేశారీ బ్యూటీ. ఎన్టీఆర్‌కి సమానంగా డ్యాన్సులతో అదరగొట్టారామె. ఆ చిత్రం తర్వాత మరో ప్రత్యేక పాట చేయలేదు కాజల్. అయితే ఆమె తెలుగులో రెండోసారి స్పెషల్ సాంగ్ చేయనున్నారని టాక్. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ఈ మూవీలో ఓ స్పెషల్ సాంగ్ ఉంటుందట. ఈ పాటకి కాజల్‌ని తీసుకోవాలన్నది బుచ్చిబాబు ఆలోచనట. సినిమాకి ఓ హైలెట్‌గా నిలవనున్న ఈ పాటలో రామ్ చరణ్‌తో కలిసి ఆమె డ్యాన్స్ చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో రామ్‌చరణ్-కాజల్ హీరో హీరోయిన్లుగా నటించిన తొలి చిత్రం 'మగధీర' (2009) బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత వీరి కాంబినేషన్‌లో వచ్చిన ద్వితీయ చిత్రం 'గోవిందుడు అందరివాడేలే' (2014) కూడా విజయం అందుకుంది. ఇప్పుడు 'పెద్ది'లో కాజల్ ఐటమ్ సాంగ్ చేస్తే... దాదాపు పదకొండేళ్ల తర్వాత వీరిద్దరూ స్క్రీన్ షేర్ చేసుకున్నట్లు అవుతుంది. మరి.. 'పెద్ది'లో ఐటమ్ సాంగ్ ఉందా? ఉంటే కాజల్ అగర్వాల్ నటిస్తారా? అనే విషయాలపై అధికారిక ప్రకటన రావాలంటే వేచి చూడాలి. జగపతిబాబు, శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు కెమెరామేన్‌గా చేస్తున్నారు. ఈ చిత్రం రామ్‌చరణ్ బర్త్ డేకి 2026 మార్చి 27న విడుదల కానుంది.

బాలీవుడ్‌లో బిజీ బిజీ

జాన్ అబ్రహాం సరసన నటించనున్నారట తమన్నా. జాన్ అబ్రహాం హీరోగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో ఓ బయోగ్రాఫికల్ డ్రామా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలోని హీరోయిన్ పాత్రకు మేకర్స్ తమన్నాను సంప్రదించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. దివంగత ముంబై పోలీస్ కమిషనర్ రాజేశ్ మారియా జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో రాకేశ్‌గా జాన్ అబ్రహాం నటిస్తున్నారు. ఆయన భార్య ప్రీతి మారియాగా తమన్నా కనిపిస్తారట. ఈ ఏడాదే ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు మేకర్స్. ఇక ఇప్పటికే అజయ్ దేవగన్ 'రేంజర్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు తమన్నా. అర్జున్ కపూర్-వరుణ్‌ధావన్ కలిసి నటించనున్న హిందీ చిత్రం 'నో ఎంట్రీ 2'లో తమన్నాకు చాన్స్ లభించిందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు రాజేశ్ మారియా బయోగ్రాఫికల్ డ్రామాలో చాన్స్ వచ్చిందని టాక్. ఇంకా అజయ్ దేవగన్ 'రైడ్ 2'లో తమన్నా 'నిషా' అనే స్పెషల్ సాంగ్ చేశారు. చూస్తుంటే... ఇలా వరుస అవకాశాలతో తమన్నా హిందీలో బిజీ బిజీగా ఉంటున్నట్లుగా తెలుస్తోంది. ఇక తెలుగులో తమన్నా లీడ్ రోల్‌లో నటించిన 'ఓదెల 2' ఈ నెల 17న విడుదలైంది.


● తమన్నా

బిజినెస్ రీల్

ఓఎన్‌జీసీకి భారీగా ఇంధన బ్లాక్‌లు



న్యూఢిల్లీ: ఓపెన్ ఎక్రేజ్ లైసెన్సింగ్ విధానం (ఓఏఎల్‌పీ) కింద ఇంధన బ్లా కులకు సంబంధించి నిర్వహించిన తొమ్మిదో విడత వేలంలో ప్రభు త్వ రంగ ఓఎన్‌జీసీ అత్యధిక బ్లాక్‌లు దక్కించుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, బీపీతో కన్సార్షియం కింద 4, సొంతంగా 11 బ్లాకులను సాధించింది. రిలయన్స్–బీపీ–ఓఎన్‌జీసీ జత కట్టడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. మరోవైపు, 28 బ్లాకులకు బిడ్ చేసిన వేదాంత.. 7 దక్కించుకుంది. ఆయిల్ ఇండియా సొంతంగా 6 బ్లాకులు, ఓఎన్‌జీసీతో జాయింట్ వెంచర్ కింద 3 సాధించింది. తొమ్మిదో విడత ఓఏఎల్‌పీలో భాగంగా చమురు, గ్యాస్ నిక్షేపాల అన్వేషణ కోసం 1.36 లక్షల చ.కి.మీ. మేర విస్తరించిన 28 బ్లాకులకు వేలం నిర్వహించారు.

ఏడాదిలో రెట్టింపు విమానాలు: స్పైస్‌జెట్



న్యూఢిల్లీ: వచ్చే 12 నెలల్లో విమానాల సంఖ్యను రెట్టింపునకు పెంచుకోనున్నట్లు స్పైస్‌జెట్ సీఎండీ అజయ్ సింగ్ తెలిపారు. కంపెనీ పునరుజ్జీవ ప్రణాళికలు ఆశించిన విధంగా అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. జనవరి 10 నాటికి కంపెనీకి మొత్తం 62 విమానాలు ఉండగా 28 ఎయిర్‌క్రాఫ్టులు వినియోగంలో ఉన్నాయి. నిలిపివేసిన వాటిల్లో 10 విమానాలను తిరిగి వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు జనవరిలో కంపెనీ వెల్లడించింది. ఆర్థిక సమస్యలు, లెస్సర్లతో న్యాయ వివాదాలు మొదలైన సవాళ్లతో స్పైస్‌జెట్ సతమతమైన సంగతి తెలిసిందే. ఇటీవలే నిధులు సమీకరించిన కంపెనీ తమ కార్యకలాపాలను మెరుగుపర్చుకునే ప్రయత్నాల్లో ఉంది.

ఐటీసీ చేతికి 24మంత్ర

డీల్ విలువ రూ. 473 కోట్లు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ తాజాగా శ్రేష్ఠ నేచురల్ బయోప్రొడక్ట్స్‌లో 100 శాతం వాటా సొంతం చేసుకోనుంది. 24మంత్ర ఆర్గానిక్ బ్రాండు కంపెనీతో వాటా కొనుగోలు ఒప్పందాన్ని(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఐటీసీ వెల్లడించింది. ఇందుకు నగదు రూపేణా దాదాపు రూ. 473 కోట్లు వెచ్చించనున్నట్లు తెలియజేసింది. 24మంత్ర బ్రాండుతో 100 రకాలకుపైగా ఫుడ్ ప్రొడక్టులను శ్రేష్ఠ విక్రయిస్తోంది. తద్వారా వేగవంత వృద్ధిలోనున్న ఆర్గానిక్ ఫుడ్ ప్రొడక్టుల విభాగంలో ఐటీసీ మరింత విస్తరించనుంది. కాగా.. మరోపక్క సహచర సంస్థ మదర్ స్పార్ష్ బేబీ కేర్‌లో మిగిలిన 73.5 శాతం వాటా సైతం చేజిక్కించుకోనున్నట్లు పేర్కొంది. 2022లో ఈ డీ2సీ కంపెనీలో 26.5 శాతం వాటా కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌లోకి యాక్సిస్ మ్యుచువల్ ఫండ్



ముంబై: ఫండ్స్‌లో పెట్టుబడులను సులభతరం చేసే దిశగా ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)లో చేరినట్లు యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ వెల్లడించింది. దీనితో అంతగా ఆర్థిక సేవలు అందుబాటులో లేని, మారుమూల ప్రాంతాల్లోని వారు కూడా సరళతరంగా, తక్కువ వ్యయాలతో తమ ఫండ్ స్కీముల్లో ఇన్వెస్ట్ చేయడానికి వీలవుతుందని సంస్థ ఎండీ బి. గోప్‌కుమార్ తెలిపారు. తమ ప్లాట్‌ఫాంలో యాక్సిస్ ఎంఎఫ్ చేరడమనేది అందరికీ ఆర్థిక సాధనాలను అందుబాటులోకి తేవాలన్న లక్ష్య సాకారానికి తోడ్పడుతుందని ఓఎన్‌డీసీ ఎండీ టి. కోషి చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-4-2025

విశాఖ	425-00
చిత్తూరు	460-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	395-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

అంచనాలు మించిన 'హెచ్‌డీఎఫ్‌సీ'

- క్యూ4లో బ్యాంక్ లాభం 7 శాతం అప్
- రూ. 17,616 కోట్లు
- రూ. 22 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో అంచనాలను మించిన పనితీరు కనపర్చింది. స్టాండెలోన్ ప్రాతిపదికన రూ. 17,616 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది క్యూ4లో నమోదైన రూ. 16,512 కోట్లతో పోలిస్తే ఇది సుమారు 6.6 శాతం అధికం. తాజా క్యూ4లో నికర లాభం రూ. 17,072 కోట్లుగా ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. సీక్వెన్షియల్ ప్రాతిపదికన లాభం 5.3 శాతం పెరిగింది. ఆదాయం రూ. 89,488 కోట్లకు పరిమితమైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి (2024–25) గాను రూ. 1 ముఖ విలువ గల ఒక్కో షేరుపై బ్యాంకు రూ. 22 డివిడెండ్ ప్రకటించింది. దీనికి జూన్ 27 రికార్డు తేదీగా ఉంటుంది. మరోవైపు, కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం సుమారు 6.8 శాతం పెరిగి రూ. 17,622 కోట్ల నుంచి రూ. 18,835 కోట్లకు చేరింది. 2025 మార్చి 31 నాటికి బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ రూ. 36.17 లక్షల కోట్ల నుంచి రూ. 39.10 లక్షల కోట్లకు చేరింది.

పెరిగిన ఎన్‌పీఏలు..

2024–25 క్యూ4లో స్థూల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి 1.33 శాతానికి చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో నమోదైన 1.24 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. అటు నికర ఎన్‌పీఏల నిష్పత్తి 0.33 శాతం నుంచి 0.43 శాతానికి పెరిగింది. సీక్వెన్షియల్‌గా డిసెంబర్ క్వార్టర్‌లో నమోదైన 0.46 శాతం పోలిస్తే స్వల్పంగా తగ్గింది. పరిమాణంపరంగా చూస్తే స్థూల ఎన్‌పీఏలు రూ. 31,173 కోట్ల నుంచి రూ. 35,223 కోట్లకు పెరిగాయి. సీక్వెన్షియల్‌గా రూ. 36,019 కోట్ల నుంచి తగ్గాయి.

వడ్డీ ఆదాయం 10 శాతం వృద్ధి..

- నికర వడ్డీ ఆదాయం నాలుగో త్రైమాసికంలో రూ. 29,080 కోట్ల నుంచి సుమారు 10 శాతం పెరిగి రూ. 32,070 కోట్లకు పెరిగింది. డిసెంబర్ క్వార్టర్‌లో నికర వడ్డీ ఆదాయం రూ. 30,650 కోట్లుగా నమోదైంది.
- ఇక నికర వడ్డీ మార్జిన్ 3.54%గా నిల్చింది. ఆదాయ పన్ను రీఫండ్‌కి సంబంధించిన రూ. 700 కోట్ల వడ్డీని మినహాయిస్తే, నికర వడ్డీ మార్జిన్ 3.46%గా ఉంది.
- సమీక్షాకాలంలో ఫీజుల రూపంలో రూ. 8,530 కోట్లు, విదేశీ మారకం .. డెరివేటివ్స్ ఆదాయం కింద రూ. 1,440 కోట్లు, నికర ట్రేడింగ్.. మార్క్‌టు మార్కెట్ ఆదాయం కింద రూ. 390 కోట్లు, ఇతరత్రా రికవరీల రూపంలో రూ. 1,670 కోట్లు వచ్చాయి.

డిపాజిట్లు 16 శాతం అప్ ..

- నాలుగో త్రైమాసికంలో బ్యాంకు డిపాజిట్లు సగటున సుమారు 16 శాతం పెరిగి రూ. 25.28 కోట్లకు చేరాయి. క్రితం క్యూ4లో ఇది రూ. 21.84 లక్షల కోట్లు గాను, అంతక్రితం క్వార్టర్‌లో రూ. 24.53 లక్షల కోట్లుగాను నమోదైంది. సీక్వెన్షియల్ ప్రాతిపదికన బ్యాంక్ డిపాజిట్లు సగటున 3.1 శాతం పెరిగాయి. కాసా (కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్) డిపాజిట్లు రూ. 7.85 లక్షల కోట్ల నుంచి సుమారు 6 శాతం వృద్ధితో రూ. 8.3 లక్షల కోట్లకు చేరాయి. మార్చి 31 నాటికి మొత్తం డిపాజిట్లలో కాసా డిపాజిట్ల వాటా 34.8 శాతంగా ఉంది.
- రుణాలు 5.4 శాతం వృద్ధితో రూ. 26.44 లక్షల కోట్లకు చేరాయి. రిటైల్ రుణాలు 9 శాతం, కమర్షియల్ .. గ్రామీణ బ్యాంకింగ్ రుణాలు 12.8 శాతం పెరగ్గా, కార్పొరేట్.. ఇతరత్రా హోల్‌సేల్ రుణాలు 3.6 శాతం తగ్గాయి.

యస్ బ్యాంక్ నికర లాభం 63% వృద్ధి

రూ.738 కోట్లుగా నమోదు



ముంబై: ప్రైవేటు రంగ యస్ బ్యాంక్ గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. మొండి బకాయిలకు కేటాయింపులు (ప్రొవిజన్లు) గణనీయంగా తగ్గడంతో మార్చి క్వార్టర్‌లో నికర లాభం 63% వృద్ధితో రూ.738 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.9,355 కోట్లకు చేరింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆదాయం రూ. 9,016 కోట్లుగా ఉంది. తాజా క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 5.7% పెరిగి రూ.2,276 కోట్లకు చేరింది. బ్యాంక్ డిపాజిట్ వృద్ధి 6.8%గా ఉంది. వడ్డీయేతర ఆదాయం 10.9% పెరిగి రూ.1,739 కోట్లకు చేరింది. మొత్తం ప్రొవిజన్లు 32.5% తగ్గి రూ.318 కోట్లకు పరిమితమయ్యాయి. స్థూల మొండి బకాయిల నిష్పత్తి 1.6% తగ్గి రూ.3,935 కోట్లకు పరిమితమైంది. నికర మొండిబకాయిలు 0.3 శాతం క్షీణించాయి. రుణ డిపాజిట్ నిష్పత్తి 88% నుంచి 86.5 శాతానికి దిగివచ్చింది. క్యాపిటల్ అడెక్వసీ 15.6 శాతానికి చేరింది.

''స్థూల ఆర్థిక వ్యవస్థ పరిస్థితుల దృష్ట్యా రుణ వృద్ధి 12–15 శాతం లక్ష్యంగా పెట్టుకున్నాము. రుణ వృద్ధి కంటే డిపాజిట్ల వృద్ధి అధికంగా ఉంటుంది. సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేటు 2% తగ్గించడంతో మూడు శాతానికి పరిమితమైంది. దీని ప్రభావం కాసా(కరెంట్ అకౌంట్ సేవింగ్స్ అకౌంట్)పై ఉండదు. క్రెడిట్ కార్డుల పోర్ట్‌ఫోలియోలో ఒత్తిళ్లు కొనసాగుతున్నాయి. రాబోయే 2–3 త్రైమాసికాల్లో క్రెడిట్ వ్యయం దిగివస్తుంది. 2025 ఆర్థిక సంవత్సరంలో 37 బ్రాంచులు ఏర్పాటు చేశాము. వచ్చే ఐదేళ్లలో ఏడాదికి కొత్తగా 80 శాఖలు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నాము'' అని యస్ బ్యాంకు ఎండీ, సీఈవో ప్రశాంత్ కుమార్ వెల్లడించారు.

మూడేళ్లలో జర్మనీ, జపాన్‌ను అధిగమిస్తాం

- 2047 నాటికి రెండో స్థానం మనదే
- నీతి ఆయోగ్ సీఈవో సుబ్రమణ్యం



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ వచ్చే మూడేళ్లలో జర్మనీ, జపాన్‌లను అధిగమిస్తుందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం అన్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచానికి విద్యా కేంద్రంగా భారత్ ఎదుగుతుందన్నారు. మిగతావన్నీ పక్కన పెడితే, భారత్‌కు ఉన్న అతిపెద్ద సానుకూలత ప్రజాస్వామ్యంగా పేర్కొన్నారు. ''ప్రస్తుతం భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. వచ్చే ఏడాది చివరికి నాలుగో స్థానానికి చేరుకుంటాం. ఆ తర్వాతి సంవత్సరంలో మూడో స్థానాన్ని సాధిస్తాం''అని సుబ్రమణ్యం చెప్పారు. ఐఎంఎఫ్ తాజా డేటా ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4.3 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. భారత కంపెనీలు, న్యాయ సేవల సంస్థలు, అకౌంటింగ్ సంస్థలు ప్రపంచ దిగ్గజాలుగా ఎదిగే ఆకాంక్షలతో పనిచేయాలని సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. తక్కువ ఆదాయ దేశాల్లోని సమస్యలతో పోల్చితే మధ్యాదాయ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలు భిన్నమైనవిగా పేర్కొన్నారు. ప్రపంచానికి పని చేసే కార్మిక శక్తిని భారత్ అందిస్తున్నట్టు చెప్పారు. జపాన్ 15వేల మంది భారత నర్సులను తీసుకుంటే, జర్మనీ 20వేల మంది హెల్త్‌కేర్ సిబ్బందిని నియమించుకున్నట్టు గుర్తు చేశారు. వారిదగ్గర కుటుంబ వ్యవస్థ ముక్కలైనట్టు వ్యాఖ్యానించారు.

భారత్‌లో 29 లక్షల యాడ్ అకౌంట్స్ సస్పెన్షన్: గూగుల్



న్యూఢిల్లీ: ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్ గతేడాది (2024) భారత్‌లో 29 లక్షల అడ్వర్టైజర్ల ఖాతాలను సస్పెండ్ చేసింది. అడ్వర్టైజింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను 24.74 కోట్ల ప్రకటనలను తొలగించింది. అంతర్జాతీయంగా 3.92 కోట్ల అడ్వర్టైజర్ అకౌంట్లను సస్పెండ్ చేయగా 510 కోట్ల ప్రకటనలను తొలగించింది. 910 కోట్ల ప్రకటనలపై ఆంక్షలు విధించింది. వార్షిక యాడ్స్ సేఫ్టీ నివేదికలో కంపెనీ ఈ విషయాలు వెల్లడించింది. సంక్లిష్టమైన విచారణలను వేగవంతం చేసేందుకు, అకౌంట్ సెటప్ సమయంలో పేమెంట్లకు సంబంధించి తప్పుడు వివరాలను సత్వరం పసిగట్టేలా తమ వ్యవస్థలను పటిష్టం చేసుకున్నట్లు గూగుల్ పేర్కొంది. మోసాలను నివారించే దిశగా స్కామ్‌లను ప్రమోట్ చేసే అడ్వర్టైజర్లను సస్పెండ్ చేయడంలాంటి చర్యలు తీసుకునేందుకు 100కు పైగా నిపుణులతో ఏర్పాటు చేసిన బృందం తమ నిబంధనల్లో పలు కీలక మార్పులు చేసినట్లు వివరించింది. దీంతో స్కామ్ యాడ్‌లపై ఫిర్యాదులు గణనీయంగా తగ్గినట్లు తెలిపింది.

కేఫిన్‌టెక్ చేతికి ఎసెంట్ ఫండ్ సర్వీసెస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్వెస్టర్ సొల్యూషన్స్ సేవల సంస్థ కేఫిన్ టెక్నాలజీస్ తాజాగా ఎసెంట్ ఫండ్ సర్వీసెస్‌లో 51 శాతం వాటాల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ 34.7 మిలియన్ డాలర్లు. వచ్చే అయిదేళ్లలో ఎసెంట్‌లో కేఫిన్‌టెక్ 100 శాతానికి వాటాలు పెంచుకోనుంది. ఇందుకోసం మిగతా 49 శాతం వాటాలను 2028, 2029, 2030లో ఏడాదికి 16.33 శాతం చొప్పున దక్కించుకోనుంది. సింగపూర్ హెడ్‌క్వార్టర్స్‌గా కార్యకలాపాలు సాగిస్తున్న ఎసెంట్ అంతర్జాతీయంగా 260 పైచిలుకు గ్లోబల్ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజర్లకు ఫండ్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసులు అందిస్తోంది. అత్యంత వేగంగా ఎదుగుతున్న అంతర్జాతీయ ఫండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కేఫిన్‌టెక్ విస్తరించేందుకు ఈ డీల్ ఉపయోగపడుతుందని సంస్థ ఎండీ శ్రీకాంత్ నాదెళ్ల తెలిపారు. ఇరు సంస్థలు సమిష్టిగా మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకుని, పరిశ్రమలో కొత్త ప్రమాణాలు నెలకొల్పుతాయని ఎసెంట్ సహ-వ్యవస్థాపకుడు కౌశల్ మండలియా తెలిపారు.

భద్రతా కోణంలోనే.. రక్షణాత్మకం కాదు

స్టీల్, అల్యూమినియం సుంకాలపై యూఎస్ వాదన



న్యూఢిల్లీ: స్టీల్, అల్యూమినియం దిగుమతులపై తాము విధించిన సుంకాలు దేశ భద్రతా కోణంలోనే తప్పించి రక్షణాత్మక చర్యల కింద చూడరాదని అమెరికా కోరింది. అమెరికా జాతీయ భద్రతకు స్టీల్, అల్యూమినియం దిగుమతులు ముప్పుగా పరిణమించడంతో, దీన్ని సర్దుబాటు చేయడానికి సెక్షన్ 232 కింద అధ్యక్షుడు టారిఫ్‌లను ప్రకటించినట్టు వివరించింది. ఈ మేరకు ప్రపంచ వాణిజ్య సంస్థకు బదులిచ్చింది. డబ్ల్యూటీవో సేఫ్‌గార్డ్ అగ్రిమెంట్‌లోని ఆర్టికల్ 12.3 కింద అమెరికాతో సంప్రదింపులకు ఏప్రిల్ 11న భారత్ ప్రతిపాదన చేయడంతో ఈ సమాధానం వచ్చింది. ''ఇవి ఎంత మాత్రం రక్షణాత్మక చర్యలు కావు. కనుక రక్షణాత్మక చర్యల కింద సంప్రదింపులకు ఎలాంటి ప్రాతిపదిక లేదు. అయినప్పటికీ ఈ అంశమే కాదు, ఏ అంశంపై అయినా భారత్‌తో చర్చలకు సుముఖంగా ఉన్నాం. కాకపోతే, చర్చలు ఏవైనా కానీ రక్షణాత్మక చర్యల ఒప్పందం కింద ఉండకూడదు''అని అమెరికా స్పష్టం చేసింది. అయితే, అమెరికా వాదనను భారత్ అంగీకరించలేదు. భద్రతా కోణంలోనే అని అమెరికా చెప్పినప్పటికీ.. అవి రక్షణాత్మక చర్యలేనని వాదించింది. ఈ ఒప్పందం కింద చర్యలను డబ్ల్యూటీవో కమిటీకి తెలియజేయడంలో అమెరికా విఫలమైనట్టు పేర్కొంది.

రీట్, ఇన్విట్‌లలో ఫండ్స్ మరిన్ని పెట్టుబడులు!

ప్రతిపాదించిన సెబీ



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)లలో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల పరిమితిని పెంచే ప్రతిపాదనను సెబీ ముందుకు తీసుకొచ్చింది. ఈ నిర్ణయం అమలైతే అప్పుడు రీట్, ఇన్విట్‌లలో మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు మార్గం సుగమం అవుతుంది. తద్వారా వీటిల్లో లిక్విడిటీ మరింత మెరుగుపడనుంది. ప్రస్తుతం ఒక ఫండ్ ఎస్‌పీవీలో గరిష్టంగా 10 శాతం మేరే రీట్, ఇన్విట్‌లలో పెట్టుబడులకు అనుమతి ఉంది. ఇప్పుడు దీన్ని ఈక్విటీ, హైబ్రిడ్ ఫండ్స్‌కు 20 శాతానికి ప్రతిపాదించింది. మే 11 వరకు ఈ ప్రతిపాదనలపై అభిప్రాయాలను తెలియజేయాలని సెబీ కోరింది.

మార్చిలో జోరుగా పసిడి దిగుమతులు

- రూ.38వేల కోట్లు
- 192 శాతం అధికం
- 2024–25లో మిశ్రమ ధోరణి
- రూ.4.99 లక్షల కోట్ల దిగుమతులు



న్యూఢిల్లీ: బంగారం దిగుమతులు మార్చిలో గణనీయంగా పెరిగాయి. ఏకంగా 192 శాతం అధికంగా 4.47 బిలియన్ డాలర్ల (రూ.38వేల కోట్లు సుమారు) విలువైన పసిడి దిగుమతి అయినట్టు కేంద్ర వాణిజ్య శాఖ గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2024 మార్చి నెలలో దిగుమతులు 1.53 బిలియన్ డాలర్లుగానే ఉండడం గమనార్హం. ఇక గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద చూస్తే బంగారం దిగుమతుల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. విలువ పరంగా వృద్ధి కనిపించగా, పరిమాణం పరంగా పసిడి దిగుమతులు తగ్గాయి. బంగారం దిగుమతులు 2023–24తో పోల్చి చూస్తే గత ఆర్థిక సంవత్సరంలో విలువ పరంగా 27 శాతం ఎగసి 58 బిలియన్ డాలర్లకు (రూ.4.99 లక్షల కోట్లు సుమారు) చేరాయి. 2023–24 సంవత్సరంలో పసిడి దిగుమతులు 45.54 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. పరిమాణం పరంగా 757.15 టన్నుల బంగారం గత ఆర్థిక సంవత్సరంలో దిగుమతి అయింది. 2023–24లో ఇది 795.32 టన్నులుగా ఉండడం గమనించొచ్చు. దిగుమతి పరిమాణం తగ్గినప్పటికీ ధరల పెరుగుదలతో విలువ పరంగా వృద్ధి నమోదైంది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలో పసిడి దిగుమతులు అంతకుముందు ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 62 శాతం తగ్గగా (విలువ పరంగా), జనవరిలో 41 శాతం, 2024 డిసెంబర్‌లో 55 శాతం చొప్పున పెరిగాయి. సురక్షిత సాధనంగా బంగారాన్ని పరిగణిస్తూ పెట్టుబడులు పెట్టే ధోరణి పెరగడం దిగుమతులకు మద్దతుగా నిలిచినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకుతోడు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలతో అనిశ్చితులు పెరిగిపోవడాన్ని గుర్తు చేస్తున్నారు.

వాణిజ్య లోటుకు ఆజ్యం

బంగారం దిగుమతుల విలువ పెరగడం దేశ వాణిజ్య లోటు పెరిగేందుకు దారితీసింది. మార్చి నెలలో వాణిజ్య లోటు 21.54 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి 283 బిలియన్ డాలర్ల లోటుతో ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకడం గమనార్హం.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్..

- మార్చి క్వార్టర్‌లో 18 శాతం అప్
- రూ. 12,630 కోట్లు
- రూ. 11 డివిడెండ్



ముంబై: ప్రైవేట్ రంగంలో రెండో అతి పెద్ద బ్యాంక్ ఐసీఐసీఐ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 12,630 కోట్ల నికర లాభం (స్టాండెలోన్ ప్రాతిపదికన) నమోదు చేసింది. క్రితం క్యూ4లో నమోదైన రూ. 10,708 కోట్లతో పోలిస్తే ఇది సుమారు 18 శాతం అధికం. తాజా క్యూ4లో లాభం రూ. 12,050 కోట్లుగా ఉంటుందని విశ్లేషకులు అంచనా వేశారు. సీక్వెన్షియల్‌గా డిసెబర్ త్రైమాసికంతో పోలిస్తే నికర లాభం 7 శాతం పెరిగింది. రూ. 2 ముఖ విలువ ఉండే ఒక్కో షేరుపై రూ. 11 చొప్పున బ్యాంకు డివిడెండ్ ప్రకటించింది.

తగ్గిన మొండిబాకీలు..

సమీక్షాకాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి 2.16 శాతం నుంచి 1.67 శాతానికి దిగి వచ్చింది. అలాగే నికర ఎన్‌పీఏల నిష్పత్తి 0.42 శాతం నుంచి 0.39 శాతానికి తగ్గింది. పరిమాణం పరంగా చూస్తే రూ. 27,962 కోట్ల నుంచి రూ. 24,166 కోట్లకు స్థూల ఎన్‌పీఏలు దిగి వచ్చాయి. సీక్వెన్షియల్‌గా చూస్తే డిసెంబర్ క్వార్టర్‌లో స్థూల ఎన్‌పీఏల నిష్పత్తి 1.96 శాతంగా, నికర ఎన్‌పీఏల నిష్పత్తి 0.42 శాతంగా ఉంది. మొండి బాకీలకు ప్రొవిజనింగ్ (పన్నులకు ప్రొవిజన్ మినహాయించి) రూ. 718 కోట్ల నుంచి రూ. 891 కోట్లకు చేరింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన బ్యాంక్ లాభం సుమారు 16 శాతం పెరిగి రూ. 13,502 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 400 శాఖలు ప్రారంభించనున్నట్లు బ్యాంక్ తెలిపింది.

డిపాజిట్లు 14 శాతం అప్..

- ఐసీఐసీఐ బ్యాంక్ డిపాజిట్లు వార్షికంగా క్రితం క్యూ4తో పోలిస్తే తాజా క్యూ4లో 14 శాతం, క్వార్టర్‌లవారీగా చూస్తే సుమారు 6 శాతం పెరిగాయి. మార్చి 31 నాటికి మొత్తం డిపాజిట్లు రూ. 16.11 లక్షల కోట్లుగా ఉన్నాయి.
- దేశీయంగా నికర రుణాలు వార్షికంగా 13.9 శాతం, సీక్వెన్షియల్‌గా 2.2 శాతం పెరిగాయి. రిటైల్ రుణాల పోర్ట్‌ఫోలియో వార్షికంగా 8.9 శాతం, సీక్వెన్షియల్‌గా 2 శాతం పెరిగింది. మొత్తం రుణాల పోర్ట్‌ఫోలియోలో రిటైల్ రుణాల వాటా 52.4 శాతంగా ఉంది. చిన్న, మధ్య తరహా సంస్థలకు రుణాల పోర్ట్‌ఫోలియో 33.7 శాతం, రూరల్ రుణాల పోర్ట్‌ఫోలియో 5.1 శాతం, కార్పొరేట్ రుణాల పోర్ట్‌ఫోలియో 11.9% పెరిగింది. వార్షికంగా మొత్తం రుణాలు 13.3 శాతం, సీక్వెన్షియల్‌గా 2.1 శాతం పెరిగి రూ. 13.42 లక్షల కోట్లకు చేరాయి.
- నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 11 శాతం పెరిగి రూ. 19,093 కోట్ల నుంచి రూ. 21,193 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.40 శాతం నుంచి 4.41 శాతానికి చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఎన్ఐఎం 4.32 శాతంగా ఉంది.
- క్యూ4లో బ్యాంకు కొత్తగా 241 శాఖలు ప్రారంభించింది. దీంతో మొత్తం శాఖల నెట్‌వర్క్ 6,983కి చేరింది. 2025 మార్చి 31 నాటికి మొత్తం ఏటీఎంలు, క్యాష్ రీసైక్లింగ్ మెషిన్ల సంఖ్య 16,285గా ఉంది.

ఆర్ఈ పరికరాల్లోకి బీసీ జిందాల్

2,030కల్లా రూ. 15,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన(ఆర్ఈ) పరికరాల తయారీలోకి ప్రవేశించినట్లు బీసీ జిందాల్ గ్రూప్ తాజాగా ప్రకటించింది. 2030కల్లా రూ. 15,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలున్నట్లు వెల్లడించింది. బిజినెస్ పోర్ట్‌ఫోలియో విస్తరణలో భాగంగా ఆర్ఈ సంబంధ కీలక పరికరాలను రూపొందించనున్నట్లు పేర్కొంది. సోలార్ సెల్స్, మాడ్యూల్స్, స్టోరేజీ బ్యాటరీ సెల్స్, సోలార్ గ్లాస్ అసెంబ్లీ తదితరాలను తయారు చేయను న్నట్లు తెలియజే సింది. ప్రాజెక్ట్ తొలి దశలో భాగం గా రూ. 4,000 కోట్ల పెట్టుబడులను వెచ్చించనుంది. తద్వారా ఆర్ఈ పరికరాల తయారీకి ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేసింది. తొలి దశలో భాగంగా 2 గిగావాట్ల సోలార్ సెల్ తయారీ, సోలార్ మాడ్యూల్ ఉత్పత్తి, 4 జీడబ్ల్యూహెచ్ బ్యాటరీ స్టోరేజీ సామర్థ్యంతోపాటు.. రోజుకి 1,200 టన్నుల సోలార్ గ్యాస్ తయారీకి యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది.



వన్డే వరల్డ్‌కప్‌కు బంగ్లాదేశ్ క్వాలిఫై

- చివరి మ్యాచ్‌లో పాకిస్తాన్ చేతిలో ఓటమి
- 0.013 రన్‌రేట్‌తో వెస్టిండీస్‌కు నిరాశ
- మహిళల వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్

లాహోర్: భారత్ వేదికగా ఈ ఏడాది చివర్లో జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నమెంట్‌కు బంగ్లాదేశ్ అర్హత సాధించింది. పాకిస్తాన్‌లో జరుగుతున్న వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలవడం ద్వారా బంగ్లాదేశ్ వరల్డ్‌కప్ బెర్త్ దక్కించుకుంది. శనివారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్ చేతిలో పరాజయం పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. రితూ మోని (48; 5 ఫోర్లు), ఫహీమా ఖాతూన్ (44 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. పాకిస్తాన్ బౌలర్లలో సాదియా 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ మహిళల జట్టు 39.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మునీబా అలీ (93 బంతుల్లో 69; 8 ఫోర్లు), ఆలియా రియాజ్ (52 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) సత్తాచాటారు. ఈ టోర్నీలో ఆడిన 5 మ్యాచ్‌ల్లోనూ గెలిచిన పాకిస్తాన్ 10 పాయింట్లతో పట్టిక అగ్ర స్థానంలో నిలవగా... బంగ్లాదేశ్ జట్టు 5 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 2 పరాజయాలతో 6 పాయింట్లు ఖాతాలో వేసుకున్న బంగ్లాదేశ్ రెండో 'ప్లేస్'దక్కించుకుంది. వెస్టిండీస్ కూడా 5 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 2 ఓటములతో 6 పాయింట్లు సాధించినా... రన్‌రేట్‌లో స్వల్పంగా మెరుగ్గా ఉన్న బంగ్లాదేశ్ ముందంజ వేసింది.

మాథ్యూస్ మెరుపులు వృథా...



వెస్టిండీస్ మహిళల జట్టుకు నిరాశ తప్పలేదు. థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌లో 10 ఓవర్లలో లక్ష్యఛేదన పూర్తిచేస్తే మెరుగైన రన్‌రేట్‌తో వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించే అవకాశం ఉండగా...ఐదు బంతుల తేడాతో అవకాశం కోల్పోయింది. ఆ జట్టు 10.5 ఓవర్లలో 168 పరుగులు చేసింది. మొదట థాయ్‌లాండ్ మహిళల జట్టు 46.1 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. నాథకన్ చాంతమ్ (66; 7 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా.. విండీస్ బౌలర్లలో అఫీ ఫ్లెచర్ 4, ఆలియా అలీనె 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం ఛేదనలో విండీస్ 10.5 ఓవర్లలో 4 వికెట్లకు 168 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ హేలీ మాథ్యూస్ (29 బంతుల్లో 70; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగగా... షినెల్ హెన్రీ (17 బంతుల్లో 48; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) దంచికొట్టింది. మాథ్యూస్ మెరుపులతో కరీబియన్ జట్టు సునాయాసంగా గమ్యాన్ని చేరేలా కనిపించినా... కీలక సమయంలో ఆమె అవుట్ కావడం విండీస్ అవకాశాలను దెబ్బకొట్టింది. చివర్లో హెన్రీ విజృంభించినా... అది సాధ్యపడలేదు. లీగ్ మ్యాచ్‌లు ముగిసేసరికి బంగ్లాదేశ్ 0.639 రన్‌రేట్‌తో నిలవగా... వెస్టిండీస్ 0.626తో నిలిచింది. అంటే 0.013 తేడాతో వెస్టిండీస్ వరల్డ్‌కప్ పోటీ నుంచి తప్పుకుంది.

తటస్థ వేదికపై వరల్డ్‌కప్‌లో పాకిస్తాన్ మ్యాచ్‌లు

ఈ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లలో భారత్ వేదికగా జరగనున్న మహిళల వన్డే వరల్డ్‌కప్ కోసం పాకిస్తాన్ జట్టు భారత్‌లో పర్యటించబోదని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహసిన్ నఖ్వీ శనివారం స్పష్టం చేశారు. సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల ఐసీసీ పురుషుల చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు టీమిండియా పాకిస్తాన్‌లో పర్యటించేందుకు నిరాకరించింది. దీంతో రోహిత్ సేన ఆడే మ్యాచ్‌లను 'హైబ్రీడ్ మోడల్'లో దుబాయ్‌లో నిర్వహించారు. ఇప్పుడదే రీతిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్ ఆడనున్న మ్యాచ్‌లను తటస్థ వేదికపై నిర్వహించనున్నారు. దీనికి గతంలోనే ఇరు దేశాల క్రికెట్ బోర్డులు అంగీకారం తెలిపాయి. 'భారత జట్టు పాకిస్తాన్‌లో చాంపియన్స్ ట్రోఫీ ఆడలేదు. తటస్థ వేదికపై మ్యాచ్‌లు ఆడింది. ఇప్పుడు మహిళల ప్రపంచకప్ విషయంలోనే అదే జరుగుతుంది. ఆతిథ్య హోదాలో భారత్ నిర్ణయించిన తటస్థ వేదికపై మ్యాచ్‌లు ఆడేందుకు పాకిస్తాన్ క్రికెట్ జట్టు సిద్ధంగా ఉంది' అని నఖ్వీ పేర్కొన్నారు.

జాతీయ ప్రాబబుల్స్‌కు 39 మంది ప్లేయర్లు

న్యూఢిల్లీ: మహిళల ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీ క్వాలిఫయర్స్‌కు ముందు నిర్వహించనున్న జాతీయ శిబిరానికి 39 మంది ప్లేయర్లు ఎంపికయ్యారు. జూన్, జూలైలో జరగనున్న ఈ అర్హత పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చడమే లక్ష్యంగా... జాతీయ మహిళల సీనియర్ ఫుట్‌బాల్ టీమ్ కోచ్ క్రిస్పిన్ ఛెత్రీ శనివారం 39 మంది ప్లేయర్లను ఎంపిక చేసింది. **ఈ ప్రాబబుల్స్‌లో తెలంగాణకు చెందిన సౌమ్య గుగులోత్ చోటు దక్కించుకుంది. ఇటీవల ఇండియన్ ఉమెన్ లీగ్ (ఐడబ్ల్యూఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తరఫున 9 గోల్స్‌తో సత్తాచాటిన సౌమ్య... ఇప్పటికే జాతీయ జట్టు తరఫున 33 మ్యాచ్‌లాడింది.** మహిళల ఆసియాకప్ 2026 క్వాలిఫయింగ్ టోర్నీకి థాయ్‌లాండ్ ఆతిథ్యమిస్తోంది. జూన్ 23 నుంచి జూలై 5 వరకు జరగనున్న ఈ టోర్నీలో భారత జట్టు గ్రూప్ 'బి' నుంచి బరిలోకి దిగనుంది. ఆతిథ్య థాయ్‌లాండ్, మంగోలియా, టిమోర్ లెస్ట్, ఇరాక్‌తో భారత జట్టు తలపడుతుంది. దానికి ముందు భారత ప్లేయర్ల కోసం మే1 నుంచి బెంగళూరులో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. సీనియర్ ప్లేయర్లు బాలా దేవి, ఆశాలత దేవికి ఈ ప్రాబబుల్స్‌లో చోటు దక్కలేదు. ఇటీవల ఐడబ్ల్యూఎల్‌లో రాణించిన యంగ్ ప్లేయర్లకు ఎక్కువ అవకాశాలు లభించాయి.

ప్రాబబుల్స్: పాయల్, ఎలాంగ్‌బమ్ చాను, కైశమ్ మెలోడీ చాను, మోనాలిసా దేవి (గోల్ కీపర్స్), పూర్ణిమ కుమారి, నిర్మలా దేవి, మార్టినా థోక్‌చమ్, శుభాంగి సింగ్, సంజూ, మాలతీ, టోయిజమ్ చాను, రంజనా చాను, స్వీటి దేవి, వికసిత్ బారా, షిల్కీ దేవి (డిఫెండర్స్), కిరణ్, రత్నబాలా దేవి, ముస్కాన్, బబీనా దేవి, కార్తీక అంగముత్తు, కోల్నీ, సంగీత, ప్రియదర్శిని, బేబే సనా, సంతోష్, అంజూ తమాంగ్ (మిడ్‌ఫీల్డర్స్), మౌసుమీ ముర్ము,



మాళవిక, సంధ్య రంగనాథన్, సౌమ్య గుగులోత్, సులాజన, లిండా కామ్, రింపా హల్దార్, మనీషా నాయక్, రేణు, కరిష్మా పురుషోత్తమ్, సుమతి, మనీషా, గ్రేస్ డాంగ్‌మెయి (ఫార్వర్డ్స్).

ఆటపై అభి'రుచి'

పతకాలపైనే గురి
- షూటింగ్‌లో దూసుకొస్తున్న సురుచి సింగ్
- ప్రపంచకప్‌లో మూడు స్వర్ణాలు సొంతం

సాక్షి క్రీడా విభాగం

పెరూ రాజధాని లిమా నగరంలో ప్రపంచ కప్ షూటింగ్ టోర్నీ... భారత స్టార్ షూటర్, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ మనూ భాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో బరిలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత మొదటిసారి బరిలోకి దిగిన మనూ స్వర్ణం గెలవడం ఖాయం అన్నట్లుగా అంచనాలు ఆమెపైనే ఉన్నాయి. కానీ చివరకు అనూహ్య ఫలితం వచ్చింది. భారత్‌కే చెందిన మరో యువ షూటర్, 18 ఏళ్ల సురుచి సింగ్ దూసుకొచ్చింది. మనూ భాకర్‌ను వెనక్కి నెట్టి ఆమె స్వర్ణపతకం సొంతం చేసుకుంది. ఒలింపిక్ మెడలిస్ట్ మనూ భాకర్ రజతానికి పరిమితం కావాల్సి వచ్చింది. దాంతో ఒక్కసారిగా అందరి దృష్టి ఆమెపై పడింది. మనూ భాకర్‌పై గెలిచిన రెండో రోజు సురుచి పిస్టల్ మళ్లీ మెరిసింది. ఈసారి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కే చెందిన సౌరభ్ చౌదరీతో కలిసి సురుచి మరో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. అంతకు ముందు వారమే అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో జరిగిన తొలి ప్రపంచ కప్‌లో స్వర్ణం నెగ్గిన ఆమెకు ఓవరాల్‌గా ఇది మూడో స్వర్ణం. అయితే మొదటి స్వర్ణంతో పోలిస్తే మనూ భాకర్‌ను ఓడించి సాధించిన పసిడి పతకం విలువ పెద్దదిగా మారిపోయింది.







బాక్సింగ్, రెజ్లింగ్‌ను కాదని...

సురుచి స్వస్థలం హరియాణాలోని జఝర్. దేశంలోనే బాక్సింగ్‌కు అడ్డాగా ఒలింపిక్ మెడలిస్ట్ విజేందర్ సింగ్ సహా ఎంతో మంది బాక్సర్లు ఓనమాలు నేర్చుకొని అగ్రస్థాయికి చేరిన భివానికి సమీపంలో ఇది ఉంటుంది. జఝర్‌కు చెందిన ఇందర్ సింగ్ ఆర్మీలో హవల్దార్‌గా పని చేశాడు. ఒకప్పుడు గొప్ప రెజ్లర్‌గా గుర్తింపు తెచ్చుకున్న గూంగా (మూగ) పహిల్వాన్ (వీరేందర్ సింగ్) ఇతనికి సోదరుని వరుస (కజిన్) అవుతాడు. తన కజిన్ తరహాలోనే తన కూతురు సురుచిని కూడా రెజ్లర్‌ను చేయాలని ఇందర్ సింగ్ ఆశించాడు. అయితే ఆ అమ్మాయి మాత్రం మరోవైపు ఆసక్తిని చూపించింది. అటు బాక్సింగ్, ఇటు రెజ్లింగ్ కాకుండా షూటింగ్‌ను ఎంచుకుంది. అందులో టాప్ ప్లేయర్ కావడమే లక్ష్యంగా పెట్టుకుంది. కూతురి ఇష్టాన్ని గుర్తించిన ఇందర్ సింగ్ ఆమెను భివానిలోని గురు ద్రోణాచార్య షూటింగ్ అకాడమీలో చేర్పించాడు. ఆపై తన ఆర్మీ ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి స్థాయిలో కూతురును షూటర్‌ను చేసేందుకు తన సమయం వెచ్చించాడు. 13 ఏళ్ల సురుచి కోచ్ సురేశ్ సింగ్ మార్గనిర్దేశనంలో షూటింగ్‌ను నేర్చుకొని అందులో పట్టు సంపాదించింది. ఇక ముమ్మందు టోర్నీల్లో విజయాలే లక్ష్యంగా ఆమె సిద్ధమవుతూ వచ్చింది. అప్పుడే కోవిడ్ మహమ్మారి వచ్చేసింది. ప్రపంచంలో ఎంతో మంది ప్లేయర్లకు వచ్చిన కష్టమే సురుచికి కూడా వచ్చింది.

సొంత ఊర్లో సాధన...

కోవిడ్ సమయంలో భివానికి వెళ్లి ప్రాక్టీస్ చేయడం అసాధ్యంగా మారింది. అప్పటికే సురుచి కొన్ని జూనియర్ టోర్నమెంట్‌లలో పాల్గొంటూ వచ్చింది. ఆ సమయంలో మరో ప్రత్యామ్నాయం కోసం చూస్తున్న ఇందర్ సింగ్‌కు తమ స్వగ్రామంలోనే కొత్తగా ఏర్పాటైన కార్గిల్ షూటింగ్ అకాడమీ కలిసొచ్చింది. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న అనిల్ జాఖడ్ ఆర్మీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన అకాడమీ ఇది. దాంతో ఇక్కడే సురుచి సాధన మళ్లీ మొదలైంది. ఆమె తన ఆటపైనే పూర్తిగా దృష్టి పెట్టి సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఈ శిక్షణ కోవిడ్ తర్వాత మంచి ప్రభావం చూపించింది. 2022 జాతీయ చాంపియన్‌షిప్‌లో ఆమె తొలి సారి పతకం గెలుచుకొని తన విజయ ప్రస్థానాన్ని మొదలు పెట్టింది. ఆ తర్వాత 2023 జాతీయ చాంపియన్‌షిప్‌లో కూడా పతకాలు సాధించింది. అయితే 2024లో జరిగిన పోటీలు ఆమె స్థాయిని షూటింగ్ ప్రపంచానికి తెలియజేశాయి. ఈసారి ఏకంగా 7 పతకాలతో మెరిసిన సురుచికి భారత భవిష్యత్తు స్టార్‌గా గుర్తింపు వచ్చింది.

స్టార్ షూటర్ శిక్షణలో...

ప్రఖ్యాత పిస్టల్ షూటర్ జీతూ రాయ్ భారత జట్టు కోచింగ్ బృందంలోకి వచ్చాక సురుచి ఆట మరింత పదునెక్కింది. షూట్ చేసే సమయంలో ఆమె నిలిచే తీరులో ఉన్న స్వల్ప లోపాన్ని సవరించడంతో పాటు కీలక సమయాల్లో ఒత్తిడిని తట్టుకునే విషయంలో జీతూ రాయ్ ఆమెకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. సురుచి ఇటీవలి వరుస విజయాల్లో రాయ్ పాత్ర కూడా చాలా ఉంది. ముఖ్యంగా వరల్డ్ కప్‌కు ముందు కర్ణీ సింగ్ షూటింగ్ రేంజ్‌లో జీతూ రాయ్ మార్గనిర్దేశనంలో జరిగిన 15 రోజుల ప్రత్యేక శిక్షణా శిబిరం సురుచికి ఎంతో మేలు చేసింది. వరల్డ్ కప్‌లో 2 వ్యక్తిగత స్వర్ణాలతో పాటు మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సౌరభ్ చౌదరితో కలిసి మరో పసిడిని కూడా ఆమె సొంతం చేసుకొని తన స్వర్ణాల సంఖ్యను మూడుకు పెంచుకుంది. ఓపికకు చిరునామావంటి షూటింగ్ క్రీడలో కెరీర్ ఆరంభంలో ఆమె త్వరగా ప్రాక్టీస్ ముగించే ప్రయత్నంలో కాస్త అసహనం ప్రదర్శించేది. కానీ కోచ్‌లు దీనిని గుర్తించి ఆమెకు సరైన దిశానిర్దేశం చేశారు. ఆటలో ఎదగాలంటే సాంకేతిక అంశాలే కాదు వ్యక్తిగత లోపాలు కూడా దిద్దుకోవాలని వారు చేసిన సూచనలను ఆమె అర్థం చేసుకుంది. ఇప్పుడు ప్రాక్టీస్‌లో కూడా తన అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి పర్‌ఫెక్షన్ వచ్చే వరకు సురుచి అక్కడినుంచి కదలదు. అలాంటి పట్టుదల అలవాటు చేసుకొని పెద్ద లక్ష్యాలతో ఆమె ముందుకు సాగుతోంది. తొలి కోచ్ సురేశ్ సింగ్ నుంచి జీతూ రాయ్ వరకు ఇప్పుడు కష్టపడే తత్వం గురించే చెబుతుండటం విశేషం. వరల్డ్ కప్ తరహా ప్రదర్శనలు పునరావృతం చేస్తూ నిలకడగా సాగితే భవిష్యత్తులో సురుచి నుంచి కూడా ఒలింపిక్ పతకం ఆశించవచ్చు.

రామ్ బాబుకు పసిడి

జాతీయ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్

చండీగఢ్: జాతీయ ఓపెన్ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్ బాబు పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. శనివారం జరిగిన రేస్‌లో రామ్ బాబు 35 కిలోమీటర్ల దూరాన్ని... 2 గంటల 32 నిమిషాల 53.50 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్ర స్థానంలో నిలిచాడు. 2022 ఆసియా క్రీడల్లో మంజు రాణితో కలిసి మిక్స్‌డ్ రేస్‌వాక్‌లో కాంస్యం నెగ్గిన రామ్ బాబు... జాతీయ పోటీల్లోనూ అదే జోరు కనబర్చాడు. అయితే తన పేరిటే ఉన్న జాతీయ రికార్డు (2 గంటల 29 నిమిషాల 56 సెకన్లు)ను మాత్రం సవరించలేకపోయాడు. 20 కిలోమీటర్ల విభాగంలో... సెబాస్టియన్ స్వర్ణం చేజిక్కించుకున్నాడు. 1 గంట 21 నిమిషాల 46.47 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. అమిత్ (1 గంట 21 నిమిషాల 51.46 సెకన్లు), అమన్‌జ్యోత్ సింగ్ (1 గంట 22 నిమిషాల 12.72 సెకన్లు) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. వచ్చే నెలలో జరగనున్న ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు 1 గంట 24 నిమిషాల 50 సెకన్లు అర్హత మార్క్ కాగా... ఈ ముగ్గురూ దానికంటే మెరుగైన టైమింగ్ నమోదు చేసుకున్నారు. మహిళల 20 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో రవీనా (1 గంట 35 నిమిషాల 58.80 సెకన్లు) స్వర్ణం గెలుచుకుంది.



మహిళల విభాగంలో 35కు బదులు 34 కిలోమీటర్లు!

మహిళల విభాగంలో ఫలితాలు వెల్లడించలేదు. మహిళా వాకర్లు రేసును పూర్తి చేయకుండానే ముగింపు గీత దాటడంతో ఫలితాలు నిలిపివేశారు. మొదట సాంకేతిక కారణాలతో మహిళల విభాగంలో ఫలితాలను నిలిపివేసినట్లు ప్రకటించిన నిర్వాహకులు ఆ తర్వాత అసలు విషయాన్ని బయటపెట్టారు. 35 కిలోమీటర్ల రేసుకు బదులు మహిళలు 34 కిలోమీటర్లను మాత్రమే పూర్తి చేసినట్లు సమాచారం. ఈ రేసులో పాయల్ 2 గంటల 51 నిమిషాల 48.76 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానం దక్కించుకుంది. అయితే ఈ ఫలితాలు పరిగణనలోకి రావు. 2024లోనూ ఇక్కడ జరిగిన జాతీయ ఓపెన్ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. అప్పుడు తప్పుడు గణాంకాలు నమోదు కావడంతో... ఆ తర్వాత వరల్డ్ అథ్లెటిక్స్ సంఘం సమయాలను సవరించింది.

మళ్లీ కోల్‌కతాకు అభిషేక్ నాయర్

కోల్‌కతా: భారత జట్టు అసిస్టెంట్ కోచ్ పదవిని కోల్పోయిన అభిషేక్ నాయర్ తిరిగి ఐపీఎల్ టీమ్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) గూటికి చేరాడు. టీమిండియా మాజీ ఆటగాడు గౌతమ్ గంభీర్ భారత హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎనిమిది నెలల క్రితం ఎలాంటి దరఖాస్తులు, ఇంటర్వ్యూలు లేకుండా నేరుగా సహాయక కోచ్‌గా ఎంపికైన అభిషేక్ నాయర్‌ను ఇటీవల భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆ పదవి నుంచి తొలగించింది. దీంతో



ఐపీఎల్‌లో గతంలో పనిచేసిన కేకేఆర్ యాజమాన్యం అతడిని తిరిగి తీసుకుంది. అయితే అభిషేక్ నాయర్ బాధ్యతలేంటో మాత్రం ఫ్రాంచైజీ వెల్లడించలేదు. 2024లో ఐపీఎల్ ట్రోఫీ నెగ్గిన కేకేఆర్ జట్టుకు నాయర్ సహాయక కోచ్‌గా వ్యవహరించాడు. దీంతో పాటు కేకేఆర్ అకాడమీని స్థాపించడంలో నాయర్ కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో 'ఇంటికి తిరిగి స్వాగతం... అభిషేక్ నాయర్' అని కోల్‌కతా ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. సోమవారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో అభిషేక్... కేకేఆర్ డగౌట్‌లో దర్శనమివ్వనున్నాడు. ఇప్పటికే కోల్‌కతా జట్టుతో కలిసిన అభిషేక్ ప్లేయర్ల ప్రాక్టీస్‌ను పర్యవేక్షిస్తున్నాడు. టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్‌లో 0–3తో ఓటమి, ఆపై ఆస్ట్రేలియా గడ్డపై 'బోర్డర్ గావస్కర్ ట్రోఫీ'లో 1–3తో సిరీస్ కోల్పోవడంతో... బీసీసీఐ దిద్దుబాటు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా టీమ్ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌తో పాటు, ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్‌లను తప్పించింది.



ఫైనల్లో అనాహత్, వీర్

కౌలాలంపూర్: ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్, వీర్ చోత్రాని ఫైనల్లోకి దూసుకెళ్లారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఐదో సీడ్, 17 ఏళ్ల అనాహత్ 11–2, 11–7, 11–6తో హెలెన్ టాంగ్ (హాకాంగ్)పై విజయం సాధించింది. 21 నిమిషాల్లో ముగిసిన పోరులో అనాహత్... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగింది. ఇప్పటి వరకు ఈ ఇద్దరి మధ్య ఐదు మ్యాచ్‌లు జరగగా... అన్నింట్లోనూ అనాహత్ విజయం సాధించడం విశేషం. ఆదివారం జరగనున్న ఫైనల్లో టోబీ ట్సె (హాంకాంగ్)తో అనాహత్ తలపడనుంది. భారత మరో ప్లేయర్, రెండో సీడ్ ఆకాంక్ష పరాజయం పాలైంది. ఆకాంక్ష 3–11, 10–12, 12–10, 8–11తో టోబీ ట్సె చేతిలో ఓడింది. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ వీర్ చోత్రాని కూడా ఫైనల్లో అడుగు పెట్టాడు. సెమీ ఫైనల్లో వీర్ చోత్రాని 11–7, 11–6, 7–11, 11–4తో ఎనిమిదో సీడ్ చి హిమ్ వాంగ్ (హాంకాంగ్)పై విజయం సాధించాడు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ప్లేయర్లు మే 9 నుంచి 17 వరకు చికాగోలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధిస్తారు.

రెండు రోజుల వ్యవధిలో...

మరోసారి పంజాబ్‌తో బెంగళూరు ఢీ

ముల్లాన్‌పూర్: ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మరోసారి పోటీకి సిద్ధమయ్యాయి. శుక్రవారమే ఇరు జట్ల మధ్య పోరు జరగగా... తిరిగి ఆదివారం ఈ రెండు జట్లే తలపడుతున్నాయి. గత మ్యాచ్‌కు బెంగళూరు వేదిక కాగా... ఇప్పుడు ముల్లాన్‌పూర్‌లో మ్యాచ్ జరగనుంది. వర్షం కారణంగా 14 ఓవర్లకు కుదించిన గత మ్యాచ్‌లో పంజాబ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇప్పుడు ప్రత్యర్థి మైదానంలో ప్రతీకారం తీర్చుకునేందుకు బెంగళూరు సిద్ధమైంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని పంజాబ్ జట్టు 7 మ్యాచ్‌లాడి 5 విజయాలు, 2 పరాజయాలతో 10 పాయింట్లతో ఉండగా... బెంగళూరు 7 మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 3 ఓటములతో 8 పాయింట్లు సాధించింది. గత మ్యాచ్‌లో పేలవ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన బెంగళూరు... లోపాలను సరిదిద్దుకోవాలని చూస్తుంటే... పంజాబ్ గెలుపు జోరు కొనసాగించాలని భావిస్తోంది.

సియాచిన్, గల్వాన్‌లకు సైతం
మొబైల్ కనెక్టివిటీ

అందుబాటులోకి వచ్చిందని ప్రకటించిన సైన్యం

శ్రీనగర్: ప్రపంచంలోనే అత్యంత అననుకూల వాతావరణ పరిస్థితులున్న సియాచిన్, గల్వాన్‌లలో విధులు నిర్వర్తిస్తున్న భారత జవాన్లు ఇప్పుడిక తమ ఆత్మీయులతో మాట్లాడుకోవచ్చు. లద్దాఖ్ ప్రాంత మంతటా హై స్పీడ్ మొబైల్ కనెక్టివిటీని ఆర్మీ అందుబాటులోకి తేవడమే ఇందుకు కారణం. ఈ పరిణామం డిజిటల్ అంతరాన్ని తగ్గించడం, మారుమూల ప్రాంతాల వారికి సాధికారత కల్పించడం దిశగా పరివర్తనాత్మక ముందడుగుగా ఆర్మీ పేర్కొంది. సరిహద్దులకు అత్యంత సమీపంలోని పోస్టులున్న తూర్పు లద్దాఖ్, పశ్చిమ లద్దాఖ్‌లతోపాటు సియాచిన్ హిమానీనదం వరకు 4జీ, 5జీ మొబైల్ కనెక్టివిటీ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధక్షేత్రం సియాచిన్‌లో 5జీ మొబైల్ టవర్‌ను విజయవంతంగా ఏర్పాటు చేశామని ప్రకటించింది. 'అత్యంత కఠినమైన శీతల పరిస్థితుల్లో 18వేల అడుగుల ఎత్తులోని సరిహద్దు పోస్టుల్లో పనిచేస్తున్న సైనికులకు ఈ సౌకర్యంతో మనోధైర్యం పెరుగుతుంది. తమ కుటుంబాలు, ప్రియమైన వారితో కనెక్ట్ అవ్వడానికి వీలు కలుగుతుంది'అని అధికారులు తెలిపారు. ఇందుకోసం కేవలం లద్దాఖ్, కార్గిల్ జిల్లాల్లోనే నాలుగు ముఖ్యమైన టవర్లు ఏర్పాటు చేశామని, ఇందులో ఆర్మీకి చెందిన ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ తోడ్పాటు ఎంతో ఉందన్నారు. బలగాలతోపాటు సరిహద్దు పోస్టులకు సమీప గ్రామాల వారు మొబైల్ సౌకర్యం అందుబాటులోకి రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇది వారికెంతో ఉపయోగపడుతుందన్నారు.



జెరూసలేం పాత నగరంలోని చర్చ్ ఆఫ్ హోలీ సెపల్చర్‌లో శనివారం హోలీ ఫైర్ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా క్రైస్తవ భక్తులు క్యాండిల్స్‌తో వెలుగులు నింపారు. ఏసు క్రీస్తును శిలువ వేసిందీ, సమాధి చేసిందీ ఇక్కడేనని నమ్మిక.

జూలైలో మెగా సునామీ?

జపాన్ 'బాబా వంగా'జోస్యం ● గతంలో చెప్పినవన్నీ నిజమైన వైనం

దయానా మృతి గురించి ముందే చెప్పారు ● 2011 సునామీ, కరోనా గురించి కూడా

సునామీ. మూడక్షరాలే అయినా, అది సృష్టించే విధ్వంసం ఎంతటిదో తెలియని వారంటూ ఎవరూ ఉండరు. 2004లో విరుచుకుపడ్డ సునామీ బీభత్సాన్ని ప్రపంచం ఎన్నటికీ మర్చిపోలేదు. అనంతరం 2011లో భారీ సునామీ జపాన్ మొదలుకుని పలు దేశాలను అతలాకుతలం చేసేసింది. అలాంటి ఉత్పాతం మరోసారి వచ్చి పడితే? అది కూడా 2011, 2004ల్లో కంటే ప్రళయభీకర స్థాయిలో వస్తే? అదే జరగవచ్చట. అది కూడా ఎప్పుడో కాదు, వచ్చే జూలైలోనే! దాని తీవ్రత జపాన్ చరిత్రలోనే కనీ వినీ ఎరగని విధంగా ఉంటుందట. ఈ మేరకు జపాన్‌కు చెందిన ప్రఖ్యాత మాంగా ఆర్టిస్టు ర్యో తత్సుకీ చెప్పిన జోస్యం ఇప్పుడు చాలామందిని తీవ్రంగా కలవరపెడుతోంది. 2011 సునామీతో పాటు ఆమె గతంలో చెప్పినవెన్నో అక్షరాలా జరగడమే ఇందుకు కారణం. ఆ జాబితాలో 2020 నుంచి రెండేళ్లకు పైగా ప్రపంచానికి నిద్ర కూడా లేకుండా చేసిన కరోనా కూడా ఉంది!

ఏమిటీ మాంగా?

మాంగా అంటే జపాన్‌కే ప్రత్యేకమైన నవలలు, కార్టూన్లు. 70 ఏళ్ల తత్సుకీ ఈ కళలో ఆరితేరారు. పైగా ఇలస్ట్రేటర్‌గా కూడా ఆమెకు చాలా పేరుంది. అంతకుమించి భవిష్యద్రష్టగా కూడా తత్సుకీకి ఉన్న పేరు అంతా ఇంతా కాదు. 1980ల నుంచీ ఆమె భవిష్యత్తు చెబుతున్నారు. ప్రిన్సెస్ డయానా మరణాన్ని కూడా ముందే చెప్పారు. ఇవన్నీ ఒక ఎత్తయితే, 'నేను చూసిన భవిష్యత్తు (ద ఫ్యూచర్ దట్ ఐ సా)'పేరిట 1999లో ఆమె రాసిన మాంగా రేపిన దుమారం అంతా ఇంతా కాదు. సమీప భవిష్యత్తులో వచ్చిపడనున్న ఎన్నెన్నో ప్రాకృతిక విపత్తులను గురించి అందులో తత్సుకీ ముందే పేర్కొన్నారు. ముఖ్యంగా 2011 మార్చి 11న ఏకంగా 9.1 తీవ్రతతో జపాన్‌ను కుదిపేసిన భయానక భూకంపం, దాని ఫలితంగా వచ్చిపడ్డ భీకర సునామీ ధాటికి ఏకంగా 20 వేల మందికి పైగా మరణించారు. ఈ ఉత్పాతం గురించైతే తత్సుకీ అత్యంత స్పష్టంగా పేర్కొన్నారు. '2011లో భారీ ఉత్పాతం వచ్చి పడనుంది' అంటూ ఓ అధ్యాయమే రాశారు. అంతేకాదు, '2020లో అంతుపట్టని కొత్త రకం వైరస్ వ్యాప్తి పరాకాష్టకు చేరుతుంది'అంటూ మరోచోట కరోనా గురించి కూడా స్పష్టంగా పేర్కొన్నారు.



సునామీ ప్రతీకాత్మక చిత్రం

రాకాసి బుడగలు

వచ్చే జూలైలో మెగా సునామీ రాబోతోందన్న తత్సుకీ, అది జపాన్ చరిత్రలోనే కనీవినీ ఎరగనంత తీవ్రమైనదని కూడా రాశారు. దాని ధాటికి జపాన్, తైవాన్, ఇండొనేసియా, ఉత్తర మరియానా దీవులు అతలాకుతలమై పోతాయని హెచ్చరించారు. ఆ దేశాలను అనుసంధానించే వజ్రాకృతితో కూడిన జోన్ నిండా 'రాక్షస బుడగలు (రాకాసి అలలు) పడగలెత్తుతాయి', 'దక్షిణ జపాన్ సముద్రం మరిగిపోతుంది'అంటూ రాబోయే సునామీ తీవ్రతను వర్ణించారు. అంతేకాదు, దాని తీవ్రత 2011 నాటి సునామీ కంటే కనీసం మూడు రెట్లకు పై చిలుకేనని స్పష్టంగా పేర్కొన్నారు. దీనిపై కొద్ది రోజులుగా ఇంటర్నెట్ హోరెత్తిపోతోంది. ఈ జోస్యం ఏ మేరకు నిజమవుతుందన్న దానిపై ఎవరి అంచనాల్లో వారున్నారు. గత 20 ఏళ్లలో తత్సుకీ చెప్పినవన్నీ జరిగినప్పుడు ఇది మాత్రం ఎందుకు జరగదని వాదించే వారు కొందరు. సునామీ వంటి ప్రాకృతిక విపత్తుల విషయంలో శాస్త్రీయ అంచనాలను నమ్ముకోవాలే తప్ప ఇలాంటి జోస్యాలను కాదని మరికొందరు కొట్టిపారేస్తున్నారు. చూడబోతే మాంగా పేరిట తత్సుకీ ఏకంగా ప్రపంచం పాలిట మరణశాసనమే రాసినట్టు కన్పిస్తోందంటూ ఇంకొందరు వాపోతున్నారు. తన రాతలపై ఇంత దుమారం రేగుతున్నా 70 ఏళ్ల తత్సుకీ మాత్రం వాటిపై మౌనం వీడటం లేదు. గత శతాబ్దికి చెందిన బల్గేరియా మిస్టిక్, హీలర్ బాబా వంగా పేరిట ఆమెను ఇప్పుడంతా 'జపనీస్ బాబా వంగా'అంటూ కీర్తిస్తున్నారు. అంధురాలైన బాబా వంగా కూడా ఇలాగే జరగబోయే విషయాలను ముందుగానే చెప్పి ప్రపంచ ప్రఖ్యాతి పొందారు.

కొసమెరుపు

కరోనాకు సంబంధించి మనందరినీ మరింత వణికించేలా మరో జోస్యం కూడా చెప్పారు తత్సుకీ! అదేమిటో తెలుసా? మరో అయిదేళ్లలో అంటే 2030లో అది మరింత తీవ్రతతో వచ్చి పడుతుందట.

– సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్‌తో ఫలవంతమైన చర్చలు
యూకే ప్రధాని కీర్ స్టార్మర్ వెల్లడి

లండన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫలవంతమైన చర్చలు జరిగాయని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ చెప్పారు. బ్రిటన్ ఉత్పత్తులపై ట్రంప్ భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేసినప్పటికీ ఈ అంశంపై అమెరికా–బ్రిటన్ మధ్య విస్తృతంగా సంప్రదింపులు జరుగుతున్నాయి. మరోవైపు అమెరికాతో వాణిజ్య ఒప్పందం దిశగా బ్రిటిష్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్, స్టార్మర్ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించుకున్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధంతోపాటు హౌతీ తిరుగుబాటుదార్లే లక్ష్యంగా యెమెన్‌పై జరుగుతున్న అమెరికా వైమానిక దాడులపై అభిప్రాయాలు పంచుకున్నారు. అలాగే అమెరికా–యూకే మధ్య వాణిజ్యంపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. తమ దేశ ప్రయోజనాలు కాపాడుకుంటూనే ఇతర దేశాలతో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి కట్టుబడి ఉన్నామని స్టార్మర్ ఉద్ఘాటించారు. మరోవైపు యూకేలో పర్యటించాలంటూ డొనాల్డ్ ట్రంప్‌ను బ్రిటిష్ రాజు చార్లెస్–3 ఆహ్వానించారు. ట్రంప్ పర్యటన సెప్టెంబర్‌లో జరిగే అవకాశం కనిపిస్తోంది. యూకే చాన్సలర్ రేచల్ రీవెస్ వచ్చే వారం అమెరికాలో పర్యటించబోతున్నారు. జీ20, జీ7 సదస్సుల్లో ఆమె పాల్గొంటారు.

పాకిస్తాన్‌లో భూకంపం
రిక్టర్ స్కేల్‌పై 5.9గా నమోదు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో భూప్రకంపనలు బెంబేలెత్తించాయి. శనివారం ఉదయం 11.47 గంటల సమయంలో ఇస్లామాబాద్, లాహోర్, పెషావర్, రావల్పిండితోపాటు ఖైబర్ పక్తూంఖ్వా ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో భూకంపం సంభవించింది. ఇది రిక్టర్ స్కేల్‌పై 5.9గా నమోదయ్యింది. అఫ్గానిస్తాన్–తజకిస్తాన్ సరిహద్దుల్లో ఉపరితలం నుంచి 94 కిలోమీటర్ల లోతున భూకంపం కేంద్రం ఉన్నట్లు నేషనల్ సీస్మిక్ మానిటరింగ్ సెంటర్ వెల్లడించింది. ఈ భూకంపంలో ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లినట్లు ఇంకా తెలియరాలేదు. అఫ్గానిస్తాన్, జమ్మూకశ్మీర్‌లోనూ శనివారం భూప్రకంపనలు సంభవించాయి. శ్రీనగర్‌కు వాయువ్యంగా 296 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ ప్రకటించింది. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు.

రిజర్వాయర్లలో మెరుగ్గా నీటి నిల్వలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తాజా నివేదికలో వెల్లడించింది. సీడబ్ల్యూసీ పర్యవేక్షణలో ఉన్న 161 రిజర్వాయర్ల వాస్తవ నీటి నిల్వ సామర్థ్యం 182.37 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎంగా) కాగా ప్రస్తుతం 66.82 బీసీఎంల నిల్వలు (36.64 శాతం) ఉన్నాయని వెల్లడించింది. గత ఏడాది కేవలం 57.86 బీఎంసీల నిల్వలే ఉన్నాయని వివరించింది. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళలల్లో మొత్తంగా 45 ప్రధాన జలాశయాల్లో 54.93 టీఎంసీల నిల్వలకు గాను ఈ నెల 17వ తేదీ నాటికి 18.54 బీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొంది. గత ఏడాది ఇదే సమయానికి 17 శాతం నిల్వల లభ్యత మాత్రమే కాగా ఈ ఏడాది అది 33.76 శాతంగా ఉందని తెలిపింది. మొత్తం 161 రిజర్వాయర్లలో 124 రిజర్వాయర్లలో సాధారణం కంటే అధిక నిల్వలుండగా, 37 రిజర్వాయర్లు సాధారణం కంటే తక్కువ నీటిని కలిగి ఉన్నాయని నివేదించింది. ఈ 37 రిజర్వాయర్లలో 12 జలాశయాల్లో సాధారణ నిల్వ కంటే తక్కువ నీటిని కలిగి ఉండగా, అందులో నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో కేవలం 37.47శాతం ఉండగా, జూరాలలో నిల్వలు ఏమాత్రం లేవని సీడబ్ల్యూసీ తెలిపింది.

48 గంటల్లో 90 మంది మృతి
గాజాపై ఆగని ఇజ్రాయెల్ దాడులు

డెయిర్ అల్–బలాహ్: బందీలను విడుదల చేసేలా హమాస్‌పై ఒత్తిడి తేవడమే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ సైన్యం యథేచ్ఛగా దాడులు కొనసాగిస్తోంది. గత 48 గంటల వ్యవధిలో గాజాపై ఇజ్రాయెల్ బలగాలు సాగించిన దాడుల్లో 90 మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని ఆ ప్రాంత ఆరోగ్య విభాగం వెల్లడించింది. వీరిలో మానవతా జోన్‌లో తలదాచుకుంటున్న మహిళలు, చిన్నారులు సహా 15 మంది ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అదే విధంగా, ఖాన్‌యూనిస్‌లో మానవతా జోన్‌గా ఇజ్రాయెల్ ప్రకటించిన మువాసీలోని టెంట్లపై జరిగిన దాడిలో మరో 11 మంది, రఫాలో జరిగిన వేర్వేరు దాడుల్లో మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. గాజాలో ఆక్రమించుకున్న సెక్యూరిటీ జోన్లపై దాడులను ఉధృతం చేస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆరువారాలుగా గాజాను దిగ్బంధించిన ఇజ్రాయెల్ ఆర్మీ ఆ ప్రాంతంలోని వారికి ఆహారం, ఇతర అత్యవసరాలను అడ్డుకుంటోంది.

హిందీని తప్పనిసరి చేస్తే అంగీకరించం
శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే హెచ్చరిక

ముంబై: పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు మూడో భాషగా హిందీని తప్పనిసరిగా బోధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని శివసేన(యూబీటీ) ఉద్ధవ్ ఠాక్రే తీవ్రంగా తప్పుబట్టారు. శనివారం ముంబైలో తమ పార్టీ కార్యకర్తల విభాగమైన భారతీయ కామ్‌గర్ సేన ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఉద్ధవ్ ప్రసంగించారు. ''మన రాష్ట్రంలో మరాఠీ, ఇంగ్లిష్ మాధ్యమ పాఠశాలల్లో హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తే అంగీకరించం. రాష్ట్ర ప్రజల్లో ఐక్యత లేకుండా చేయడమే బీజేపీ లక్ష్యం. ప్రజలను ఎప్పుడూ ఒత్తిళ్లకు గురిచేస్తారు. వాళ్లు అలా సమస్యల్లో కూరుకుపోవడమే బీజేపీకి ఇష్టం''అని అన్నారు. బీజేపీనుద్దేశిస్తూ.. ''మీరు ప్రేమతో అడిగితే మేం ఏదైనా చేస్తాం. బలవంతంగా రుద్దితే మేం వ్యతిరేకిస్తాం. హిందీ నేర్చుకోండి అని బలవంతపెట్టడం ఎందుకు?. మీరు ఈ రాష్ట్రంలో మనుగడలో ఉండాలంటే ఖచ్చితంగా జై మహారాష్ట్ర అనాల్సిందే''అని అన్నారు.

అన్ని విధాలుగా
అండగా నిలుస్తాం

అల్లర్ల బాధితులకు గవర్నర్ ఆనంద బోస్ హామీ

కోల్‌కతా: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన అల్లర్ల బాధితులను గవర్నర్ ఆనంద బోస్ పరామర్శించారు. సాధ్యమైనంత మేర అన్ని విధాలుగా అండగా నిలుస్తామని వారికి హామీ ఇచ్చారు. అల్లర్ల సమయంలో దుండగులు షంషేర్‌గంజ్ ప్రాంతం జఫ్రాబాద్‌లో ఓ ఇంట్లో ఉన్న తండ్రి హర గోవింద్ దాస్, అతని కుమారుడు చందన్ దాస్‌లను కత్తితో పొడిచి చంపారు. వీరి కుటుంబీకులు శనివారం తమ ఇంటికి వచ్చిన గవర్నర్ కాళ్లపై పడి, న్యాయం చేయాలని వేడుకున్నారు. 'వీరి అభ్యర్థనలను పరిశీలిస్తాం. బాధితుల నుంచి మూడు, నాలుగు సూచనలందాయి. స్థానికంగా బీఎస్ఎఫ్ పోస్టులను ఏర్పాటు చేయడం ఇందులో ఒకటి. ఈ అంశాన్ని సంబంధిత యంత్రాంగం దృష్టికి తీసుకెళ్తా. సానుకూల చర్యలను కచ్చితంగా తీసుకుంటాం. రాజ్‌భవన్‌లో అందుబాటులోకి తెచ్చిన హెల్ప్‌లైన్ నంబర్‌ను వారికి అందజేశా'అని గవర్నర్ మీడియాకు తెలిపారు. అనంతరం ధులియన్ బజార్ ప్రాంతంలో బాధితులను కలుసుకున్నారు. బాధితులు కోరిన ప్రకారం న్యాయం దక్కేలా చూస్తామన్నారు. జఫ్రాబాద్‌లోని బెట్బోనా గ్రామం వద్ద స్థానికులు రోడ్డుపై అడ్డంకులు ఏర్పాటు చేయగా గవర్నర్ ఆగి, వారిని శాంతపరిచారు. అంతకుముందు, ఫరక్కాలోని అతిథి గృహం వద్ద కూడా గవర్నర్ అల్లర్ల బాధిత కుటుంబాలతో మాట్లాడారు. ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగిన అల్లర్లలో తండ్రి, కుమారుడు సహా ముగ్గురు చనిపోవడంతోపాటు భారీగా ఆస్తినష్టం సంభవించిన ఘటనలపై పోలీసులు 274 మందిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం గవర్నర్ ఆనందబోస్ మాల్దా జిల్లాలో తాత్కాలిక శిబిరంలో తలదాచుకుంటున్న అల్లర్ల బాధిత ముర్షిదాబాద్ వాసులను పరామర్శించడం తెల్సిందే.

బాధితుల గోడు విన్న మహిళా కమిషన్

జాతీయ మహిళా కమిషన్(ఎన్సీడబ్ల్యూ) చైర్‌పర్సన్ విజయా రాహత్కర్ శనివారం బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ధులియన్ తదితర వక్ఫ్ అల్లర్ల ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. బెట్బోనా గ్రామంలో దుండగులు తమను భయభ్రాంతులకు గురి చేశారంటూ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలి, బీఎస్ఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలి, దాడులపై ఎన్ఐఏతో దర్యాప్తు చేయించాలి అంటూ వారు ప్లకార్డులు ప్రదర్శించారు. హింసాత్మక ఘటనల తీవ్రత అనూహ్య స్థాయిలో ఉందని తెలిసిందని అనంతరం రాహత్కర్ మీడియాకు తెలిపారు. బాధితుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందని వారికి హామీ ఇచ్చామన్నారు. ఇక్కడి బాధిత మహిళల డిమాండ్లపై హోం మంత్రి అమిత్ షాకు నివేదిక అందజేస్తామని ఎన్సీడబ్ల్యూ సభ్యురాలు అర్చనా మజుందార్ తెలిపారు. శుక్రవారం మాల్దాలో అల్లర్ల బాధితులను రాహత్కర్ సారథ్యంలోని బృందం కలుసుకోవడం తెల్సిందే.

రాష్ట్రపతి పాలన విధించాలి: వీహెచ్‌పీ

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో చోటుచేసుకున్న అల్లర్లను నిరసిస్తూ శనివారం విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆందోళనలను నిర్వహించింది. బెంగాల్‌లో శాంతి భద్రతలు క్షీణించాయని, తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసింది. బెంగాల్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని, ముర్షిదాబాద్ అల్లర్ల బాధితులకు తగు పరిహారం అందజేయాలని కోరింది. బెంగాల్‌లో బంగ్లాదేశీ–రోహింగ్యా చొరబాటుదార్లను గుర్తించి, వెళ్లగొట్టాలంది. సోమవారం కూడా నిరసనలు తెలుపుతామని తెలిపింది.



ముర్షిదాబాద్ జిల్లాలో అల్లర్ల బాధితులతో మాట్లాడుతున్న గవర్నర్ ఆనంద బోస్

క్షేత్రస్థాయిలో బలోపేతంపై బీఎస్పీ దృష్టి

- ఘర్ వాపసీకి సిద్ధమైన బహిష్కృత నేతలు
- యూపీ అసెంబ్లీ ఎన్నికలపై మాయావతి గురి

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ అధినేత్రి మాయావతి రాజకీయ పావులు కదుపుతున్నారు. మరో రెండేళ్లలో జరగనున్న ఎన్నికల్లో ఈసారైనా కనీసం డబుల్ డిజిట్‌తో అసెంబ్లీలోకి అడుగుపెట్టాలన్నది ఆమె లక్ష్యంగా ఉంది. ఇందులో భాగంగా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ముఖ్యంగా ఘర్‌వాపసీపై దృష్టి పెట్టారు. ఆకాశ్ ఆనంద్, నగీనా మాజీ ఎంపీ గిరీశ్ చంద్ర తిరిగి పార్టీలోకి వచ్చిన తర్వాత, పశ్చిమ యూపీ ప్రాంతానికి చెందిన పార్టీ మాజీ నాయకులను దారిలోకి తెచ్చుకునేందుకు వ్యూహ రచన చేస్తున్నారు. బీఎస్పీ నుంచి బహిష్కరణకు గురైన, బయటకు వెళ్లిన కొందరు నేతలు తిరిగి పార్టీలోకి వచ్చేందుకు సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. ఇందులో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. వీరంతా తిరిగి పార్టీ ఛత్రం కిందికి వస్తే బీఎస్పీ క్షేత్రస్థాయిలో బలోపేతమవుతుందని ఆమె అంచనాగా ఉంది.

ఒకప్పుడు ఘన చరిత్ర

1984లో పార్టీ ఏర్పడినప్పటి నుంచి ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో తమదైన ముద్ర వేసుకున్న బీఎస్పీ ఇప్పుడు పతనావస్థలో ఉంది. 2007 అసెంబ్లీ ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీతో యూపీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించిన మాయావతి...ఆ తర్వాత ఎన్నికల్లో అనుకున్న ఫలితాలను సాధించలేకపోయారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో యూపీలో 20 సీట్లు సాధించిన ఆ పార్టీ, 2014లో కనీసం ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. అయితే, 2019 ఎన్నికల్లో ఎస్పీ, ఆర్ఎల్‌డీతో కలిసి బరిలో దిగి 10 చోట్ల విజయం సాధించిన బీఎస్పీ 2024 ఎన్నికల్లో మాత్రం ఒక్క స్థానంలో కూడా జెండా ఎగురవేయలేకపోయింది. అంతేగాక 2012–2024 మధ్య జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ తన ఉనికిని సైతం చాటుకోలేక చతికిలపడింది.

పాత నేతలకు తిరిగి బాధ్యతలు

2012 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత బీఎస్పీకి క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు తగ్గిపోయిన నేపథ్యంలో, ఒక్కరొక్కరుగా పార్టీని వీడడం ప్రారంభించారు. కాగా పశ్చిమ యూపీలో ఒకప్పుడు పార్టీకి అండగా నిలిచిన 15 మందికి పైగా మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, సీనియర్ నాయకుల్లో కొందరిని క్రమశిక్షణా రాహిత్యం కారణంతో మాయావతి పార్టీ నుంచి బహిష్కరించారు. మరికొందరు తమకు తాముగానే పార్టీని వీడారు. ఇప్పుడు వీరందరిపైనా బీఎస్పీ కన్నేసింది. అలాంటి కొందరు నేతలు పార్టీతో టచ్‌లో కూడా ఉన్నారు. అయితే, ఇటీవల అధినేత్రి మాయావతికి క్షమాపణ చెప్పిన తర్వాత మేనల్లుడు ఆకాశ్ ఆనంద్, ఆ తర్వాత మాజీ ఎంపీ గిరీశ్ చంద్ర తిరిగి పార్టీ కండువా కప్పుకున్నారు. వీరిలో గిరీశ్ చంద్రకు బిజ్నోర్, అమ్రోహా పార్టీ ఇన్‌ఛార్జ్‌గా అధినేత్రి బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో నాలుగు నెలల క్రితం పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ప్రమోద్ నిరంకారిని రాంపూర్ జిల్లా అధ్యక్షుడిగా మళ్లీ నియమించారు.

కేంద్ర శాఖల్లో కీలక నియామకాలు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కీలక నియామకాలకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదముద్ర వేసింది. రెవెన్యూ సెక్రటరీగా అరవింద్ శ్రీవాస్తవ, ఎకనామిక్ ఎఫైర్స్ సెక్రటరీగా అనురాధ ఠాకూర్ నియమితులయ్యారు. ప్రధాని కార్యాలయంలో పనిచేస్తున్న హరి రంజన్ రావు స్పోర్ట్స్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. హోం శాఖలో ఇంటర్ స్టేట్ కౌన్సిల్ సెక్రటేరియట్‌లో అడ్వైజర్‌గా ఉన్న ఆశిష్ శ్రీవాస్తవను అదే విభాగంలో సెక్రటరీగా నియమించారు. వాణిజ్యం, పరిశ్రమల శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా రాజేశ్ అగరొవాల్ నియమితులయ్యారు.

నితీశ్ అవినీతిని
వ్యవస్థీకృతం చేశారు
ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్


పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అవినీతిని వ్యవస్థీకృతం చేశారని ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. మరికొద్ది నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ ప్రచారం కోసం ప్రజాధనాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. ఇందుకు తాజా ఉదాహరణ మహిళా సంవాద్ పథకమేనని చెప్పారు. మహిళల కోసం ప్రత్యేకంగా చేసిందేమీ లేకున్నా ఈ పథకానికి రూ.225 కోట్లు కేటాయించారన్నారు. ఆర్థిక అరాచకానికి రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వమే కారణమని నిందించారు. రాష్ట్రంలో రూ.76,622 కోట్ల విలువైన నిర్మాణ పనులకు గాను మొట్టమొదటి సారిగా గ్లోబల్ టెండర్లను ఆహ్వానించడానికి కారణమేంటని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రులు ప్రాజెక్టు పనుల్లో పెద్ద మొత్తంలో కమీషన్లు అందుకుంటున్నారని తేజస్వీ ఆరోపించారు.

శత్రు చట్టం కింద అరెస్టయిన
వెనిజులా పౌరులకు ఊరట

- వారిని స్వదేశానికి తరలించవద్దు
- అమెరికా సుప్రీంకోర్టు ఉత్తర్వులు

వాషింగ్టన్: అమెరికాలో 1798 నాటి ఎలియన్ ఎనిమీస్ చట్టం కింద నిర్బంధానికి గురైన వెనిజులా పౌరులకు భారీ ఊరట లభించింది. వారిని బలవంతంగా వెనక్కి పంపించకుండా అమెరికా సుప్రీంకోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేదాకా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తేల్చిచెప్పింది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఉత్తర టెక్సాస్‌లో 261 మంది వెనిజులా పౌరులను ఎలియన్ ఎనిమీస్ చట్టం–1798 కింద నిఘా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అరెస్టు చేశారు. ఈ 261 మందిని ట్రంప్ ప్రభుత్వం ఎల్‌సాల్వెడార్ దేశంలో భూలోక నరకంగా పరిగణించే ఓ జైలుకు తరలించింది. తర్వాత వారందరినీ వెనిజులాకు పంపించాలని నిర్ణయించింది. దీంతో బాధితులకు మద్దతుగా అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ కార్యకర్తలు న్యాయ పోరాటం ప్రారంభించారు. కోర్టులను ఆశ్రయించారు. 261 మందిని వారి స్వదేశానికి తరలించకుండా తాత్కాలికంగా నిలిపివేస్తూ కింది కోర్టు మార్చి 15న ఆదేశాలిచ్చింది. అయితే, వారిని వెనక్కి పంపించడానికి 1798 నాటి వార్‌టైమ్ చట్టాన్ని ట్రంప్ ఉపయోగించుకోవచ్చని స్పష్టంచేస్తూ సుప్రీంకోర్టు ఈ నెల 8న తీర్పు వెలువరించింది. కానీ, డిపోర్టేషన్‌ను సవాలు చేసే అవకాశం వారికి ఇవ్వాలని స్పష్టంచేసింది. దాంతో సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలయ్యింది. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం డిపోర్టేషన్‌ను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేదాకా ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొంది. వెనిజులా పౌరులకు ఇది అతిపెద్ద విజయమని అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ కార్యకర్తలు పేర్కొంటున్నారు. వెనిజులా వాసులు ప్రస్తుతానికి ఎల్ సాల్వెడార్ జైలులోనే ఉండనున్నారు. 216 మందిలో 137 మందిపై ఎలియన్ ఎనిమీస్ చట్టం–1798ను తొలగించినట్లు అమెరికా అధికారులు చెబుతున్నారు. పెద్ద సంఖ్యలో విదేశీయులను అక్రమ వలసదార్లను గుర్తించి, అరెస్ట్ చేసి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికా నుంచి బయటకు పంపిస్తున్న సంగతి తెలిసిందే.

విచక్షణా గ్రాంటులు అంటే ఏమిటి?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

పరిపాలనా సంబంధాలు

కేంద్ర, రాష్ట్రాల మధ్య సాధారణ పరిస్థితుల్లో ఉండే పరిపాలనా సంబంధాల గురించి విస్తృతంగా IXవ భాగంలో 256 నుంచి 263 వరకు ప్రకరణల్లో పొందుపరిచారు. ఈ సంబంధాలనే మునిసిపల్ సంబంధాలు అని కూడా అంటారు. దైనందిన పరిపాలన అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తుంది.

ప్రకరణ 256 ప్రకారం ప్రతి రాష్ట్ర ప్రభుత్వం కార్యనిర్వహణాధికారాలను పార్లమెంటు చేసిన చట్టాలకు లోబడి వినియోగించాలి. దీని కోసం రాష్ట్రాలకు కొన్ని పరిపాలనా ఆదేశాలను కేంద్రం జారీ చేయొచ్చు.

ప్రకరణ 257 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహణ అధికారాలను కేంద్రం నియంత్రించవచ్చు. రాష్ట్రాలు వాటి అధికారాలను వినియోగించుకునే సందర్భంలో అవి కేంద్ర ప్రభుత్వ అధికారాలను ప్రశ్నించే విధంగా ఉండకూడదు. రైల్వేలు, టెలికమ్యూనికేషన్లు తదితర కేంద్ర ప్రభుత్వ ఆస్తులను రాష్ట్రాలు పరిరక్షించాలి. వాటి పరిరక్షణకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తిరిగి చెల్లిస్తుంది.

ప్రకరణ 258 ప్రకారం సంబంధిత రాష్ట్ర గవర్నర్ అంగీకారంతో కేంద్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని పాలనా విధులను షరతులతో లేదా షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రపతి బదలాయించవచ్చు.

ప్రకరణ 258ఎ ప్రకారం కేంద్ర ప్రభుత్వ సమ్మతితో (షరతులతో లేదా షరతులు లేకుండా) రాష్ట్ర ప్రభుత్వ పాలనా విధులను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర గవర్నర్ బదలాయించవచ్చు. ప్రకరణ 258ఎ లోని అంశాలను 1956లో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 259ని 1956లో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

ప్రకరణ 260 ప్రకారం భారత ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా భారత్ బయట ఉన్న భూభాగాల పరిపాలనను చేపట్టవచ్చు.

ప్రకరణ 261 ప్రకారం దేశంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు జారీ చేసిన ధ్రువపత్రాలు, పబ్లిక్ రికార్డులను న్యాయతీర్పులపై నమ్మకం ఉంచి గౌరవించాలి.

నదీ జలాల వివాదాలు..

ప్రకరణ 262(1) ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాలు, నదీ లోయలకు చెందిన జలాల వినియోగం, పంపిణీ, నియంత్రణకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి పార్లమెంటు ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయవచ్చు.

ప్రకరణ 262(2) ప్రకారం నదీ జలాల వినియోగానికి సంబంధించి ఫిర్యాదులను లేదా వివాదాలను విచారించే అధికారం సుప్రీంకోర్టు లేదా మరేదైనా న్యాయస్థానం పరిధి నుంచి మినహాయిస్తూ చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉంటుంది. 1956లో పార్లమెంటు అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తారు.

దేశంలో 2017 నుంచి వస్తువుల, సేవల పన్ను (జీఎస్టీ) చట్టం అమలులోకి వచ్చింది. ఇందుకోసం 122వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. ఇది కేంద్రం, రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీ, జీఎస్టీ మండలి ఏర్పాటుతో పాటు ఇతర ఆర్థిక అంశాల గురించి వివరిస్తుంది. ఈ బిల్లు ద్వారా జీఎస్టీని అమలు చేయడానికి రాజ్యాంగపరమైన మార్గాలను కల్పించారు.

అంతర్రాష్ట్ర మండలి:

ప్రకరణ 263 ప్రకారం భారత రాష్ట్రపతి ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయవచ్చు. దీనికి హోదారీత్యా ప్రధానమంత్రి అధ్యక్షులుగా ఉంటారు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల పాలకులు ఇందులో సభ్యులుగా ఉంటారు. అంతర్రాష్ట్ర వివాదాలకు సంబంధించిన అంశాలను విచారణ చేసి సలహాలు ఇస్తారు. అంతర్రాష్ట్ర మండలిని మొదటిసారిగా 1990లో ఏర్పాటు చేశారు.

ఆర్థిక సంబంధాలు

రాజ్యాంగంలోని 12వ భాగంలో 264 నుంచి 300 వరకు ఉన్న ప్రకరణలు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక, ఆస్తుల ఒప్పందాలు మొదలైన అంశాల గురించి ప్రస్తావించారు.

పన్నుల విభజన:

కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల విధింపునకు సంబంధించి కచ్చితమైన విభజన చేశారు. **కేంద్రం పరిధిలోకి వచ్చే పన్నులు:**

- వ్యవసాయేతర ఆదాయంపై పన్ను
- ఎగుమతి, దిగుమతి సుంకాలు
- పొగాకుపై ఎక్సైజ్ సుంకం
- కార్పొరేషన్ పన్ను
- మూలధన విలువపై పన్ను
- వ్యవసాయేతర ఎస్టేట్లపై పన్ను
- వారసత్వ పన్ను
- అంతర్రాష్ట్ర రవాణా పన్ను
- స్టాక్ మార్కెట్, స్టాక్ ఎక్స్ఛేంజ్ పన్ను
- చెక్కులు, ప్రామీసరి నోట్లు, బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్, ఇన్సూరెన్స్ పాలసీల బదిలీలపై పన్ను
- వార్తా పత్రికలపై అమ్మకం పన్ను, ప్రకటనలపై పన్ను
- అంతర్రాష్ట్ర వ్యాపారంలో విధించే అమ్మకం పన్ను
- అంతర్రాష్ట్ర వాణిజ్యంలో సరకులపై విధించే పన్ను
- సర్వీసులపై పన్ను
- వ్యవసాయేతర భూముల వారసత్వ బదలాయింపు పన్ను

రాష్ట్ర జాబితాలో 45 నుంచి 63 వరకు ఉన్న ఎంట్రీలు, 66వ అంశంతో కలిపి మొత్తం 20 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నులు విధించవచ్చు. **అవి:**

- భూమి శిస్తు
- వ్యవసాయ భూములపై వారసత్వ పన్ను
- స్థిరాస్తులపై పన్ను (భూములు, భవనాలు)
- మద్యపానంపై పన్ను
- విద్యుత్ వినియోగం, అమ్మకంపై పన్ను
- ప్రకటనలపై పన్ను
- మోటారు వాహనాలపై పన్ను
- టోల్ టాక్స్
- కస్టడీ పన్నులు
- కేంద్ర జాబితాలోని డాక్యుమెంట్లు మినహా మిగతా వాటిపై స్టాంపు డ్యూటీ
- వ్యవసాయ ఆదాయంపై పన్ను
- వ్యవసాయ భూములపై ఎస్టేట్ పన్ను
- ఖనిజాలపై పన్ను
- స్థానిక ప్రాంతాల్లోకి రవాణా అయ్యే వస్తువులపై పన్ను (ఆక్ట్రాయ్)
- వాణిజ్య పన్ను
- రోడ్డు, జల రవాణాలపై పన్ను
- పశువులపై పన్ను
- వృత్తి పన్ను
- వినోదపు పన్నులు
- రాష్ట్ర జాబితాలోని అంశాలకు చెందిన ఫీ

ఉమ్మడి జాబితాలోని ఎంట్రీ నంబర్లు 35, 44, 47లలో ఉన్న అంశాలపై పార్లమెంటు, రాష్ట్ర శాసన శాఖలు పన్నులు విధించవచ్చు. **అవి:**

- యాంత్రిక శక్తి ఆధారంగా పనిచేసే వాహనాలపై పన్ను
- స్టాంప్ డ్యూటీస్
- మూడో జాబితాలో పేర్కొన్న వాటిపై వసూలు చేసే ఫీ

అవశిష్ట పన్నులు: కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో పేర్కొనని అంశాలపై కేంద్రం పన్నులు విధించవచ్చు. **అవి:**

- బహుమతి పన్ను
- సంపద పన్ను
- వ్యయ పన్ను

ప్రకరణ 265 ప్రకారం చట్టబద్ధత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పన్నులు విధించరాదు. అయితే ఫీ వసూలు చేయవచ్చు.

ప్రకరణ 266 ప్రకారం కేంద్ర సంఘటిత నిధి, రాష్ట్ర సంఘటిత నిధి, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ పద్దులు ఉంటాయి.

కేంద్ర సంఘటిత నిధిలోకి కేంద్ర ప్రభుత్వానికి వచ్చే అన్ని ఆదాయాలను, రుణాలను జమ చేస్తారు. అదేవిధంగా రాష్ట్ర సంఘటిత నిధిలోకి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే అన్ని ఆదాయాలను జమ చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పద్దుల్లోకి ప్రజల పొదుపు మొత్తాలను జమ చేస్తారు. **ఉదా:** ప్రావిడెంటు ఫండ్, పోస్టల్ సేవింగ్స్, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పొదుపు పత్రాల ద్వారా వచ్చిన మొత్తం.

ప్రకరణ 267(1) ప్రకారం కేంద్ర ఆగంతుక నిధి, రాష్ట్ర ఆగంతుక నిధి ఉంటాయి. ఊహించని ఖర్చులను ముఖ్యంగా.. ప్రకృతి వైపరీత్యాల ద్వారా జరిగిన నష్టం, ఖర్చులను భరించడానికి రాష్ట్రపతి, గవర్నర్ పేరుతో ఆగంతుక నిధిని నిర్వహిస్తారు. పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభల ఆమోదానికి లోబడి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిధులను నిర్వహిస్తాయి. కేంద్ర ఆగంతుక నిధిని 1957లో భారత ఆగంతుక నిధి చట్టం ద్వారా ఏర్పాటు చేశారు.

ప్రకరణ 268: కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల విభజన: కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల విభజనకు సంబంధించి మౌలిక రాజ్యాంగంలో ప్రస్తావించిన అంశాలకు భారీ మార్పులు చేశారు. 2000లో 80వ, 2003లో 88వ రాజ్యాంగ సవరణల ద్వారా ఈ మార్పులు చేశారు.

10వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు 80వ రాజ్యాంగ సవరణ చేశారు. దీని ప్రకారం కేంద్రానికి వచ్చిన పన్నుల వాటాలో 29 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలి. ఈ పద్ధతినే 'ప్రత్యామ్నాయ నిధుల బదిలీ' అంటారు. ఇది 1996 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ద్వారా కేంద్ర పన్నులైన కార్పొరేషన్ టాక్స్, ఎక్సైజ్ సుంకాల్లో రాష్ట్రాలకు కూడా వాటా ఉంటుంది.

2004లో 88వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 266(ఎ)లో సర్వీస్ టాక్స్ అంశాన్ని చేర్చారు. దీన్ని కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. వసూలైన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్రాలు పంచుకుంటాయి.

ప్రకరణ 268 ప్రకారం కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకుంటాయి.

ఉదాహరణలు:

- బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్
- చెక్కులు
- ప్రామిసరీ నోటు
- బీమా పాలసీ బదలాయింపు
- కంపెనీ షేర్ల బదలాయింపు
- ఆల్కహాల్ ఆధారంగా తయారు చేసిన ఔషధాలు
- టాయ్‌లెట్ సంబంధ వస్తువులపై ఎక్సైజ్ డ్యూటీలు, స్టాంపు డ్యూటీలు

ప్రకరణ 268ఎ ప్రకారం సర్వీస్ టాక్స్ కేంద్ర ప్రభుత్వమే విధిస్తుంది. దీన్ని కేంద్రమే వసూలు చేస్తుంది. వసూలైన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి.

ప్రకరణ 269 ప్రకారం కేంద్రం విధించి, కేంద్రమే వసూలు చేసి, రాష్ట్రాలకు బదలాయించే పన్నులు: అంతర్రాష్ట్ర రవాణాలో జరిగే వస్తువుల అమ్మకం, కొనుగోలుపై విధించే పన్నులను కేంద్రమే విధించి, వసూలు చేసి, రాష్ట్రాలకు బదలాయిస్తుంది.

ప్రకరణ 270 ప్రకారం కొన్ని పన్నులను కేంద్రమే విధించి, కేంద్రమే వసూలు చేస్తుంది. వసూలు చేసిన మొత్తం కేంద్ర, రాష్ట్రాల మధ్య విభజిస్తారు. **ఉదా:** వ్యవసాయేతర ఆదాయపన్ను, సెంట్రల్ ఎక్సైజ్, రాష్ట్ర జాబితాలో ప్రస్తావించని ఇతర పన్నులు.

ప్రకరణ 271 ప్రకారం కొన్ని పన్నులపై సర్‌చార్జీలు: పార్లమెంటు ఒక చట్టం ద్వారా **ప్రకరణ 269, 270**లలో ప్రస్తావించిన పన్నులపై సర్‌చార్జీలు విధించొచ్చు.

ప్రకరణ 272లో ఉన్న అంశాలను 2000లో 80వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

ప్రకరణ 273 ప్రకారం అసోం, బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు జనుము, జనుము ఆధారిత ఎగుమతి సుంకాలకు సంబంధించి ప్రత్యామ్నాయ గ్రాంటులను కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది.

ప్రకరణ 274 ప్రకారం రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల విషయంలో పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టడానికి రాష్ట్రపతి పూర్వానుమతి అవసరం.

ప్రకరణ 275 (1) ప్రకారం సహాయ నిధులు (Grant-in-aid): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ప్రత్యేక అవసరాల అభివృద్ధి కోసం సహాయక నిధులను ఇస్తుంది. ఇవి రెండు రకాలు..

1. చట్టబద్ధ గ్రాంటులు, 2. విచక్షణ గ్రాంటులు.

చట్టబద్ధ గ్రాంటులు అంటే ఆర్థిక సహాయం అవసరమైన రాష్ట్రాలకు మాత్రమే పార్లమెంటు ఒక చట్టం ద్వారా కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు సాధారణ అవసరాలు, ప్రత్యేక అవసరాలకు (**ఉదా:** ఎస్సీ, ఎస్టీల సంక్షేమం) నిధులు ఇస్తుంది.

ప్రకరణ 275(1)(ఎ) ప్రకారం ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి ఉన్న గిరిజన ప్రాంతాల్లో సహాయక గ్రాంట్లు మొత్తం ఆ రాష్ట్రానికే చెల్లిస్తారు.

ప్రకరణ 275(2) ప్రకారం ఆర్థిక సంఘం సలహా మేరకు రాష్ట్రపతి సహాయక గ్రాంట్లను సంబంధిత అధికారులకు మంజూరు చేస్తారు. దీనికి సంబంధించి పార్లమెంటుకు శాసనం చేసే అధికారం కూడా ఉంది.

ప్రకరణ 276 ప్రకారం వ్యక్తి, వ్యాపారం, ఉపాధి అంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వాలు వ్యక్తులపై రూ. 2500లకు మించకుండా వృత్తి పన్ను విధించవచ్చు.

ప్రకరణ 279 ప్రకారం పన్నుల ద్వారా వసూలైన ఆదాయాన్ని నికర ఆదాయంగా నిర్ణయిస్తారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ దీనికి సంబంధించి నికర ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తారు.

ప్రకరణ 280 ప్రకారం ఆర్థిక సంఘం ఉంటుంది. భారత రాష్ట్రపతి ప్రతి అయిదేళ్లకు ఆర్థిక సంఘాన్ని ఏర్పరుస్తారు. ఇందులో ఒక చైర్మన్, నలుగురు సభ్యులుంటారు. ఇది కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల విభజనపై సిఫారసులు చేస్తుంది.

ప్రకరణ 281 ప్రకారం ఆర్థిక సంఘం తన సిఫారసులను రాష్ట్రపతికి సమర్పిస్తుంది. ఆ నివేదికను పార్లమెంటు ముందు ఉంచుతారు.

ప్రకరణ 282 ప్రకారం ప్రజా సౌకర్యార్థం ఏ రాష్ట్రానికైనా కేంద్ర ప్రణాళికా సంఘం సిఫారసు మేరకు పార్లమెంటు నిధులు ఇస్తుంది. వీటిని 'విచక్షణా గ్రాంటులు' అంటారు.

ప్రకరణ 285 ప్రకారం కేంద్ర ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వం పన్నులు విధించరాదు.

ప్రకరణ 286 ప్రకారం సరకుల క్రయ విక్రయాలకు సంబంధించిన పన్ను విధింపుపై పరిమితులు ఉంటాయి. రాష్ట్రం వెలుపల జరిగే వస్తువుల క్రయ విక్రయాలు, భారతదేశంలో దిగుమతి, ఎగుమతి చేసే వస్తువులపై రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు విధించకూడదు.

ప్రకరణ 287 ప్రకారం విద్యుత్‌పై పన్ను మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 292 ప్రకారం దేశంలో లేదా విదేశాల్లో కేంద్రం రుణాలు తీసుకోవచ్చు.

ప్రకరణ 293 ప్రకారం రాష్ట్రాలకు దేశం లోపల మాత్రమే రుణాలను తీసుకునే అధికారం ఉంది.

ఉపాధ్యాయుడి ముఖ్య కర్తవ్యం ఏమిటి?



మాదిరి ప్రశ్నలు

1. **ప్రస్తుత విద్యా విధానం దేనికి ప్రాధాన్యం ఇస్తుంది?**
   1) పాఠ్యపుస్తకాలు 2) క్రీడాంశ విధానం
   3) పని అనుభవం 4) పరీక్షలు
2. **తల్లిదండ్రులను పాఠశాల కార్యక్రమాలకు ఆహ్వానించడం వల్ల కలిగే ప్రయోజనం?**
   1) వారు తమ పిల్లల కార్యక్రమాలు చూసి ఆనందిస్తారు
   2) వారు పాఠశాల కార్యక్రమాల గురించి తెలుసుకుంటారు
   3) పాఠశాలకు సమాజంతో సంబంధం ఏర్పడుతుంది
   4) పాఠశాల పనితీరును పరిశీలించ గలుగుతారు
3. **ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఇచ్చే ఇంటి పని (హోమ్ వర్క్) ఏవిధంగా ఉండాలి?**
   1) సులభంగా చేయగలమనే భావన కలిగించేదిగా ఉండాలి
   2) ఆలోచనలను పెంచేవిధంగా ఉండాలి
   3) ఇతరులపై ఆధారపడేట్లు చేసేదిగా ఉండాలి
   4) కష్టతరమైన వాటినే ఇవ్వాలి
4. **పాఠశాలలో జాతీయ పండగలు నిర్వహించడంలోని ఉద్దేశం ఏమిటి?**
   1) జాతీయభావాన్ని పెంపొందించడం
   2) సామూహికంగా పనిచేయడాన్ని అలవరచడం
   3) పాఠశాలకు సమాజంతో సంబంధాన్ని ఏర్పరచడం
   4) ఒకరినొకరు అభినందించుకోవడాన్ని నేర్పించడం
5. **బాలికలు చదువును మధ్యలోనే మానేయడానికి ప్రధాన కారణం ఏమిటి?**
   1) ఆర్థిక స్తోమత లేకపోవడం
   2) తల్లిదండ్రుల ప్రోత్సాహం లేకపోవడం
   3) బాలికలకు విద్య అనవసరం అనే భావన
   4) చిన్న వయసులోనే పెళ్లి చేయడం
6. **ఉపాధ్యాయుడి సామర్థ్యం దేనిపై ఆధారపడుతుంది?**
   1) క్రమశిక్షణ 2) బోధనా పద్ధతులు
   3) మూర్తిమత్వం 4) నైపుణ్యం
7. **ప్రాథమిక పాఠశాలల్లో బోధనా వసతులు, పాఠశాల అవసరాలు ఏ కార్యక్రమం కింద సమకూరుతున్నాయి?**
   1) రాజీవ్ విద్యా మిషన్
   2) సర్వశిక్షా అభియాన్
   3) ఆపరేషన్ బ్లాక్‌బోర్డు
   4) ఏదీకాదు
8. **ఆపరేషన్ బ్లాక్ బోర్డు ముఖ్య ఉద్దేశం?**
   1) పాఠశాలల్లో కనీస అవసరాల కల్పన
   2) ఉపాధ్యాయుల నియామకం
   3) మధ్యాహ్న భోజన పథకం అమలు
   4) విద్యార్థులందరికీ ఉపాధి కల్పన
9. **విద్యార్థిగా మీరు ఎక్కడ గడపడానికి ఇష్టపడతారు?**
   1) మైదానంలో 2) లైబ్రరీలో
   3) తరగతి గదిలో 4) పైవన్నీ
10. **ఉపాధ్యాయుడిగా మీరు ఎలాంటి విద్యార్థులను అభిమానిస్తారు?**
    1) వినయ, విధేయతలతో నడచుకునేవారిని
    2) అల్లరిచేస్తూ సరదాగా గడిపేవారిని
    3) ఎల్లప్పుడూ చదువుకునేవారిని
    4) అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేవారిని
11. **ఒక పని చేసేటప్పుడు కొన్ని ఆటంకాలు ఎదురైతే మీరు ఏం చేస్తారు?**
    1) పని పూర్తిగా ఆపేస్తాను
    2) పని తాత్కాలికంగా ఆపేస్తాను
    3) ఆలోచిస్తాను
    4) ఆటంకాలను అధిగమించి పని పూర్తి చేస్తాను
12. **మీరు ఒక గణిత సమస్యను పరిష్కరించే ప్రయత్నంలో భాగంగా సమస్యను త్వరగా సాధించలేకపోతే ఏం చేస్తారు?**
    1) విసుగుచెంది మానేస్తాను
    2) ఆలోచిస్తూ కూర్చుంటాను
    3) ఇతరుల సహాయంతో సాధించడానికి ప్రయత్నిస్తాను
    4) రేపటికి వాయిదా వేస్తాను
13. **ఒక విద్యార్థి నిరంతరం తన కొంటె చేష్టలతో తరగతిని ఆటంకపరుస్తుంటే ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేయాలి?**
    1) అతడి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయాలి
    2) ఆ విద్యార్థికి తరగతిలో క్రమశిక్షణ నిర్వహణ బాధ్యతను అప్పగించాలి
    3) ఆ విద్యార్థిని పట్టించుకోకూడదు
    4) తరగతి గది నుంచి ఆ విద్యార్థిని బయటకు పంపించాలి
14. **కిందివాటిలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సరైన అవగాహన ఉండటానికి దోహదపడే అంశం ఏది?**
    1) విద్యార్థులు తమ పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని ఉపాధ్యాయులు అడగడం
    2) ఉపాధ్యాయులు విద్యార్థుల్లో భయభ్రాంతులను కలుగజేయడం
    3) ఉపాధ్యాయులు విద్యార్థులకు సాయం చేసే మార్గదర్శకులుగా ఉండి వారి పట్ల కలుపుగోలుతో ప్రవర్తించడం
    4) ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను సూచించడం
15. **ఒక చర్చలో మీరు భాగస్వాములైతే..?**
    1) ఇతరులు చెప్పేది జాగ్రత్తగా వింటాను
    2) నేను చెప్పేది ఇతరులు వినేటట్లు జాగ్రత్త పడతాను
    3) చర్చలో పాల్గొనను
    4) ఆలోచిస్తూ కూర్చుంటాను
16. **విద్యార్థి పాఠశాలలో గ్రంథ పఠనం చేయడంపై ఉపాధ్యాయుడిగా మీ అభిప్రాయం?**
    1) దాని వల్ల విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుంది
    2) విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుంది
    3) విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందుతుంది
    4) పైవన్నీ
17. **విద్యార్థుల శక్తి సామర్థ్యాలను సరిగా అంచనా వేయగలిగిన వారెవరు?**
    1) తల్లిదండ్రులు 2) స్నేహితులు
    3) అధ్యాపకులు 4) పరీక్షకులు
18. **ప్రస్తుత విద్యా విధానంలో కనిపించే ప్రధానమైన లోపమేమిటి?**
    1) నిరుద్యోగం పెరగడానికి కారణం అవుతోంది
    2) జాతీయ సమగ్రతాభావాన్ని కలిగించడం లేదు
    3) సత్ప్రవర్తనను పెంపొందించడం లేదు
    4) స్వయం పోషకత్వానికి ఉపయోగ పడటం లేదు
19. **కొంత మంది విద్యార్థులు మధ్యలోనే బడి మానేస్తున్నారు. దీనికి ఒక కారణం?**
    1) తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం
    2) పుస్తకాలు సకాలంలో లభించకపోవడం
    3) విద్యార్థులకు బడిలో పాఠాలు అర్థం కాకపోవడం
    4) పాఠశాల వాతావరణం ఆకర్షణీయంగా లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత
20. **తెలివైన విద్యార్థులుగా ఎవరిని పేర్కొంటాం?**
    1) ఎల్లప్పుడూ విశ్రాంతి లేకుండా చదువుకునేవారు
    2) పరీక్షల్లో ఎక్కువ మార్కులు సంపా దించేవారు
    3) విద్యపై ఇష్టం చూపేవారు
    4) తమ విజ్ఞానాన్ని నిత్యజీవితంలో ఉపయోగించుకునేవారు
21. **క్రమశిక్షణ లక్ష్యం ఏమిటి?**
    1) విద్యార్థుల్లో ఐకమత్యాన్ని కలిగించడం
    2) విద్యార్థులను నియమబద్ధులుగా తయారుచేయడం
    3) విద్యార్థుల్లో భయం కలిగించడం
    4) విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడటం
22. **విద్యార్థుల ప్రవర్తనపై ప్రభావం కలిగించేది?**
    1) నైతిక విద్యాబోధన
    2) తల్లిదండ్రుల పెంపకం
    3) పాఠశాల వాతావరణం
    4) ఉపాధ్యాయుల ఆదర్శం
23. **ఉపాధ్యాయులకు ఏది అవసరం?**
    1) క్రమశిక్షణ 2) సహనం
    3) గ్రంథాలయ పఠనం
    4) మంచి కంఠస్వరం
24. **విద్యార్థులకు రాజకీయాలు బోధించడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?**
    1) పరిపాలనా విధానం గురించి తెలుసుకుంటారు
    2) వారు రాజకీయల్లో చురుగ్గా పాల్గొంటారు
    3) పార్టీలకు సంబంధించిన వివరాలు తెలుసుకుంటారు
    4) మంచి నాయకత్వ లక్షణాలను సంపాదిస్తారు
25. **మీరు తరగతి గదిలో బోధించే సమయంలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ఆశిస్తారా?**
    1) అవసరం లేదు 2) సమయం వృథా
    3) విద్యార్థులందరూ పాల్గొనేలా చూస్తాను
    4) తెలివైనవారిని మాత్రమే ఆమోదిస్తాను
26. **విద్యార్థులకు స్వేచ్ఛ ఎందుకివ్వాలి?**
    1) దానివల్ల వారిలో క్రమశిక్షణ పెరుగుతుంది
    2) వారికి ఆటలాడుకునే సమయం ఎక్కువగా లభిస్తుంది
    3) వారిలోని అంతర్గత శక్తులు వ్యక్తమవుతాయి
    4) వారు స్వేచ్ఛగా మాట్లాడగలుగుతారు
27. **పాఠశాల సక్రమ నిర్వహణలో ఎవరి పాత్ర ప్రాముఖ్యమైంది?**
    1) విద్యార్థి 2) ఉపాధ్యాయుడు
    3) ప్రధానోపాధ్యాయుడు
    4) విద్యాశాఖ అధికారి
28. **గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మీరు గ్రామానికి ఏం చేస్తారు?**
    1) గ్రామస్థులకు పరిశుభ్రత అలవాటు చేస్తాను
    2) నైతిక విద్యను బోధిస్తాను
    3) నిరక్షరాస్యత తొలగిస్తాను
    4) వయోజనులకు విద్య నేర్పిస్తాను
29. **నైతిక విద్య ముఖ్య ఉద్దేశం ఏమిటి?**
    1) మంచి పౌర లక్షణాలను పెంపొందించడం
    2) ఆదర్శ వ్యక్తిత్వాన్ని పెంపొందించడం
    3) ధార్మిక దృష్టిని కలుగజేయడం
    4) నైతిక విలువలను సృష్టించడం
30. **ఉపాధ్యాయుడి ముఖ్య కర్తవ్యం ఏమిటి?**
    1) విద్యార్థులు క్రమశిక్షణ పాటించేలా చేయడం
    2) విద్యార్థులను మానసికంగా అభివృద్ధి చేయడం
    3) బోధనా ప్రావీణ్యాన్ని మెరుగుపరచుకోవడం
    4) విద్యార్థులతో పలుమార్లు అభ్యాసం చేయించడం
31. **తమను తాము తక్కువగా అంచనా వేసుకునే విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయుడు ఏవిధంగా వ్యవహరించాలి?**
    1) పాఠాలను మరింత మంచిగా చెప్పాలి
    2) విద్యార్థుల తెలివితేటలను పెంపొం దించే అభ్యాసాలు ఇవ్వాలి
    3) వ్యక్తిగత బోధన చేపట్టాలి
    4) అభ్యాసాలు ఇస్తూ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని కలుగజేయాలి

సమాధానాలు

1) 3; 2) 3; 3) 2; 4) 1; 5) 2; 6) 2; 7) 2; 8) 1; 9) 4; 10) 4; 11) 4; 12) 3; 13) 1; 14) 3; 15) 1; 16) 4; 17) 3; 18) 4; 19) 4; 20) 4; 21) 2; 22) 4; 23) 1; 24) 1; 25) 3; 26) 3; 27) 3; 28) 3; 29) 1; 30) 3; 31) 4.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌హెచ్‌ఏఐలో 26 పోస్టులు

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) డీపీఆర్‌సెల్ ఆఫ్ ఎన్‌హెచ్‌ఏఐలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 26.
- **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపల్ డీపీఆర్ ఎక్స్‌పర్ట్-04, డొమైన్ ఎక్స్‌పర్ట్-సీనియర్ హైవే ఎక్స్‌పర్ట్-04, రోడ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్-04, ట్రాఫిక్ ఎక్స్‌పర్ట్-05, ఇన్విరాన్‌మెంట్/ఫారెస్ట్ స్పెషలిస్ట్-05, ల్యాండ్ అక్విజిషన్ ఎక్స్‌పర్ట్-04.
- **అర్హత:** గ్రాడ్యుయేషన్(సివిల్ ఇంజనీరింగ్) లేదా తత్సమానం, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 30.04.2025.
- **వెబ్‌సైట్:** https://nhai.gov.in

సీపెట్, భువనేశ్వర్‌లో టీచింగ్ పోస్టులు

భువనేశ్వర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్).. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
- **పోస్టుల వివరాలు:** అసోసియేట్ ప్రొఫెసర్ (మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్)-01, అసిస్టెంట్ ప్రొఫెసర్(మెటీరియల్ సైన్స్)-01, అసిస్టెంట్ ప్రొఫెసర్(మెటీరియల్ సైన్స్/ఫిజిక్స్)-01, అసిస్టెంట్ ప్రొఫెసర్(కంప్యూటర్ సైన్స్)-01, అసిస్టెంట్ ప్రొఫెసర్(మ్యాథమేటిక్స్)-01, అసిస్టెంట్ ప్రొఫెసర్(ఇంగ్లిష్)-01, ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్-01.
- **అర్హత:** బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు నెట్/స్లెట్/సెట్ స్కోరుతో పాటు పని అనుభవం ఉండాలి.
  వయసు: 65 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.46,400, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.35,000 నుంచి రూ.40,000, ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్‌కు రూ.40,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.04.2025.
- **వెబ్‌సైట్:** https://www.cipet.gov.in

ఇందిరా పాయింట్ ఎక్కడ ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
సాంఘిక శాస్త్రం



భారతదేశం- భౌగోళిక స్వరూపాలు

విశాల భారతదేశ భౌగోళిక స్వరూప విశిష్టత, వైవిధ్యం, వాటి ముఖ్య లక్షణాలను ఈ పాఠంలో నేర్చుకుంటారు. వివిధ భౌగోళిక స్వరూపాల ఉనికి అక్కడి ప్రజలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందో విద్యార్థులు అవగాహన చేసుకోగలుగుతారు. భౌగోళిక దృగ్విషయాలు, భారతదేశంలోని వాతావరణ మార్పులకు, భారతీయుల జీవనానికి కావాల్సిన అవసరాలను తీర్చడానికి ఎలా దోహదపడుతున్నాయో ఈ పాఠ్యాంశం ద్వారా వివరణాత్మకంగా తెలుసుకోవచ్చు.

ముఖ్యాంశాలు

భారతదేశ ఉనికి

- భారతదేశం పూర్తిగా ఉత్తరార్ధ గోళంలో ఉంది. 8°4' నుంచి 37°6' ఉత్తర అక్షాంశాల మధ్య 68°7' నుంచి 97°25' తూర్పు రేఖాంశాల మధ్య విస్తరించి ఉంది.
- భారత ప్రామాణిక కాలమానాన్ని (ఐఎస్‌టీ) నిర్ధారించడానికి అలహాబాద్ (ఉత్తరప్రదేశ్) నుంచి వెళ్లే 82°30' తూర్పు రేఖాంశాన్ని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. గ్రీనిచ్ (లండన్) ప్రామాణిక కాలానికి (GMT- Greenwich Mean Time) ఐఎస్‌టీ 5 గంటల 30 నిమిషాలు ముందుఉంటుంది.
- తూర్పు చివరన ఉన్న ఇంఫాల్ (మణిపూర్)లో సూర్యోదయమైన 80 నిమిషాల తర్వాత పశ్చిమ చివరన అహ్మదాబాద్(గుజరాత్)లో సూర్యోదయం అవుతుంది.
- ప్రపంచ భూభాగమంతా రెండు ప్రధాన భూఖండాల నుంచి ఏర్పడింది. అవి.. అంగారా భూమి (లారేషియా), గోండ్వానా భూమి. భారత ద్వీపకల్పం గోండ్వానా భూభాగానికి చెందింది.
- హిమాలయాలు 20 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయి. అది మానవులు రెండు లక్షల ఏళ్లక్రితం భూమిపై ఆవిర్భవించారు.

ముఖ్య భౌగోళిక స్వరూపాలు

1) హిమాలయాలు
2) గంగా-సింధు నది మైదానం
3) ద్వీపకల్ప పీఠభూమి
4) తీరప్రాంత మైదానాలు
5) ఎడారి ప్రాంతం
6) దీవులు

హిమాలయాలు

ఇవి పడమర నుంచి తూర్పునకు 2400 కి.మీ. పొడవున వ్యాపించి ఉన్నాయి. వీటిలో సమాంతరంగా ఉండే మూడు పర్వత శ్రేణులున్నాయి. అవి.. ఉన్నత హిమాలయాలు (హిమాద్రి శ్రేణి), నిమ్న హిమాలయాలు (హిమాచల్ శ్రేణి), బాహ్య హిమాలయాలు (శివాలిక్ శ్రేణి).

గంగా- సింధు నది మైదానం

గంగా-సింధు మైదాన ప్రాంతాన్ని మూడు భాగాలుగా విభజించారు. అవి.. పశ్చిమ భాగం, మధ్య భాగం, తూర్పు భాగం.

ద్వీపకల్ప పీఠభూమి

ఈ ప్రాంతాన్ని ప్రధానంగా రెండు భాగాలుగా విభజించారు. అవి.. మధ్య ఉన్నతభూములు, దక్కన్ పీఠభూమి.

తీరప్రాంత మైదానాలు

వీటిని రెండు భాగాలుగా వర్గీకరించారు. అవి.. పశ్చిమ తీర మైదానం (అరేబియా సముద్ర తీర ప్రాంతం). తూర్పు తీర ప్రాంతం (బంగాళాఖాతం తీరం).

ఎడారి ప్రాంతం: థార్ ఎడారి (రాజస్థాన్).

దీవులు

భారత దేశంలో రెండు ద్వీప సమూహాలున్నాయి.అవి..అండమాన్ నికోబార్ దీవులు, లక్షదీవులు

కీలక పదాలు- నిర్వచనాలు

జీవనది: వేసవిలోనూ ఎండిపోకుండా ఏడాది పొడవునా ప్రవహించే నది. ఉదా:గంగా, యమునా నదులు.

ద్వీపకల్పం: మూడు వైపులా నీరు ఉండి ఒకవైపు భూభాగంతో ఉండే భూస్వరూపం. ఉదా: భారతదేశం.

కోరల్: కోరల్ అనే ఆంగ్ల పదానికి పగడం అని అర్థం. ఇది సముద్రాల్లో జీవించే కీటకం. ఈ పగడపు కీటకాలు కాల్షియం కార్బోనేట్‌ను గ్రహించి తమ కర్పరాలను నిర్మిస్తాయి. ఇవి గుంపులు గుంపులుగా నివసిస్తూ ఒకదానికొకటి పెనవేసుకొని పగడపు దిబ్బలను ఏర్పరుస్తాయి. ఈ దిబ్బలను ప్రవాళ భిత్తికలని పిలుస్తారు. ఇవి సముద్రంపైకి ఉబ్బివచ్చి దీవులుగా ఏర్పడుతాయి. ఉదా: లక్షదీవులు

డూన్: హిమాచల్ శ్రేణి(నిమ్న హిమాలయాలు), శివాలిక్ శ్రేణి (బాహ్య హిమాలయాలు)ల మధ్య ఉండే లోయలను స్థానికంగా డూన్ అని పిలుస్తారు.

ఉదా: డెహ్రాడూన్, కోట్లీడూన్, పాట్లీడూన్.

అంగారా భూమి: ప్రస్తుతమున్న ఉత్తరఅమెరికా, యూరప్, ఆసియా ఖండాలు 20 కోట్ల సంవత్సరాల క్రితం ఒక్కటిగానే కలిసి ఉన్న భూభాగంగా ఉండేది. దీన్ని అంగారా భూమి (లారేషియా)గా పిలిచేవారు. ఇది టెథిస్ సముద్రానికి ఉత్తరంగా ఉండేది.

గోండ్వానా భూమి: ప్రస్తుతమున్న దక్షిణఅమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అంటార్కిటికా ఖండాల భూభాగంతో పాటు ఇండియా, మలేషియాలాంటి దక్షిణాసియా ప్రాంతాలన్నీ ఒకే భూభాగంగా ఉండేవి. ఈ భూ భాగాన్ని గోండ్వానా భూమి అనేవారు. ఇది టెథిస్ సముద్రానికి దక్షిణంగా ఉండేది.

శివాలిక్ శ్రేణి: దక్షిణ హిమాలయ పర్వతాలను బాహ్య హిమాలయాలుగా పిలుస్తారు. వీటిని శివాలిక్ పర్వతశ్రేణి అంటారు. ఈ శ్రేణి జమ్ముకశ్మీర్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ వరకు అవిచ్ఛిన్నంగా వ్యాపించి ఉంది. వీటి సగటు ఎత్తు 900 మీ. నుంచి 1100 మీ. ఉంటుంది.

పూర్వాంచల్ పర్వతాలు: భారతదేశానికి తూర్పున ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న హిమాలయాలను పూర్వాంచల్ పర్వతాలు అంటారు. ఈ పర్వతాలు అవక్షేప శిలలు, ఇసుకతో ఏర్పడ్డాయి. వీటిని స్థానికంగా వివిధ పేర్లతో పిలుస్తారు.

ఉదా: పాట్‌కాయ్ కొండలు (నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్), ఖాసీ కొండలు (మేఘాలయ).

ఇందిరా పాయింట్: భారతదేశ దక్షిణ చివరి సరిహద్దును ఇందిరా పాయింట్‌గా పిలుస్తారు. ఇది నికోబార్ దీవుల దక్షిణ చివరన ఉంది.

అంతర్వేది: రెండు నదుల మధ్య ఉండే మైదాన ప్రాంతాన్ని అంతర్వేది అంటారు. ఇది సారవంతమైన భూభాగం. పూర్వం ఇలాంటి ప్రాంతాలపై అధికారం పొందడానికి రాజుల మధ్య యుద్ధాలు జరిగేవి.

ప్రశ్నలు-సమాధానాలు

నాలుగు మార్కుల ప్రశ్నలు

1. కింది పేరాను చదివి భారతదేశ శీతోష్ణస్థితి, హిమాలయాల గురించి వ్యాఖ్యానించండి.

హిమాలయాల వల్ల శీతోష్ణస్థితి అనేక విధాలుగా ప్రభావితమవుతుంది. ఇవి భారతదేశ ఉత్తర సరిహద్దులో రక్షణ కవచంగా ఉండి తీవ్ర చలికాలంలో మధ్య ఆసియా నుంచి వచ్చే చల్లటి గాలులను అడ్డుకుంటాయి. వేసవిలో వర్షాలకు, పశ్చిమ కనుమలు దాటిన తర్వాత ఉన్న ప్రాంతంలో రుతుపవన శీతోష్ణస్థితికి హిమాలయాలే కారణం. ఇవి లేకపోతే ఉత్తర ప్రాంతం పొడిగా ఉండేది.

జ: ఒక ప్రాంతంలో దీర్ఘకాలికంగా ఒక క్రమ పద్ధతిలో ఉండే వాతావరణ పరిస్థితులను శీతోష్ణస్థితిగా పిలుస్తారు. ఉష్ణోగ్రత, వర్షపాతం, పీడనం, పవనాలు, ఆర్ద్రత మొదలైన భౌతికాంశాల సగటు స్థితులను శీతోష్ణస్థితి వివరిస్తుంది. వివిధ ప్రదేశాల్లోని శీతోష్ణస్థితి లక్షణాల్లోని తేడాలను నిర్ణయించడంలో మనదేశ వైశాల్యం, వివిధ భౌగోళిక స్వరూపాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. వాటిలో ప్రధానమైనవి హిమాలయ పర్వతాలు.

హిమాలయ పర్వతాలు జమ్ముకశ్మీర్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ వరకు భారతదేశ ఉత్తర సరిహద్దుగా సుమారు 2400 కి.మీ. పొడవున వ్యాపించి ఉన్నాయి. శీతాకాలంలో మధ్య ఆసియా నుంచి వీచే అతి శీతల పవనాలు ఉత్తర మైదానాల్లోకి ప్రవేశించకుండా హిమాలయాలు అడ్డగించి ఉత్తర భారతాన్ని చలి నుంచి కాపాడుతున్నాయి. వేసవిలో మైదానాల్లో వర్షం కురవడానికి, పశ్చిమ కనుమల తూర్పు, ఈశాన్య భాగాల్లోనూ రుతుపవన శీతోష్ణస్థితికి హిమాలయాలే కారణం. రుతుపవన శీతోష్ణస్థితి లేకుంటే భారతదేశం ఉష్ణమండల ఎడారిగా మారి ఉండేది. అంతేకాకుండా హిమాలయాల్లోని హిమానీ నదాల నుంచి ప్రవహించే జీవనదుల వల్ల ఉత్తర మైదానాలు సారవంతంగా మారాయి. దీంతో అక్కడ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ విధంగా హిమాలయాల వల్ల భారత శీతోష్ణస్థితి అనేక విధాలుగా ప్రభావితం అవుతోంది.

2. భారతదేశ ప్రధాన భౌగోళిక విభజనలు ఏవి? హిమాలయ ప్రాంత భౌగోళిక పరిస్థితులతో ద్వీపకల్ప పీఠభూమిని పోల్చండి?

జ: భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని ఆరు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు.

1. హిమాలయాలు 2. గంగా - సింధు మైదానం 3. ద్వీపకల్ప పీఠభూమి 4. తీరప్రాంత మైదానాలు 5. ఎడారులు 6. దీవులు.

హిమాలయ ప్రాంతం, ద్వీపకల్ప పీఠభూమికి మధ్య ఉన్న పోలికలు, తేడాలు:

- ఉత్తర భారతదేశ ఉత్తర భాగంలో హిమాలయ పర్వతాలున్నాయి. ఇవి సుమారుగా 5 లక్షల చ.కి.మీ. విస్తీర్ణంలో వ్యాపించి ఉన్నాయి. భారత ఉత్తర మైదానాలకు దక్షిణంగా ఉన్న పీఠభూమిని ద్వీపకల్ప పీఠభూమిగా పిలుస్తారు. 16 లక్షల చ.కి.మీ. వైశాల్యం ఉన్న ఈ పీఠభూమి విశాలమైన దేశంలో అతిపెద్ద నైసర్గిక స్వరూపం.
- హిమాలయాలు సముద్ర మట్టానికి సరాసరి 600 నుంచి 6100 మీటర్ల ఎత్తు ఉండగా, ద్వీపకల్ప పీఠభూమి 600 నుంచి 900 మీటర్ల సాధారణ ఎత్తుతో క్రమరహితంగా ఉంది.
- హిమాలయాల్లో జన్మించిన గంగా, సింధు, బ్రహ్మపుత్ర నదులు, వాటి ఉపనదులు జీవనదులుగా ప్రవహిస్తూ ఉత్తర భారతదేశాన్ని సస్యశ్యామలం చేస్తున్నాయి. ద్వీపకల్ప పీఠభూమిలో ప్రవహిస్తున్న గోదావరి, కృష్ణా, మహానది, కావేరి, నర్మద, తపతి లాంటి ముఖ్యనదులు ద్వీపకల్ప పీఠభూమిని సంపన్నం చేస్తున్నాయి.
- హిమాలయాల దక్షిణ భాగంలో గంగా - సింధు మైదానాలు ఉన్నాయి. ఇక్కడి సారవంతమైన నేలలు పలు పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ద్వీపకల్ప పీఠభూమిని ఆనుకొని పశ్చిమ, తూర్పు భాగాల్లోనూ తీర మైదానాలున్నాయి. ఈ మైదానాల్లోని సాగు భూమి వ్యవసాయానికి అత్యంత అనుకూలం.
- ఈ రెండు ప్రాంతాల్లోని భౌగోళిక నిమ్నోన్నతాలు అక్కడ రుతుపవన వర్షపాతం కురవడానికి దోహదపడుతున్నాయి.
- హిమాలయ ప్రాంతంలో దాల్, ఊలార్, కుమావున్, సోమర్ లాంటి ప్రముఖ సరస్సులున్నాయి. చిల్కా, పులికాట్, కొల్లేరు, అష్టముడి లాంటి సరస్సులు ద్వీపకల్ప పీఠభూమిలో ప్రధానమైనవి.

ఈ రెండు ప్రధాన భౌగోళిక స్వరూపాలు అనేక రకాలుగా భారతదేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయి.

రెండు మార్కుల ప్రశ్న

1. ప్రపంచ పటాన్ని పరిశీలించి భారతదేశ ఉనికిని గురించి క్లుప్తంగా రాయండి.



జ: భారతదేశ ఉనికి

- ఆసియా ఖండ దక్షిణ భాగంలో భారతదేశం ఉంది. భూమధ్య రేఖకు ఉత్తరంగా ఉన్న భారతదేశం ఉత్తరార్థ, పూర్వార్ధ గోళాల్లో విస్తరించి ఉంది.
- భారతదేశం భౌగోళికంగా 8°4' నుంచి 37°6' ఉత్తర అక్షాంశాలకు, 68°7' నుంచి 97°25' తూర్పు రేఖాంశాల మధ్య ఉంది.
- మూడువైపులా సముద్రం ఉండి ఒక వైపు భూభాగ సరిహద్దు ఉన్న భారతదేశాన్ని ద్వీపకల్పంగా పరిగణిస్తారు.
- ఇది అక్షాంశాల పరంగా ఉత్తర దక్షిణాలుగా 30 డిగ్రీల పొడవున, అలాగే రేఖాంశాల పరంగా కూడా తూర్పు పడమరలుగా అన్నే డిగ్రీల వెడల్పున వ్యాపించి ఉంది.
- భారతదేశ భూభాగాలైన అండమాన్ నికోబార్, లక్షదీవులు ప్రధాన భూభాగానికి దూరంగా విసిరేసినట్లు ఉన్నాయి.

ఒక మార్కు ప్రశ్నలు

1. అంతస్థలీయ ప్రవాహం అంటే ఏమిటి?

జ: ఎడారుల్లో ప్రవహించే నది లేదా కాలువల్లోని నీరు సముద్రానికి చేరకుండా సరస్సుల్లోకి ప్రవహించి అక్కడి ఇసుకలోకి ఇంకి అంతర్గతంగా ప్రవహిస్తుంది. ఈ ప్రవాహాలను అంతస్థలీయ ప్రవాహాలు అంటారు.

ఉదా: థార్ ఎడారిలోని లూనీ ప్రవాహం.

2. టెరాయి అంటే ఏమిటి?

జ: సచ్ఛిద్రంగా ఉండే బాభర్ ప్రాంతం కింది నుంచి చిన్న చిన్న నదులు, వాగులు ప్రవహించి కొద్ది దూరంలో బయటికి వచ్చి ప్రవహిస్తాయి. అప్పుడు ఆ ప్రాంతంలో చిత్తడి నేలలు ఏర్పడతాయి. ఈ చిత్తడి ప్రాంతాన్ని టెరాయి అంటారు.

లక్ష్యాత్మక ప్రశ్నలు

1. కిందివాటిలో తప్పుగా జతపర్చినది?
ఎ) జమ్ముకొండలు- జమ్ముకశ్మీర్
బి) మిష్మీకొండలు- అరుణాచల్‌ప్రదేశ్
సి) కొచ్చార్- అస్సోం
డి) పాట్కాయ్- ఉత్తరప్రదేశ్

2. కింది ఏ పర్వతాల్లో ఊటీ ఉంది?
ఎ) మహదేవ్ కొండలు బి) నీలగిరి
సి) ఆరావళి డి) అన్నామలై

3. సిమ్లా, నైనిటాల్, ముస్సోరి వంటి వేసవి విడిది స్థావరాలు ఏ ప్రాంతంలో ఉన్నాయి?
ఎ) ఉన్నత హిమాలయాలు
బి) నిమ్న హిమాలయాలు
సి) శివాలిక్ శ్రేణి
డి) నీలగిరి

4. ఆరావళి పర్వతాల వర్షచ్ఛాయ ప్రాంతంలో ఉన్న ఎడారి?
ఎ) సహారా బి) థార్
సి) అటకామా డి) సోన్

5. కింది వాటిలో సింధు నది ఉపనది?
ఎ) గండక్ బి) కోసీ
సి) రావి డి) బెట్వా

సమాధానాలు

1) డి; 2) బి; 3) బి; 4) బి; 5) సి.

Internet data is broken up as



Bank Exams
COMPUTER AWARENESS

1. A technique used by codes to convert an analog signal into a digital bit stream is known as:
a) Pulse code modulation
b) Pulse stretcher
c) Query processing
d) Queue management
e) None of these

2. The most important or powerful computer in a typical network is:
a) desktop b) network client
c) network server
d) network station
e) my computer

3. In MS word what is the short curt of Ctrl + L?
a) Left Align b) Left Indent
c) Increase Left Margin
d) Decrease Left Margin
e) None

4. Which of the following can NOT be used to create parallel style column?
a) Format Tabs
b) Table Insert Table
c) Insert Textbox
d) Format Columns
e) None of these

5. An Internet standard for transferring files is known as:
a) IRC b) Telnet c) FTP
d) WAIS e) None of these

6. Another name for electronic cash or e-cash, the Internet equivalent to traditional cash, is:
a) Cybercast and analog cash
b) Digital cash and cybercom
c) Carders and cybercom
d) Cybercast and digital cash
e) None of these

7. This type of e-commerce often takes the form of an electronic version of the classified ads or an auction:
a) B2C b) C2C c) G2C
d) B2B e) None of these

8. The command that fixes the minor errors of the disk:
a) Error.fix b) Scandisk
c) Chkdsk d) Defrag
e) None of these

9. What is a LAN that has one or more dedicated computers and all others act as recipients?
a) Peer-to-peer model
b) Client/server model
c) P-to-p model
d) Ring network e) None

10. If a computer has a(n) ______ port, it does not need a NIC.
a) Internet b) Ethernet
c) Intranet d) Broad band
e) None of these

11. Microprocessors as switching devices are used for which generation computers?
a) First Generation
b) Second Generation
c) Third Generation
d) Fourth Generation
e) None of these

12. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
a) Extended Binary Coded Decimal Interchange Code
b) Extended Bit Code Decimal Interchange Code
c) Extended Bit Case Decimal Interchange Code
d) Extended Binary Case Decimal Interchange Code
e) None of these

13. Storage capacity of magnetic disk depends on:
a) Tracks per inch of surface
b) Bits per inch of tracks
c) Disk pack in disk surface
d) All of above e) None of these

14. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is:
a) Memory b) Buffer
c) Accumulator d) Address
e) None of these

15. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the ________.
a) Internal modem
b) External modem
c) PC Card modem
d) Wireless modem e) None

16. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
a) ISDN b) Microwave
c) Cable modem d) DSL
e) None of these

17. The rules for exchanging data between computers are called
a) Interconnections
b) Synchronous packages
c) Protocols
d) Data transmission synchronization
e) None of these

18. ______ is the process of breaking down information sent or transmitted across the Internet into small parts called packets.
a) Protocol b) Bandwidth
c) Reformatting d) Identification
e) None of these

19. Relocation bits used by relocating loader are specified (generated) by
a) Relocating loader itself
b) Linker
c) Assembler or translator
d) Macro processor
e) None of these

20. Which of the following scheduling objectives should be applied to the following: the system should admit jobs to create a mix that will keep most devices busy
a) to be fair
b) to balance resource utilization
c) to obey priorities
d) to be predictable e) none

21. A task in a blocked state
a) is executable
b) is running
c) must still be placed in the run queues
d) is waiting for same temporarily unavailable resources
e) none of these

22. The higher versions of the operating systems are so written that programs designed for earlier versions can still be run. What is it called?
a) Upgradability
b) Upward mobility
c) Universality
d) upward compatibility
e) none of these

23. IP address is currently
a) 4 bytes long
b) available in plenty
c) 6 bytes long
d) not assigned as it is all used up
e) none of these

24. Internet data is broken up as
a) Fixed length packets
b) Variable length packets
c) Not packetized
d) 64 bytes packets
e) None of these

25. The packets of an internet message
a) take a predetermined path
b) take a path based on packet priority
c) go along different paths based on path availability
d) take the shortest path from source to destination
e) none of these

26. By an intranet we mean
a) a LAN of an organization
b) a Wide Area Network connecting all branches of an organization
c) a corporate computer network
d) a network connecting all computers of an organization and using the internet protocol
e) none of these

27. The part of machine level instruction, which tells the central processor what has to be done, is
a) Operation code b) Address
c) Locator d) Flip-Flop
e) Register

28. Which of the following systems software does the job of merging the records from two files into one?
a) Security software
b) Utility program
c) Networking software
d) Documentation system
e) None of these

29. Fork is
a) The dispatching of a task
b) The creation of a new job
c) The creation of a new process
d) Increasing the priority of a task
e) None

30. Computer is free from tiresome and boardroom. We call it
a) Accuracy b) Reliability
c) Diligence d) Versatility
e) None of these

31. CD-ROM is a
a) Semiconductor memory
b) Memory register
c) Magnetic memory
d) All the above
e) None of these

32. To produce high quality graphics (hardcopy) in colour, you would want to use a/n
a) RGB monitors b) Plotter
c) Ink-jet printer
d) Laser printer e) None

33. Which of the following IC was used in third generation of computers?
a) SSI b) MSI c) LSI
d) Both a and b
e) None of these

34. On which of the following sites can you set up your email account:
a) www.hotmail.com
b) www.gre.org c) www.linux.org
d) www.syvum.com e) none

35. The acronym NOS refers to the :
a) Operating system on the clients
b) Network order system, or topology
c) Operating system of the network
d) network architecture
e) none of these

36. the most common network strategies are
a) star, ring, bus, hierarchical
b) terminal, peer-to-peer, client server
c) topology, protocol, architecture
d) host, client, terminal
e) none of these

Answers

1) a; 2) c; 3) a; 4) d; 5) c;
6) d; 7) b; 8) c; 9) b; 10) b;
11) d; 12) a; 13) d; 14) b; 15) c;
16) d; 17) c; 18) c; 19) b; 20) b;
21) d; 22) d; 23) a; 24) b; 25) c;
26) d; 27) a; 28) b; 29) c; 30) c;
31) d; 32) b; 33) d; 34) a; 35) c;
36) a.